


# శ్రీ నాన్నగారి స్మృతులు

# Table of Contents

ముందు మాట

సద్గురు శ్రీ నాన్నగారు

సాక్షాత్తు భగవంతుని స్వరూపులు, శ్రీ నాన్నగారు (లేట్ అప్పల నరసమ్మ గారు

తండ్రి ప్రేమ పంచిన ప్రేమమూర్తి నాన్నగారు (సుందరమ్మ గారు)

భగవంతునితో మైత్రి (నల్లసుబ్బరాజు గారు)

ప్రేమమూర్తి మన నాన్నగారు (సూర్యనారాయణ రాజుగారు)

జీవితంలో వెలుగు నింపిన నాన్నగారు (డా. రామరావు గారు)

ఈశ్వరుడే నాన్నగారు స్వరూపంలో (రామచంద్ర రాజుగారు)

జ్ఞాన పుత్రులు, శ్రీ నాన్నగారు (కమలమ్మ గారు)

దేవీ స్వరూపులు శ్రీ నాన్నగారు (లక్ష్మి గారు (జిన్నూరు))

ప్రత్యక్ష పరబ్రహ్మ స్వరూపమే శ్రీ నాన్నగారు (సరస్వతమ్మగారు)

దైవంతో మైత్రి (లేట్ P S N రాజు గారు)

ఓ పరమ గురుదేవ (లేట్ రంగరాజు గారు)

సాధన కంటే విశ్వాసం గొప్పది (లేట్ సావిత్రమ్మ గారు)

శ్రీ నాన్నగారు, మన ఆప్తులు (లేట్ రామకృష్ణరాజు గారు)

నాన్నగారు గొప్ప వరం, అనుగ్రహం (శ్రీమతి ఇందిరా గారు)

సాక్షాత్తు పరమశివుడే మన నాన్నగారు (లేట్ భానుగారు)

నాన్నగారు మాకు ఇవ్వబడిన బహుమతి (లేట్ లక్ష్మిగారు)

నడిచే భగవద్గీత (లేట్ రమేష్ గారు)

అందరి బంధువు (లేట్ బుజ్జి గారు)

నాన్నగారి ప్రేమ - విశ్వ ప్రేమ (లేట్ రాజశ్రీ గారు)

నాన్నగారి  అంతులేని  ప్రేమ ప్రవాహం (లేట్ పద్మ గారు)


# ముందు మాట



ఎందరో మహానుభావులు. అందరికీ వందనములు. మన భారతభూమి పుణ్యభూమి. అటువంటి పుణ్యభూమిలో ఇటీవల జన్మించిన వారిలో నాన్నగారు ప్రముఖులు, శ్రేష్ఠులు, అనుగ్రహ స్వరూపులు. భగవాన్ రమణ మహర్షి వారి అనుగ్రహాన్ని సంపూర్ణంగా కలిగి, ఆయన స్థితిని ఈయన పొంది దానిని ఇతరులకు ప్రేమతో అందించడానికి వచ్చిన ప్రేమ మూర్తి సద్గురు శ్రీ నాన్నగారు. ఆయనకు సమకాలికులైన కొంతమంది భక్తులు వారి పూర్వజన్మల పుణ్యం వలన ఆయన చెంతచేరే అర్హతను పొంది ఆయనతో అత్యంత సన్నిహితంగా గడిపారు. నాన్నగారితో వారికున్న అనుబంధంలో ఎన్నో ప్రత్యక్ష, పరోక్ష అనుభవాలను పొందుతూ తమ జీవితాలను సార్థకం చేసుకున్నారు. అటువంటి భక్తుల జీవితాలకు సంబంధించిన స్మృతులు భావితరాల వారికి ఉపయోగకరంగానూ, ఆదర్శప్రాయంగానూ ఉండాలి అనే ఉద్దేశ్యంతో ఈ అనుభవాలను పుస్తక రూపంలో తీసుకురావడం జరిగింది. భక్తులు లేనిదే భగవంతుడు లేడు. భక్తుల హృదయాలలో భగవంతుడు కొలువై ఉంటాడు. అటువంటి భక్తుల హృదయాలలో నుంచి వచ్చిన ఆణిముత్యాలు ఈ పుస్తక రూపంలో రావడం మన అందరి అదృష్టం, ఆనందదాయకం.

**డా.ఉష గారు**

# సద్గురు శ్రీ నాన్నగారు



నాన్నగారు భగవాన్ రూపాన్ని ఎప్పుడూ చూడకపోయినా, ఆయన పేరు వినకపోయినా చిన్నవయస్సులోనే భగవాన్ కలలోకి వచ్చి ఆయన్ని ఆలింగనం చేసుకుని ముద్దాడి ప్రస్తుతానికి ఇది సరిపోతుందిలే! అన్నారు. కాలక్రమంలో భగవాన్ ఆయనని సంపూర్ణంగా వశం చేసుకుని జ్ఞానాన్ని ప్రసాదించారు. చాలా సందర్భాలలో నాన్నగారు "భగవాన్ కి మేము దత్త పుత్రులం. మా శ్రమ లేకుండా, పిల్లలకు తల్లితండ్రుల ఆస్థిలో ఎలా అయితే వాటా వస్తుందో అలా మాకు భగవాన్ సంపద వారసత్వంగా సంక్రమించింది. సాధన పేరుమీద కష్టం తెలియకుండా భగవాన్ మమ్మల్ని అనుగ్రహించారు" అనేవారు. ఆ వారసత్వం ఆయనకి మాత్రమే పరిమితం చేసుకోకుండా నాన్నగారు మనందరినీ కూడా దత్తత తీసుకుని, ఆయన ఆస్థికి వాటాదారులని చేసి అత్యంత దయతో, ప్రేమతో, కరుణతో ఆయన పొందిన జ్ఞానాన్ని మనతో పొందింపచేయడానికి కృషి చేసారు. సాధన పేరు మీద మనకి ఏమాత్రం కష్టం లేకుండా అనుగ్రహ ప్రవాహాన్ని కురిపించారు.

మానవ జీవితానికి సద్గురువు అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లే! అది లేకపోతే జీవితంలో ఎన్ని ఉన్నా ఒకటి లేని సున్నలే! అని ఆయన చెప్పడమే కాకుండా దానివిలువ మన మనసుకి అర్థమయ్యేలా చేసి, ఆత్మ తాలూకు వైభవాన్ని మన కళ్ళ ఎదురుగా చూపిస్తూ, దాని గురించి శ్రవణం చేయిస్తూ, మననం చేయిస్తూ ఆయన సమక్షంలో నిధి ధ్యాస దానంతట అదే వచ్చేలా చేసేవారు.

తమ దగ్గరకి వచ్చిన భక్తులను కేవలం One look is enough, One word is enough, One touch is enough అన్నట్టు ఒక చూపుతో, ఒక మాటతో, ఒక స్పర్శతో అందర్నీ అనుగ్రహించేవారు. వచ్చిన భక్తులు పురుషులు అయితే వారిపట్ల అపారమైన దయను కురిపిస్తూ, ఆయన మృదువైన చేతులతో వారి బుజాలను, వీపును, పొట్టను నిమురుతూ, బుగ్గలను, నుదుటిని తాకుతూ అనుగ్రహించేవారు. అదే స్త్రీలు అయితే వారు పుట్టింటికి వెళ్తే తల్లితండ్రుల నుంచి ఎటువంటి ఆప్యాయత, ప్రేమ, సహాయ సహకారాలు అందుతాయో, అంతకు మించిన ప్రేమతో అన్ని రకాలుగా వారిని సంతృప్తి పరిచి పంపించేవారు. ఈ విధంగా అందరికీ అన్నీ సమకూరుస్తూ ఆత్మవిద్య బోధించి పునీతుల్ని చేసారు.

ఎంతోమంది విదేశీయులు తమ దేశాలకు రమ్మని నాన్నగారిని చాలాసార్లు ఆహ్వానించినా కూడా, స్వదేశాన్ని వదిలి వెళ్ళడానికి ఆయన ఎంతమాత్రం ఆసక్తి చూపించలేదు. ఈ జన్మ తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఉన్న ప్రజలకు అంకితం చేద్దామనుకుంటున్నాను అని స్పష్టంగా తెలియచేసారు. జిన్నూరు చుట్టుపక్కల ఉన్న చిన్న చిన్న గ్రామాలలో ఉన్న పేదవారికి, స్త్రీలకు, నిస్సహాయులకు... నిరంతరం అందుబాటులో ఉంటూ అందరికీ ధైర్యాన్నీ, శక్తినీ అందిస్తూ, భౌతికంగా వారికి అవసరమైనవన్నీ సమకూరుస్తూ వారి జీవితాలలో శాంతిని నెలకొల్పారు. గృహస్థాశ్రమంలో ఉండడం వల్ల జిన్నూరులోనే జీవనం సాగిస్తూ ఎందరికో ఆధ్యాత్మిక బోధ చేసారు. చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలు, పట్టణాలు సంచరిస్తూ ఎన్నో ప్రవచనాలు చేసారు. ఆయన భక్తులతో కలిసి అనేక పుణ్యక్షేత్రాలు, పుణ్యతీర్థాలు కూడా సందర్శించారు. ప్రపంచం అంతా వ్యాప్తి చెందే అంత జ్ఞానము, వెలుగు ఆయనలో ఉండి కూడా ఆయన కేవలం మన ప్రాంతాలకే పరిమితమై ఉండటం అనేది తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల వారి అదృష్టం, మహద్భాగ్యం.

# సాక్షాత్తు భగవంతుని స్వరూపులు, శ్రీ నాన్నగారు

## (లేట్ అప్పలనరసమ్మ గారు)

**అప్పలనరసమ్మగారికి, నాన్నగారికి మధ్య ఉన్న అనుబంధం గురించి ఆమె మేనకోడలు అయిన వేణమ్మగారు తెలియచేసిన విషయాలు :**



మా మేనత్త గారైన అప్పలనరసమ్మ గారి భర్త తన రెండవ సంతానం కడుపులో ఉన్నప్పుడే చనిపోయారు. ఆ కారణంగా తన పుట్టినిల్లయిన జిన్నూరులో మా ఇంటికి తీసుకువచ్చారు. మేమందరం కలిసి ఉండేవాళ్ళం. అలా తన జీవితమంతా జిన్నూరులోనే కొనసాగింది. తన ఇద్దరు పిల్లలు ఇంకా నేను, నా తమ్ముడు మొత్తం నలుగురము కూడా తన ఆధ్వర్యంలోనే పెరిగాము. అందరినీ చాలా సమానంగా చూసేవారు. ఇంకా మా బంధువుల పిల్లలు అందరూ కూడా జిన్నూరు స్కూల్లో చదువుకోవడం వల్ల మా ఇంటికి వస్తూ ఉండేవారు. అలా మొత్తం ఒక పది మంది పిల్లలం ఉండేవాళ్ళం. ఆవిడ ఉదయం నుండి సాయంత్రం వరకు అలసిపోకుండా చిరునవ్వుతో మా అందరికీ అవసరమైనవి చేసి పెడుతూ ఉండేవారు. బేదభావన అనేది లేకుండా అందరినీ సమానంగా చూసేవారు. మాది చాలా పెద్ద కుటుంబం అవటం వలన తరచు బంధువులు వస్తూ ఉండేవారు. వారందరికి ఆవిడే వంట చేసి పెట్టేవారు.

ఆమె కుమార్తె అయిన సత్యవతి కూడా నాన్నగారికి చాలా ఉత్తమమైన భక్తురాలు. తన కొడుకు జిన్నూరులోనే ఉంటారు. ఆయన కూడా సమాజ సేవ బాగా చేస్తారు. అందువలన నాన్నగారు ఆయనని చాలా ఇష్టపడేవారు. నాన్నగారిపట్ల ఆయనకి కూడా  చాలా గౌరవం, ప్రేమ ఉన్నాయి. మా మేనత్త ఎవరి మధ్యవర్తిత్వం లేకుండానే నాన్నగారిని కలుసుకున్నారు. నాన్నగారిని సంపూర్ణంగా విశ్వసించారు. మా మేనత్త ఎప్పుడూ ఎవరి మాట కాదనేవారు కాదు. కానీ ఒక్క నాన్నగారి విషయంలో మాత్రం,  ఆయన దగ్గరికి వెళ్ళవద్దు అని ఎవరైనా చెప్పినా ఆమె వినేవారు కాదు. అది నా వ్యక్తిగత విషయం అన్నట్టు ఉండేవారు. నాన్నగారి ఇంటి నుండి మా ఇంటికి ఒక కిలోమీటర్ దూరం ఉంటుంది. మా ఇంటి దగ్గర నుండి నాన్నగారి ఇంటికి నడిచి వెళుతూ మధ్యలో ఉండే వారందరి ఇంటి తలుపులు కొట్టి, "మీకు తెలియటం లేదు సాక్షాత్ భగవంతుడే నాన్నగారి రూపంలో వచ్చారు", అంటూ అందరికీ చెబుతూ వెళ్ళేవారు.

ఎవరైనా కష్టంలో ఉన్నారు అని తెలిస్తే వాళ్లని ఆ కష్టాల్లో నుండి బయటకు తీసుకు రావటానికి తన వంతు ప్రయత్నం తను చేసేవారు. నాన్నగారు ఎన్నోసార్లు అప్పలనరసమ్మ గారు ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు తన చీరచెంగుతో వారి కన్నీళ్లను తుడుస్తారు అని చెప్పేవారు. ఆవిడ నాన్నగారి దగ్గరికి అందరిని రమ్మని చెప్పినా కానీ వారు రాకపోతే, "నాన్నగారు భగవత్ స్వరూపులని వీళ్ళు గుర్తించటం లేదు, వీళ్ళు ఎందుకు పుట్టారో  వీరికి అర్థం  కావట్లేదు అని బాధపడుతూ ఉండేవారు. ఆ మాట వినేసరికి నాకు ఇప్పటికీ వెన్నులో వణుకు వస్తుంది. అత్తయ్యకి భౌతికంగా ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ, తన దృష్టి ఎప్పుడూ నాన్న గారి మీద చెక్కుచెదరకుండా ఉంచుతూ భగవంతుడే నాన్నగారుగా వచ్చారు అన్న విశ్వాసంతో జీవించారు. అందుకే అంత శాంతిగా ఉండగలిగేవారు. ఇది అంతా జరిగి దాదాపు 30 సంIIలు అయ్యి ఉంటుంది. అప్పట్లో స్త్రీలు బయటకు ఎక్కువగా వచ్చేవారు కాదు. అందువలన ఆమె కొడుకుకి ఆవిడ నాన్నగారి ఇంటికి వెళ్ళటం ఇష్టం ఉండేది కాదు.

హాల్లో తన కొడుకు తిడుతున్నా సరే, లోపల అష్టోత్తరం చదువుకుంటూ ఒక్కొక్క పువ్వు నాన్నగారి ఫోటో మీద వేసి పూజ చేస్తూ ఉండేవారు. నాన్నగారి విషయంలో మాత్రం పూర్తి స్వేచ్ఛ తనకు తనే తీసుకున్నారు. నాన్నగారి దగ్గరకు వెళ్తున్నందుకు ఆ రోజుల్లో ఎంతోమంది ఎన్నో మాటలు అనేవారు. అయినా అవేమీ పట్టించుకోకుండా నవ్వి ఊరుకునేవారు. నాన్నగారి గురించి వారికి తెలియటం లేదు అనేవారు.

నాన్నగారి 60 వ పుట్టినరోజుకి నాకు మా మేనత్త ఫోన్ చేసి ఈరోజు నాన్నగారి పుట్టినరోజు జరిగింది. సుదర్శనమ్మ గారు సావిత్రమ్మ గారి చేత దండలు పంపించి నాన్నగారిని, కన్నమ్మ గారిని వేసుకోమన్నారు. వారు ఇద్దరు ఆ దండలని వేసుకొన్నారు అని చాలా ఆనందపడుతూ, ఆ ఆనందంతో చెప్పలేక చెబుతూ, ఆ విషయం గురించి పదినిమిషాలు మాట్లాడారు. తన దృష్టిలో నాన్నగారంటే ఒక మానవ రూపం కాదు, సాక్షాత్ భగవంతుడే! ప్రతిరోజు ఆవిడ నాన్నగారి ఇంటికి వెళుతూ ఉండేవారు. అప్పట్లో కొన్ని కారాణాల వలన ఒక్కొక్కసారి నాన్నగారి ఇంట్లోకి వెళ్ళటం కుదేరేది కాదు. అలా కుదరకపోతే నాన్నగారి ఇంటి చుట్టూ, అంటే నాన్నగారు ముందు వీధిలో నుండి వెనక వీధికి తిరుగుతూ అలా మూడు సార్లు ఆ ఇంటికి ప్రదక్షణ చేసి నమస్కారం చేసుకొని వచ్చేవారు. ఒక్కొక్కసారి మాకు దర్శనం ఇవ్వటానికి నాన్నగారు టవల్ ఆరేసుకునే వంకతో బయటికి వచ్చి మాకు దర్శనం ఇచ్చారు అని ఆనందపడుతూ చెప్పేవారు. ఆ ఆనందానికి అవధులు ఉండేవి కావు.

ఒకసారి అత్తయ్య నాన్నగారి ఇంటి  గుమ్మం దగ్గర నిలబడి దుఃఖ పడుతూ ఉన్నారట. నాన్నగారు గుమ్మానికి ఉన్న కర్టెన్ తీసుకుని బయటకు వచ్చి అప్పలనరసమ్మ గారూ  మీరు దేవుడ్ని చూసారా..? అని అడిగారట. దుఃఖ పడటం వలన నోటి నుంచి మాటరాక చూడలేదు అని తల  ఊపారట! అప్పుడు నాన్నగారు నేను భగవంతుడిని చూశాను.

నేను చూసిన భగవంతుడిని మీకు చూపిస్తాను అన్నారట. ఈ సంఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న స్నేహితురాలు తరువాత నాకు చెప్పారు.

ఒకసారి నాన్నగారికి ఆపరేషన్ అయినప్పుడు నాన్నగారిని చూడటానికి అత్తయ్య హైదరాబాద్ వచ్చారు. వారమ్మాయి, నేను హైదరాబాదులో ఉంటాము. నాన్న గారి దగ్గరికి తీసుకు వెళ్ళమని నన్ను చాలా బలవంతం చేసారు. నాకు నాన్నగారిని ఇబ్బంది పెట్టడం పెద్దగా ఇష్టం ఉండదు. ఎంత చెప్పినా వినకపోయేసరికి సరే అని ఆ హాస్పిటల్ దగ్గరికి తీసుకువెళ్లి, తరువాత వచ్చి తీసుకెళ్తాను అని చెప్పి వచ్చేసాను. అక్కడ కూర్చుని దుఃఖ పడుతూ ఉన్నారట. నాన్న గారు బయటకు వచ్చి ఏంటి అప్పల నరసమ్మ గారూ మీరు ఇక్కడ ఉన్నారు ఏమిటి? అని అడిగారట. మిమ్మల్ని చూసి వెళదామని వచ్చాను నాన్నగారూ అని చెప్పారట. నేను బానే ఉన్నాను అని నాన్నగారు సర్దిచెప్పి పంపించారట. తరువాత ఈ విషయం నాన్నగారే స్వయంగా చెప్పారు.

ఒకసారి మా చిన్న మేనత్త భర్త చనిపోయారు. వాళ్ళు అమలాపురంలో ఉంటారు. ఆయన అప్పలనరసమ్మ గారికి మరిది అవ్వటం వలన ఆవిడ చెల్లెలు ఇంటికి వెళ్లారు. అప్పుడు రావులపాలెంలో నాన్నగారి ప్రవచనం జరిగింది. మా మేనత్త ఆ ప్రవచనానికి వెళ్ళారు. నాన్నగారు అక్కడ మా మేనత్త ని చూసి, మరిది గారు చనిపోతే అప్పలనరసమ్మ గారు ఇక్కడ ఉన్నారు ఏమిటి,  అని చాలాసార్లు అన్నారట. ఈ విషయం నాన్న గారే చెప్పారు. తర్వాత అప్పలనరసమ్మ గారు  తన చెల్లిని పుట్టినిల్లు అయిన జిన్నూరు తీసుకువచ్చారు. ఆ సమయంలోనే తనకి కొంచెం ఆరోగ్యం భాగాలేకపోవటం వలన పాలకొల్లు హాస్పత్రిలో జాయిన్ చేశారు. అక్కడ నుండి హైదరాబాదు తీసుకువచ్చారు. హైదరాబాద్ వచ్చిన తరువాత నాన్నగారికి నన్ను హైదరాబాదు తీసుకొచ్చినట్టు తెలుసో లేదో అన్నారు.

అదే  ఆవిడ మాట్లాడిన ఆఖరి మాట! ఆ రోజే అత్తయ్య దేహం వదిలేసారు. ఆ సమయానికి నాన్నగారు కోయంబత్తూర్ లో ఉన్నారట. నాన్నగారు భోజనం చేద్దామని చెయ్యి కడుక్కుని చాలా సేపు నిలబడి అప్పలనరసమ్మ గారు ఏంటి నాకు చెప్పకుండా వెళ్ళిపోయారు అన్నారట. తర్వాత రోజు నాన్నగారికి ఫోన్ చేశాను. ఏంటమ్మా అత్తయ్య మనతో చెప్పకుండా వెళ్ళిపోయారు అన్నారు. తను ఏ పని చేసినా, ఏ మాట మాట్లాడినా నాన్నగారిని మనసులో నింపుకుని చేసేవారేమో అనిపించేది నాకు.

భర్తలేకపోయినా, తన ఇద్దరు పిల్లలను పెంచి పెద్ద చేసినా, పైకి కష్టపడినట్టు కనిపించేవారు కాదు. అంటే ఆవిడ జీవితానికి నాన్నగారే సర్వస్వం అయ్యారు. నాన్న గారిని నాన్నగారు అని కూడా అనేవారు కాదు, సాక్షాత్తు భగవంతుడు అనేవారు. తను చనిపోయినప్పుడు నాన్నగారు కోయంబత్తూరులో భక్తులతో అన్న మాటలు : “అప్పల నరసమ్మ గారు ఇలా వెళ్లిపోయారు ఏమిటి? అప్పలనరసమ్మ గారికి ఇప్పుడు శరీరంతో సంబంధం తెగిపోయింది, బంధువులతో సంబంధం తెగిపోయింది, అందరితోనూ సంబంధం తెగిపోయింది, ఇపుడు గురువు పని మొదలవుతుంది. చీకటి లోకాలకు వెళ్ళకుండా గురువు వెలుగులోకి తీసుకు వెళ్తారు. అప్పల నరసమ్మ గారికి ఇంక ఒకటి రెండు జన్మలు మాత్రమే మిగిలి ఉన్నాయి" అన్నారు.

జిన్నూరులో ఒకసారి ప్రవచనం జరిగినప్పుడు అప్పలనరసమ్మ గారి కోసం ఈ లడ్డూలను పంచుతున్నాను అన్నారు. దానికి అప్పలనరసమ్మ గారి కుమారుడు లడ్డూలకు నేను డబ్బులు ఇస్తాను నాన్న గారూ  అంటే, అది నీకు సంబంధం లేదు. నా కోసం నేను పంచిపెడుతున్నాను అన్నారు.  నాన్నగారు అప్పలనరసమ్మ గారి ఫోటో ఒకటి తెప్పించి, ఆశ్రమంలో ఆయన గదిలో పెట్టుకున్నారు.

తరువాత నాలుగైదు ప్రవచనాలలో ఒక పది నిమిషాలు అప్పలనరసమ్మ గారి గురించి మాట్లాడారు. ఒకసారి నాన్నగారు నాతో మీ నాన్నగారు పొలిటీషియన్ అవ్వడం వలన మీ అమ్మగారు బిజీగా ఉండేవారు.

మొత్తం కష్టమంతా అప్పల నరసమ్మ గారిదే అమ్మా! తను ఎంత కష్టపడ్డారో నీకు ఏమి తెలుసు? నేను చూశాను... నేను చూశాను... అన్నారు. జిన్నూరులో చాలామంది అప్పల నరసమ్మగారు మా జీవితాలకి నాన్నగారిని ప్రసాదించారు అని చాలా కృతజ్ఞతగా ఉంటారు.

# తండ్రి ప్రేమ పంచిన ప్రేమమూర్తి నాన్నగారు

## (సుందరమ్మ గారు (అరటికట్ల))

నాన్నగారిని మొదటిసారి నేను వెంకటాపురంలో దర్శనం చేసుకున్నాను. నేను వెళ్ళేసరికి నాన్నగారు భగవద్గీత చెబుతున్నారు. ఇంతకుముందు చాలా మంది దగ్గర గీత విన్నాను కానీ నాన్నగారు చెబుతూ ఉంటే చాలా వివరంగా అర్థమయ్యింది. ఇంటికి వచ్చిన తరువాత నా స్నేహితురాలు అయిన కుమారితో నాన్నగారు భగవద్గీత చాలా అద్భుతంగా చెపుతున్నారు అన్నాను. తరువాత చింతపర్రులో నాన్నగారు ప్రవచనాలు చెబుతారు అని తెలిసి నేను, కుమారి ఇద్దరం కలిసి అక్కడకు వెళ్ళాము. మొదటిసారి నాన్నగారు ప్రవచనం వినగానే, కుమారికి నాన్నగారు చెప్పేదంతా సత్యమే, దానిని అంగీకరించాలి అనిపించింది. కుమారికి వివాహం అయిన తరువాత శివుడు 3 సార్లు స్వప్నంలో దర్శనమిచ్చి నిన్ను తీసుకు వెళ్ళిపోతాను అనేవాడు. నాకు చిన్న పాప ఉంది, నన్ను తీసుకువెళ్తే ఎలాగ? అనేది. అలా శివుడి స్వప్న దర్శనం అయిన కొన్ని సంవత్సరాలకే నాన్నగారు మాకు పరిచయమయ్యారు.

మేము మొదటిసారి జిన్నూరు వెళ్ళినప్పుడు, భగవాన్ భోజన హాలులో కూర్చున్న చిత్రపటం ఉంటుంది కదా! అదే విధంగా నాన్నగారు మొదటి దర్శనం ఇచ్చారు. ఎక్కడి నుండి వచ్చారు? అని మమ్మల్ని అడిగి ఏమైనా సందేహాలుంటే అడగండి అన్నారు. మాకు సందేహాలు ఏమీ లేవు నాన్నగారూ, చింతపర్రులో మీ ప్రవచనం విని ఇక్కడికి వచ్చాము అని చెప్పాము. తరువాత మరలా ఒకసారి జిన్నూరు వెళ్ళాము. మిమ్మల్ని ఎప్పుడైనా చూడాలనిపిస్తే మీ దర్శనం చేసుకోవటానికి మేము రావచ్చా? అని అడిగాము. మీకు ఎప్పుడు రావాలి అనిపిస్తే అప్పుడు రండమ్మా అన్నారు. మీ ప్రవచనాలు చాలా అద్భుతంగా ఉంటున్నాయి.

మీ ప్రవచనాలు ఇంక ఎక్కడైనా జరిగితే మాకు రావాలని ఉంది అని చెప్పాము. అప్పటినుండి తమ ప్రవచనాలు ఎక్కడెక్కడ జరుగుతాయో, ఆ వివరాలు మాకు చెబుతూ ఉండేవారు. నాన్నగారు ప్రవచనాలు ఉదయం 11 గంటలకు మొదలుపెడితే సాయంత్రం నాలుగు గంటల వరకు అలా చాప మీద కూర్చుని చెబుతూనే ఉండేవారు. ఒకసారి నాన్నగారి దగ్గరకు వెళ్ళినప్పుడు కుమారి మాకు రావడానికి వీలవుతోంది కాబట్టి వస్తున్నాము నాన్నగారూ, కానీ చాలామంది మీ దగ్గరకు రాలేకపోతున్నారు అని చెప్పింది.

మరొకసారి నేను నాన్నగారితో, తెలియని వారు ఎవరైనా అడిగితే, మీ సబ్జెక్టు మీరు చెప్పింది చెప్పినట్టు నేను చెప్పలేకపోతున్నాను అన్నాను. దానికి నాన్నగారు చెప్పింది చెప్పినట్టు వస్తేనే చెప్పాలమ్మా! మనసు కల్పిస్తే దోషం వస్తుంది అన్నారు. కుమారి మనసులో ఏది అనిపిస్తే అదే చెప్పేది. ఆ త్రికరణశుద్ధి బాగా ఉండేది. అందువలనే తను ఏమీ చదవకపోయినప్పటికీ,  నాన్నగారు మాటలను చెప్పింది చెప్పినట్టు ఉదాహరణలతో సహా చెప్పగలిగేది. అంటే మెదడుతో ఆలోచించుకుని చెప్పటం కాదు. చెప్పాలి అని నోరు తెరవగానే ఆ సబ్జెక్టు అలా వచ్చేసేది. అది నాన్న గారు తనకి ఇచ్చిన శక్తి . నాన్నగారు కుమారి వచ్చిన తరువాతే భగవాన్ ప్రవచనం మొదలైంది అనేవారు. మేమిద్దరం ఎక్కడికి వెళ్ళినా నాన్నగారి గురించి ఎక్కువ మాట్లాడేవాళ్ళము. మనలాగే ఇతరులు కూడా నాన్నగారి దర్శనం చేసుకుని బాగు పడాలి అనుకునే వాళ్ళం. అలా చాలా మంది మా ద్వారా నాన్నగారి దగ్గరికి  వచ్చేవారు. కుమారికి ఒకదాని తరువాత ఒకటి ఏవో కష్టాలు వస్తూనే ఉండేవి.

ఒకసారి నాన్నగారి దగ్గర నాకెందుకు నాన్నగారూ, ఇన్ని కష్టాలు వస్తున్నాయి అని బాధపడింది. దానికి నాన్నగారు నువ్వు పూర్వ జన్మలో చాలా తపస్సుచేసి వచ్చావమ్మా అన్నారు. ఆ తపస్సు ఫలమే తనకి నాన్నగారు లభించారు అనిపించింది.

ప్రారబ్ధం ప్రకారం ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వాటన్నింటికీ, భగవంతుడు గురువుని సాయంగా పెట్టి కుమారి ప్రారబ్ధాన్ని ఖర్చు చేయిస్తున్నాడు అని నాకు అనిపించేది. నాన్నగారి భక్తులు చాలామంది పరిచయం అవటం వలన ఎక్కడికి వెళ్ళినా నాన్నగారి సబ్జెక్టే మాట్లాడుకునేవాళ్ళం.

నాన్నగారు అరుగు మీద కూర్చుంటే సాక్షాత్ ఆ ఈశ్వరుడే దేహం ధరించి వచ్చాడని అనిపించేది. మాకు  ఆయనను ఏమని సంబోధించాలి అని తలంపు వచ్చేది. స్వామీజీ అని పిలుద్దామా అంటే కాషాయం ధరించలేదు. సంసారి లాగానే జీవనం కొనసాగిస్తున్నారు. అప్పుడు కుమారి హృదయములో నుండి నాన్న గారు అని స్ఫురించింది. నోటితో నాన్నగారు అని పిలిచింది. ఆ పిలుపు వినగానే నాన్నగారి ముఖారవిందం బ్రహ్మ తేజస్సు తో నిండిపోయింది. ఒకసారి పోస్టాఫీసులో ప్రవచనం జరిగేటప్పుడు నాన్నగారికి వేరే పేరు పెట్టాలి అనుకున్నారు. కానీ నాన్నగారు వెంటనే నాకు ఇంక ఏ పేరు అవసరం లేదు.  నాన్నగారు అనే పేరు సరిపోతుంది అన్నారు.

మేము నాన్నగారి దగ్గరికి వెళ్ళినప్పటికి, నాన్న గారి మనవడు అయిన వర్మ చాలా చిన్నవారు. మమ్మల్ని చూసి లోపలకి పరిగెత్తుకుంటూ వెళ్ళి తాతయ్య అరటికట్ల భక్తులు వస్తున్నారు అని చెప్పేవారు. కన్నమ్మగారి తో కూడా మాకు చాలా అనుబంధం ఉంది. మమ్మల్ని చూసి నాన్నగారు లోపలికి వెళ్ళి చూసి రండమ్మా అనేవారు. 1986 సంవత్సరంలో వరదలు వచ్చాయి. వరదలు తగ్గిన తరువాత నాన్నగారి దగ్గరకు వెళ్ళాను. అప్పటకి నాన్నగారి  ఆరోగ్యం బాగాలేదు. కన్నమ్మ గారు నన్ను నాన్నగారిని చూసి వెళ్ళమన్నారు. నేను నాన్నగారి దగ్గరకి వెళ్ళగానే దుప్పటి కప్పుకొని ఉన్నారు. అది నెమ్మదిగా ప్రక్కకు తీసి నన్ను చూసి పరవాలేదమ్మా, కంగారుపడక్కర్లేదు తగ్గిపోతుంది అని చెప్పారు.

ఆయన్ని అలా చూసి నాకు చాలా భాద అనిపించింది. తరువాత కుమారికి ఈ విషయం చెప్పాను. మరునాడు మళ్ళీ ఇద్దరం కలిసి నాన్నగారిని చూడటానికి మా ఊరి నుండి జిన్నూరు నడుచుకుంటూ వెళ్ళాము. మేము వెళ్ళేసరికి అక్కడ రామచంద్ర రాజు గారు, డాక్టర్ గారు దగ్గర ఉండి నాన్నగారికి సిలైన్ పెడుతున్నారు. నాన్నగారికి బానే ఉంది పరవాలేదు అని చెప్పారు. అప్పుడు మా మనసులు కుదుటపడ్డాయి. కుమారి గారిది అప్పట్లో తాటాకు ఇల్లు అవటం వలన, ఆ వరదల సమయంలో తను ఎలా ఉందో అని నాన్నగారు మమ్మల్ని తలుచుకున్నారట. తరువాత మేము నాన్నగారి దగ్గరికి వెళ్ళినప్పుడు ఎలా ఉన్నారో అని మిమ్మల్ని తలుచుకున్నానమ్మా అన్నారు. మేము బాగానే ఉన్నాము నాన్నగారూ, వేరే ఇంటికి వెళ్ళాము అని కుమారి చెప్పింది. ఈశ్వరుడు దయవలన వరదలు ఎక్కువ రాలేదమ్మా! లేకపోతే పాలకొల్లు పెద్ద గోపురం పై వరకు నీరు వెళ్ళిపోవలసింది. భగవంతుడు కాపాడాడు అన్నారు. అలా నాన్నగారు మమ్మల్ని అన్ని విషయాలలోను కనిపెట్టుకుని ఉండేవారు.

నాన్నగారిని ఎప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు చేతిలో ఉన్న పని తొందరగా ముగించుకుని ఆయన దర్శనానికి వెళ్ళేవాళ్ళము. ఆయన పరిచయం అయిన తరువాత మా జీవితాలలో ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ అవి కష్టంగా అనిపించలేదు. కుమారి నా జీవితం నాన్నగారికి స్వాధీనం అయిపోయింది అనేది. నాన్నగారిని ఒకసారి మా గ్రామంలో ప్రవచనం పెట్టమని అడిగాము. నాన్నగారు అలాగేనమ్మా అని వచ్చి ప్రవచనం చెప్పారు. అక్కడ ఉన్న వారందరూ స్త్రీలే అవటం వలన నాకు నాన్న గారిని చూసి శ్రీకృష్ణుడి అవతారమే అనిపించింది. కానీ ఈ కృష్ణుడు మనకి తండ్రిగా వచ్చి మనల్ని ఆదరించారు. మనం నాన్నగారి దగ్గరికి ఎన్ని సమస్యలతో వెళ్ళినా కూడా, ఆయన సమక్షంలో పరిపూర్ణమైన శాంతితో మన మనస్సులు నిండి, లోపల వెలితి లేకుండా పూర్ణ ఆనందంతో తిరిగి ఇంటికి వచ్చే వాళ్ళము. అంటే ఆయన సమక్షంలో మన దుఃఖము ఒక కెరటంలా వచ్చి వెళ్లిపోయినా అది మనల్ని బాధించదు. ఎంత పెద్ద ప్రారబ్దాన్ని అయినా చిన్నదిగా చేసి మనచేత అనుభవింప చేస్తారు.

తలతో పోయేది కిరీటంతో పోగొడతాడు గురువు అంటారు కదా! అలాగా కుమారికి కష్టాలు ఎక్కువ ఉండటం వలన నాన్నగారు నాతో మీరు కుమారిని చూస్తూ ఉండండి అని చెప్పారు. అలా మా ఇద్దరిని ఒక్కటిగా కలిపే ఉంచారు.

కుమారి ఏ కారణం వలన అయినా నాన్నగారి దగ్గరకి రాలేకపోతే, నేను వెళ్ళి నాన్నగారి విషయాలు చెప్పి వచ్చేదాన్ని. ఆయన దయ వలన నేను, కుమారి కష్టసుఖాలలో చేదోడువాదోడుగా ఉన్నాము. కుమారికి రాత్రులు సరిగా నిద్ర పట్టేది కాదు. ఈ విషయం గురించి నాన్న గారిని అడిగితే నీకు లోపల ఏదో బెంగ ఉందమ్మా, అందువల్లనే నిద్ర పట్టడం లేదు. ఆ బెంగ తగ్గిన మరుక్షణమే నీకు నిద్ర పడుతుంది అన్నారు. తనకి నిద్ర పట్టకపోయినా, నాన్నగారి దయ వలన తన ముఖంలో అలసట కనిపించకుండా ఎప్పుడూ శాంతితో ఉండేది. నాకు తెలిసినంత వరకూ నాలో ఏ బెంగలూ లేవు, నాకు తెలియనివి నాన్నగారే తియ్యాలి అని ఆ భారం కూడా ఆయన మీదే వేసి నిశ్చింతగా ఉండేది.

ఒకసారి శృంగవృక్షం నుండి ఒక భక్తుడు వచ్చి నాన్నగారితో జిన్నూరు లో భోధ ఉంది గాని భోజనాలు లేవు, అరుణాచలంలో భోజనాలు ఉన్నాయి కానీ బోధ లేదు అన్నారు. అప్పుడు అక్కడే ఉన్న మమ్మల్ని చూపించి వీరు అరటికట్ల నుండి వచ్చారు. అరటికట్లను చూస్తే నాకు అరుణాచలంలా అనిపిస్తుంది అన్నారు. ఆ శిష్యుడు ఈసారి అరటికట్ల వెళ్తాను నాన్నగారూ  అని చెప్పి, మమ్మల్ని సత్సంగంలో ఏం పుస్తకం చదువుతున్నారు? అని అడిగారు. ఫలానా పుస్తకం అని చెప్పిన తరువాత అది ఎవరు రాశారు? అని అడిగారు. నాకు ఏ పుస్తకం చదివినా అది ఎవరు రచించారో చూసే అలవాటు ఉండేది. నాన్నగారి దయవల్ల నాకు ఆ పేరు వెంటనే గుర్తుకు వచ్చి ఆ పుస్తకం రచయిత పేరు చెప్పాను. అలా నాన్నగారు ప్రతి విషయంలోనూ అంతర్లీనంగా ఉంటూ ఆయన దయ మనపై ప్రసరింప చేస్తూ ఉన్నారు.

నాన్నగారి ప్రవచనాలు విన్నంతసేపు ఏదో టానిక్ వేసుకుంటే బలం వచ్చినట్టు అంత బలంగా ఉండేది. మరలా నాన్నగారి వాక్యాలు ఎవరితోనైనా పంచుకునేటప్పుడు కూడా అలాగే ఉండేది. తరువాత మామూలుగానే అనిపించేది.  అంటే ఆ సమయంలో ఆ పనికి ఆయన అలా లోపల నుండి బలం ఇస్తూ ఉపయోగించుకుంటున్నారు అని కుమారి అంటూ ఉండేది.

నాన్నగారు నాకు ఉపదేశసారం, అక్షరమణమాల పుస్తకాలు ఇచ్చి కుమారికి చదివి వినిపిస్తూ ఉండు అని చెప్పేవారు. నాన్నగారి ఇంట్లో జరిగిన ఒక కార్యక్రమానికి సారి  చేయవలసి వస్తే మేము ఎవర్నో తీసుకుని సహాయం చేయటానికి వెళ్ళాము. ఆరోజు మొత్తం పని అంతా ఒక్కరోజులోనే అయిపోయింది. కానీ మాకు లోపల అలసట తెలియలేదు. బయటకు వచ్చి చూసేసరికి నాన్నగారు అరుగుమీద చెమటలతో కూర్చుని ఉన్నారు. అది చూసి మాకు చాలా ఆశ్చర్యం వేసింది. అప్పుడు నువ్వు నిమిత్త మాత్రంగా ఉండు, పని నేను చేస్తాను అన్న వాక్యం మాకు అనుభవపూర్వకంగా చూపించారు అనిపించింది. అక్కడ మేము చేసాము అన్న భావనతో మా మనసు పెరగకుండా చేసి, అలా ప్రతి సంఘటనలో శక్తి ఆయనది అని మాకు చూపిస్తూ ఉండేవారు.

ఒకసారి నాన్నగారు అరుణాచలంలో మనసు మృదువుగా, తేలికగా, దూదిపింజలా అయిపోవాలి అన్నారు. అలా ఎలా అవుతుంది? అనుకున్నాను. తరువాత నేను, కుమారి ఇద్దరం కలిసి గిరి ప్రదక్షిణకి వెళ్ళాము. అప్పుడు కుమారి నడక చూస్తూ ఉంటే నాన్నగారు మనసు దూదిపింజలా అవ్వాలి అన్నారు కదా! మనసు మృదువుగా అయితే ఇలా ఉంటుందేమో అని నాకు తన  నడక చూస్తూ ఉంటే అనిపించింది.

ఒకసారి నాన్నగారి దగ్గర ఆయనతో పాటు మేము కూడా మౌనంగా కూర్చుని ఉన్నాము. నాన్నగారు మౌనం చాలించిన తరువాత కుమారిని లోపల ఎలా ఉందమ్మా అని అడిగి, ఊపిరిసలపనంత ప్రేమను నువ్వు అనుభవిస్తావమ్మా అన్నారు. కుమారి నాన్నగారితో తనకి శివుడు అంటే ఇష్టమని చెప్పి, ఏ విధంగా నామం చేసుకోవాలి అని అడిగింది. అప్పుడు నాన్నగారు మద్రాసు నుండి తనకొక స్పటికమాల, నాకు రాముడంటే ఇష్టం కనుక నాకు ఒక తులసి పూసల మాల తెప్పించి ఇచ్చారు. వాటితో మేము జపం చేసుకునే వాళ్ళము. ఒకసారి మీ ఫోటో ఒకటి ఉంటే ఇవ్వండి నాన్నగారు అని కుమారి అడిగింది. అలాగే అమ్మా అని ఫోటో ఇచ్చారు. వరదలు వచ్చినప్పుడు మేము ఎక్కడికి వెళ్ళినా నాన్నగారి ఫోటో, నాన్నగారు ఇచ్చిన మాలను తీసుకుని వెళ్లిపోయే వాళ్ళం.

నాకు నాన్నగారి మేనమామలు తెలుసు. అందులో ఒకరు ఒకసారి, నాన్నగారు తండ్రి అయిన సూర్యనారాయణరాజు గారి గురించి ఒక మాట చెప్పారు. సూర్యనారాయణ రాజు గారి చేతిలో ఎప్పుడూ భగవద్గీత పుస్తకం ఉండేదట. ఆయనను చూస్తే ఒక సాధువులా  అనిపిస్తూ ఉండేవారట. నాన్నగారి నాన్నమ్మగారికి తులసమ్మ అంటే ఇష్టం. ఇప్పటికీ ఆ తులసికోట జిన్నూరులో ఉంది. ఆ కోటకే ఇప్పటికీ కన్నమ్మ గారు పూజ చేస్తూ ఉంటారు.

ఒకసారి పోడూరులో నాన్నగారి ప్రవచనం ఉందని వెళ్ళాము. కొన్ని అనివార్య కారణాలవల్ల అక్కడ ప్రవచనం జరగకపోవడంతో వెనక్కి వచ్చేస్తూ జిన్నూరు వెళ్ళాము. మేము వెళ్ళేసరికి నాన్నగారు మమ్మల్ని చూసి ఇప్పుడే మీరు వస్తారు అనే తలంపు వచ్చిందమ్మా! అందుకే ఏలూరు ప్రయాణం మానుకొని కూర్చున్నాను అన్నారు. నాన్నగారి దగ్గరకి ఏ సమయంలో వెళ్ళినా సబ్జెక్ట్ చెబుతూనే ఉండేవారు.

గురుపౌర్ణమి, నాన్నగారు పుట్టినరోజు లాంటి పెద్ద కార్యక్రమాలకి సహాయం చెయ్యటానికి ముందురోజే నాన్నగారి ఇంటికి వెళ్ళేవాళ్లము. మేము పడుకునే చోటు నుండే నాన్నగారు వాష్ రూమ్ కి వెళ్ళవలసి వచ్చేది. అక్కడ లైట్ వేస్తే మాకు ఇబ్బంది అని చెప్పి, బ్యాటరీ లైట్ వేసుకుని వెళ్లేవారు. అది చూసి మాకు, మేము ఇక్కడ ఉండటం వల్ల నాన్నగారు ఇబ్బంది పడుతున్నారు అని బాధ అనిపించేది.

ముఖానికి రాసుకున్న పౌడరు కూడా చెరగకుండా శిష్యులకు జ్ఞానం ఇచ్చేయాలని నాన్నగారు తప్ప సృష్టిలో ఏ జ్ఞాని అనుకోలేదు అనిపిస్తుంది. మనల్ని అంత ప్రేమగా, బాధ్యతగా ప్రతి విషయంలోనూ చూసుకుంటూ ఉండేవారు. అరటికట్ల నుండి ఎక్కడికి వెళ్ళినా మధ్యలో నాన్నగారిని చూసి వెళ్తూ ఉండే వాళ్లము. అలా ఒకసారి నేను ఎక్కడికో వెళుతూ జిన్నూరు వెళ్ళాను. అప్పుడు నాన్నగారు ప్రయాణం పెట్టుకుని ఎందుకు వచ్చారమ్మా అని అడిగారు. మీరు ఆత్మగా ఉన్నారు కదా! మిమ్మల్ని చూడకుండా నేను ఎలా ఉండగలను? అని అడిగాను. ఆత్మ అంతటా ఉంది కదా అని చెప్పారు. కానీ మాకు అంతటా ఉన్న ఆత్మని చూసే శక్తి లేదు కదా నాన్నగారూ, అందుకే మిమ్మల్ని చూడటానికి వచ్చాను అని చెప్పాను. నాన్నగారు ప్రతి జీవుడులోను ఆత్మని చూడమని మనకు ప్రబోధిస్తూ వచ్చారు. చాలా రోజుల తరువాత నాన్నగారు, మీరే కదా సుందరమ్మ గారూ నన్ను ఆత్మగా ఉన్నానని చెప్పారు అంటూ గుర్తుచేసారు. నేను అన్నమాట నేనే మరిచిపోయాను. ఆ రోజు నాన్నగారి దయే నా చేత ఆ మాట అనిపించింది.

నాన్నగారు అనే పేరు కుమారి నోటిలో నుండి వచ్చినా కానీ,  నాన్నగారు మాత్రం ఎప్పుడూ అరటికట్ల భక్తులే ఈ పేరు పెట్టారు అని చెప్పేవారు. అంటే వ్యక్తులుగా మన మధ్యలో వ్యత్యాసాలు ఉండవచ్చు ఏమో కానీ,



నాన్నగారు మాత్రం భక్తుల మధ్యలో ఎప్పుడూ వ్యత్యాసం చూడలేదు. అందుకే అందరనీ సమూహంగా కలిపి అరటికట్ల భక్తులు నాకు నాన్నగారు అనే పేరు పెట్టారు అని చెప్పేవారు.

# భగవంతునితో మైత్రి

## (నల్ల సుబ్బరాజు గారు)

మా ఇల్లు నాన్నగారి ఇంటికి దగ్గరలోనే ఉండేది. ఈ జన్మలో నేను ఏ ప్రయత్నమూ చేయకపోయినా, భగవంతుని అనుగ్రహం వలన, నా పూర్వజన్మ సంస్కారం వలన నాన్నగారితో నాకు అనుబంధం ఏర్పడింది. నాన్నగారు నాతో ఎప్పుడూ స్నేహితుడిలా ఉండేవారు. ఆయన సమక్షంలో నాకు  శాంతి వస్తూ దేహ స్పృహ ఉండేది కాదు. నాన్నగారు మౌనంగా కూర్చొని ఉండేవారు. నాకు నాన్నగారి సమక్షంలో గడుపుతూ ఆయన మాటలు వినటం చాలా ఇష్టంగా ఉండేది. అందువలన 10 రోజులలో చేయవలసిన వ్యవసాయ పనులను 3 రోజులలోనే ముగించుకొని నాన్నగారి దగ్గరకు వచ్చి కూర్చునే వాడిని. చాలామంది భక్తులు వస్తూ, వెళుతూ ఉండేవారు. నాకు మొదటి నుండి భక్తులంటే ఎక్కువ ఇష్టంగా ఉండేది.

నేను ఒక సామాన్య రైతుని. నాకు ఖాళీ సమయం ఉన్నప్పుడల్లా నాన్నగారి దగ్గరకి రావటానికి ఎక్కువ మక్కువ చూపేవాడిని.

మా ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా నాన్నగారే ముందు ఉండి జరిపించేవారు. నాకు సంబంధించిన ప్రతీ విషయంలోనూ నాన్నగారు నాకు తోడుగా ఉంటూ ఆయన నాపై ప్రేమ చూపిస్తూ నాలో ఒక భాగమైపోయారు. అలా నాలో ఒక భాగమై మొత్తం అంతా ఆయనే అయ్యి నన్ను తీసేసారు అనటంలో ఎటువంటి సందేహం లేదు. అసలు మనము లేనేలేము ఉన్నదే ఆయన! నా జీవితమంతా ఆయనతోనే గడిపే అవకాశాన్ని భగవంతుడు నాకు కలుగజేసాడు. నాన్నగారు అంటే విపరీతమైన ఇష్టం ఉండేది. అందుకు ఆయన కష్టపడటం నాకు ఇష్టం ఉండేది కాదు.

దానివలన కన్నమ్మ గారితో ఏమైనా పని లో సహాయం కావాలంటే చెప్పండి నేను పురమాయిస్తాను అని చెప్పి చేస్తూ ఉండేవాడిని. నాన్నగారి ప్రవచనాలు ఎక్కడ జరిగినా వెళ్ళేవాడిని.

నాన్నగారి తల్లి రాజాయమ్మ గారికి, ఆమె కుమారులు ముగ్గురిలో నాన్నగారంటే ఎక్కువ ఇష్టంగా ఉండేది. నాన్నగారు పుస్తకాల గదిలో కూర్చొని లేవకుండా ఒక నాలుగైదు గంటలు పుస్తక పఠనం చేస్తూ ఉండేవారు. నాన్నగారు మా ఇంటికి, మా పొలానికి కూడా వస్తూ ఉండేవారు. నాకు ధ్యానం అంటే ఏమిటో తెలియకపోయినా, ధ్యానం చేసుకోవటం చాలా ఇష్టంగా ఉండేది. అందువలన మా పొలంలో ఒక కుటీరం వేసి, ప్రక్కనే ఒక కొలనులా త్రవ్వించి ధ్యానం చేసుకోవాటానికి ఒక పీట చేయించాను. నాన్నగారు పొలం వచ్చినప్పుడు కుటీరంలోకి వెళ్ళి చూసి చాలా బాగుంది సుబ్బరాజు గారు అన్నారు. అక్కడున్న పీట చూసి అలా మరొకటి చేయించమన్నారు.

నాన్నగారికి సౌకర్యంగా ఉండాలని పీట ఇంకా మంచిగా, పెద్దగా చేయించి ఇచ్చాను. నాన్నగారు దానిమీద కూర్చుని ప్రతిరోజు పుస్తకాల గదిలో పుస్తకాలు చదువుకుంటూ ఉండేవారు. నేను వెళ్ళినప్పుడల్లా నాన్నగారికి ఇబ్బంది కలగకూడదని నెమ్మదిగా వెళ్ళి అరుగు మీద కూర్చునే వాడిని. నాన్నగారు తరువాత నేను రావటం చూసి, ఆయన కూడా నెమ్మదిగా బయటకు వచ్చి కూర్చునేవారు. మా ఇరువురి మధ్య ఎలాంటి సంభాషణ లేకపోయినా అలా మౌనంగా కూర్చుని ఉండే వాళ్ళము. అలా నా జీవితమంతా నాన్నగారితోనే ముడిపడింది అనటానికి ఎటువంటి సందేహం లేదు. నాన్నగారితో ఇన్ని సంవత్సరాలు నా జీవిత యాత్ర కొనసాగటం అనేది భగవంతుడు నాకు ప్రసాదించిన వరం. బాహ్య సంబంధాలపై నాకు పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. నాన్నగారితో మాత్రమే మానసికమైన అనుబంధం నిరంతరం ఉండేది.

మొదటసారి నాన్నగారు, నేను మరో ఇద్దరితో కలిసి కాళహస్తి, ఏర్పేడు వెళ్ళాం. అప్పటికి నాన్నగారి వయస్సు సుమారు 25 సంవత్సరాలు ఉంటుంది. అప్పుడు మలయాళ స్వామి ఏర్పేడులో కుటీరంలో ఉన్నారు. అక్కడకి స్వామి దర్శనానికి మేము నలుగురం కలిసి వెళ్ళాము. స్వామి బయటికి రాలేదు. మేము కూర్చొని ఎదురుచూస్తున్నాము. ఈ లోపు ఒక అబ్బాయి,  మమ్మల్ని పిలుచుకురమ్మని స్వామి పంపారు అని పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు. అలా స్వామిని దర్శించుకున్నాము. మమ్మల్ని చూసి మలయాళ స్వామి చిన్న వయసులో చాలా శ్రద్ధగా వచ్చారు అని సంతోషపడ్డారు. మా వివరాలు అన్నీ అడిగి తెలుసుకున్నారు. మళయాళ స్వామి చెప్పిన ఒక మాట నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. వృద్ధాప్యం వచ్చిన తరువాత రామ, కృష్ణ అనుకుంటే సరిపోతుంది అనుకుంటారు చాలామంది. కానీ అది నిజం కాదు. తడిగా ఉన్న సిమెంటు మీద ఏదైనా అచ్చు గుద్దితే అది ఎప్పటికీ అలా ఉండిపోతుంది. అలా చిన్న వయస్సులోనే భక్తి అనే అచ్చు పడితే, ఎదిగేకొద్దీ మనం ఆధ్యాత్మికంగా శక్తివంతలమవుతాం. భవిష్యత్తులో అది బలాన్నిస్తుంది అన్నారు. మళయాళ స్వామి చెప్పింది విని నేను ఆశ్చర్యపోయాను.

తరువాత 1957 లో, భగవాన్ నాన్నగారికి కలలోకి వచ్చి అనుగ్రహించడం జరిగింది. ఆ తరువాత నాన్నగారు 1959 లో మొదటిసారి అరుణాచలం వెళ్ళినప్పుడు నేను ఆయనతో పాటు వెళ్ళాను. నేను అరుణాచలం వెళ్ళటం అదే మొదటిసారి. మాకు అక్కడ రూము దొరకలేదు. అప్పుడు భోజనానికి ఒక హొటల్ కి వెళ్ళాము. అక్కడ అన్ని రకాల పదార్థాలతో విందు భోజనంలా వడ్డించారు. అప్పుడు నాన్నగారు ఆ హొటల్ వాళ్ళతో, ఇన్నిరకాల పదార్థాలు వడ్డించారు. ఇంత తక్కువ దరకి మీకు ఎలా గిట్టుబాటు అవుతుంది? అన్నారు. అప్పుడు ఆ హొటల్ వాళ్ళు ఈ రోజు పండుగ కదా! పండుగ రోజు అందరికీ సంతృప్తిగా పెడతాము. లాభం ఆశించము అన్నారు.

వారిగురించి అంతలా ఆలోచించి మాట్లాడిన నాన్నగారి ప్రేమకి నా మనసు కరిగింది. హొటల్ వాళ్ళు మాతో, రమణాశ్రమం చూడ్డానికి వచ్చినప్పుడు అక్కడే రూములు, భోజనం దొరుకుతాయి కదా! మరి భోజనానికి ఇక్కడకి ఎందుకు వచ్చారు? అన్నారు. అప్పుడు నాన్నగారు మేము అరుణాచలం రావటం ఇదే మొదటిసారి, మాకు ఆశ్రమం గురించి వివరాలు తెలియవు అన్నారు.

అప్పుడు గుర్రపు జట్కాబండి కట్టించుకొని, దారిలో అరటిపళ్ళు కొనుక్కొని రమణాశ్రమానికి వెళ్ళాము. రమణాశ్రమంలో కిటికీ దగ్గర కూర్చుని సత్యానందగారు కనిపించారు. ఆయన 14 సం॥ల నుంచి మౌనంలో ఉన్నారు. ఆయన పని నెమళ్ళకి ఆహారం వేయటం. మమ్మల్ని చూడగానే సైగచేసి దగ్గరికి పిలిచారు. అక్కడ ఆశ్రమంలో గోశాల పక్కన, జంటిల్ మెన్ రూమ్ అని ఉంటుంది. ఆ రూమ్ మాకు ఇచ్చారు. అక్కడ మేము భగవాన్ తో కలిసి జీవించిన భక్తులను కలిసి మాట్లాడటం జరిగింది. అలా కలిసిన వారిలో కృష్ణస్వామి, అన్నామలైస్వామి, మురుగునార్ కూడా ఉన్నారు. మురుగునార్ భగవాన్ గురించి చాలా విషయాలు చెప్పారు. ఆయన చాలా నిరాడంబరంగా ఉన్నారు. తరువాత రామస్వామి పిళ్ళై అనే ఆయనని కలిసాము. ఆయన ఆశ్రమ శుభ్రత పని చూసుకునేవారు. ఫారిన్ భక్తులు చాడ్విక్, ఆస్ బోర్న్ లను కూడా కలిసాము. వీళ్ళు చాలా భక్తి, శ్రద్ధలతో మోకాళ్ళపై కూర్చొని, ఆశ్రమంలో జరిగే వేద పారాయణంలో పాల్గొనేవారు. మేము అక్కడ చలంగారితో కూడా మాట్లాడటం జరిగింది.

అరుణాచలం నుంచి రామేశ్వరం వెళ్ళాం. అక్కడ నాన్నగారు అర్ధరాత్రి సమయంలో లేచి వరండాలో కూర్చొని, ఎందరో మహానుభావులు అంటూ పాట మొదలు పెట్టి అద్భుతంగా చాలాసేపు పాడారు. తరువాత ఓం నమశ్శివాయ అని స్మరణ చేస్తూ వాసుదేవా, నారాయణా అంటూ నామాలు జపించడం మొదలు పెట్టారు.

అదంతా చూసిన నేను, సృష్టిలో అందరికంటే నేనే చాలా అదృష్టవంతుడిని అనుకున్నాను. తెల్లవారు జామున ధనుష్ కోటిలో సముద్రపు స్నానం చేసాము. తిరుగు ప్రయాణంలో మధురై మీనాక్షి గుడికి వెళ్ళాము. తరువాత పాండిచ్చేరి అరబిందో ఆశ్రమానికి వెళ్ళాము. అక్కడ మాతాజీని కలవడం జరిగింది. ఆ ప్రయాణంలో నాన్నగారు నాకు ఆధ్యాత్మిక బలాన్ని, శక్తిని ఇచ్చారు.

చాలాసార్లు నాన్నగారిలో నేను, బుద్ధుడిని, రామకృష్ణుడిని చూడటం జరిగింది. ఆయనతో నా అనుబంధాన్ని నేను మాటలలో పెట్టలేను. ఆయన నాకు అప్పగించిన పని చేయటం అంటే నాకు చాలా ఇష్టం. ఆయన సమక్షంలో ఆకలి కూడా తెలిసేది కాదు. గంటలు క్షణాలలాగ గడిచిపోయేవి. నాన్నగారి దయకు హద్దులు లేవు. ఆయన ఎప్పుడూ ఎదుటివారి శ్రేయస్సుకోసమే ఆలోచించి పనిచేసేవారు. ఎప్పుడూ ఆయన గురించి ఆయన ఆలోచించుకోలేదు. మా స్నేహం అలా కొనసాగుతూ వచ్చింది.

బద్రిరాజు గారని పి.డబ్ల్యు.డి ఆఫీసర్ నాన్నగారి దగ్గరకు వచ్చారు. ఆయన తనపని అయిపోయిన తరువాత సాయంత్రం నాన్నగారి దగ్గరకు వచ్చి చాలా సమయం గడిపేవారు. ఒకోసారి 8 గం.వరకూ ఉండిపోయేవారు. అప్పుడు నాన్నగారు మా గురించి ఆలోచిస్తూ, సుబ్బరాజుగారూ ఆఖరి బస్ టైమ్ అయిపోతోంది. బద్రిరాజు గారిని తీసుకువెళ్ళి బస్ ఎక్కించిరండి అనేవారు. నేను సంతోషంగా తీసుకువెళ్ళి ఆఖరి బస్ ఎక్కించేవాడిని.

నిజానికి నాన్నగారు మాకు ఏదైనా చెప్పాలంటే శాశించి చెప్పొచ్చు. కానీ ఆయన ఎప్పుడూ శాశించినట్టు మాట్లాడలేదు. మనసుకు హత్తుకునేలా చాలా సౌమ్యంగా మాట్లాడేవారు. ఇన్ని సం॥లు ఆయనతో గడిపాను. ఆయన ఎప్పుడూ సౌమ్యంగానే నన్ను పిలవడం జరిగింది.

నాన్నగారికంటే నేను వయసులో పెద్దవాడిని. నన్నే కాదు, నాన్నగారి కంటే చిన్నవారిని కూడా ఆయన చాలా గౌరవంగానే పిలిచేవారు. నాన్నగారు నాకు అప్పగించిన పనిని నేను చాలా ప్రేమగా చేసేవాడిని. ఎప్పుడూ కూడా నాకు ఆ పనులు కష్టమనిపించలేదు. ఇదంతా నా ఆధ్యాత్మిక అభివృద్ధికి సహాయపడింది. ఇలాంటి పనులు మన ఎదుగుదల కోసం చేయిస్తారని అర్థమయింది.

నాన్నగారు ఎక్కువ సమయం పుస్తకాల గదిలో గడిపేవారు. నాకూ, ఆయనకూ మధ్య ఉన్న స్నేహం సామాన్యమైనది కాదు. నాన్నగారు చాలా చేదుగా ఉన్నదేదయినా ఇచ్చి తినమన్నా ఒక క్షణం కూడా ఆలోచించకుండా నేను దానిని చాలా ఇష్టంగా తినేస్తాను. ఇలాంటిది ఇచ్చారు ఏమిటి? అని కూడా అనుకోను. ఎందుకంటే నాకు ఆయనమీద విపరీతమైన ప్రేమ. ఆయన ఏది చేసినా కేవలం నా మంచి కోసమే చేస్తారని నాకు తెలుసు. నాకు ఏది మంచో, ఏది చెడో ఆయనకి తెలిసినట్లు ఇంకెవరికీ తెలియదు. ఆయనతో సహవాసంలో నాకు అపారమైన శాంతి వచ్చేది. ఈ శాంతిని నా చుట్టూ ఉన్నవాళ్ళతో పంచుకోవాలని నాకు అనిపించేది. ఈ విషయం నేను నాన్నగారితో చెబితే, సుబ్బరాజుగారూ ఈ విషయాలన్నీ మనం బయటకు చెప్పకూడదండి. మనం మన లోపల శక్తిని పెంచుకుంటూ రావాలి గానీ, బయటకు అన్నీ వ్యక్తం చేయకూడదు అన్నారు.

రమణ క్షేత్రం నిర్మించేటప్పుడు నాన్నగారు నన్ను అక్కడ కూర్చోమని ఆ పనులు చూస్తూ ఉండమనే వారు. రామచంద్ర రాజు గారు నిర్మాణానికి అవసరమైనవి ఏమైనా కావాలంటే తెచ్చి ఇస్తారు అని చెప్పారు. అలా ఆ 15 రోజులు అక్కడ పనులు చూసుకున్నాను. రమణ క్షేత్రంలో నాన్నగారు ఒక పది మందితో కలిసి సత్సంగం జరిపేవారు. అప్పట్లో ఆశ్రమంలో నాపరాళ్ళు ఉండేవి. అందరం వాటిపైనే కుర్చునే వాళ్ళం.

వాటి పై కూర్చుంటే నాన్నగారికి నెప్పులు వస్తాయి కదా అని, సైకిల్ మీద ఒక పరుపు పట్టుకొచ్చి దానిని నాన్నగారు కూర్చునే చోట వేసేవాడిని. ఆయన లేచి వెళ్ళిన తరువాత  నా సైకిల్ మీద ఆ పరుపు తీసుకు వెళ్ళేవాడిని.

నాన్నగారు ప్రక్కనే ఉన్న గ్రామాలకి ప్రవచనాలు చెప్పటానికి వెళ్ళినప్పుడు, నేను కూడా నాన్నగారితో వెళ్ళటానికి ఇష్టపడి నాన్నగారితో కలిసి ఇద్దరం చెరో సైకిల్ మీద వెళ్ళేవాళ్ళం. చిన్న మోటార్ సైకిల్ కొనుక్కున్న తరువాత నాన్నగారిని దానిపై తీసుకువెళ్ళేవాడిని. నాకు అలా ఆయనతో వెళ్ళటం, ఆయన ఉపన్యాసాలు వినటం అంటే చాలా ఇష్టంగా ఉండేది. తిరిగి వచ్చేసిన తరువాత సుబ్బరాజు గారు చాలా జాగ్రత్తగా తీసుకువచ్చారండి అని నాన్నగారు అంటూ ఉంటే ఆ మాటలు ఎంతో ప్రేమగా, ఆకర్షణీయంగా ఉండేవి.

జిన్నూరులో మా ఇంటిని పోస్ట్ ఆఫీస్ కి అద్దెకు ఇచ్చాము. నాన్నగారి ప్రవచనాలు మా ఇంటి దగ్గర రెండు సంవత్సరాలు జరిగాయి.

నాన్నగారు ఉన్న స్థితిని అందరూ గుర్తించాలని, నాన్నగారి గురించి భక్తులందరికీ తెలియాలని నేను లోపల తపన పడుతూ ఉండేవాడిని. తరువాత నాన్నగారిని భగవంతుడు స్వరూపంగా అర్థం చేసుకుని భక్తులు ఎక్కువ మంది వస్తూ ఉంటే చాలా ఆనందంగా ఉండేది. నాన్నగారి దగ్గర కూర్చుంటే సర్వము మర్చిపోయి శాంతిలో ఊగిసలాడే వాళ్ళము. నాన్నగారి సంకల్పంతో రామచంద్ర రాజు గారు, జిన్నూరు డాక్టర్ గారు నా ద్వారా నాన్నగారికి పరిచయం అయ్యారు.

ఒకసారి మా మనవరాలు నాకు లక్ష రూపాయలు ఇచ్చి ఉంచుకొమ్మంది. అప్పుడు నాన్నగారికి తెలిసి, సుబ్బరాజు గారు మీరు పుచ్చుకున్నారా? అని అప్పుడప్పుడు అడుగుతూ ఉండేవారు. అవును నాన్నగారూ నేను తీసుకున్నాను అని చెప్పే వాడిని.

నాన్నగారు అలా అంటూ ఉంటే లోపల నుండి ఈ మూట ఇంకో జన్మకు మోసుకు వెళ్ళటం ఎందుకు? అని అంటున్నారని స్ఫురించి నా మనవరాలికి ఆ డబ్బు తిరిగి ఇచ్చేశాను. అలా నాన్నగారు చెప్పిన ప్రతి వాక్యం నా హృదయంలో ఉండిపోయింది. నాన్నగారి లాంటి స్నేహితుడిని, గురువుని ఇక ముందు ఎన్నడూ చూడలేను.

ఇప్పుడు భౌతికంగా ఎవరితోనూ మాట్లాడాలని అనిపించదు. మౌనంగా తదేకంగా అలా లోపలకి చూసుకుంటూ ఉంటే, భగవంతుడి దయవల్ల



సహజంగా మనస్సు అంతర్ముఖం అవుతోంది. జీవితంలో కష్టాలు ఎదురైనప్పటికీ, ఇదంతా భగవంతుడి అనుగ్రహం అనుకుని వాటిని ఇష్టంగా చేసుకున్నాను. అలా జీవితంలో ఇప్పుడు ఏ కోరిక లేకుండా సంతృప్తిగా జీవిస్తున్నాను. నాన్నగారు నా జీవితంలోకి ప్రవేశించిన ముందుకి ఇప్పటికీ చూసుకుంటే నా మనసులో చాలా వాసనలు తగ్గించారు అనిపిస్తుంది. నాన్నగారు దేహం వదిలేసిన తరువాత ఆయన దేహం లేదు కానీ, ఆయన శక్తి ఉంది అని అర్థం చేసుకున్నాను. నిరంతరం ఆయన జ్ఞాపకాలతో, ఆయన స్మరణలోనే ఉంటాను. ఆధ్యాత్మిక చింతన లేనివారికి నాన్నగారి స్థాయి అందదు. నాన్నగారు స్థాయి గుర్తించగలగాలి అంటే వారికి ఆధ్యాత్మిక చింతన కొంతైనా ఉండాలి.

# ప్రేమమూర్తి మన నాన్నగారు


## (సూర్యనారాయణ రాజు గారు (కాపవరం)

మా అత్తగారి ఊరు కొమ్మర గ్రామం. నేను అప్పుడప్పుడు ఆ గ్రామానికి వెళ్తూ ఉండేవాడిని. అక్కడ నాన్నగారిని మొదటిసారిగా చూశాను. కానీ ఆయనది జిన్నూరు అని అప్పుడు నాకు తెలియదు. మా అత్తగారి ఇల్లు, నాన్నగారి మేనమామల ఇల్లు ఎదురెదురు కావడం వల్ల నా భార్యకి ఆయన తెలుసు. 1965 వ సంవత్సరంలో నా భార్య నన్ను నాన్నగారికి పరిచయం చేసింది. అప్పటికి నా వయస్సు 25 సం॥లు ఉంటుంది. నాన్నగారు నన్ను మీది ఏ ఊరు? అని అడిగారు. మాది కాపవరం గ్రామం అని చెప్పాను. మీది కాపవరమా మా ఊరు పక్కనే అన్నారు. మీరు ఎవరి అబ్బాయి? అని అడిగారు. అప్పుడు నేను మా తండ్రిగారి పేరు చెప్పాను. మీ తండ్రి గారు నాకు తెలుసు అన్నారు.

తర్వాత కొద్ది రోజులకు నేను చెట్టు పై నుంచి పడిపోయాను. బంధువులందరూ ఇంక నేను బతకను అనుకున్నారు. అలా మూడు నెలలు మంచం మీదే ఉండిపోయాను. అప్పుడు మా వాళ్ళు నా గురించి దేవుడికి మొక్కుకున్నారు. తరువాత నెమ్మదిగా కోలుకొని కొద్దిరోజులకి పూర్తిగా నడవగలిగాను. ఆ మొక్కు తీర్చడానికి నేను, నా భార్య పెద్ద తిరుపతి బయలుదేరాం. అక్కడ స్వామి దర్శనం బాగా జరిగింది. అక్కడ నేను వెంకటేశ్వర స్వామి ఫోటో ఒకటి కొనుక్కున్నాను. వచ్చేటప్పుడు ఆ ఫోటో బ్యాగ్ లో పెట్టడం మర్చిపోయి రూములోనే వదిలేసాను. ఇంటికి వచ్చాక చూసుకుంటే ఫోటో కనిపించలేదు. నా భార్యని అడిగితే మీరే కదా సర్దుకున్నారు అంది. అయ్యో అక్కడ మర్చిపోయానే! ఇప్పుడు ఆ ఫోటో ఎలా వస్తుంది? అని మనసులో బాధ పడుతున్నాను. నా భార్యని వెంకటేశ్వర స్వామి ఆవహించి మీకు ఆ ఫోటో కావాలా? అని నన్ను అడిగారు. అవును కావాలనే కదా కొనుక్కున్నాను అనిచెప్పాను. అప్పుడు నా భార్య ఆ ఫోటో తీసి ఇచ్చింది. అప్పుడు నామనసులో ఇది నిజమా! లేక తనే ఫోటో కావాలని దాచి ఇప్పుడు ఇస్తోందా! అనే అనుమానం వచ్చింది.

అప్పుడు నా భార్యని అవహించి ఉన్న స్వామి హారతి కర్పూరం బిళ్ళలు తెచ్చి నా భార్య చేతిలో వేసి వెలిగించమన్నారు. ముందుగా ఒకటి వేసి వెలిగించాను. తర్వాత ఇంకొకటి, ఇంకొకటి అంటూ మొత్తం నాలుగు బిళ్లలు వేసి తన చేతి మీదే వెలిగించమన్నారు. అప్పుడు ఆమెకు చెయ్యి కొంచెం కూడా కాలలేదు. అప్పుడు నాకు నమ్మకం కలిగింది నా భార్య రూపంలో మాట్లాడింది ఆ వెంకటేశ్వరస్వామేనని. అప్పటినుండి భగవంతుడు ఉన్నాడు అని ప్రగాఢమైన విశ్వాసం కలిగింది. అప్పటి నుంచి నా ఆధ్యాత్మిక ప్రయాణం మొదలైంది.

పాలకొల్లులో గీతా మందిరం ఉంది. దానిని బ్రహ్మానంద స్వామి నడుపుతున్నారు. అందులో ఒక కార్యక్రమానికి నల్ల సుబ్బరాజు గారు నాన్నగారిని ఆహ్వానించారు. ఆ కార్యక్రమానికి నేను, నా భార్య కూడా హాజరయ్యాము.  అప్పటికి నాన్నగారు నేను, కొమ్మరలో కలిసి చాలాకాలం



అయ్యింది. అయినా నాన్నగారు నన్ను గుర్తుపట్టి,  సూర్యనారాయణ రాజు గారూ బాగున్నారా అని పలకరించి మీకు భక్తి వుంది అన్నారు. నేను నవ్వి ఊరుకున్నాను. తరువాత చాలా కాలం వరకు నాన్నగారిని కలవలేదు.

ఒకసారి చింతపర్రు నుంచి అప్పల రాజు గారు మా తండ్రి గారి వద్దకు వచ్చి, చింతపర్రులో గౌతమ బుద్ధుని విగ్రహం శిధిలావస్థకు వచ్చింది దానిని బాగు చేస్తున్నాం చందా కావాలని మా తండ్రి గారిని అడిగారు. అప్పుడు మా తండ్రిగారు నన్ను చూపించి వీడు మా మూడో అబ్బాయి. ఇంత చిన్న వయసులోనే వీడికి వైరాగ్యం వచ్చింది. వ్యవసాయం కూడా అన్నగార్లు ఇద్దరికీ అప్పచెప్పి ఆధ్యాత్మికత అని తిరుగుతున్నాడు. వీడిని నేను గట్టిగా మందలించలేకపోతున్నాను అని చెప్పారు. ఆయన నా వైపు చూసి ఇంత చిన్న వయసులో అంత వైరాగ్యమా అని ఆశ్చర్యపోయారు.

అప్పుడు అప్పలరాజు గారు నాతో, ప్రతి పౌర్ణమికి జిన్నూరు నుండి వెంకటరామరాజుగారు వచ్చి చింతపర్రులో మా ఇంటిదగ్గర  ప్రవచనం చెపుతున్నారు నువ్వు కూడా వచ్చి విను అన్నారు. అలా నేను నాన్నగారి ప్రవచనాలకు వెళ్ళటం మొదలుపెట్టాను. నాన్నగారితో నా అనుబంధం అలా మొదలైంది. అప్పటికి ఇంకా నాన్నగారికి నాన్నగారు అన్న నామదేయం రాలేదు.

నాన్నగారు ప్రతి పౌర్ణమికి మధ్యాహ్న సమయానికి చింతపర్రు చేరుకుని, సరిగ్గా 2 గంటలకు మొదలు పెట్టి 6 గంటల వరకు ప్రవచనం చేసేవారు.

నాన్నగారికి భగవాన్ 1959 వ సంవత్సరంలో కనపడ్డారు. అంతకుముందే నాన్నగారు భగవద్గీత బోధించేవారు. చింతపర్రులో నాన్నగారితో మాట్లాడటం కుదిరేది కాదు. ఎందుకంటే ఆయన సరిగ్గా 2 గం.లకు వచ్చి, 6 గం. వరకు ప్రవచనం చేసి సైకిలు మీద వెళ్ళిపోయేవారు. నేను అప్పుడప్పుడు అప్పలరాజుగారిని కూడా కలుస్తూ ఉండేవాడిని. ఒకసారి నేను ఆయనతో జిన్నూరు వెంకట్రామరాజు గారి ఇంటికి వెళ్లవచ్చా? అని అడిగాను. అప్పుడు అయన వెళ్ళవచ్చు, మధ్యాహ్నం పన్నెండు తర్వాత టీ తాగి అరుగు మీద కూర్చుని ఉంటారు అని చెప్పారు. మరుసటి రోజు అప్పలరాజు గారు, నేను కలిసి జిన్నూరు వెళ్ళాము. ఆరోజు భక్తి గురించి మాట్లాడుకున్నాం. సూర్యనారాయణ రాజు గారూ  అప్పుడప్పుడు వస్తూ ఉండండి అన్నారు నాన్నగారు. అప్పటినుండి వారానికి ఒకరోజు అప్పలరాజుగారు, నేను నాన్నగారి దగ్గరికి వెళుతూ ఉండేవాళ్ళం. అలా ఒక ఆదివారం మేము నాన్నగారి దగ్గరికి వెళ్ళిన  సమయానికి, అక్కడ రామచంద్రరాజు గారు కనిపించారు. అప్పలరాజు గారు ఆయన్ని పలకరిస్తే, ప్రతి ఆదివారం జిన్నూరు వస్తున్నట్టు చెప్పారు. అప్పటి నుండి ముగ్గురం ఒకేరోజు నాన్నగారి దగ్గరకు వెళ్ళేవాళ్ళము. అలా మా ముగ్గురితో ప్రతి ఆదివారం ప్రవచనాలు జరిగేవి.

ఒకసారి నా భార్య ప్రవచనం వినటానికి స్రీలకి అనుమతి ఉంటుందా? అని అడిగింది. నేను ఆమెతో అక్కడ స్త్రీలు ఎవరూ ఉండరు, నీకు వెంకట్రామరాజు గారి భార్య తెలుసు కదా!

నువ్వు లోపలికి వెళ్ళి ఆవిడ దగ్గర కూర్చో. స్త్రీలు రావచ్చు అంటే నిన్ను పిలుస్తాను అని చెప్పి జిన్నూరు తీసుకెళ్ళాను. నా భార్య లోపల కన్నమ్మగారి దగ్గరికి వెళ్ళింది. వాళ్ళిద్దరూ లోపల మాట్లాడుకుంటున్నారు. నాన్నగారు మేము, బయట అరుగుమీద కూర్చున్నాం. ఆయనకు తెలియనిది ఏముంది? మన మనసులో ఏమి జరుగుతుందో ఆయనకు తెలుస్తుంది కదా! అప్పుడు నాన్నగారు లోపల కొత్త మాట వినిపిస్తుంది ఎవరండి అని అడిగారు. నా భార్య స్త్రీలు కూడా ప్రవచనం వినటానికి రావచ్చా అని అడిగింది. తనని కూడా నాతో తీసుకు వచ్చానండి అన్నాను. అలాగా, ఆవిడను కూడా రమ్మనండి అన్నారు. నా భార్య వచ్చి నాన్నగారి దగ్గర కూర్చుంది. ఇద్దరు కొమ్మర విశేషాలు రెండు నిమిషాలు మాట్లాడుకున్నారు. తరువాత నాన్నగారు సబ్జెక్టు మొదలుపెట్టారు. అయిపోయాక నా భార్య నాన్నగారిని ఆడవారు ఇక్కడికి రావచ్చా? అని అడిగింది. అప్పుడు నాన్నగారు అదేంటమ్మా ఆత్మకి స్త్రీ లేదు, పురుషుడు లేడు. అందరూ అర్హులే. అందరూ రావచ్చు అన్నారు. అయన మాటలకి నా భార్య చాలా సంతోషపడింది. తను తిరిగి వస్తున్నప్పుడు జిన్నూరులో కొంతమంది స్త్రీలు సత్సంగం చెప్పుకోవడం చూసింది. వారిదగ్గరకు వెళ్ళి అక్కడ సూర్యుడు ప్రకాశిస్తుంటే ఇక్కడ చిన్న చిన్న దీపాలు పెట్టుకుంటున్నారా? అని అడిగి, ప్రతి ఆదివారం వెంకట రామరాజు గారి ఇంటి దగ్గర ప్రవచనం జరుగుతుంది, ఆదివారం మీరందరూ అక్కడికి రండి అని చెప్పింది. ఆ తరువాత ఆదివారం ప్రవచనం జరిగే సమయానికి 12 మంది స్త్రీలు వచ్చి కూర్చున్నారు.

అలా క్రమేపీ భక్తులు పెరుగుతూ రావటం వలన అరుగు సరిపోయేది కాదు. అప్పటికి పోస్ట్ మాస్టర్ కూడా నాన్నగారి ప్రవచనానికి వచ్చేవారు. అప్పుడు పోస్ట్ మాస్టర్ ఇక్కడ చోటు సరిపోవట్లేదు కదా! ప్రవచనాలు పోస్ట్ ఆఫీస్ లో పెట్టుకుందాం అని అడిగారు. వెంటనే నాన్నగారు సరే అన్నారు. అప్పట్లో పోస్టాఫీసులో ఒంటిగంట నుండి రెండింటి వరకు మౌనం, రెండు గంటల నుండి ఆరు గంటల వరకు ప్రవచనం జరిగేవి. తర్వాత భక్తులు ఎక్కువై ఆ పోస్ట్ ఆఫీస్ కూడా సరిపోయేది కాదు. అప్పుడు నల్ల సుబ్బరాజు గారు ఆయన సొంత డబ్బులతో ఎదురుగా పందిరి వేయించారు. అప్పుడు చాలా ఖాళీ ప్రదేశం వచ్చింది.

ఇంక జనం పెరిగినా, ఎన్నాళ్లు చెప్పుకున్నా పర్వాలేదు అనుకున్నారు. కానీ క్రమేపీ ఆ పందిరి కూడా నిండిపోయింది. అప్పుడు ఎర్ర సుబ్బరాజు గారికి ఇక్కడ రమణాశ్రమం కడితే బాగుండు అని తలంపు కలిగింది. ఎర్ర సుబ్బరాజు గారు ఆయన తోటలో రమణాశ్రమం కట్టుకోవడానికి స్థలం ఇచ్చారు. ఈ లోపు నాన్నగారు ప్రవచనాలు చెప్పడానికి చుట్టు ప్రక్కల గ్రామాలకు ఎక్కువగా వెళ్ళేవారు.

ఒకసారి చిన్న అమీరంలో ఈశ్వరమ్మ అనే ఒక అమ్మగారు మాకు తారసపడ్డారు. ఆవిడ వేల్పూర్ స్వామి గురించి చెప్పారు. ఆవిడను కాపవరం తీసుకువెళ్ళాం. అక్కడ ఆవిడ నాలుగు రోజులు ఉన్నారు. ఆవిడకు చదువు రాదు. అయినా అక్షరమణమాల చూడకుండా పాడేవారు. ఆవిడ మమ్మల్ని వేల్పూరు స్వామి దగ్గరికి తీసుకువెళ్ళారు. మేము వెళ్ళే సరికి వేల్పూర్ స్వామి "నేనెవడను?" అనే పుస్తకం చదువుతూ సత్సంగం చెబుతున్నారు. అప్పటికి వేల్పూర్ స్వామి మౌనం పట్టలేదు మాట్లాడుతున్నారు. అప్పటికి ఆయనకు 18 -19 సం॥ లు ఉంటాయి. ఇంత చిన్న వయసులోనే ఇంత వైరాగ్యంగా ఉన్నారు, జిన్నూరు వచ్చి నాన్నగారి మాటలు వింటే ఇంకా బాగుంటుంది అని నాకు అనిపించింది. అప్పుడు వేల్పూరు స్వామితో, జిన్నూరులో భగవాన్ భక్తులు వెంకటరామరాజు గారు ఉన్నారు. ఆయనకు భగవాన్ గురించి బాగా తెలుసు. అందుచేత ఒక ఆదివారం మీరు అక్కడికి రండి అని చెప్పాను. సరే వస్తాను అన్నారు. ఆ తర్వాత ఆదివారమే ఇంకొకరిని తీసుకుని వేల్పూరు స్వామి జిన్నూరు వచ్చారు. నాన్నగారి ప్రవచనం అయిపోయాక వేల్పూరు స్వామిని, నాన్నగారికి పరిచయం చేసాను. వేల్పూరు నుంచి వచ్చారు రమణ భక్తులు, మీ దర్శనానికి వచ్చారు అని చెప్పాను. నాన్నగారు స్వామితో మాట్లాడి ప్రతి ఆదివారం వస్తూ ఉండండి ఇక్కడ మీటింగ్ జరుగుతుంది అన్నారు. భగవాన్ గురించి అక్కడ వేల్పూర్ లో స్వామి చెప్పేవారు. ఇక్కడ జిన్నూరులో నాన్నగారు చెప్పేవారు. తర్వాత కొంతకాలానికి కార్తీక అమావాస్య రోజున వేల్పూర్ స్వామి మౌనం పట్టారు. ఆయన మౌనం పట్టిన రోజును వేల్పూరులో ప్రత్యేకమయిన రోజుగా జరుపుతారు. ఒకసారి వేల్పూరు స్వామి ఆయన తండ్రి గారిని జిన్నూరు పంపించి నాన్న గారిని ప్రవచనం చెప్పటానికి ఆహ్వానించారు.

అప్పుడు నాన్నగారు వేల్పూరు వెళ్ళారు. మన భక్తులు కూడా కొంతమంది వెళ్లారు. తర్వాత రెండు, మూడు సార్లు నాన్నగారు వేల్పూరులో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసారు.

పోస్ట్ ఆఫీస్ లో మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రవచనం మొదలు పెట్టేవారు. ముందుగా నాన్నగారు కళ్ళు మూసుకుని కొద్దిసేపు ధ్యానంలో కూర్చునేవారు. ఆ సమయంలో మేమందరం కూడా కళ్ళు మూసుకుని ధ్యానంలోకి వెళ్ళిపోయేవాళ్ళం. అసలు నిశ్శబ్దం అంటే ఎలా ఉంటుందో అక్కడే చూడాలి. ఒక్క మాటలో చెప్పాలి అంటే సహజంగానే అందరికీ మనోమౌనం వచ్చేది. ఒకసారి ఒక అరగంట అయిన తర్వాత నేను ఎందుకో కళ్ళు తెరిచి చూసాను. అక్కడున్న అందరూ కళ్ళు మూసుకునే ఉన్నారు. కానీ నాన్నగారు మాత్రం కళ్ళు తెరిచి అక్కడున్న ఒక్కో మనిషిని చూస్తున్నారు. ఆ చూపు తోటి వాసనలే తీసేసారో! జన్మలే తీసేసారో! మొత్తానికి భక్తులందరికీ ఉపకారం జరుగుతోంది, మేలు జరుగుతోంది అని ఆరోజు నాకు అర్థం అయింది. తరువాత కొద్దిసేపటకి నాన్నగారు ప్రవచనం మొదలుపెట్టేవారు. నాన్నగారి మాట ఎక్కడో నూతిలో నుండి వచ్చినట్టు వచ్చేది. అక్కడ మా మనసు సెపరేటుగా లేకుండా ఆయనతో లయం అయిపోయేది. అలా అందరినీ మనో మూలంలోనే ఉంచేవారు. నాన్నగారు అందర్నీ పరిశీలనగా చూస్తూ "మీకేమో మాటలు కావాలి. నాకేమో మాటలు రావట్లేదు. ఇలాగే మౌనంగా ఉండాలని ఉంది. కానీ మాటలు లేకపోతే మీరు తృప్తి పడరు కదా! అందుచేత మీ కోసం నేను చెప్పవలసి వస్తోంది. ఎక్కడో ఉన్నవాడిని వచ్చి చెప్పవలసి వస్తోంది" అనేవారు. ఎక్కడో అంటే బయట అని కాదు. హృదయంలో అని నాకు అర్థం అయింది. ముందు నెమ్మదిగా మాట్లాడేవారు. తరువాత కొద్ది  సేపటికి ఆయన గొంతు పెరిగేది.



ఒకసారి కేవలం స్వరూపం గురించి చాలా లోతైన ప్రసంగం చేసి అందర్నీ ఆ స్వరూపంలోకి తీసుకెళ్ళిపోయారు. ఇంక అక్కడ సాధన ఏమీ లేదు. అంత లోతుల్లోకి వెళ్ళి చెప్తున్నారు. అది వినేసరికి నాకు, మనం ఆ స్వరూపమే అయి ఉన్నాం కదా! మనము ఈ మనసును పట్టుకుని ఏడుస్తున్నాము అనిపించింది. ఇంత స్వచ్ఛమైన బోధ, ఇంత స్వచ్ఛమైన మాటలు గాలిలో కలిసిపోతున్నాయి. మనం బయటకు వచ్చిన తరువాత నాన్నగారు ఏమి చెప్పారంటే ఎవ్వరికీ రెండు మాటలు చెప్పలేకపోతున్నాము, ఏమిటి ఈ పరిస్థితి అనిపించేది. అద్భుతమైన ఆ వాక్యాలు ఎవరూ రాయలేకపోయారు. ఆ మాటలను పట్టుకుని రాద్దామనుకున్నా నేను రాయలేను అని ఆవేదన వచ్చేది. అప్పుడు అప్పలరాజు గారు చిన్నబ్బాయి సత్యసాయి భక్తులు. అతను పాటలు బాగా పాడతాడు. ఆ అబ్బాయికి క్యాసెట్లు రికార్డు చేయటం తెలుసు. నేను అతనితో, టేప్ రికార్డర్, క్యాసెట్లు నేను కొంటాను. నువ్వు ప్రతి ఆదివారం నాన్నగారి మాటలు టేపు చేయాలి అని అడిగాను. తప్పకుండా అన్నయ్యా నేను  చేస్తాను అన్నాడు. ఇదంతా ఈశ్వర సంకల్పమే! తర్వాత క్యాసెట్లు రికార్డు చేయటం నాకు కూడా అలవాటు చేసాడు. అలా నేను 25 క్యాసెట్లు వరకు చేశాను. తర్వాత క్యాసెట్లు కొనటం ఆర్థికంగా నాకు భారం అయ్యింది మళ్ళీ నేను ఆ అబ్బాయికి విషయం చెప్పి ఏం చేయను అని సలహా అడిగాను. అప్పుడు ఆ అబ్బాయి ఒక సలహా ఇచ్చాడు. ఆ సలహా మేరకు క్యాసెట్లలో రికార్డయిన ప్రసంగాలన్నీ పుస్తకంలో రాసేవాడిని. తర్వాత ఆ క్యాసెట్ చెరిపేసి మళ్ళీ అందులోనే రికార్డ్ చేసేవాడిని. అలా పోస్ట్ ఆఫీస్ మీటింగ్ లలో నాన్నగారు చేసిన ఆధ్యాత్మిక బోధ అంతా భద్రపరచబడినది.

ఇంతలో డాక్టర్ రామారావు గారు వచ్చారు. ఈ క్యాసెట్లు, ఇదంతా చూసి ఆయన నాతో,  సూర్యనారాయణ రాజు గారూ ఆ క్యాసెట్లు నాకు ఇవ్వండి నేను పట్టుకెళ్ళి రికార్డ్ చేసి మీకు మళ్ళీ తెచ్చి ఇచ్చేస్తాను అన్నారు. ఆ తర్వాత నుండి రికార్డింగ్ బాధ్యత ఆయన తీసుకున్నారు. రికార్డ్ చేసిన క్యాసెట్లలో సబ్జెక్ట్ నేను పుస్తకంలో రాసుకునేవాడిని. తర్వాత మిల్లు రామరాజు గారు క్యాసెట్లు బుజ్జిని తీసుకొచ్చారు. బుజ్జి వచ్చినప్పటి నుండి క్యాసెట్లు ఇంకా క్లియర్ గా రావడం, సిడిలు చేయడం మొదలైంది.

బుజ్జి వచ్చినప్పటి నుంచి సబ్జెక్టు ప్రవాహంలా ఆగకుండా రికార్డయ్యింది. ఆ తర్వాత కొద్ది కాలానికి జిన్నూరు రమణాశ్రమంలో మేనేజ్ మెంట్ లో వచ్చిన కొన్ని ఇబ్బందుల కారణంగా, కొద్ది రోజులు నాన్నగారు అక్కడ ప్రవచనాలు ఆపి పొరుగు గ్రామాలకు ఎక్కువగా వెళ్ళేవారు. దాంతో పొరుగు గ్రామాల నుండి కొత్త భక్తులకు అవకాశం కలిగి వాళ్ళు రావడం ప్రారంభించారు. పోస్ట్ ఆఫీస్ ప్రవచనాలు జరిగే రోజుల్లో వచ్చే భక్తులందరూ ఎలా ఉండేవారంటే, వారు కేవలం సబ్జెక్టు కోసమే వచ్చేవారు. భౌతిక విషయాలు కానీ వారి వ్యక్తిగత విషయాలు కానీ నాన్నగారి దగ్గర చర్చించేవారు కాదు. ఆయన సమక్షంలో రోజులు, వారాలు ఎలా గడిచిపోయాయో మాకు తెలిసేది కాదు. భగవాన్ ఈ సృష్టిని లేనిదానిగానే చూసారు. భగవాన్ ఒక్క కోణంలోనే ప్రయాణం చేశారు. రెండవ కోణం లేదు కదా! భగవాన్ కి ఏద్వైతే అనుభవంలో ఉందో, నాన్నగారికి కూడా అదే అనుభవంలో ఉంది. అయితే  నాన్నగారు ఈ ప్రకృతిని తన స్వరూపంగా చూశారు. అది మామూలుగా చూడటం కాదు! మనసుతో చేసింది కాదు! అది ఆయన అయి ఉన్నారు. అందుచేత భక్తులు తమ కష్టసుఖాలు గురించి చెప్పుకున్నా, చదువుల గురించి చెప్పినా, చేపల చెరువుల గురించి చెప్పినా ఆయన వాటిని తనకు భిన్నంగా విడదీయలేదు. ఆయన వాళ్ళ ఇబ్బందులను ఎంతవరకు సరిచేయగలరో అంతవరకు చేసేవారు. ఈరోజున చాలా మంది భక్తుల పిల్లలు ఒక ఉన్నత స్థితిలో ఉన్నారంటే,  దానికి కారణం నాన్నగారే అనటంలో ఎటువంటి సందేహం లేదు.

నాన్నగారు భౌతికమును, ఆధ్యాత్మికతను విడదీయలేదు. ఒకటిగానే చూశారు అనడానికి ఒక ఉదాహరణ:  లంకలకోడేరు లో ఎవరో బ్రాందీ షాపు ఓపెనింగ్ కి పిలిస్తే, నాన్నగారు వెళ్ళి బ్రాందీ షాప్ ఓపెన్ చేశారు. దానికి కారణం ప్రకృతిని, పరమాత్మని ఆయన వేరుగా చూడలేదు. ప్రకృతి, పరమాత్మ ఒక్కటే, వేరు కాదు!



అని మహాత్ములు అందరూ చెబుతారు కాని ఎవరూ ఆచరణలో చూపించలేదు. అది ఒక్క నాన్నగారికే సాధ్యమైంది. అక్కడ విమర్శకి లొంగలేదు. విమర్శించిన వాళ్ళను కూడా ప్రేమించారు. ఆయన చేసింది మనకు అర్థమయితే, ఆ కృతజ్ఞత కనుక మన హృదయంలో  వికసిస్తే మనకు క్షణంలో మోక్షం వస్తుంది.

పోస్ట్ ఆఫీస్ మీటింగ్ లు జరిగిన రోజుల్లో ఆ బోధను అనుభవించాం, ఆ మౌనాన్ని అనుభవించాం. ఆ ఆనందం ఇప్పుడు లేదు కదా అని నాకు చాలా బాధ అనిపించి, ఒకసారి నాన్నగారిని అడిగాను. అప్పుడు నాన్నగారు సూర్యనారాయణ రాజు గారూ అవి అమృతతుల్యమైన రోజులండీ..! మనం మళ్ళీ ఆ రోజులను చూడలేము..!  అన్నారు. నేను ఆ గతాన్ని హృదయంలో ఉంచుకుని, నాన్నగారి మీద ధ్యాస పెట్టుకుని తటస్థంగా  ఉండటానికి అలవాటుపడ్డాను. నాన్నగారు నాకు వేరుగా లేరు! నాలో ఉన్నది ఆయనే! అందుచేత ఈ మనసు కోతి గంతులు వేసినా, దానిని అదుపు చేసుకుని ఆయనపై  ధ్యాస నిలబడేలా ప్రయత్నం చేస్తాను. నాన్నగారు భౌతికంగా, ఆధ్యాత్మికంగా ఏలోటూ రాకుండా నాకు కావల్సినవన్నీ నాకు అందించారు.

# జీవితంలో వెలుగు నింపిన నాన్నగారు

**(డా. రామరావు గారు)**

పేదలే పెన్నిధులనుకొని, దీనులే దేవుళ్లనుకొని, ఆర్తులే ఆప్తులనుకొని, పీడితులే పరమాత్మ అనుకొని 12 సంవత్సరాలు పని పని కోసమే చేసాను. చివరికి విధివంచితుడనై, నేను నమ్మిన ఆశయాలు వమ్మై, నేను దైవంగా పూజించిన సమాజమే నన్ను ద్వేషిస్తూంటే- చేసేది లేక వృత్తికి స్వస్తి చెప్పి, కర్తవ్యం తెలియక ఖిన్నుడనై, మిన్నకున్న తరుణంలో ఒక మిత్రుడు తారసిల్లి, “ జిన్నూరు లో ఒక రాజుగారు ఉన్నారు. ఆయన మంచి భక్తులు. చక్కని సలహాలు చెప్తారు. ఆయనను కలుసుకోండి. మీ మనస్సు కుదుట పడుతుంది.” అని సలహా చెప్పారు.

1984 ఏప్రెల్ 19న ఆ మహనీయుడిని దర్శించాను. “రాజుగారు! నేను నమ్మిన ఆశయాల కోసం జీవితాన్ని అంకితం చేసి, అయిన వారందరికి దూరమయ్యాను. నేను నమ్మిన ఆశయాలు నాకు గాని, నా వారికి గాని, నేను ప్రేమించే సమాజానికి గాని శాంతిని సంతృప్తిని ఇవ్వలేదు. నా ఆశయాలే నన్ను గేలి చేస్తున్నాయి. అవమానం వేధిస్తోంది. ఆవేదన కృంగదీస్తోంది. ఆలోచన, జరిగిన దానిని మర్చిపోయి సమాజానికి దూరంగా, ఏకాంతంలో ప్రశాంతంగా బ్రతకమంటోంది.ఏది మంచో, ఏది చెడో నేను నిర్ణయించుకోలేక పోతున్నాను. అందుకే మీ సలహా కోరి వచ్చాను. మీరు ఏ దారిన నడవమంటే అది నాకు ఇష్టము లేక పోయినా, కష్టమైనప్పటికి ఆచరించడానికి సిద్ధంగా ఉన్నాను.” అని నా పరిస్థితిని వివరించాను.

ఆయన కాసేపు నా ముఖంలోకి ప్రశాంతంగా చూసారు. “ మీకు మంచి రోజులొస్తాయి. అభివృద్ధిలోకి వస్తారు. ప్రస్తుతం మీరు ఇప్పుడు చేస్తున్న వృత్తిని విడిచి పెట్టండి.కొద్ది రోజుల్లో మీ హృదయంలో నుండే మీకు ఆదేశాలు వస్తాయి. వాటిని మీరు ఆచరించండి.” అని చెప్పి భగవాన్ శ్రీ రమణ మహర్షి జీవిత చరిత్రను ఇచ్చి పంపేసారు.

వారం తిరగకుండానే వారి అనుగ్రహం వల్ల మళ్లీ దర్శన భాగ్యం కలిగింది. రాత్రి 9 గం. లకు నేను జిన్నూరు వెళ్లేటప్పటికి ఆయన ఒక్కరే ఒంటరిగా అరుగు మీద కూర్చొని ఉన్నారు. “ రాజుగారు! ‘ నాది’ అనే భావన పోయి, నేను నేనుగా ఒంటరిగా మిగిలిపోవాలని ఉంది. అప్పటి వరకు కనుచూపుమేరలో నా ఊహకు అందినంతవరకు, నాకు శాంతి కనిపించటం లేదు.” అని చెప్పాను.

ఒక్క సారి ఆయన కళ్లు మెరుపులా మెరిసాయి. మరల చెప్పమన్నారు, చెప్పాను. మరల చెప్పమన్నారు. అంతే! ఆ కళ్లు రెప్ప వాల్చకుండా నా కళ్లల్లోకి చూస్తూ నిలబడి పోయాయి. ఆ కళ్లు మామూలు కళ్లు కావు. ఆ చూపు మామూలు చూపు కాదు. ఎక్కడో అంతరాంతరాళాలలో నుండి వచ్చి నా హృదయాంతరాళము లోనికి చూస్తున్నది ఆ చూపు! ఎంతో ప్రశాంతత, ప్రేమ పొంగి పొరలుతున్నది ఆ చూపు లో! బండరాళ్లు కూడా కరిగిపోతాయని అనిపిస్తోంది- ఆ ప్రేమకు! మా చుట్టూ గంభీర మౌనము ఆవరించినది. ఆ చూపుల కాంతిలో, శాంతిలో నేను కాలాన్నే మర్చిపోయాను. గంట కాలం గడిచి పోయింది. ఆ గంటే నా జీవితంలో జేగంట మ్రోగిన ఘడియని, ఆ రోజే నా జన్మకు జీవం పోసిన రోజని అప్పుడు నాకు తెలియదు. మౌనము మాట్లాడుతుందని, జ్ఞానాన్ని బోధిస్తుందని, అమృతాన్ని వర్షిస్తుందని నేనెప్పుడు ఊహించలేదు. కాని అది నా ఊహకు అందిన తరువాత ఉప్పొంగిన హృదయంలో నుండి కృతజ్ఞతతో కన్నీరు పొంగిపొరలింది.

గంభీర మౌనాన్ని ఛేదించుకుని ఎక్కడో హృదయపు లోతుల్లో నుండి వస్తున్న ఒక మాట వినిపించింది. “ఈ వెంకట్రామరాజే వచ్చి (నాన్నగారే), భవిష్యత్తులో మీ కళ్ల ముందు నిలుచుంటే- కన్నెత్తి చూడటం కూడా మీకు భారమనిపించ వచ్చును డాక్టరు గారు!” అని అన్నారు.

కృతజ్ఞతతో నిండిన నా మనస్సు ఒక్క సారి తుళ్ళిపడి, “నేనంత కృతఘ్నుడను అవుతానంటారా?” అని అడిగాను.

“మీ కంటే వేరొక వస్తువు ఉంటే మీరు చూస్తారు. కాని అంతటా ఉన్నది మీరే అయినప్పుడు, మీరు దేనిని చూస్తారు?” అని ప్రశ్నించారు.

“మీరు అన్నదే నిజమైతే, ఆ మహోన్నత స్థితినే గనుక నేను పొందితే, ఆ స్థితికి దారి చూపుతున్న మీ పట్ల నాకు కృతజ్ఞత ఉండాలి కదా?” అని అన్నాను.

“కృతజ్ఞత ఉన్నప్పటికి – ఒక్కసారి అద్వైత సుఖాన్ని రుచి చూసాక, ఆ ఆత్మశాంతిలో మునిగాక, ద్వైత దృష్టి ఎంత కష్టమో మీకు చెపుతున్నాను” అని అన్నారు ప్రేమతో!

ఆ మాటల బరువు, వాటి లోతు ఆనాడు నాకు తెలియదు. ఏదో అవ్యక్తమైన అనుభూతి నన్ను ఆవరించింది.

కొద్ది రోజులు గతించిన తరువాత, శ్రీ నాన్నగారి మాటలున్న కేసెట్టును ఒక సోదరుడు నాకు ఇచ్చారు. వారి మాటలు వింటున్నాను. అందులో కొన్ని మాటలు నా గుండెను కుదిపేసాయి. నా హృదయాన్ని దోచేసాయి. “ మీరు జన్మించినది మొదలు మీ స్వార్థం కోసమే పరితపిస్తున్నారు. కాని పరమార్థం కోసం మీ జీవితంలో ఎంతకాలం ఖర్చు పెట్టారు?” అని- ఆ మాటలు నాకు సత్యమనిపించాయి. అహంకారమును సంతృప్తి పరచుటకై జీవించటం కంటే – సద్గురువును ఆశ్రయించి, అహంకార రహిత స్థితిని చేరుకొనుటకు ప్రయత్నం చేయుట మంచిదనిపించింది. మరి ఆ సద్గురువు ఎక్కడ దొరుకుతాడు?

తళుక్కున మెరుపులా నాకు ఒక ఆలోచన తట్టింది, ”ఇన్నాళ్ళుగా లోకము వైపు పరిగెడుతున్న నా మనస్సు ఇప్పుడు ఎందుకిలా వెనుతిరిగి వస్తున్నది? ఈ ఆలోచనలు అన్నీ ఎందుకు వస్తున్నాయి?

ఆ మహనీయుని మాటలు వినబట్టేగదా? అయితే ఆయనే నాకు గురువు!"
సత్యాన్ని గుర్తు చేసి, తెలియ చెప్పగలవాడే గురువు. గుర్తించే హృదయం లేక ఇన్నాళ్లు కళ్లుండీ చూడలేక పోయాను---అంతే! ఆ రోజు నుండి శ్రీ నాన్నగారితో నా జీవితాన్ని ముడిపెట్టుకున్నాను. స్మరించుట మొదలు పెట్టాను. ప్రేమించుట నేర్చుకున్నాను. ఆ ప్రేమ నా దుఃఖాన్ని ఆర్పివేసింది. నా జీవితంలో ఎంతో వెలుగును నింపింది. సంవత్సరం తిరగకుండానే ఆయన పాదాల చెంతకు నన్ను చేర్చింది. మహిమలు చెసినవాడు గురువని మనం అనుకుంటాం. మరి మనస్సును మార్చటం కంటే మించిన మహిమ మరొకటుందా!!

సత్యాన్వేషణలో సహకరించుటకు మన తండ్రి మన కోసం ఎదురు చూస్తున్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోండి. మీరూ తరించండి.



# ఈశ్వరుడే నాన్నగారు స్వరూపంలో

**(రామచంద్ర రాజు గారు)**

నేను ఆంధ్రపత్రికలో విలేఖరిగా చేస్తూ ఉండే వాడిని. నాన్నగారిని దర్శించక ముందు నుండే ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకోవాలని కుతూహలంగా ఉండేది. నేను వడ్లవానిపాలెంలో ఉండగా, సుబ్బరాజుగారు మా ఇంటికి వస్తూ ఉండేవారు. అలా వచ్చినప్పుడు ఒకసారి నాకు భక్తి మీద చాలా ఇష్టంగా ఉంది అని చెప్పాను. ఆయన నాన్నగారు అని జిన్నూరులో ఉన్నారు వెళ్దాం రండి అన్నారు. అంతకుముందే నేను ఒకసారి నాన్నగారి ప్రవచనం విన్నాను. ఒక ప్రవాహం లాగ చెప్పటం వలన నాకు అర్థం కాలేదు. అయినా, ఆయన రమ్మంటున్నారు బాగోదు కదా అని వెళ్ళాను. మేము వెళ్ళే సరికి సాయంత్రం 5 అయ్యింది. నాన్నగారు అప్పుడే భోజనం పూర్తిచేసుకొని అరుగు మీద ఉన్న పుస్తకాల గది లో కూర్చుని ఉన్నారు. నన్ను అక్కడ వదిలి సుబ్బరాజుగారు వెళ్ళిపోయారు. నేను, నాన్నగారు మాత్రమే అరుగు మీద కూర్చున్నాము. ఆయన నా యోగక్షేమాలు అన్నీ అడిగి తెలుసుకున్నారు. తరువాత నాన్నగారిని రెండోసారి దర్శనం చేసుకున్నప్పటి నుండి ఏ పని చేస్తున్నా కూడా ఆయనే నా మనసులో ఉండేవారు. అప్పటినుండి ప్రతిరోజూ నాన్నగారి దర్శనం చేసుకునేవాడిని. ఆయన నా కూడా ఉన్నట్టే అనిపించేది. ఆ ఆనందాన్ని పట్టలేక పోయేవాడిని. ఈశ్వరుడే గురు రూపం ధరించి వస్తాడు అని కానీ, హృదయం లోనే ఆనందం ఉంది అని కానీ నాన్నగారిని కలవక ముందు నాకు తెలియదు.



అప్పటికి  సబ్జెక్ట్ అంతగా వినక పోయినా, నాన్నగారిని చూసినప్పుడల్లా ఆనందం వస్తూ ఉండేది. ఏంటి ఈ ఆనందం ఎక్కడి నుంచి వస్తోంది అనుకునేవాడిని. నాన్నగారు నాలోనే, నాతోనే ఉంటూ నిరంతరం ఆయన సమక్షంలో గడిపే మహోన్నతమైన వరాన్ని నాకు ప్రసాదించారు. నాలో ఉన్న వాసనలు అన్నీ నాన్నగారు తీసేసి, నా హృదయాన్ని ఖాళీ చేశారు. అను నిత్యం ఆయన సమక్షంలో గడపటమే నాకు సాధన. అప్పట్లో భక్తులు తక్కువగా ఉండటం వలన, నాకు ఎప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు నాన్నగారిని చూసి వస్తూ ఉండేవాడిని. అలా ఒక సారి మధ్యాహ్నం 1:00 గం. వెళ్ళినప్పుడు నాన్నగారు పడుకుని ఉన్నారు. నన్ను చూసి రండి రామచంద్రరాజు గారూ మీ గురించే చూస్తున్నాను అన్నారు. నేను ఏమీ మంత్రం అడగకుండానే నాకు మంత్రాన్ని ఇచ్చారు. నాకు అప్పటికి మంత్రం ఇస్తారని కూడా తెలియదు.

ఒకసారి నాన్నగారు నాతో మనం అరుణాచలం వెళ్దాం అన్నారు. సరే అని చెప్పి ఇంటికి వచ్చేసాను. నాన్నగారు పాలకొల్లు సంతకు వస్తూ ఉండేవారు. అలా సంతకి వచ్చినప్పుడు ఒకసారి కూరగాయలు కొనుక్కుని మా షాప్ దగ్గరికి వచ్చి, రామచంద్ర రాజు గారు అరుణాచలం వెళ్లి వచ్చేద్దాము సిద్ధంగా ఉండండి, టికెట్ తీసుకున్నాను అన్నారు. ఆత్మ ఒక్కటే సత్యం అంటున్నారు కదా! ఇవి అన్నీ వెళ్ళటం అవసరమా నాన్నగారూ అని అడిగాను. నాన్నగారు " రాజీ లేదు, తిరుగు లేదు ఆత్మ ఒక్కటి మాత్రమే సత్యం" అన్నారు. ఈశ్వరుడే గురు రూపంలో నాన్నగారిలా వచ్చారు అని తెలిసినా, మనసులో అంత పట్టు కుదరక ఆయనని ఒక స్నేహితుడిగానే చూశాను.



చాలా యాత్రలకు మేము ఇద్దరమే వెళ్ళేవాళ్ళము. అలా మొదటిసారి అరుణాచలం వెళ్ళినప్పుడు గిరి కనిపించగానే, అదిగో రామచంద్ర రాజుగారు అదే అరుణాచలం గిరి అని చెప్పారు. ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి అరుణాచలం వెళ్ళేవాళ్ళము. అలా ఒకసారి అరుణాచలం వెళ్ళి అక్కడ నుండి చిదంబరం, కుంభకోణం, తిరుచందూర్, స్వామిమలై, తిరుచంద్రాపురం, కన్యాకుమారికి వెళ్ళాము. కన్యాకుమారి నుండి మద్రాసు బస్సులో ప్రయాణించాము. చాలా సమయం పట్టింది. నాకు బస్సు ప్రయాణాలు పడక పోవటం వలన వాంతులు అవుతూ ఉండేవి. ఈ యాత్రలో కూడా నాకు వాంతులు అయ్యాయి. ఆ తరువాత నుండి ఎక్కడికి వెళ్ళినా నాకు వాంతులు అవలేదు. నాన్నగారు, నేను అరుణాచలంలో ఉన్నప్పుడు మోరీ గెస్ట్ హౌస్ లో ఉంటూ, ఒకోసారి బయటికి వెళ్ళే వాళ్ళము. అలా ఇద్దరం రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు "భోజనం తిని, భోజనానికి ఉంటే అది బుద్ధిమంతుల లక్షణం అని బుద్ధుడు చెప్పేవాడు రామచంద్ర రాజు గారూ" అన్నారు. రెండవసారి నాన్నగారితో అరుణాచలం వెళ్ళినప్పుడు గిరిప్రదక్షిణకి వెళ్ళాము.



మధ్య , మధ్యలో దారిలో ఉన్న ప్రతి చిన్న గుడిని, ప్రతి లింగాన్ని నాన్నగారు నాకు చూపించారు. భగవాన్ భక్తులైన సాధుఓం తోను, ఆయన శిష్యుడు (లండన్ దేశస్తుడు ) అయిన మైకేల్ జేమ్స్ తోను పరిచయం చేసారు. అలా అక్కడున్న భగవాన్ భక్తులందరినీ పరిచయం చేశారు. ఒకసారి నాన్నగారు అరుణాచలం గిరి ప్రదక్షణకి నేను రాను మీరు వెళ్ళండి అని చెప్పి సాధుఓం, మైకేల్ జేమ్స్ వారిద్దరితో కలిపి నాన్నగారు నన్ను గిరిప్రదక్షిణ చేయించారు. అలా వారితో కలిసి ప్రదక్షిణ చెయ్యటం నా జీవితంలో మరుపురానిది.

ఒకసారి నాన్నగారితో కలిసి కొడైకెనాల్ వెళ్ళాను. అక్కడ పది రోజులు ఉండి వద్దామనుకున్నాము. మేము తీసుకున్న కాటేజ్ కొండమీద ఉంది. ఆ ప్రాంతంలో చలి ఎక్కువగా ఉండటం వలన నాలుగు రోజులు ఉండి అరుణాచలం తిరిగి వచ్చేసాము. చాలాసార్లు శ్రీహరికోట కూడా వెళ్ళాము. అలా ఒకసారి శ్రీహరికోట నుండి అరుణాచలం వెళ్తుంటే, మధ్యలో సూళ్ళూరుపేట నుండి చెన్నై రావటానికి ఒక ట్రైన్ ఎక్కాము. ట్రైను లో ఖాళీ లేకుండా ప్రయాణికులు అందరూ కిక్కిరిసిపోయి ఉన్నారు. ఆ ట్రైన్ లో బాత్ రూమ్ దగ్గర నాలుగైదు గంటలపాటు నాన్నగారు కూడా అలాగే నిలబడి మద్రాస్ వరకు ప్రయాణం చేశారు. ఒకసారి భగవాన్ ఆత్మానుభవం పొందిన మదురై కూడా వెళ్ళాము. అక్కడ ఒక చాప ఇస్తే ఆ చాప మీదే ఆ రోజు రాత్రి పడుకున్నాము. నేను నాన్నగారు కలిపి అరుణాచలంలో ఒకే మంచం మీద పడుకున్న రోజులు కూడా ఉన్నాయి. నేను, నాన్నగారు అరుణాచలంలో గదిలో ఉన్నప్పుడు నాన్నగారికి ఆత్మానుభవం కలిగింది. కానీ, నాకు మాత్రం నాన్నగారిని దర్శించక ముందే నాన్నగారు పొందవలసినది పొందే ఉన్నారని, అందుకే ఆత్మసుఖం గురించి బోధిస్తూ అందరికీ శాంతిని, ఆనందాన్ని పంచి పెట్టావారని అనిపించేది. ఒకసారి నాన్నగారు నేను అరుణాచలంలో గుడిని దర్శించుకున్నప్పుడు అపితకుచాంబ గుడి ఎదురుగా నాన్నగారు కూర్చుని ఆ కొండనే మౌనంగా చూస్తూ ఉన్నారు. నాన్నగారు అప్పుడు నాతో "ఈ గిరి ఫైనల్ స్టేట్" అన్నారు. నాన్నగారు ఎప్పుడూ ఆ గిరిని ఒక చైతన్యంగా, ఒక ఈశ్వరుడిగా మాత్రమే చూసేవారు.




1999వ సంవత్సరంలో నాన్నగారితో కలిసి బదరి, ఋషికేశ్ వెళ్ళాము. నాన్నగారితో కోయంబత్తూరు కూడా వెళ్ళాము. అక్కడి నుండి కేరళలో ఉన్న కొన్ని పుణ్యక్షేత్రాలు కూడా దర్శించాము. కోయంబత్తూర్ లో ఉండగా నాన్నగారు భగవద్గీత చదువుతూ ఉండేవారు. అలాగే నాన్నగారితో పాటు నాగపూర్ అక్కడి నుండి భీమశంకరం, జ్ఞానేశ్వర్ మరియు భక్త తుకారాం ఉండే స్థలాలు కూడా దర్శించాము.

అలా చాలా సంవత్సరాల వరకు మేము ఇద్దరం కలిసి చాలా పుణ్యక్షేత్రాలకు వెళ్ళాము. అలా 38 సంవత్సరాలు నిరంతరంగా, విరామం లేకుండా ఆయనతో ఈ జీవిత యాత్ర కొనసాగింది.

నాన్నగారితో అరుణాచలం వెళ్తున్నప్పుడు నా మనసుకి చాలా ఆనందం వచ్చేస్తూ ఉండేది. మనసుకే ఇంత ఆనందం వచ్చేస్తూ ఉంటే, ఇంక ఆత్మానందం వస్తే ఇంకెంత వైభవంగా ఉంటుంది అనుకునేవాడిని. నాన్నగారు ఇంత వైభవంగా నాతో కలిసి ప్రయాణాలు చేస్తున్నారు ఏమిటి అనుకునేవాడిని, ఆయన వైభవానికి సరిపోయే అర్హత, యోగ్యత నాకు లేకపోయినా నన్ను ఎందుకు ఈయన ఎంచుకున్నారు? అని అనిపిస్తూ ఉండేది.

తర్వాత నాన్నగారి ఇంటి దగ్గర ప్రవచనాలు జరుగుతూ ఉండేవి. నెమ్మది, నెమ్మదిగా భక్తులు రావటం వలన అరుగు మీద స్థలం సరిపోయేది కాదు. అప్పుడు జిన్నూరు పోస్ట్ మాస్టర్ కూడా నాన్నగారి ప్రవచనాలు వింటూ ఉండేవారు. అలా జిన్నూరు పోస్ట్ ఆఫీస్ లో ప్రతి ఆదివారం ప్రవచనాలు జరిగేవి. అలా పోస్ట్ ఆఫీస్ లో ఒక సంవత్సరం ప్రవచనాలు చెప్పిన తరువాత అక్కడ కూడా భక్తులు ఎక్కువ అవడం వలన తరువాత వేరే చోట రమణ క్షేత్రానికి స్థలం తీసుకుంటే మంచిదని స్థలం తీసుకున్నారు కానీ వెంటనే ప్రవచనాలు మొదలు పెట్టలేదు.



వారంలో 2 లేదా 3 ప్రవచనాలు వేరే గ్రామాల్లో ఉంటూ ఉండేవి. నాన్నగారితో పాటు నేను కూడా వెళ్ళేవాడిని. అలా వేరే వ్యాపకం ఏమీ లేకుండా, నాన్నగారితో నిరంతరం గడిపేవాడిని. అక్కడికి వచ్చినవారు అడిగిన సందేహాలకు నాన్నగారు సమాధానం చెబుతూ ఉండేవారు. అవి అన్ని పుస్తకాలు కింద రాస్తే ఎన్ని పుస్తకాలు అయ్యేవో అని ఇప్పుడు అనిపిస్తూ ఉంటుంది. ఆయన చెప్పినవన్నీ మాధుర్యం మింగినట్టు మింగేసాను కానీ ఇతరులకి నేను పంచి పెట్టలేకపోయాను.

ఆ తరువాత నాన్నగారు కూడా చిన్న గ్రామాలకు వెళ్లినప్పుడు మాత్రం అక్కడ జరిగిన ప్రవచనాలు అన్నీ రాసేవాడిని. నేను విలేకరిని అవ్వటం వలన వాటిని పత్రికలలో ప్రచురించటానికి ఇచ్చే వాళ్ళము. అలా మేము పంపిన ప్రసంగాలు అన్నిటిని  కూడా పత్రికా సంపాదకులు ప్రముఖ స్థానం ఇచ్చి ప్రచురించేవారు. అప్పట్లో జిల్లా ఎడిషన్ లేకపోవటం వలన పత్రికల్లో ప్రచురించిన నాన్నగారి ప్రసంగాలు అన్నీ మెయిన్ పేపర్ లోనే వచ్చేవి.

నాన్నగారి జీవితంలోకి భగవాన్ ఎలా ప్రవేశించారు అనేది కూడా పత్రికల్లో వేయించడం జరిగింది. దాని వలన భక్తులందరికీ నాన్నగారి గురించి తెలుసుకోవటానికి ఉపయోగపడింది. అలా పత్రికలో ప్రచురించిన ప్రసంగాలు అన్నీ కూడా సేకరించి ఒక పుస్తకం కింద వేయిద్దాం అన్నారు నాన్నగారు. "శ్రీ నాన్నగారి ప్రవచనాలు" అని ఒక పుస్తకం ప్రచురించారు. నాన్నగారి సాహిత్యం చూడాలంటే భక్తులందరూ ఆ పుస్తకం చదివి తీరాలి. చాలాకాలం వరకు పుస్తకాలకి ముందుమాటగానీ, ఉపోద్ఘాతము కానీ వ్రాయవలసి వస్తే, నన్ను ఒక గదిలోకి తీసుకు వెళ్ళి నాచేత నాన్నగారే స్వయంగా రాయించేవారు.




ఒకసారి గుమ్ముళూరు లో ప్రవచనం నిమిత్తం నాన్నగారిని నా సైకిల్ మీద ఎక్కించుకుని తీసుకువెళ్ళే అవకాశం దొరికింది. అది నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆయనలోని సహజత్వం, నిరాడంబరత్వం అతి సమీపంగా ఉండి నేను చూడడం వలన, ఆయన సమక్షంలో నేను పొందిన అనుభూతుల వలన నాకు ఇది గురు శిష్యుల సంబంధమా..! లేక స్నేహితుల మధ్య ఉండే అనుబంధమా..! ఏమిటి ఈ బంధం అనిపిస్తూ ఉంటుంది. రమణాశ్రమంలో నాన్నగారికి కలిగిన అనుభూతిని నాతో పంచుకున్నారు. నాన్నగారు భక్తులు ఎవరికైనా ప్రవచనం గురించి మాట ఇస్తే, ఆ సమయానికి ఆయనకీ ఆరోగ్యం బాగో లేకపోయినా, జ్వరం వచ్చినా కూడా ప్రవచనం మాత్రం చెప్పటం మానలేదు.

నాకు ఒక టేబ్లెట్ ఇచ్చి జేబులో ఉంచుకోండి రామచంద్రరాజు గారూ, నేను మీటింగ్ మధ్యలో అడిగితే ఇద్దురుగాని అనేవారు. అలాగ ఆయన భక్తులపై అపారమైన ప్రేమ కురిపిస్తూ ఉండేవారు. భక్తులకు, ఆయనకు విడదీయరాని బంధం ఉండేది. ఏమైనా పని ఉంటే నాన్నగారు నాకు ఫోన్ చేసి రమ్మనే వారు.  అప్పుడు ఇద్దరం కలిసి వెళ్ళేవాళ్ళం. ఆయనకు సంబంధించిన ప్రతి విషయంలోనూ నన్ను భాగస్వామిని చేశారు. అలాగ నిర్విరామంగా, విశ్రాంతి లేకుండా కర్మయోగియై భక్తులందరికీ ఉజ్వలమైన ఆధ్యాత్మిక భవిష్యత్తు అందించాలని కృషి చేస్తూనే ఉన్నారు. ఆయన చైతన్యం కాబట్టి ఆయనకు విశ్రాంతి అవసరం లేదు. కానీ ఆయనతో పాటు ఉన్న నాకు కూడా అలిసి పోతున్నాను అనే స్పృహ లేకుండా చేసేవారు.

ఒక్కొక్కసారి నాన్నగారు పిలిచే ఆ పిలుపుకి నా హృదయం ద్రవిస్తూ ఉండేది. ఆ పిలుపు నాన్నగారు హృదయం నుండి వచ్చేది కాబట్టి నాకు పట్టలేని ఆనందం వచ్చేస్తూ ఉండేది. ఇంటికి వెళ్ళినా కూడా అది అలాగే ఉంటూ ఉండేది. నేను పడుకున్నప్పుడు నా మంచానికి ఎదురుగా భగవాన్ ఫోటో ఉంటుంది. ఆ ఫోటో చూస్తుంటే నా కళ్ళు చెమ్మగిల్లేవి. కానీ నాకు నా కళ్ళు చెమ్మగిల్లుతున్నాయో, భగవాన్ కళ్ళు చెమ్మగిల్లుతున్నాయో అర్ధమయ్యేది కాదు. మనసు లో ఆనందం. హృదయంలో ఆనందం. ఏమిటి ఇంత ఆనందం అనుకుంటూ ఉండే వాడిని. అలా నాన్నగారు నాకు శరీర స్పృహ తెలియనివ్వలేదు. నాన్నగారు చైతన్యము అయ్యి చెప్పారు కాబట్టి ఆ వాక్యాలు ఈ రోజు నదులు, సముద్రాలు దాటుతున్నాయి. నాన్నగారి వాక్యాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. మా పిల్లల విషయాలు, వివాహాలు అన్నిటికీ కూడా నాన్నగారే బాధ్యత వహించారు. నన్ను నాన్నగారికి నీడ అంటారు కానీ, ఆయన నన్ను వదిలి పెట్టకుండా ఆయన వెంట అలా తిప్పుకున్నారు.



సూర్యుడు మనకి ప్రత్యక్షంగా ఎలా కనిపిస్తాడో, అలాగే గురువే మనకు ప్రత్యక్ష దైవం అని ఇప్పుడు అనిపిస్తూ ఉంటుంది. ఆత్మానుభవం పొందిన గురువు దొరకటం చాలా కష్టం. నాన్నగారు హృదయంలో పొందిన ఆనందాన్ని లోపల ఇముడ్చుకోలేక, తాను పొందినది అందరూ పొందాలనే కాంక్షతో మన అందరికి పంచేవారు. ఆత్మానందం గురించి చెప్పటం చాలా కష్టం. కానీ నాన్న గారు మనకు అర్థమయ్యేలా చిన్న చిన్న ఉదాహరణలతో చెప్పేవారు. ఉపనిషత్తులు అవి రాసిన వారు వస్తువుని దర్శించి రాసారు అంటారు. నాన్నగారు చెప్పే సబ్జెక్టు మామూలు వారు చెప్పలేరు. అవి దర్శించి చెప్పిన వాక్యాలు. ఆ వాక్యాలు ఇప్పుడు చదువుతూ ఉంటే, నాన్నగారికి దగ్గరగా ఉండి కూడా నేను చాలా కోల్పోయాను అనిపిస్తూ ఉంటుంది. ఒకసారి పోస్ట్ ఆఫీస్ మీటింగ్ లో నాన్నగారు ప్రవచనం చెబుతూ మధ్యలో నా గురించి "రామచంద్ర రాజు గారు నా జీవితంలోకి ఆలస్యంగా ప్రవేశించినా నాతో చివరి వరకు ఉంటారు అన్నారు". భక్తుల సమక్షంలో అన్న ఈ మాట నూటికి నూరుపాళ్లు సత్యమైంది. అలా చివరి వరకు ఆయనతో ఉండే సాన్నిధ్యాన్ని నాకు కలిగించారు. ఒక జ్ఞాని సమక్షంలో నిరంతరం కలిసి ఉండటం ఆయన నాకు ప్రసాదించిన వరం.



ఎన్నో సందర్భాలలో నాన్నగారు నా చెయ్యి పట్టుకొని నడిచేవారు. ఆ సమయంలోనే నాన్నగారు నన్ను చేయి పట్టుకొని నడిపిస్తున్నారు అని అప్పుడు అనుకునే వాడిని. కానీ నన్ను వదలకుండా నా జీవితం చివరివరకూ నన్ను చేయి పట్టుకొని నడిపించారని ఇప్పుడు నాకు అర్థమవుతోంది. మా ఇరువురి బంధం విడదీయరానిది. నాన్నగారు జన్మరాహిత్యం పొందటానికి నాకు ఏ వాసనలు అడ్డు వస్తున్నాయో, ఆ వాసనలు నేను గుర్తించేలా చేసారు. అంతకు మించిన భాగ్యం ఏముంటుంది? భక్తుల జీవితాలలో ఎన్నో అద్భుతాలు చేసినా ఏమీ చెయ్యనివాడిలా, భగవాన్ లా ఉండేవారు.

భగవాన్, నాన్నగారు వేరు, వేరు కాదు. ఇద్దరు ఒక్కటే! నాన్నగారే భగవాన్ ! భగవానే అరుణాచలేశ్వరుడు! అలా వారు ముగ్గురు ఒక్కటే !అందులో ఏ మాత్రం సందేహం లేదు. అలాంటి గురువుని మనము ఇక ముందెన్నడు చూడలేము. అటువంటి మహాత్ములు ఎప్పుడో గాని దేహం ధరించరు. కానీ నాన్నగారు మన కోసం మళ్ళీ దేహం ధరించి వస్తారు.

నాన్నగారికి వేదాల సారం, ఉపనిషత్తుల సారం అంతా తెలుసు. భగవదనుభవం పొందిన తరువాత కూడా నాన్నగారు పుస్తక పఠనం విడిచిపెట్టలేదు. ఏదైనా ఒక పుస్తకం చదివి దాని సారం మొత్తం వివేకానందుడిలా చెప్పేవారు. ఒకసారి నేను, ఉపన్యాసాలు ఇంత అద్భుతంగా ఎలా చెప్పగలుగుతున్నారు నాన్నగారూ అని అడిగాను. “మన గొప్పతనం ఏమీ లేదు రామచంద్ర రాజుగారూ..! భగవాన్ పలికిస్తున్నారు” అన్నారు. శ్రీ నాన్నగారి



దర్శన భాగ్యం వలన, ఆయన సన్నిధిలో గడపడం వలన, ఆయన బోధల వలన నేను మా ఇంటికి వెళ్లినా కూడా ఏ పని చేస్తున్నా, నిద్రిస్తున్నా, నిరంతరం నా స్మృతిలో ఉంటూ, నాలో ఉంటూ, నన్ను నడిపిస్తున్నట్లుగా ఉండేది. నా హృదయాంతరాలలో నుండి ఒక తెలియని ఆత్మానందం వెల్లుబికి వచ్చేది. ఈ ఆనందం, ఈ వైభవం ఏమిటని ఆశ్చర్యపోయేవాడిని. అలా ఆయనను చూసినంత మాత్రాన, ఆయన ప్రవచనాలు విన్నంత మాత్రాన ఆయనతో ఉన్న సన్నిహిత సహచర్యం వలన నాలో కలిగిన ఆనందం, శాంతి, కాంతి, సత్యం, ప్రేమ నా స్వంతమై నా అనుభవంలో శాశ్వతమైతే ఇంక ఎంత బాగుంటుందోనని, అంతకంటే సాధించేది ఏమీ లేదని అనిపించేది. ఆయన చూపులో, వాక్కులో ఎంతో ప్రేమానురాగాలు పొంగివచ్చి నా హృదయాంతరాలలో ప్రవేశించి నన్ను అంతర్ముఖపరిచేవి.

# జ్ఞాన పుత్రులు, శ్రీ నాన్నగారు

## (కమలమ్మ గారు)

నేను ఒకసారి పోడూరు వెళ్ళాను. అక్కడ ఎవరో భగవాన్ గురించి చెబుతారని తెలిసి విందామని వెళ్ళాను. కాపవరం సూర్యనారాయణ రాజు గారిని, కాంతమ్మగారిని అక్కడ మొదటిసారి కలిసాను. గుడివాడ




నాగేశ్వరరావుగారు కూడా అక్కడికి వచ్చారు. ఆయన భగవాన్ గురించి చెప్పారు. అక్కడ తెలిసినవారు నాతో, మీ ఊరికి కూడా నాగేశ్వరరావుగారు వచ్చి భగవాన్ గురించి చెబుతారు, మీరు కావాలంటే చెప్పించుకోవచ్చు అన్నారు. నేను సరే అన్నాను. ఆ తరువాత చించినాడలో నాగేశ్వరరావుగారు 5 రోజులు "భగవాన్ గురించి, అక్షరమణమాల గురించి, నేనెవరిని" గురించి చెప్పారు. కానీ నాకు ఏమీ అర్థం కాలేదు. చించినాడలో "గిరి" కూడా వేసాము. అక్కడ అరుణాచలేశ్వరుడికి, భగవాన్ కి కల్యాణం చేసారు. అరుణాచలేశ్వరుడుని పెళ్ళికొడుకుగా, భగవాన్ ని పెళ్ళికూతురుగా కల్యాణం చేసారు. కల్యాణం చాలా వైభవంగా జరిగింది. అక్కడకు వచ్చిన భక్తులు నాతో, మేము అరుణాచలం దీపానికి వెళ్తున్నాం మీరు కూడా రండి అన్నారు. వారితో కలిసి అరుణాచలం వెళ్ళాను. అరుణాచలం వెళ్ళటం అదే మొదటిసారి అయినా నాకు కొత్తగా అనిపించలేదు. అదంతా తెలిసిన ప్రదేశంలా అనిపించింది. ఏదైనా గత జన్మ సంబంధం ఉందేమో అనుకున్నాను. అక్కడ ధ్యాన మందిరానికి వెళ్ళి కూర్చున్నాను. అక్కడ నాకు సుభద్రమ్మగారు ఇచ్చిన నామం జ్ఞాపకం రాలేదు. అరుణాచలశివ వస్తోంది. నేను తీసుకున్న నామాన్ని

బలవంతంగా గుర్తు చేసుకుని ధ్యానం చేయవలసి వచ్చింది. నారాయణ రాజుగారి భార్య, నేను కలిసి భగవాన్ సమాధి చుట్టూ ప్రదక్షిణ చేసేవాళ్ళం.


ఆ తరువాత హైదరాబాదు సుభద్రమ్మగారి దగ్గరకు వెళ్ళిపోయాను.

ఒకసారి హైదరాబాద్ నుండి చించినాడ పనిమీద వచ్చాను. అప్పుడు కాపవరం సూర్యనారాయణ రాజు గారిని, కాంతమ్మగారిని చూడాలనిపించి వారింటికి వెళ్ళాను. అదే సమయానికి అక్కడికి నాన్నగారు వచ్చారు. నేను ఆయనని చూడగానే పెద్దాయన కదా అని నమస్కారం పెట్టాను. సూర్యనారాయణ రాజు గారు నాన్నగారికి, ఈమె చించినాడ కమలమ్మ గారు అనిచెప్పి నన్ను పరిచయం చేశారు. అలాగా అమ్మా , నన్ను చూడడానికి చాలా దూరం నుంచి వచ్చారమ్మా అన్నారు. నాకు ఆశ్చర్యం కలిగింది. నేను ఈయనను చూడటానికి రాలేదు కదా! అని మనసులో అనుకున్నాను. కాంతమ్మగారు నన్ను ఆ రోజుకి అక్కడ ఉండిపొమ్మన్నారు. సరే అని ఉండిపోయాను. ఆ రోజు సాయంత్రం నాన్నగారికి చాప వేసి భోజనం వడ్డించారు. కాంతమ్మగారు నాతో కమల అక్కా మీరు కూడా భోజనానికి కూర్చోండి అన్నారు. నాకు లోపల కంగారుగా ఉంది కానీ కూర్చున్నాను. నాన్నగారు ఆయన ఆకులో ఉన్న కొన్ని పదార్థాలు నా ఆకులో వేసారు. నేను ప్రసాదంగా భావించి తీసుకున్నాను. తరువాత ఆయన పూజ గదిలోకి వెళ్ళి చూస్తున్నారు. నాకు భగవంతుడి నామం ఆయన ద్వారా తీసుకోవాలనిపించింది. కాంతమ్మగారిని నేను నాన్నగారి దగ్గర నామం తీసుకోవచ్చా అని అడిగాను. మీకు ఇష్టమయిన నామం తీసుకోవచ్చని చెప్పారు. అప్పుడు నాన్నగారిని అడిగితే, ఆయనే భగవాన్ నామం ఇచ్చారు. నాతో కొద్దిసేపు మాట్లాడి ఆయన జిన్నూరు బయలుదేరి వెళ్ళిపోయారు. మరనాడు నేను చించినాడ వెళ్ళిపోయాను.



తరువాత ఒకరోజు సూర్యనారాయణ రాజు గారు జిన్నూరు వెళ్ళారు. అప్పుడు నాన్నగారు మీకు ఒక పని చెప్తాను చేస్తారా? అని సూర్యనారాయణ రాజు గారిని అడిగారట. చెప్పండి నాన్నగారూ చేస్తాను అన్నారట. మీ ఇంటికి కమలమ్మగారు వచ్చారు కదా, ఆవిడని హైదరాబాద్ నుండి వచ్చేయమనండి అని చెప్పి, సూర్యనారాయణ రాజు గారూ మీ ఇంటి దగ్గర మీరు యజ్ఞాలు చేశారు కదా! దానికి నేను ఫలితాన్ని ఇస్తాను. అది ఎలా వస్తుందో చెబుతాను. కమలమ్మగారు ఆత్మానుభవం పొందాలని హైదరాబాద్ వెళ్ళారు. అది వారికి అందదు, అందుచేత వారిని తీసుకు వచ్చేయండి. మీరు యజ్ఞం చేసిన దాని కంటే ఎక్కువ ఫలితం పొందుతారు అని చెప్పారు. అలాగే నాన్నగారూ  నేను చెబుతాను కానీ, ఆవిడ సుభద్రమ్మ గారిని నమ్మినందు వలన ఆవిడ దృష్టి అటే ఉంటుంది కదా అన్నారట.

తరువాత జరిగినది అంతా సూర్యనారాయణ రాజు గారు నాతో చెప్పారు. నాన్నగారి చూపు నాపై పడింది. నాన్నగారు ఊరుకోరు కదా! అందువల్ల నాకు కూడా చించినాడ వచ్చేయాలనే బుద్ధి కలిగింది. నాన్నగారి చూపు హైదరాబాదులో నన్ను నిలబడ నివ్వలేదు. నాన్నగారు అరుగు మీద ప్రతీ ఆదివారం ప్రవచనం, చెప్పేవారు. ఒక రోజు అరుణాచలం వెళ్తున్నానని నాన్నగారితో చెబుదామని వెళ్ళాను. అప్పట్లో ఆ అరుగుమీద ఎక్కువమంది భక్తులు ఉండేవారు కాదు. నేను వెళ్ళేసరికి నాన్నగారు అరుగు మీద కూర్చుని ఉన్నారు. అప్పుడు ఆయన, మెడ కింద భాగం అంతా నాన్నగారిలాగ, మెడ పైన తలభాగం మాత్రం భగవాన్ లా కనిపించారు. తల వణుకుతూ కనిపించింది. అలా చూస్తూ ఉండి పోయాను. నాకు ఒళ్ళంతా ఒణికినట్లు స్పందన కలిగింది. అప్పటి వరకు భగవాన్ ని చూడలేక పోయాను అని అనిపించేది. ఆ రోజు నుండి ఆ భావన పోయింది.



తండ్రి మన హృదయాలలోనే ఉన్నారు. ఇన్ని రోజులూ అంతటా ఉన్న వారిని దేహంగా భావించాను. కాని, తండ్రి అంటే దేహం కాదు చైతన్యమేనని నాకు అర్థమయింది. నాన్నగారి దర్శనం తరువాత గుడికి వెళ్ళాలని, పూజలు చేయాలని అనిపించలేదు. నేను నాన్నగారితో, మీ దర్శనం అవకముందు బాగా ఇష్టంగా పూజలు చేసేదాన్ని. మీ దర్శనం అయ్యాకా వాటిమీద ఆకర్షణ ఉండట్లేదు. పూజలు చేయటానికి బద్ధకిస్తున్నానంటారా? అని అడిగాను. మీరు పూర్వజన్మలో అవసరమయినదంతా చేసి వచ్చినట్టున్నారు. అందుకు వాటిపట్ల ఆసక్తి పోయి ఉంటుంది. అవి ఇంక అవసరం లేదులేమ్మా అన్నారు. దీపావళి నోము మాత్రం చేసుకునేదాన్ని. దీపావళి రోజు ఉదయాన్నే నాన్నగారి ఇంటికి వెళ్ళి నాన్నగారి, కన్నమ్మ గార్ల దర్శనం చేసుకునేదాన్ని. కన్నమ్మ గారు పూజ చేసుకున్నారా? అని అడిగేవారు. ఇంకా లేదు నాన్నగారి దర్శనం కోసంవచ్చాను అనేదాన్ని. మీకు నాన్నగారు ఉంటే చాలు ఇంకేమీ అక్కరలేదు, ఇంకేదయినా మీకు నాన్నగారి తరువాతే కదా అని కన్నమ్మ గారు నవ్వేవారు. నాకు నాన్నగారి దర్శనం చేసుకుంటే చాలనిపించేది. ఎంతో తృప్తిగా ఉండేది. జిన్నూరు వెళ్ళడం, కుటుంబంలో సభ్యులులాగ మేము సన్నిహితంగా ఉండడం, ఆయనతో అన్ని విషయాలు మాట్లాడుకోవడం చెప్పలేని ఆనందం కలిగేది. మా అనుబంధం తల్లీ బిడ్డల లాంటిది. నాన్నగారిని చూడకుండా ఉండలేక పోయేదాన్ని. నాది అనే భావన లేకుండా అంతా తండ్రిదే అనిపించేది. ఆ విశ్వాసం కూడా తండ్రి ప్రసాదమే. ఆయన అనుగ్రహం ఒక్కటే సరిపోతుంది. ఇదివరకు ఆధ్యాత్మికంగా ఏదో పొందాలనే తపన ఉండేది. ఇప్పుడు అంతా ఆయనే



ఒక రోజు గురు పౌర్ణమి వచ్చింది. ఆరోజు తెల్లవారుజామున 4:30 కి బయలుదేరి జిన్నూరు వెళ్ళాను. మొదట్లో కొంచెం భయంగా ఉండేది.

పువ్వులు, అరటిపళ్ళు, కొబ్బరికాయ, నేఫ్ కిన్, సీసాలో కొన్ని నీళ్ళు పట్టుకుని వెళ్ళాను. కానీ  కొబ్బరికాయ కొట్టటానికి కత్తి తీసుకువెళ్ళలేదు.



వారిని అడిగితే బావుండదేమో అనుకున్నాను. నేను వెళ్ళేసరికి నాన్నగారు బయట కూర్చుని కాఫీ తాగుతున్నారు. ఆశ్చర్యంగా నాన్నగారి కుర్చీ పక్కనే కత్తి కనిపించింది. నన్ను చూసి ఏంటండీ కమలమ్మగారూ పొద్దున్నే వచ్చారు అన్నారు. ఆ సమయానికి అక్కడ ఎవరూ లేరు. ఈరోజు గురుపౌర్ణమి కదా నాన్నగారూ! అన్నాను. ఈరోజు గురుపౌర్ణమా అని, మీరు కుర్చోండి అంటూ చాప వేసారు. మంచినీళ్ళు తాగుతారా? అని అడిగారు. వద్దు నాన్నగారూ అన్నాను. నేను స్నానం చేసి వస్తాను అని చెప్పి స్నానం చేసి వచ్చారు.

కమలమ్మగారు మీకు గురుపౌర్ణమి చేసే అలవాటు ఉందా అన్నారు. పీఠాధిపతులలో ఒక స్వామి మా పొరుగింటి వారి ఇంటికి వచ్చేవారు. వారికి పాదపూజ చేసేదాన్ని నాన్నగారూ అని చెప్పాను. నాన్నగారి పాదాలు కడిగి నీళ్ళు నెత్తిమీద చల్లుకుని, పువ్వులు పాదాల మీద వేసాను. నాన్నగారు సాంప్రదాయబద్ధంగా చేస్తున్నారండి అని, కొబ్బరికాయలు, అరటి పళ్ళు భగవాన్ ఫొటో దగ్గర పెట్టమన్నారు. తరువాత హారతి ఇచ్చాను. నాకు లోపల భయంగా ఉండి  నాన్నగారి మీద దృష్టి నిలవలేదు. మళ్ళీ ఇంకో గురుపౌర్ణమికి నాన్నగారిని మా ఇంటికి తీసుకు వెళ్ళిపోవాలి. ఇక్కడ భయం, భయంగా చేస్తున్నాను అనిపించింది. నాకు మనసులో ఎప్పుడూ ఒక కోరిక ఉండేది. మా పక్కింటికి వెళ్ళి పీఠాధిపతులకు పాదపూజ చేయవలసి వస్తోంది కదా, ఇలాంటి మహాత్ములను నా ఇంటికి ఎప్పుడు తీసుకురాగలను అని నాకు బాధ అనిపించి దుఃఖం వచ్చేది. అప్పటికి నేను ఉమ్మడి కుటుంబంలో ఉన్నాను. ఉమ్మడి కుటుంబంలోంచి బయటపడి, భవిష్యత్తులో ఎప్పుడయినా ఇలాంటి మహాత్ములను ఇంటికి తీసుకురావాలని అనుకునేదాన్ని. మేము వేరు పడ్డాకా నాన్నగారిని రమ్మని పిలిచాను. నన్ను మీ ఇంటికి తీసుకు వెళ్ళాలని ఉంది మీకు

అన్నారు నాన్నగారు. గురుపౌర్ణమికి మా ఇంటికి రమ్మని పిలిచాను. వర్షాకాలం కదండీ అన్నారు నాన్నగారు. నాన్నగారు మాకు వర్షం రానివ్వరు కదండీ అన్నాను. నాన్నగారు వర్షం రానివ్వరా అండీ అని ఆయన నవ్వారు. సరే వస్తానులెండి అన్నారు. భోజనానికి వచ్చేయమని చెప్పి, మీటింగ్ పెట్టండి అని అడిగాను. సరేనమ్మా అన్నారు.

గురుపౌర్ణమికి నాన్నగారు మా ఇంటికి వచ్చారు. మీ ఇల్లు చాలా బాగుంది అన్నారు. అప్పటినుంచి దాదాపు 10 సం॥ లు గురుపూర్ణిమ మా ఇంట్లో చాలామంది భక్తులతో నాన్నగారి సమక్షంలో జరిగేది. తరువాత నాన్నగారి పుట్టిన రోజులు కూడా మా ఇంట్లో జరిపించటం ప్రారంభించాం. అలా ఒకసారి పుట్టినరోజు వేడుక జరుగుతున్నప్పుడు చాలా వర్షం పడింది.



అప్పుడు నాకు నాన్నగారి ప్రవచనం గురించి కంగారుగా ఉండి, ప్రవచనం వేరే చోట ఏర్పాటు చేద్దామా అని అనుకుంటున్నాను. కానీ నాన్నగారు ప్రవచనం మొదలుపెట్టే సమయానికి వర్షం ఆగిపోయింది. నాన్నగారి ప్రవచనం ఆటంకం లేకుండా జరిగిపోయింది. నాన్నగారిని మా ఇంటికి మోటార్ సైకిల్ మీద తీసుకువచ్చేవారు. బంగార్రాజు గారు జాగ్రత్తగా తీసుకువచ్చారా? నాన్నగారూ అని అడిగాను. బంగార్రాజు గారు చాలా జాగ్రత్తగా తీసుకుని వచ్చారు కమ్మలమ్మగారూ అన్నారు.

నాన్నగారు గురుపౌర్ణమికి వచ్చి 4 రోజులు గడిచిన తరువాత, ఐదవ రోజు ఉదయం వరకు ఉండి తిరిగి వెళ్ళిపోయేవారు. నాన్నగారు వెళ్ళిన వెంటనే ఏడ్చేసేదాన్ని. నాన్నగారు నా మొఖం వైపు చూసి, వెళ్ళి వస్తానని చెప్పకుండానే వెళ్ళిపోయేవారు. మళ్ళీ వెంటనే నేను జిన్నూరు వెళ్ళి నాన్నగారి దగ్గర కొంచెం సేపు కూర్చుని వచ్చేదాన్ని. అసలు దుఖం ఆగకుండా అలా ఉండిపోయే దాన్ని. అలా కొద్దిరోజులు వెళ్ళాను. తరువాత ఎప్పుడు వచ్చినా, సాయంత్రం వరకు ఉండి భోజనం చేసి వెళ్తాను

అనేవారు. ఆయన సాయంత్రం వరకు మా ఇంటిదగ్గరే ఉంటే నేను మళ్ళీ జిన్నూరు వెళ్ళను కదా! అందుకని సాయంత్రం వెళ్ళేవారు. నాకు అలా ఆయన వెనక వెళ్ళకూడదని నేర్పారు. అప్పుడు నాకు మనసులో, నా కోసం ఇంకో పూట ఉంటున్నారు కదా అనిపించేది.

తరువాత కొద్ది రోజులకి, "ఆయన జిన్నూరులోనే కాదు అంతటా ఉన్నారు. జిన్నూరు లో ఉండి ఇక్కడ లేకపోతే ఆయన దేవుడు ఎలా అవుతారు?" అనిపించింది. ఆ విశ్వాసాన్ని ఆయనే ఇచ్చారు. అప్పటి నుండి నాన్నగారు వెళ్ళేటప్పుడు ప్రతిసారీ, కమలమ్మగారూ వెళ్ళి వస్తానని చెప్పేవారు. కొన్ని సంవత్సరాల తరువాత భక్తుల సంఖ్య పెరగడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని, గురు పూర్ణిమ మా ఇంటిదగ్గర కాకుండా జిన్నూరు లో చేయడం ప్రారంభించారు. కాని, ఆ తండ్రి నాకు అమూల్యమైన వరం ప్రసాదించారు. “గురు పూర్ణిమ ఎక్కడ జరిగినా, ఆ సాంప్రదాయం చించినాడ లో ప్రారంభమయింది కాబట్టి అది మరచిపోను” అని గురుపూర్ణిమ రోజు సాయంకాలానికి ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నా  చించినాడలో మా ఇంటికి వచ్చేవారు. అలౌకికమైన వారి ప్రేమకి ఇంత కంటే నిదర్శనం ఏమి కావాలి? నా జీవితానికి ఇంతకు మించిన అదృష్టం ముమ్మాటికీ మరొకటి లేదు.

నాన్నగారు మా ఇంట్లో చిన్నపిల్లవాడిలా, చాలా సన్నిహితంగా ఉండేవారు. వంటింట్లోకి వచ్చి టమాటాలు కొన్నారా, పెరట్లో పండినవా అని





అడిగేవారు. టీ పెడతారా? అని అడిగేవారు. చాలా రోజుల వరకు నాకు ఆ మాటలే గుర్తుకు వచ్చేవి. ఆ జ్ఞాపకాలతోనే ఉండేదాన్ని. కొన్ని రోజులకి చించినాడలో మాఇల్లు అమ్మేసి (కొన్ని సమస్యల వలన) పాలకొల్లు వచ్చేద్దామని అనుకున్నాము. అప్పుడు నాన్నగారు, కమలమ్మగారూ మాకు

నీడలేకుండా అయిపోయిందండి అన్నారు.  అయితే ఇల్లు అమ్మకుండా ఉంచేస్తాము మీరు వచ్చి ఉందురుగాని అన్నాను. అలా వద్దు కమలమ్మగారూ, మీరు చించినాడలో ఉంటే ఇప్పుడు 2, 3 నెలలకి ఒకసారి మీ ఇఃటికి వస్తున్నాను. అదే మీరు పాలకొల్లు వచ్చేసారనుకోండి, నేను వారానికి రెండు సార్లు వచ్చి చూసి వెళతాను. నిజానికి చించినాడలో బంధువులు, భక్తులు చాలామంది ఉన్నారు కానీ మన ఇంటి దారి రాదు కదా అన్నారు. ఆయన ప్రేమ చూడండి. మాకు సంతానం లేదు. బిడ్డలు లేరని మా బంధువులు అనుకునేవారు. కాని నాకు ఎప్పుడూ బాధ కలగలేదు. మా భందువుల్లో ఒకరు, కమలమ్మగారికి పిల్లలు లేరు నాన్నగారూ! మీరు ఆమెకు సంతానాన్ని అనుగ్రహించాలి అన్నారు. అప్పుడు నాన్నగారు “ఇన్ని సంవత్సరాల నుంచి చూస్తున్నాను, సంతానం లేదనే బాధ కమలమ్మగారిలో నాకెప్పుడూ కనిపించలేదు” పిల్లలు పుట్టినా వాళ్ళు సక్రమంగా ఉంటారని, తల్లితండ్రులను సుఖపెడతారని లేదు. వాళ్ళు సరి అయిన వాళ్ళు కాకపోయినా, చెడు అలవాట్లకు గురి అయినా మనకు విపరీతమైన దుఃఖం వస్తుంది. సంతానం సవ్యంగా లేకపోవడం వల్ల ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారు. అటువంటి ఋణ శేషం మన కమలమ్మగారికి లేదు. అందుచేత ఆవిడ సుఖంగా ఉన్నారు అని చెప్పారు. నాన్నగారు నా హృదయాన్ని పరికించి ఆ మాట అన్నారేమో అనిపించింది. "అయినా, జ్ఞాన పుత్రులు మీరుండగా, నాకు పిల్లలు లేక పోవటమేమిటి?" అన్నాను. ఆమాటకి నాన్నగారు పకపకా నవ్వేసారు. నిర్మలమైన ఆ నవ్వులో కొండంత అనుగ్రహాన్ని వర్షింపచేసారు. నేను మనసులో "తల్లి, తండ్రి, బిడ్డ, గురువు, దైవం అన్నీ మీరే! నన్ను వెన్నంటి ఉండి నడిపించే తండ్రి మీరు ఉండగా నే కోరవలసినది ఏముంది అనుకున్నాను."

2017 లో జిన్నూరులో నాన్నగారి పుట్టినరోజు వేడుకలు జరుపుకొని, మేము పాలకొల్లు నుంచి వైజాగ్ కి మారాము. అప్పుడు నేను బాధపడుతూ మీకు దూరమైపోతున్నాను నాన్నగారూ అంటే లేదమ్మా, నేను వైజాగ్ వస్తూ ఉంటాను కదా అక్కడ మనం కలుసుకోవచ్చు అన్నారు. ఆ సం ॥రం

సెప్టెంబరు నెలలో నాన్నగారి పుట్టినరోజు జరిగిన తరువాత, అక్టోబరు 13 కి నాన్నగారు ఆరోగ్యం బావుండక వైజాగ్ హాస్పిటల్ లో చేరారు. హాస్పిటల్ నుంచి వైజాగ్ లో షర్మిలగారి ఇంటికి వచ్చాకా, జిన్నూరు వెళ్ళేలోపు ఒకరోజు భక్తులందరికీ ఆయనని దర్శించుకునే అవకాశం కలిగించారు. అప్పుడు నేను కూడా వెళ్ళాను. అక్కడ నాన్నగారు అంత అనారోగ్యంతో ఉండి కూడా భక్తులందర్నీ నవ్వుతూ అనుగ్రహిస్తూనే ఉన్నారు. నేను దగ్గరకు వెళ్ళేసరికి పట్టుకోమన్నట్టుగా చెయ్యి చాపారు. నేను ఆచేతిని పట్టుకున్నాను. చాలాసేపటివరకూ నా చెయ్యి వదలకపోవడంతో, నేను దర్శనానికి వచ్చిన మిగిలిన భక్తులు ఇబ్బంది పడతారేమో అనుకున్నాను. ఆ తరువాత పక్కన ఉన్న మా తమ్ముడి కూతురుతో ఆయనని, కమలమ్మ గారిని జాగ్రత్తగా చూసుకోండి అంటూ మా భాద్యతని అప్పగించారు. అప్పుడు నాకు దుఃఖం వచ్చింది. ఇలాంటి స్థితిలో ఉండి కూడా నాన్నగారు నా భాద్యత గురించి ఆలోచిస్తున్నారు కదా అనుకున్నాను. భౌతికంగా నాన్నగారు మా గురించి భాద్యత అప్పగించినా, ఆయన దేహం వదిలేసిన తరువాత ఆయన నాకూడా ఉన్నట్టే ఉంది. నన్ను వదిలి వెళ్ళారన్న భావన ఎప్పుడూ కలగలేదు.



# దేవీ స్వరూపులు శ్రీ నాన్నగారు

**(లక్ష్మి గారు)**

జిన్నూరులో నాన్నగారి తమ్ముడుగారి ఇంట్లో మేము అద్దెకు ఉండేవాళ్ళం. మా పిల్లలు నాన్నగారి ఇంటి ఎదురుగా ఉన్న స్కూల్లో చదువుకునేవారు. నాన్నగారు గ్రామ పెద్దగా ఉండి అన్ని కార్యక్రమాల్లోను పాలుపంచుకునే వారు. మా పిల్లలకి ఆటల పోటీలలో బహుమతి వస్తే, నాన్నగారి చేతుల మీదగా అందుకున్నారు. నాకు చిన్నప్పటి నుండి దేవుడిని తెలుసుకోవాలి అనే కాంక్ష బలీయంగా ఉండేది. ఎవరైనా బంధువులు ఇంటికి వస్తే వారు భగవంతుని మాటలు ఏమైనా చెబుతారా అని ఎదురు చూసేదాన్ని. నేను మూడోతరగతి చదువుతున్నప్పుడు అమ్మవారు నా జీవితంలోకి ప్రవేశించారు. అప్పటినుండి నాకు దేవి అంటే చాలా ఇష్టం. నాకు అప్పుడప్పుడు దర్శనం కూడా కలిగేది. స్కూలుకి వెళ్ళి నిన్ను మరిచి పోతున్నాను తల్లి అని ఇంటికి వచ్చిన తర్వాత అమ్మవారి దగ్గర బాధపడుతూ ఉండేదాన్ని. వివాహమై, ముగ్గురు సంతానం కలిగిన తర్వాత కూడా ప్రతినిత్యం అమ్మవారి పూజ చేసుకునేదాన్ని. నాకు ఏ కష్టం వచ్చినా అమ్మవారి తోనే పంచుకునే దానిని. నాకు తెలిసిన వారందరూ దేవిని ఎక్కువ పూజించడం వలన కష్టాలు వస్తాయి అనేవారు. అమ్మా, అందరూ ఇలా అంటున్నారు ఏమిటి అని దేవిని ప్రార్థిస్తే, తల్లి బిడ్డలను ప్రేమిస్తుంది కానీ, కష్టాలు పాలు చెయ్యదు అనే సమాధానం వచ్చింది. నా భర్త సహకారం నాకు సరిగ్గా ఉండేది కాదు. అందువలన పిల్లలని పోషించలేనేమో అని చనిపోదాం అనుకున్నాను. అప్పుడు అమ్మవారు కలలో కనిపించి నాన్నగారిని చూపించి, ఆయన దగ్గరకు వెళ్ళు ఆయన నీకు మహోన్నతమైన స్థితిని ప్రసాదిస్తారు అని చెప్పింది.



నాన్నగారు దర్శనం కోసం నాన్నగారి ఇంటికి వెళ్ళగానే, నాన్నగారు నన్ను చూసి నాకు ఎదురొచ్చి లోపలకి తీసుకు వెళ్ళారు. నాకు చాప వేసి కూర్చోమని ఆయన మంచం మీద కూర్చున్నారు. రామకృష్ణుడు అన్నీ అమ్మవారితో పంచుకున్నట్టు నాకు నాన్నగారిని చూడగానే నా అనుభవాలన్నీ ఆయనకి చెప్పుకోవాలి అనిపించింది. నాన్నగారు నన్ను ఏమీ మాట్లాడనివ్వకుండా కళ్ళు మూసుకొని కూర్చున్నారు. అప్పుడు నాన్నగారిలో ఉన్న ఆ బ్రహ్మ తేజస్సు ఈ విశ్వమంతా వ్యాపించినట్టు నాకు అనిపించింది. అందరూ నాన్నగారిని భక్తుడిగానే చూస్తున్నారు కానీ, ఆయన దేహం ధరించి వచ్చిన ఆ పరమేశ్వరుడే అనుకున్నాను. నా మానసిక రోగం తగ్గించటానికి నాకు ఒక మంచి వైద్యుడు లభించాడు అనిపించింది. అలా ఆ రోజు నుండి నాన్నగారు మీద విశ్వాసం కుదిరి ఆయనకే శరణాగతి చెందాను. నాన్నగారితో ఈ జీవిత యాత్ర దాదాపుగా 40 సంవత్సరాలు కొనసాగింది. ఏ రోజూ కూడా ఆయన మీద నమ్మకం చెక్కుచెదరనివ్వలేదు. ఆ రోజు నుండి ప్రతిరోజూ ఇంట్లో పూజ చేసుకుని, తర్వాత నాన్నగారి దర్శనం చేసుకుని వచ్చేదాన్ని. ప్రతిరోజు అదే నా దినచర్య. అలా నా జీవితానికి నాన్నగారి దర్శనం ఒక మహా వెలుగు అయ్యింది. నాన్నగారికి దగ్గరలో ఏవో కారణాలు వలన మా పిల్లలు ఇల్లు కొనుక్కోవద్దు అన్నారు. దూరంగా ఉంటే నాన్నగారిని చూడటానికి వీలుపడదు అని, నాన్నగారి ఇంటికి దగ్గరలోనే ఇల్లు తీసుకుంటాను, నా జీవితానికి అది సరిపోతుంది అని మా పిల్లలకి చెప్పాను. నాన్నగారి పట్ల నాకు కుదిరిన ఆ విశ్వాసం వలన నాన్నగారు నాకు భగవంతుడు స్వరూపంగానే కనిపించేవారు. కానీ అప్పట్లో అందరూ నన్ను మనిషిని పట్టుకుని దేవుడు అంటుంది ఏమిటి? అని విమర్శించేవారు. అయినా ఏమీ లెక్క చేసేదాన్ని కాదు. ఆ ధైర్యానికి నాన్నగారు నన్ను మెచ్చుకునేవారు. నాకు ఎన్నో స్వప్నాలు వచ్చేవి. ఆ స్వప్నాల యొక్క అర్థం ఎవరిని అడిగినా మాకు తెలియదు అని చెప్పేవారు. ఒక్క నాన్నగారి దగ్గర మాత్రమే నా ప్రశ్నలకు సమాధానం దొరికింది. నాన్నగారికి భిన్నంగా నాకు వేరే జీవితం అంటూ ఏదీ లేదు. అందుకే నా జీవితం గురించి నాకు

తెలియదు. ఈరోజు వెనక్కి తిరిగి చూసుకుంటే నా జీవితమంతా నాన్నగారే నిండి ఉన్నారు.

ఒకసారి నాన్నగారి దగ్గరికి వెళ్ళినప్పుడు నాకు ఇంట్లో ఇబ్బందులు ఉన్నాయని నాన్నగారికి చెప్పకపోయినా, నాన్నగారు నాకు కొంత ధనము ఇచ్చి ఇది ఉపయోగించుకో అన్నారు. అప్పుడు నాన్నగారూ నేను మీ దగ్గరికి ఏదో ఆశించి రావటం లేదు. సమాజపరంగా కానీ, కుటుంబపరంగా కానీ నాకు లభించనటువంటి జ్ఞానం మీ దగ్గర లభిస్తోంది. దానివల్ల నా మనసుకి విపరీతమైన శాంతి చేకూరి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా అవి నా మనసుని తాకటం లేదు. అందువలన మీ సమక్షానికి వస్తున్నాను అని నాన్నగారు ఇచ్చిన ధనాన్ని అక్కడ పెట్టేసాను. అప్పుడు నాన్నగారు నావెనకే వచ్చి అప్పు కింద తీసుకో, నీ దగ్గర ఉన్నప్పుడు తిరిగి ఇవ్వాచ్చమ్మా అని నా చేతోలో పెట్టేసి, నిన్ను చూస్తుంటే దేవత భూమి మీదకు వచ్చి నడుస్తున్నట్టు ఉంటుంది అన్నారు.

ఒకసారి నాన్నగారు నీకు వచ్చే కష్టాలను చూసి నీకు భయం వేయటం లేదామ్మా అని అడిగారు. నాకు భయం వేయటం లేదు నాన్నగారు. అందరిలా పరిస్థితులు బావుంటే నేను ఇక్కడికి రావటానికి నా భర్త అంగీకరించకపోదురు. ఆ కష్టాలు ఉండటం వల్లనే ఇక్కడకు వచ్చి మీ సమక్షాన్ని ఆనందిస్తూ, మీ సబ్జెక్ట్ ని ఆస్వాదిస్తున్నాను. నాకు ఉపనిషత్తులు ఏమీ తెలియకపోయినా మీ నోటి నుండి వచ్చిన ప్రతి వాక్కు నాకు ఉపనిషత్తుతో సమానం. నాకు కష్టాలు ఉండటం వల్లనే ఈ ఉపనిషత్తులు వినటానికి నాకు ఇక్కడికి వచ్చే భాగ్యం కలిగింది. అందువలన ఆ కష్టాలు ఉన్నా పరవాలేదు అన్నాను. నువ్వు ఏమాట మాట్లాడినా ఉపనిషత్తులా మాట్లాడతావు అన్నారు. మాకు బంధువులు, స్నేహితులు అన్నీ నాన్నగారే అయ్యి నడిపించారు. ఒకసారి మా అబ్బాయిని నాన్నగారు  మీరు మీ బంధువులందరినీ మరిచిపోయారా అని అడిగారు. అప్పుడు మా అబ్బాయి తాతయ్యా, మీ సమక్షంలో ఉండి మీ

వాక్యాలు వింటూ అందరిని మరిచిపోయేలా చేసారు. మాకు అన్నీ మీరే అయ్యారు అన్నాడు.

ఒక్కొక్కసారి నాకు నాన్నగారి చెబుతున్న వాక్యాలు వింటున్నాము కానీ వాటిని ఆచరించలేక పోతున్నాము, అవి ఆచరించలేనప్పుడు నాన్నగారి దగ్గరికి వెళ్ళి ఆయనను ఇబ్బంది పెట్టడం ఎందుకు అనిపించి వెళ్ళేదాన్ని కాదు. అప్పుడు నాన్నగారే సైకిల్ తొక్కుకుంటూ మా ఇంటికి వచ్చి ఎందుకు రావటం లేదమ్మా లక్ష్మి అని అడిగి రమ్మని చెప్పి వెళ్ళేవారు.

నాన్నగారు ఒకసారి "మీకు తలంపులు వస్తున్నా ఆ తలంపులు మీరు కాదు. తలంపులు లేని స్థితి ఒకటి ఉంటుంది అదే మీరు" అన్నారు. ఆ వాక్యం విని చాలాసేపు ఆలోచించుకుని, నాన్నగారూ నా తలంపులే నేను అనుకుంటున్నాను. అది మాత్రం నాకు స్పష్టంగా తెలుస్తోంది. తలంపు లేని స్థితి ఒకటి ఉంటుంది అని మీరంటున్నారు. అది నాకు అనుభవంలో లేదు. అందువలన మీరు చెప్పిన దానిని నేను అంగీకరించలేక పోతున్నాను. దీని గురించి నాకు అర్థమయ్యేలా చెప్పండి అని అడిగాను. నాన్నగారు ఒక పది రోజులు నీకు కొంచెం కష్టంగా ఉంటుంది. తరువాత దీని గురించి నీకు బాగా అర్థమవుతుంది అన్నారు. తరువాత నాకు ఆ విషయాన్ని అవగాహనలోకి తెచ్చారు. అలా నాన్నగారు ఏదైనా వాక్యం చెబితే అది అనుభవంలోకి రావడం లేదని చాలా బాధ పడేదాన్ని. నేను పడుతున్న ఆ బాధ నాన్నగారికి తెలిసి అవమానాలు భరించకుండా, కష్టాలు పడకుండా ఆత్మ జ్ఞానం వస్తుంది అని ఎదురు చూడకు. అందుకు నీ మనసుని సిద్ధం చేసుకుని నా దగ్గరికి రా అన్నారు.

ఒకసారి నాన్నగారి ఇంటికి వెళ్ళి, నాన్నగారూ ఇంట్లోనూ న్యాయం చేయలేకపోతున్నాను, మీరు చెప్పిన వాక్యాలు విని అర్థం చేసుకొని జీవించలేకపోవటం వలన అనవసరంగా మీ దగ్గరికి వచ్చి మిమ్మల్నీ ఇబ్బంది పెడుతున్నాను. రేపటినుండి సత్సంగాలకి రాను నాన్నగారూ

అన్నాను. అప్పుడు నాన్నగారు "ఒక గుడికి వెళ్తే  దేవుడి దగ్గర కొబ్బరికాయ కొడతాము. కానీ ఆ కాయ ఒక్క దెబ్బకు పగలదు కదా! తొమ్మిదిసార్లు కొడితే పదవసారి పగులుతుంది. ఆ తొమ్మిది సార్లు కొట్టిన ప్రభావం దాని మీద ఉండటం వలన అది పదవసారి పగులుతుంది. అలాగే సబ్జెక్టు శ్రవణం చేయగా, చేయగా దాని ప్రభావం నీ మనసు మీద ఉంటుంది. ఈశ్వరుడు ఒక్కసారి నిన్ను తలుపు సందులో పెట్టి నొక్కి ఆ వాక్యాన్ని అనుభవంలోకి తీసుకు వస్తాడు. అందుకే శ్రవణం చేయమని చెబుతారు. అది నీకు ఎప్పుడు అనుభవంలోకి తీసుకురావాలో ఆ ముహూర్తం ఈశ్వరుడు పెట్టుకుంటాడు. నువ్వు ఇక్కడకు వచ్చి ప్రవచనం వింటూ ఉంటేనే నీకు మారు మనసు రావటం లేదు. ఇక ఇక్కడకి రాకపోతే నీకు మారు మనసు ఎలా వస్తుంది? అందువలన నువ్వు ప్రవచనం వినటానికి రావటం మానవద్దు" అని చెప్పారు. మరొక సందర్భంలో నాన్నగారు "స్నేహం అంటే రూపాలు వేరైనా, వారి హృదయం ఒక్కటిగానే ఉంటుంది. నీ స్నేహం నాకు ఇష్టం అమ్మా లక్ష్మీ" అన్నారు. నాన్నగారు రామచంద్రరాజుగారితో, లక్ష్మి చాలా కష్టాలు పడుతున్నప్పటికీ అవి ఏమి తన ముఖంలో కనిపించవు. అందరూ ఆశ్చర్యపడే స్థాయికి లక్ష్మిని ఈశ్వరుడు తీసుకువస్తాడు అన్నారట. లక్ష్మి నువ్వు ఏమీ చింతించకు, నాన్నగారు నీ గురించి ఇలా అంటున్నారు అని రామచంద్ర రాజు గారు నాకు చెప్పారు. అలా డాక్టర్ గారు, రామచంద్ర రాజు గారు నాకు తోబుట్టువుల్లా ఉండేవారు. నేను ఎప్పుడయినా చెడు స్నేహాలలో పడినా, నాన్నగారు నాకు లోపలినుండి వారితో స్నేహం చేయకు అని గైడ్ చేసేవారు. అలా అనుక్షణం నన్ను కంటికి రెప్పలా కాపాడుతూ ఉన్నారు.

ఒకసారి నేను వెళ్ళే సమయానికి నాన్నగారు ధ్యానంలో ఉన్నారు. నేను వచ్చిన సంగతి ఆయనకు తెలిసి ధ్యానం నుండి బయటకు వచ్చి అమ్మా లక్ష్మీ , ఈశ్వరుడు నీకు వరం ప్రసాదించడానికి సిద్ధంగా ఉన్నాడు. నీకు ఏమి వరం కావాలి? అని అడిగారు. నాకు జ్ఞానం కావాలి అన్నాను. జ్ఞానం మాట అటు ఉంచు. నీకు ధనం కావాలా? చదువు కావాలా? అన్నారు. నాన్నగారు నాకు చదువు కావాలి. చదువంటే ఇష్టం అని చెప్పాను.

అప్పుడు నాన్నగారు అయితే మీ ముగ్గురు పిల్లలని ప్రయోజకులను చేసి ఈశ్వరుడు నీ చేతిలో పెడతాడమ్మా..! తరువాత జ్ఞానం కావాలి అని అడిగావు కదా..! జ్ఞానం అంటే ఏమిటో తెలుసా? అన్నారు. జ్ఞానం అంటే ఏమిటో నాకు తెలియదు నాన్నగారూ కానీ, అది పొందాలనే కాంక్ష మాత్రం బలీయంగా ఉంది అన్నాను. అప్పుడు నాన్నగారు నా జాతి దానివి ఎన్నాళ్ళకు దొరికావు? ఈ ప్రకృతి మాటలు విని నా చెవులు చిల్లులు పడిపోయాయి. నీ ముఖంలో ఎప్పుడూ అసూయ అన్నది నాకు కనపడదు. ఆ అసూయని పోగొట్టుకోవటానికి నువ్వు పూర్వజన్మలో చాలా తపస్సు చేసావు అని నాకు తెలుస్తోంది అన్నారు. నా దినచర్యలో భాగంగా ఒకసారి నాన్నగారి దర్శనానికి వెళ్ళాను. భోజనం చేసావా? పిల్లలకు పెట్టేవామ్మా..! నీ యోగ క్షేమాలు చూడకుండా నేను భోజనం చెయ్యను. ఈ దేహం ఈ భూమి మీద ఉన్నంతవరకు మీ కుటుంబ యోగక్షేమాలను నేను చూసుకుంటాను  అన్నారు.

ఆయన చేసే ప్రతి పనిలోను, ప్రతి మాటలోను ఆయన ఆత్మగా నాకు వ్యక్తమయ్యేవారు. నాన్నగారు ప్రేమ ఎటువంటిదంటే, ఒక రాయికి బాధ కలిగినా కూడా ఆ బాధ తీర్చటానికి స్పందించే ప్రేమ హృదయం నాన్నగారిది. నాకు వచ్చే సమస్యలన్నీ నాన్నగారి దగ్గర ఏమీ చెప్పకపోయినా, నా హృదయంలో ఉండి నా సమస్యలు అన్నీ తెలుసుకొని నన్ను అన్నివిధాలా సంరక్షించారు. భౌతికంగా నాకు తండ్రిలా, ఆధ్యాత్మికంగా నాకు దైవంలా నా వెన్నంటి ఉంటూ నన్ను అడుగడుగునా రక్షిస్తూ ఉండేవారు. అలాంటి ప్రేమను ఇకముందు ఎన్నడూ ఎవరిలోనూ చూడలేము. నాన్నగారి దేహం లేకపోయినా, ఇప్పుడు కూడా నాకు లోపల నుండి గైడెన్స్ ఇస్తున్నారు.

నాన్నగారు నన్ను ఏది చెయ్యమని చెబితే అదే చేసేదానిని. నాకంటూ ప్రత్యేకమయిన అభిప్రాయం ఏమీ ఉండేది కాదు. మా పిల్లలు వివాహం జరిగే సమయంలో మా బంధువుల వలన కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. నాన్నగారి దగ్గరికి వెళ్ళి చెప్పాను. "ఎవరి సలహాను

అనుసరించి మనం జీవించగలము అమ్మా, నీకు స్ఫూర్తిని ఇచ్చేవాడు భగవంతుడు. ఆయన నీ హృదయం నుండి నిన్ను గైడ్ చేస్తాడు. దాని ప్రకారం నువ్వు పని చేసుకు వెళ్ళిపో!" అన్నారు. నా భర్తకి ఆరోగ్యం బాగా లేనప్పుడు నాన్నగారు నీ భర్తని చూసుకోమ్మా అన్నారు. నాన్నగారికి ఇచ్చిన మాట కోసం ఆయనకు సేవ చేస్తూ ఉండేదాన్ని. కానీ ఆయనకు సేవ చేసే శక్తి నాన్నగారు ఇస్తున్నారని స్పష్టంగా తెలుస్తూ ఉండేది. ఈ సేవ చేసే ప్రక్రియలో నాలో ఉన్న ఇష్టాలను, అయిష్టాలను కూడా నాన్నగారు తగ్గించేసారు. చాకిరి నేను చేస్తుంటే, గౌరవం నీకు వస్తోంది ఏమిటి లక్ష్మీ.. అన్నారు. అంటే నాలో ఉండి నాకు శక్తిని ఇస్తూ నాన్నగారు చేసేవారు. అలా ఆయన ప్రేమతో అన్నీ చేయిస్తూ ఆయన ప్రేమలో జీవుడిని కరగ పెట్టేవారు. "చెడు తలంపు లోనుంచి నువ్వు బయటకు రావాలి అని కష్ట పడుతూ ఉంటావు కదా! నువ్వు పడిన ఆ కష్టమే నిన్ను కష్టం లేని స్థితికి తీసుకు వెళుతుంది" అనేవారు.

నాన్నగారితో కలిసి చాగల్లు ప్రవచనానికి వెళ్ళాను. అక్కడ వంటచేసి నాన్నగారికి వడ్డించినప్పుడు, లక్ష్మీ... వంట బాగా చేసావమ్మా అన్నారు. తరువాత ఇంటికి వచ్చేసి ఆరోజు రాత్రి కింద ఏమీ పరుచుకోకుండానే నిద్రపోయాను. అప్పుడు మా ఇంట్లో విద్యుత్ సౌకర్యం లేదు. నాకు సహజంగానే గాఢ నిద్ర పడుతుంది. ఆ రోజు అలా పడుకున్నప్పుడు ఏదో నా శరీరం మీద పాకుతున్నట్టు అనిపించింది. కానీ కళ్ళు తెరవలేక నాన్నగారి మీద భారం వేసి పడుకున్నాను. మరుసటి రోజు నాన్నగారి దర్శనానికి వెళ్ళినప్పుడు నన్ను చూసి, దేహం మీద ఏమీ పాకుతోందో అనే స్పృహ లేకుండా పడుకున్నావు అంత నిద్ర ఏమిటి? కింద ఏమైనా పరుచుకొని పడుకోవాలి. చీకటిలో ఉన్నప్పుడు బ్యాటరీ లైట్ వేసుకో అనిచెప్పి  కొనుక్కోమని డబ్బులు ఇచ్చారు. అంటే నువ్వు నిద్రపోతున్నా నీ హృదయములో ఉన్నవాడు మాత్రం నిద్ర పోకుండా నిన్ను చూస్తూ ఉంటాడు. వాడు ఒక్కడు మాత్రమే నీ క్షేమం కోరుకునేవాడు అని

అంటారు కదా! అలా నాన్నగారు నా క్షేమం కోరుకుంటూ నాకు అడుగడుగునా సహాయం అందిస్తూ ఉన్నారు.

ఒకసారి ఊరు వెళుతూ చపాతీ పిండి బయట మర్చిపోయి వెళ్ళిపోయాను. ఊరి నుండి వచ్చిన తరువాత, నాన్నగారిని దర్శనం చేసుకుని వచ్చి ఈ చపాతీ పిండితో చపాతీలు చేసుకుని తిందాము అనుకుని నాన్నగారి ఇంటికి వెళ్ళాను. అప్పుడు నాన్నగారు ఆ చపాతీ పిండిపై బల్లి పాకింది. ఈ రోజు నువ్వు మా ఇంట్లో భోజనం చెయ్యి అని, కన్నమ్మ గారితో లక్ష్మి కి కూడా వంట చెయ్యి అని చెప్పారు. కన్నమ్మగారు లక్ష్మి కి నేను వంట చేసే ఉంచాను అన్నారు. అలా వారు ఇరువురు నాపై చూపే ప్రేమలో నాకు భౌతిక జీవితంతో సంబంధం లేకుండా వారి ఇరువురి నడుమ పసిబిడ్డలా అనందిస్తూ గడిపేదాన్ని. నాన్నగారు నాకు ఏదైనా పండు ఇచ్చినా, ఈ పండు నీ ఆరోగ్యానికి మంచిది తిను లక్ష్మీ అని ప్రేమగా చెప్పి ఇచ్చేవారు.

ఒక భక్తుడు నాన్నగారితో లక్ష్మి మనస్తత్వం పిల్లల స్వభావంలా ఉంటుంది ఏమిటి నాన్నగారూ అన్నారట. లక్ష్మి మనసు మనకు ఉంటే ఒక్క సెకనులో భగవంతుడు మనకి మోక్షాన్ని ప్రసాదిస్తాడు అన్నారట నాన్నగారు. ఎంతో మంది స్వాములు నాన్నగారి దర్శనానికి వచ్చి నన్ను చూసి, నాన్నగారి సమక్షంలో ఉంటూ ఆడుతూ, పాడుతూ నువ్వు పొందవలసినది పొందుతున్నావు. ఇంతకు మించిన భాగ్యం ఎవరికి లభిస్తుంది? అనేవారు. ఒక జ్ఞాని జీవుడిలో ఉన్న అజ్ఞానం తో పోరాడి, చివరికి ఆ పోరాటంలో జ్ఞానే విజయం సాధిస్తాడు. ఇది నా జీవితంలో నాన్నగారి ద్వారా జరిగింది. ఇది నా ప్రత్యక్ష అనుభవం.

ఒకసారి మా ఇంట్లో అమ్మవారు ఎందుకో దుఃఖ పడుతున్నట్టు నాకు అనిపించింది. నాన్నగారి ఇంటికి వచ్చి చూస్తే నాన్నగారు కూడా అలాగే కనిపించారు. అప్పుడు నాన్న గారిని నేనేమైనా తప్పు చేశానా? మీరు ఇరువురూ అలా దుఃఖ పడుతున్నట్టు నాకు ఎందుకు అనిపిస్తోంది? నా తప్పు ఉంటే చెప్పండి నేను సరి చేసుకుంటాను అన్నాను. అప్పుడు

నాన్నగారు "నీకు వచ్చే దుఃఖాన్ని మీ బంధువులు ఎవరూ పంచుకోలేరు. నువ్వు ప్రేమించే నీ దేవి, నువ్వు ఆరాధించే నేను మాత్రమే పంచుకోగలము. నీ హృదయంలో ఉన్న అంతరాత్మ తప్ప నీ దుఃఖాన్ని ఎవ్వరూ పంచుకోలేరు" అన్నారు. ఈ మాట భక్తులందరికీ కూడా ఉపయోగపడుతుంది అనిపించింది. ఒకసారి భగవాన్ జయంతికి నాన్న గారిని భోజనానికి రమ్మని ఆహ్వానించాను. అప్పుడు నాన్నగారు నువ్వు నా మాటలు అర్థం చేసుకుని ఆచరించు అదే నీ నుండి నేను ఆశిస్తున్నాను అన్నారు.

ఒకసారి నాన్నగారు అరుణాచలం వెళ్ళారు. అప్పుడు నాన్నగారు ఇక ఉండరు అనే భయం నాలో కలిగి అరుణాచలం వెళ్ళి  నాన్నగారిని చూసేయాలి అనిపించింది. చేతిలో ప్రయాణానికి సరిపడా ధనం ఏమీ లేకపోయినా, అరుణాచలం వెళ్ళాలనుకుని స్టేషన్ కి వెళ్ళాను. అప్పుడు అక్కడ భక్తులు ఒకరు కనిపించి మిమ్మల్ని నేను తీసుకు వెళ్తానని చెప్పి తీసుకువెళ్లారు. అరుణాచలం వెళ్ళి నాన్నగారిని చూసిన తరువాత నాన్నగారు బానే ఉన్నారు. ఇది అంతా నా మనసు చేసే గారడీ అని అర్థమైంది. ఇంక ఎప్పుడు మనసు మాట వినకూడదు అనుకున్నాను.

నాన్నగారు ప్రవచనాలు చెప్పటం మొదట నాన్నగారి ఇంటి దగ్గర ప్రారంభించారు. ఆ తరువాత పోస్ట్ ఆఫీస్ లో చెప్పేవారు. నాన్నగారు అక్కడికి వెళ్ళేటప్పుడు  మా అబ్బాయిలను కూడా సైకిల్ ఎక్కించుకుని తీసుకుని వెళ్ళేవారు. నాన్నగారు అక్షరమణమాల పాడుతూ, మా అబ్బాయిని సైకిల్ ఎక్కించుకుని తొక్కుకుంటూ,  ప్రతి పౌర్ణమికి పక్కనే ఉన్న చిన్న , చిన్న గ్రామాలకు ప్రవచనం చెప్పటానికి వెళ్ళేవారు. మా అబ్బాయిలు ఇంటి దగ్గర ఉంటే వాళ్ళు అల్లరి చేస్తూ నన్ను ఇబ్బంది పెడుతున్నారు అని వాళ్ళని నాన్నగారు వెంట తీసుకు వెళ్ళేవారు.

నాన్నగారి ప్రవచనాలు వేరే గ్రామాల్లో జరిగినప్పుడు,  అక్కడికి వెళ్ళటానికి సరిపడా ధనం నా దగ్గర ఉండేది కాదు. అటువంటప్పుడు నన్ను

ప్రవచనానికి తీసుకువెళ్ళే బాధ్యత మీదే నాన్నగారూ అని ప్రార్థించేదాన్ని. అలాగే నాన్నగారు ఏదో ఒక రకంగా సహాయం చేస్తూ, నా ప్రయణానికి సంబంధించిన అడ్డంకులన్నీ తొలగిస్తూ ఉండేవారు. ఒకసారి చించినాడలో గురుపౌర్ణమి చేసినప్పుడు నాన్నగారి ప్రవచనానికి వెళ్ళాను. అప్పుడు నాన్నగారు నన్ను దగ్గరకు పిలిచి, "ఏ శక్తిని నమ్మి నువ్వు ఈ ప్రవచనాలకి వస్తున్నావో, నిన్ను తిరిగి ఇంటి దగ్గర దింపే భాధ్యత కూడా ఆ శక్తిదే." అందువలన నువ్వు ప్రతి ప్రవచనానికి రావచ్చు అన్నారు.

నాన్నగారి వాక్యాలు మా పిల్లలు కూడా వినాలని, ప్రతి ఆదివారం వాళ్ళకి ఇష్టం లేకపోయినా నాన్నగారి దగ్గరకు తీసుకు వెళ్ళేదాన్ని. అది చూసి నాన్నగారు పిల్లల్ని ఎందుకు తీసుకు వస్తున్నావు అని అడిగేవారు. వీళ్ళు కూడా బాగు పడాలి అనే నా స్వార్థం కోసం నేను తీసుకొస్తున్నాను నాన్నగారూ అని చెప్పేదాన్ని. అది విని వెరీగుడ్ అనేవారు.

ఒకసారి పాలకోడేరు ప్రవచనానికి వెళ్ళాము. అక్కడ ఎవరో నా గురించి చెడుగా చెప్పటం వల్ల ఒక పెద్దాయన నేను భోజనం చేస్తుండగా వచ్చి నన్ను మందలించడం మొదలు పెట్టారు. నాకు అక్కడి నుండి వెంటనే వచ్చేయాలని అనిపించింది. కానీ వ్యక్తి అంటే అహంకారం. అది ముఖ్యం కాదు. అన్నం అంటే పర బ్రహ్మ స్వరూపం. అంటే,  అన్నం ముందు కూర్చున్నప్పుడు అది తినకుండా వచ్చేస్తే, అన్నాన్ని అగౌరవపరిచినట్టు అవుతుంది అని లోపల నుండి స్ఫురించింది. అందువల్ల ఆయన మాటలు పట్టించుకోకుండా భోజనం ముగించుకుని వచ్చేసాను. అలా అవమానాలను భరించే శక్తి కూడా లోపల నుండి నాన్నగారు ఇస్తూ ఉండేవారు.

నేను ఆపరేషన్ చేయించుకోవటానికి వెళ్ళేముందు నాన్నగారికి ఫోన్ చేసి చెప్పాను. అంతా సవ్యంగా అవుతుంది చేయించుకోమ్మా అన్నారు. ఆపరేషన్ చేసేటప్పుడు డాక్టర్స్ మీరు మాకు సహకరించాలి, మీరు బతుకుతారు అని గ్యారెంటీ కూడా ఇవ్వలేము అని చెప్పారు. దానికి

ఈశ్వరుడు నన్ను ఈ ఆపరేషన్ వంక పెట్టుకుని తీసుకు వెళ్ళాలనుకుంటే తీసుకు వెళ్ళిపోతాడు. మీ పని మీరు చేయండి అన్నాను. నా నోటి ద్వారా నాన్నగారు పలికించిన ఆ వాక్యాలకి డాక్టర్స్ అందరూ ఆశ్చర్యపోయారు. నేను మగతలోకి జారుకుంటున్నప్పుడు అరుణాచలం గిరి పై నుండి ఒక మహా వెలుగు వచ్చి నా లోకి ప్రవేశించినట్టు అనిపించింది. ఆపరేషన్ అయిన తరువాత నాలో ఎలాంటి భయాందోళనలు లేకుండా ఉండటం చూసి డాక్టర్లు, మా పిల్లలు కూడా ఆశ్చర్యపోయారు.

ఒకసారి నాన్నగారు ఈ ప్రహరీ దాటి గుమ్మం లోపలికి వచ్చిన వారు ఎవ్వరూ కూడా ఒట్టి చేతులతో బయటకు వెళ్ళరు అన్నారు. నాకు పూజ ద్వారానే నాన్నగారు లభించారు అనిపిస్తుంది. పూజ చేసినప్పుడు దీపం వెలిగిస్తాం కదా! ఆ దీపం వెలిగించినప్పుడు ఎలా ప్రార్ధించాలో చెప్పేవారు నాన్నగారు. హృదయంలో ఉన్న  జ్ఞానజ్యోతిని వెలిగించడం నాకు తెలియక, దానికి పరోక్షంగా ఈ దీపాలను వెలిగిస్తున్నాను. నా హృదయంలో ఉన్న జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు రమ్మని చెప్పి భగవంతుడిని ప్రార్ధించి దీపం పెట్టుకోండి అనేవారు. అలాగే పూజ చేసి హారతి ఇచ్చేటప్పుడు, నాలో ఉన్న అజ్ఞానాన్ని కరిగించమని ఈశ్వరుడిని ప్రార్ధించండి అనేవారు. నాకు పూజ అంటే ఆసక్తి ఉండటం వలన హారతి ఇచ్చేటప్పుడు హారతి ఇచ్చేది ఎవరు? అది పొందేది ఎవరు? అని ఒకోసారి అనిపిస్తూ ఉండేది. అంటే అంతా నాన్నగారే కదా! అలా మధ్య, మధ్యలో అద్వైతస్థితి అనుభవంలోకి వచ్చేటట్టు చేస్తూ ఉండేవారు. నాన్నగారు దేహం వదిలేసే ముందు ఎందుకో నాకు ఇక నాన్నగారు దేహం ఎన్నో రోజులు ఈ భూమిపైన ఉండదు అనిపిస్తూ ఉండేది. అప్పుడు నాకు అనారోగ్యంగా ఉండటం వల్ల నాన్నగారికి దూరంగా ఉండవలసి వచ్చింది. అయినా నాన్నగారిని విడిచి ఉండలేను అని మా అబ్బాయిలతో పోట్లాడి నాన్నగారి దగ్గరకు వచ్చేసేదానిని. మా పెద్దబ్బాయికి ఒకసారి నాన్నగారు స్వప్నంలో దర్శనమిచ్చి, మీ అమ్మను నా దగ్గరకు పంపించు నా దేహం

ఇంకా ఎన్నో రోజులు ఉండదు అని చెప్పి, నన్ను చూడటానికి నువ్వు ఎప్పుడు వస్తావు? అని మా అబ్బాయిని అడిగారట.

ఒక భక్తురాలికి భగవాన్ స్వప్నంలో దర్శనం ఇచ్చి నన్ను అరుణాచలము తీసుకొని రమ్మని చెప్పారట. నాకు కూడా అదే సమయంలో స్వప్నంలో దర్శనమిచ్చి నువ్వు అరుణాచలం వస్తావా అని అడిగారు. అలా భగవాన్ అనుగ్రహంతో నా దగ్గర ప్రయాణానికి సరిపడా ధనం లేకపోయినా అరుణాచలం వెళ్ళాను. గిరి ప్రదక్షిణకి వెళ్ళినప్పుడు గిరిని చూసి దేవుడు అనుకునే అంత భక్తి నాకు లేదు. రాయిని దేవుడు అంటారేమిటి అనుకున్నాను. ప్రదక్షణ చేసి వచ్చిన తర్వాత నా చుట్టూ నేను తిరుగుతున్నట్టు నాకు కల వచ్చింది. గిరి అంటే మన హృదయంలో ఉన్న ఆత్మ అని నాకు అప్పుడు అర్థమయింది.

నాన్నగారి దగ్గర ఏమాత్రం భయపడకుండా ఉండేదాన్ని. ఆయనంటే విపరీతమైన ఇష్టం ఉండటం వల్లనే ఆయనంటే భయం కలిగేది కాదు. నాన్నగారి సమక్షంలో ఉన్నప్పుడు నాన్నగారి నోటిలో నుండి వచ్చే ప్రతి వాక్యం అనుభవంలో నుండి వచ్చేది. అందువలన అక్కడ దేహ స్ఫురణ కూడా ఉండేది కాదు. నాన్నగారు నా వైపు చూస్తూ ఉంటే, ఎందుకు తరచుగా నా వైపు చూస్తూ ఉంటారు అనుకునే దానిని. నీ వైపు చూడకుండా ఉండలేక చూస్తున్నాను అమ్మా అనే వారు. నాన్నగారు ఏవాక్యం చెప్పినా కపటం లేకుండా, ఉన్నది ఉన్నట్టుగా చెప్పేవారు. ఆయన్ని చూస్తుంటే ఒక్కొక్కసారి జ్ఞానమే రూపం ధరించి వచ్చింది అనిపించేది. ఒకసారి నాన్నగారి దగ్గరకు వచ్చిన ఒక డాక్టరు mathematics కి అంతం ఏమిటి? అని అడిగారు. అంతం చైతన్యమే! అని నాన్నగారు చెప్పారు. నాస్తికులు ఆస్తికులు అవుతారు, ఆస్తికులు భక్తులు అవుతారు, భక్తులు జ్ఞానులు అవుతారు, జ్ఞాని నా స్వరూపం పొందుతాడు అని భగవద్గీతలో కృష్ణుడు అన్నాడు అని నాన్నగారు చెప్పారు. అలా భక్తుల మనసులలో ఉన్న బండరాళ్ల లాంటి వాసనలు నాన్నగారి అనుగ్రహం ద్వారా తొలగించబడ్డాయి. అందువల్లనే ఈరోజు భక్తులు అందరం చాలా

ఆనందంగా ఉండగలుగుతున్నాము. ఇలా నా జీవితంలో జరిగే ప్రతి సంఘటన రాస్తే ఒక పెద్ద గ్రంధం అవుతుంది. మనం బాగు పడటానికి ఒక గురువు చాలు అని నాన్నగారు చెప్పారు. అలా మనల్ని మనం బాగు చేసుకోవడానికి ఒక రమణ భాస్కర చాలు అనిపిస్తుంది. ఎవరు ఏ యోగంలో ప్రయాణం చేసినా, మన దృష్టి  అంతా ఎక్కడ కేంద్రీకరించాలి అంటే మనం దేహాభిమానాన్ని తగ్గించుకుంటూ రావాలి. దేహంతో ఏ నేను అయితే తాదాప్యం పొందుతోందో దాని నుండి విడుదల పొందాలి.



# ప్రత్యక్ష పరబ్రహ్మ స్వరూపం నాన్నగారు

## (సరస్వతిదేవి గారు)

సరస్వతి దేవి గారు తణుకు ప్లీడర్ సూర్య నారాయణ రాజు గారి కుమార్తె. ఆమెను చిన్నప్పుడు ఒకసారి ఎవరో తిడితే ఆ విషయం తన తండ్రితో చెప్పారు. దానికి ఆమె తండ్రి, గాలి అటు వీస్తూ వెళుతోంది కదా! ఆ తిట్లు కూడా అలా గాలిలో కలిసి వెళ్లిపోతాయి అన్నారు. అప్పటినుండి ఎవరు ఏమన్నా ఆమె పట్టించుకునేవారు కాదు. ప్లీడర్ గారు బెనారస్ లో Law పాసైన రోజునే ఈమె పుట్టారని సరస్వతి అని పేరు పెట్టారు. ప్రపంచంలో సహృదయులందరూ వాటాదారులే అని భగవాన్ రంగన్ తో చెప్పినట్లు, నాన్నగారు ప్లీడర్ గారి సహృదయానికి తరచుగా తణుకు వెళ్ళేవారు. నాన్నగారు ఆయనకి రామనామం ఇచ్చారు. ఆయన తుది శ్వాస వదిలే వరకు రామనామం విడిచిపెట్టలేదు. ప్లీడర్ గారు చనిపోయిన తరువాత నాన్నగారు ఆయన గురించి మాట్లాడుతూ, ఆయన చాలా నిరాడంబరుడు. కోర్టులో వాదించినప్పుడు ఫీజు ఎంత ఇస్తే అంతే తీసుకునేవారు అన్నారు. ప్లీడర్ గారి సహృదయం గురించి నాన్నగారు ఒక చిన్న సంఘటన ఈ విధంగా చెప్పారు. ఒక వ్యక్తి ప్లీడర్ గారికి రు. 25,000 ఇవ్వాల్సి వస్తే, అతను వచ్చినప్పుడు అడగమంటారా అంటే, అతన్ని అడగవద్దు అతను ఏమి ఇబ్బందుల్లో ఉన్నాడో అందినప్పుడు ఇస్తాడు అన్నారట. ప్లీడర్ గారు చనిపోయిన పదకొండో రోజు నాన్నగారు రమణ అష్టోత్తరం పుస్తకాలపై ఆయన ఫొటో వేయించి అందరికీ పంచారు. 1992 లో సరస్వతమ్మ గారికి స్వప్నంలో నాన్నగారు పువ్వుల దండతో కనిపించారు. మర్నాడు జూబ్లీహిల్స్ లో ఆవిడకి స్వప్నంలో కనిపించినట్టే నాన్నగారు దర్శనమిచ్చారు.



ఆ రోజు నుండి ఇప్పటివరకూ సరస్వతి గారికి అన్నీ  నాన్నగారే. ఆవిడ నాన్నగారిని శాంతిని ఇమ్మని ప్రార్థించేవారు. ఆవిడకి అందరూ సమానమే! అందరి క్షేమాన్ని కాంక్షించేవారు.

ఆమె భర్త దత్తుడు గారు. మొదటిసారి నాన్నగారు అ్రజం వెళ్ళినప్పుడు దత్తుడు గారి తల్లి ఫోటోవైపు చూస్తూ, ఆమె తల్లి భగవాన్ ని దర్శించుకున్నారు ఆ బంధమే నన్ను ఇలా తీసుకొచ్చింది అన్నారు. దత్తుడి గారి తల్లి సుబ్రహ్మణ్య స్వామికి గుడి కట్టించారు. దత్తుడు గారంటే నాకు చాలా ఇష్టం. ఆయన నాకు రోజు గుర్తుకొస్తూనే ఉంటారమ్మా అన్నారు. దత్తుడు గారు ఎంతో మందికి ఉద్యోగాలు ఇప్పించారు. ఆయన చాలా తక్కువగా మాట్లాడేవారు. దత్తుడి గారికి  ఆరోగ్యం బాగా లేనప్పుడు నాన్నగారు చూడటానికి వచ్చి, ఈశ్వరుని బొమ్మ ఆయనకి ఎదురుగా ఉంచమని ఇచ్చారు. ఆయన తుదిశ్వాస వదిలేవరకు అది మంచం పక్కనే పెట్టుకుని ఉన్నారు. దత్తుడు గారు చనిపోయాక నాన్నగారు ఆయన ఫోటో పెద్దది కట్టించి తణుకు క్షత్రియ కళ్యాణ మండపంలో పెట్టారు.

1993లో గురు పౌర్ణమికి 30 మందితో కలిసి సరస్వతమ్మ గారు అరుణాచలం వెళ్ళారు. రమణాశ్రమంలో వంటశాల దగ్గరనుండి చిన్న కొండ స్పష్టంగా కనిపించేది. అప్పట్లో చెట్లు ఎక్కువ ఉండేవి కావు. ఒకరోజు సాయంకాలం సరస్వతమ్మ గారికి నాన్నగారు అక్కడ నిలబడి ఆశీర్వదిస్తూ కనిపించారు. ఆవిడ అక్కడ ఉన్న అందరినీ పిలిచారు.  నాన్నగారు చాలాసేపు ఆ విధంగా దర్శనమిచ్చారు. తరువాత రెండు నెలలకి నాన్నగారు హైదరాబాద్ వచ్చారు. ఆరోజు నాన్నగారు చెప్పిన మొదటి వాక్యం ఏమిటంటే "బాహ్యంగా ఎంత సేపు చూస్తారు? హృదయంలోకి చూడండి" అన్నారు. అప్పుడు సరస్వతమ్మ గారికి అరుణాచలేశ్వరుడే నాన్నగారు అని అర్థమయింది. నాన్నగారు చాలాసార్లు అ్రజం వచ్చేవారు. వచ్చినప్పుడు ఇక్కడ అరుణాచలంలో ఉన్నట్టు ఉందమ్మా అనేవారు. అక్కడ రెండు మూడు రోజులు ఉండేవారు. అలా మే నెలలో అ్రజం వచ్చినప్పుడు, నాన్నగారు మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవడానికి రూములోకి వెళ్ళగానే కరంటు పోయింది.

నాన్నగారు విశ్రాంతి తీసుకొని బయటికి వచ్చిన తరువాత ఆవిడతో, సరస్వతమ్మ గారూ నేను గదిలో లోపల ఉన్నాను కదా అయినా వేడి తెలియలేదు అన్నారు.

ఒకసారి ఏదో విషయంలో ఆవిడ కూతుర్లు ఆమెని, కోడళ్ళు చూసుకుంటారు నీకెందుకు అని విసుక్కున్నారు. ఆ రోజు మధ్యాహ్నం సరస్శతమ్మ గారు అందరితో కలిసి జిన్నూరు వెళ్ళారు. నాన్నగారు ఆవిడకి దగ్గరగా కుర్చీ వేసుకుని ముందుకు ఒంగి ప్రేమతో, సరస్వతమ్మ గారూ మీకు ఏమి ఇవ్వగలను? మీకు మోక్షం ఇమ్మని భగవంతుడిని ప్రార్థిస్తాను. ఆయన మోక్షం ఇవ్వాలనుకుంటే పిల్లల మీద మమకారం పోవటానికి వారితో తిట్టిస్తాడు అన్నారు.

కన్నమ్మ గారు సరస్వతమ్మ గారితో, మిమ్మల్ని నాన్నగారు రోజు తలుచుకుంటారు అన్నారు. అదేవిధంగా నాన్నగారు కూడా సరస్వతమ్మ గారితో మీరంటే కన్నమ్మగారికి చాలా ఇష్టమండి అన్నారు. కన్నమ్మ గారు ఎక్కడికి వెళ్ళకపోయినా, అగ్రజం మాత్రం రెండు మూడు సార్లు వెళ్ళారు. అప్పుడప్పుడు సరస్వతమ్మ గారితో ఫోన్లో మాట్లాడుతూ ఉంటారు. తరచూ సరస్వతి గారికి స్వీట్సు, పళ్ళు పంపుతూ ఉంటారు. ఈ మధ్యకాలంలో కన్నమ్మ గారు సరస్వతి గారికి ఫోన్ చేసి మిమ్మల్ని చూడాలని ఉంది నేను రాలేను. నాన్నగారు ఎప్పుడైనా మజ్జిగ తాగేవారు. ఆ గ్లాసు మీకు ఇవ్వాలని ఉంది అది పంపిస్తాను అన్నారట. సరస్వతమ్మ గారికి ఎన్నోసార్లు నాన్నగారు కలలో కనిపిస్తూ ఉంటారు. ఆమెకు భావనాబలం బాగా ఉంది. ఆమె ఏది అనుకుంటే అది జరుగుతుంది. ఎంతోమంది అగ్రజాన్ని పుట్టినిల్లు లా భావిస్తూ ఉంటారు. కన్నమ్మ గారి లాగానే సరస్వతమ్మ గారు కూడా దీపావళి తోరాలు వందలకొలది పంచుతారు.

ఒకసారి నాన్నగారు హైదరాబాద్ లో ఒక భక్తుల ఇంట్లో ఉండగా సరస్వతమ్మ గారు వచ్చారు. నాన్నగారు కాసేపు దర్శనమిచ్చి ఎవరో కలవటానికి వచ్చారని గదిలోకి వెళ్ళి పోయారు. ఆవిడ అక్కడే గుమ్మం దగ్గర నిలబడి ఇంకొకసారి దర్శనం అవుతుందని ఎదురుచూస్తున్నారు.

నాన్నగారు తలుపులు తీసి, ఆమె రెండు చేతులను నాన్నగారి తలపై పెట్టుకుని అలాగే చాలా సేపు ఉండి పోయారు. సరస్వతమ్మగారు ఆ ఆనందాన్ని, శాంతిని తట్టుకోలేక పోయారు. ఆమె కుమార్తెలతో నాన్నగారు, మీ అమ్మగారిలో చాలా హుందాతనం ఉందమ్మా అన్నారు.

2015 లో సరస్వతమ్మ గారి మేనకోడలు వేణమ్మ జిన్నూరు వెళ్ళారు. నాన్నగారు ఆమెను నువ్వు ఉదయం రాలేదేమిటి అని అడిగారు. అత్తయ్యని చూడటానికి వెళ్ళాను అని వేణమ్మ చెప్పారు. నేను అర్జంట్ వెళ్ళాలి రేపు ఉదయాన్నే వెళదాము అన్నారు. మరుసటి రోజు ఉదయం నాన్నగారే స్వయంగా, సరస్వతమ్మ గారి ఇల్లు నాకు భాగా తెలుసు అంటూ డ్రైవర్ కి దారి చూపిస్తూ తీసుకువెళ్ళారు. కారు దిగిన తరువాత స్పీడ్ గా లోపలికి సరస్వతమ్మ గారి దగ్గరకు వెళ్ళి కుర్చీ దగ్గరకు జరుపుకుని, మీకు మోక్షం రాకుండా ఆపే అవకాశం లేదు. మీరు స్వర్గ రాజ్యం పొందుతారు. మీరు శాంతి, ఆనందం పొందాలి అంటూ ఆ ఆశీర్వాదంతో కూడా నాన్నగారు తృప్తి చెందకుండా, మీరు నిర్వాణ సుఖం పొందాలి. మీరు నామం కూడా చెయ్యక్కరలేదు అల్టిమేట్ స్టేట్ పొందాలి అన్నారు. అక్కడే ఉన్న కొడుకులతో, కోడళ్ళతో ఆమెను చూసుకోవటం మీ అదృష్టం. ఆమెకు కుమార్తెలు కూడా గుర్తుకురాకూడదు. అంటే మీరు అంత బాగా చూసుకోండమ్మా! మీరు యజ్ఞాలు, యాగాలు చెయ్యక్కర్లేదు. ఆమెను చూసుకుంటూ, ఆమెకు సేవ చెయ్యండి అదే మీ అదృష్టం అన్నారు.

నాన్నగారి రెండు చేతులు సరస్వతమ్మ గారి నుదుటి మీద పెట్టి ఉంచారు. అప్పుడు నాన్నగారు, సరస్వతమ్మ గారు ఇద్దరూ కూడా తేజస్సుతో వెలిగిపోయారు. నాన్నగారితో కలిసి అక్కడికి వెళ్ళిన వేణమ్మ  ఇదంతా చూసి, నేను ఎంత పుణ్యం చేసుకున్నానో ఈ దృశ్యం చూసే భాగ్యం నాకు కలిగింది. ఆ ప్రేమ, ఆ దయ ఆ అనుగ్రహం చూసే అదృష్టం నాకు కలిగింది. అది నాన్నగారు నాకు ఇచ్చిన బహుమతి అనుకున్నారు. ఆమె జీవించిన జీవిత విధానానికి నాన్నగారు అక్కడికి వచ్చి ఆమెను అలా అనుగ్రహించారు అనిపించింది. సరస్వతమ్మగారికి సత్సంగం అంటే చాలా ఇష్టం.

సత్సంగం అయిన వెంటనే ఫోన్ చేసి ఏమి చెప్పారు? అని అడుగుతారు. దూరం నుంచి వస్తారు కదా భోజనాలు పెట్టుకోండి అంటారు. కుమార్తెల కి వారి అత్తగారిని ఎప్పుడూ బాగా చూసుకోవాలి అని చెప్పేవారు.


ఒకసారి లక్ష్మిగారి ఇంట్లో సరస్వతమ్మ గారిని జ్యోతి వెలిగించమన్నారు. ఒకసారి అరుణాచలంలో సరస్వతమ్మ గారు, లక్ష్మి గారు రమణాశ్రమంలో ఒకే రూమ్ లో పడుకున్నారు. లక్ష్మి సామాన్యం కాదు, లక్ష్మిలో కూడా శాంతి ఉంది అన్నారు. ఆ రాత్రంతా శాంతిలో ఉండి సరస్వతమ్మ గారు  నిద్రపోలేదు. ఒకసారి 1993లో తణుకులో ఎవరింటికో నాన్నగారు వెళ్ళారు. ఒక ఆమె తల నొప్పి భరించలేక పోతున్నాను అని నాన్నగారితో చెప్పారు. నాన్నగారు కళ్ళల్లోంచి ఒక మెరుపు చుక్కలా వచ్చి ఆమె కళ్ళలోకి వెళ్ళింది. నాన్నగారు తల నొక్కుకుంటూ ఆయన గదిలోకి వెళ్ళిపోయారు. క్రమేపీ ఆమెకు తల నొప్పి తగ్గింది. సెప్టెంబర్ 23 న నాన్నగారి జయంతి రోజు రాత్రి 12 గంటలకు సరస్వతమ్మ గారికి ఎందుకో మెలుకువ వచ్చింది. నాన్నగారికి హ్యాపీ బర్త్ డే అని చెప్పి పండ్లు సమర్పించి దన్నం పెట్టుకున్నారు. ఇది అంతా ఆయన కృప అన్నారు. సరస్వతమ్మ గారికి 90 సం॥ ల వయస్సు ఉన్నప్పటికీ రోజంతా నాన్నగారి ప్రవచనాలు వింటూనే ఉంటారు. అవి అందరికీ షేర్ చేయటం ఆవిడకి ఇష్టం. ఎవరైనా, ఏ విషయంలో అయినా సరస్వతమ్మ గారిని తప్పు పట్టినా, ఆవిడలో ఏ విధమైన రియాక్షన్ ఉండదు. నాలో ఉన్న తప్పులు గురించి నాకు చెప్పండి నాకు తెలియదు కదా అంటారు. అలా ప్రతీదీ అంగీకరిస్తారు. ప్రతిరోజూ ఇద్దరు ముగ్గురు అనాధలు వారింట్లో భోజనం చేసేవారు. ఇంట్లో ఏదైనా ప్రత్యేకమైన వంట చేస్తే పెద్దవారికి పంపేవారు. ఇంటికి వచ్చిన వారిని ఊరికే పంపటం సరస్వతమ్మగారికి ఇష్టం ఉండదు.



# దైవంతో మైత్రి

## (P.S.N రాజు గారు)

నాన్నగారు మరియు వైజాగ్ P.S.N రాజు గారు బాల్యంలో స్నేహితులు. వారు ఇద్దరూ కలిసి పాలకొల్లు హైస్కూల్లో చదువుకున్నారు. నాన్నగారు జిన్నూరు నుండి పాలకొల్లు వచ్చేవారు. P.S.N రాజుగారు కాపవరం నుండి పాలకొల్లు వచ్చి చదువుకునే వారు. వారు 10 వ తరగతి చదువుకునేటప్పుడు ఒకే రూమ్ లో ఉండేవారు. నాన్నగారు పాఠ్య పుస్తకాల కన్నా ఆధ్యాత్మిక గ్రంథాలు మీద ఆసక్తి కనపరిచేవారు.  భగవద్గీత మొదలగు ఆధ్యాత్మిక గ్రంథాలు ఎక్కువగా చదువుకునేవారు. P.S.N రాజుగారు శ్రద్ధగా పాఠ్యపుస్తకాలు పఠించేవారు. సత్యనారాయణ రాజు గారికి అవసరమైన పుస్తకాలు నాన్నగారే కొని పెట్టేవారు. ఇద్దరూ 10 వ తరగతి పరీక్షలు రాశారు. రాజు గారు పరీక్ష పాసయ్యారు. నాన్నగారు పరీక్షలో ఫెయిల్ అవ్వడం జరిగింది. నాన్నగారు సైకిల్ వేసుకుని వెళ్ళి, మా సత్యం పాసయ్యాడు, మా సత్యం పాస్ అయ్యాడు అంటూ ఎంతో సంతోషంతో అందరికీ చెప్పారు. కానీ సత్యనారాయణ రాజు గారు ఆయన పాస్ అయిన సంతోషం కన్నా నాన్నగారు పరీక్ష తప్పారని ఎంతో బాధ పడ్డారు. ఇద్దరూ అలా ఎంతో స్నేహంగా ఉండేవారు. రాజు గారు నాన్నగారిని వారి అమ్మమ్మ వద్దకు తీసుకువెళ్ళేవారు. P.S.N రాజుగారు నాన్నగారి వివాహానికి కొమ్మర వెళ్ళారు.



తరువాత ఇద్దరూ చాలా సంవత్సరాలు దూరంగా ఉన్నారు. రాజుగారు వ్యాపార నిమిత్తం విశాఖపట్నం వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. సత్యనారాయణరాజు గారు తన చిన్న కుమారుడి వివాహానికి నాన్నగారిని ఆహ్వానించటానికి వచ్చినప్పుడు, వెంకట్రాముడూ నువ్వు ఉపన్యాసాలు చెబుతున్నావని తెలిసింది. నేను వ్యాపారంలో ఉండిపోయాను అన్నారు.

అప్పుడు నాన్నగారు నీ శరీరం ఆపని నిమిత్తం వచ్చింది, నా శరీరం ఇందుకు వచ్చింది. నువ్వు 100 కుటుంబాలకి పని కల్పిస్తున్నావు అన్నారు. రాజుగారి చిన్న కుమారుడి వివాహానికి నాన్నగారు మొదటిసారిగా విశాఖపట్నం రావడం జరిగింది. నాన్నగారు వచ్చినందుకు ఆయన చాలా సంతోషించారు..

నాన్నగారు వివాహానికి వచ్చి వెళ్ళిన తరువాత రాజుగారికి,  సత్యం మీ సిరి సంపదలు చూసి, మీ ఐశ్వర్యం చూసి నాకు ఏనుగు ఎక్కినంత సంతోషం కలిగింది అని ఉత్తరం రాసారు. సత్యనారాయణ రాజు గారి పెద్ద కుమారుడు అయిన విష్ణుకుమార్ రాజు కి హార్ట్ఎటాక్ వచ్చి సీరియస్ అయినప్పుడు నాన్నగారికి ఫోన్ చేసి చెప్పారు. సత్యం నువ్వేమీ కంగారు పడకు, విష్ణుకి ఏమీ అవ్వదు. విష్ణు పూర్ణ ఆయుష్కుడు అన్నారు నాన్నగారు. తరువాత విష్ణురాజు గారు కోలుకున్నారు. సత్యనారాయణ రాజు గారు నాన్నగారు చెప్పిన  ఉపన్యాసాలలోని మంచి వాక్యాలు అన్నీ రాసుకునేవారు. ఆయన ఎప్పుడూ ధర్మబద్ధంగా జీవించే వారు. సత్యం నువ్వు రమణ క్షేత్రానికి ప్రెసిడెంటుగా ఉండు అని నాన్నగారు అడిగితే, ఆయన నేనేమి చేయగలను నాన్నగారూ అన్నారు. నువ్వు ఊరికే ఉండు, మిగతా అంతా వాళ్ళు చూసుకుంటారు అని నాన్నగారు రాజు గారిని ప్రెసిడెంటుని చేసారు. నేను, నువ్వు ఉన్నంత కాలం నువ్వు ఉండు అన్నారు.

నాన్నగారు P.S.N రాజు గారిని ఎప్పుడూ సత్యం అనే పిలిచేవారు. సత్యం మర్యాద రాముడు అమ్మా అనేవారు. తరువాత సత్యనారాయణరాజు గారు అనారోగ్యంతో మంచం మీద ఉన్నప్పుడు నాన్నగారు చాలా సార్లు వచ్చి చూసి వెళ్ళేవారు. ఒకసారి ఆయన పక్కన కూర్చుని సత్యం నీకు జ్ఞానం కావాలా? అని అడిగారు. అప్పుడు సత్యనారాయణరాజు గారు జ్ఞానం ఇస్తానంటే వద్దు అనేవారు ఎవరు ఉంటారు నాన్నగారూ అన్నారు. నాన్నగారు అలాగే.. అలాగే.. అన్నారు.



సత్యనారాయణరాజు గారు మంచం మీద ఉన్నప్పుడు నాన్నగారు చెయ్యి సత్యనారాయణరాజు గారి హృదయం మీద, నుదుటి మీద ఎక్కువసేపు ఉంచేవారు. ఒకరోజు సూర్యాస్తమయం అవుతున్నప్పుడు నాన్నగారు రాజుగారి కోడలికి సూర్యుడ్ని చూపించి, మీ మామగారు అస్తమిస్తున్న సూర్యుడు అని చెప్పారు. నాన్నగారు చెప్పిన కొంత కాలానికి ఆయన కాలం చేశారు. నాన్నగారికి ఫోన్ లో రాజుగారి ఆరోగ్య పరిస్థితి గురించి చెబితే, సత్యం నా హృదయంలోనే ఉన్నాడమ్మా , మీరు బాధపడద్దు అమ్మా అనేవారు. రాజుగారు మంచం మీద ఉన్నప్పుడు నాన్నగారు సత్యానికి అన్నీ ఇంత బాగా జరుగుతున్నాయి. నాకు అలా జరుగుతాయా! అన్నారు.

నాన్నగారితో కలిసి P.S.N రాజుగారు చాలా సార్లు ఎన్నో పుణ్యక్షేత్రాలను దర్శించుకునే వారు. ఆయన నాన్నగారి దగ్గర ఎంతో వినయంతో, ఆప్యాయతతో, గౌరవంతో ఒదిగి ఉండేవారు. ఒకసారి రాజుగారు పిన్ని నాన్నగారితో మీరు, మా సత్యం కలిసి చదువుకునేవారు కదా అని అడిగారు. చదువుకున్న వెంకట్రాముడు ఎప్పుడో పోయాడు అన్నారు నాన్నగారు. రాజుగారు నాన్నగారిని మా అమ్మమ్మ ని చూసి వద్దాము అని చెప్పి తీసుకుని వెళితే, ఆవిడ తల్లిదండ్రులు లేని పిల్లలు ఎలా ఉంటారోనని నాన్నగారి దగ్గర బాధపడ్డారట. నాన్నగారు ఆ మాటలు తలుచుకుంటూ, సత్యం వాళ్ళ అమ్మమ్మ నాతో అన్న మాటలు గుర్తుకు వస్తూ ఉంటాయి. ఈ రోజు వీళ్ళ అన్నదమ్ములు ముగ్గురు ఎంతో  వృద్ధిలోకి వచ్చారు అని సంతోషంగా చెప్పారు.

రాజుగారు ఇంట్లో మేడమీద నాన్నగారు చాలాసార్లు ఉపన్యాసాలు చెప్పేవారు. సత్యనారాయణరాజు గారు నాన్నగారిని స్నేహితుడు గానే భావించి వెంకట్రాముడు అనే పిలిచేవారు. నాన్నగారు వైజాగ్ వచ్చినప్పుడు బీచ్ కి, రామకృష్ణ మిషన్ కి తీసుకుని వెళ్ళేవారు. ఒకసారి నాన్నగారిని వెంకట్రాముడూ, నేను ఆఫీస్ కి వెళ్తున్నాను. నీకు కారు ఉంచాను. ఎక్కడికి వెళ్లాలన్నా కారు వాడుకో అనేవారు. అప్పుడు కొంత మంది భక్తులు వస్తూ ఉండేవారు. నాన్నగారికి భక్తులు నమస్కారం చేస్తూ ఉంటే, సత్యనారాయణ రాజు గారి భార్య మీరు కూడా నమస్కారం చేయండి అంటే వాడు, నేను నమస్కారం చేసుకోవడం ఏంటి అనేవారు.

ఆయన నాన్నగారి ఉపన్యాసాలు విన్న కొత్తలో, వెంకట్రాముడు ఏంటి చెప్పిందే చెబుతున్నాడు అనేవారు.

మొదటిసారి గుండుగొలను కన్నమ్మగారు అయిన వెంకట నరసమ్మగారి బలవంతం మీద, ఇష్టం లేకపోయినా రాజుగారు నాన్నగారికి పాదపూజ చేశారు. నాన్నగారు ఇటువంటివి ఏమీ వద్దు అన్నారు. రాజుగారి ప్రమేయం లేకుండానే ఆరోజు అలా జరిగింది. ఆ తరువాత P.S.N.రాజుగారు చాలాసార్లు ఎంతో భక్తితో నాన్నగారికి పాద పూజ చేసేవారు. చాలామంది భక్తులు నాన్నగారు వచ్చినప్పుడు వస్తూ, వెళ్తూ ఉండేవారు. కాపవరం సూర్యనారాయణ రాజుగారు PSN రాజు గారితో, సత్యం మీరు నాన్నగారి దగ్గర మంత్రం తీసుకోండి. మీరు ఆయన మామూలు మనిషి అని అనుకుంటున్నారు. కానీ ఆయన మహాత్ముడు అని చెప్పారు. అప్పుడు రాజుగారు వెళ్ళి నాన్నగారితో నేను మంత్రం తీసుకుంటే నీ దగ్గర ఇదివరకులా ఉండ లేను కదా, నీ పక్కన కూర్చో కూడదు కదా! అంటే నాన్నగారు సత్యం మనం ఇదివరకు ఎలా ఉన్నామో ఇప్పుడు కూడా అలాగే ఉందాం అన్నారు. నాన్నగారు నామం ఇవ్వగానే సత్యనారాయణరాజు గారికి గురు భావన కలిగింది. అప్పటినుండి నాన్నగారూ అని పిలిచేవారు. ఆయన దగ్గర కిందే కూర్చునేవారు. పాదాలకి నమస్కారం చేసేవారు.

నాన్నగారు రైల్వేస్టేషన్ కి రాగానే సాష్టాంగ నమస్కారం చేసేవారు. ఆయన భార్య స్టేషన్లో సాష్టాంగ నమస్కారం చేస్తారు ఎందుకు అంటే, గురువుగారు కనిపించగానే నమస్కారం చేయాలి. అంతేకానీ ఈ పక్కన ఎవరున్నారు? ఆ పక్కన ఎవరున్నారు? కింద ఎలా ఉంది? అని చూసుకుని నమస్కారం చేస్తారా! అనేవారు. రాజుగారు భక్తులను ఎంతో ఆప్యాయంగా ఆదరించి వారికి సౌకర్యాలు చూసేవారు. తుని తోటలో దీపోత్సవం మూడు సంవత్సరాలు, వైజాగ్ లో మూడు సంవత్సరాలు రాజుగారు దగ్గరుండి జరిపించారు.



నాన్నగారిని అక్కడ జ్యోతి వెలిగించమంటే, నేను ఇంతవరకూ ఎప్పుడూ వెలిగించలేదు అన్నారు. నేను ఏర్పాట్లు చేస్తాను, మీరు జ్యోతి వెలిగిస్తే భక్తులు సంతోష పడతారు అన్నారు రాజుగారు. అప్పుడు నాన్నగారు జ్యోతిని వెలిగించారు.

P.S.N రాజుగారు మరణించే సమయానికి నాన్న గారికి ఆరోగ్యం బాగోలేదు. బి. పి బాగా ఎక్కువగా ఉండేది. డాక్టర్లు నాన్నగారిని విశ్రాంతిగా ఉండాలని చెప్పారు. ప్రయాణాలు చేయవద్దని సూచించారు. రాజుగారి భార్య వెంకట నరసమ్మ గారిని చూడ్డానికి వెళ్ళాలనుకున్నప్పుడు, ఆవిడ నాన్నగారితో మీ ఆరోగ్యం బాగోలేదు కదా నాన్నగారూ! మీరు వైజాగ్ రావద్దు. నేను బాగానే ఉన్నాను. మీ ఆరోగ్యం కుదుటపడ్డాక వచ్చి వెళుదురుగాని అని చెప్పారు. అప్పుడు నాన్నగారు మా అబ్బాయిని పంపుతాను అని చెప్పి సత్యనారాయణ రాజుగారిని పంపించారు. సత్యం నా హృదయంలోనే ఉన్నాడమ్మా , మీరు బాధ పడవద్దు అన్నారు.

తరువాత కొంతకాలానికి నాన్నగారు వైజాగ్ వచ్చినప్పుడు P.S.N రాజుగారిని తలుచుకుంటూ ఇలా చెప్పారు. రాజుగారు మీనాక్షి అమ్మగారి ఇంటినుండి,  నాన్నగారిని తమ ఇంటికి తీసుకురావడానికి వెళ్ళినప్పుడు నాన్నగారితో,  మన ఇంటికి వెళదాం అనేవారట. అంతే కానీ మా ఇంటికి వెళదాం రండి అని సత్యం ఎప్పుడూ అనలేదు అన్నారు నాన్నగారు.



మరొక సందర్భంలో ఇంకొక సంఘటన గురించి వివరిస్తూ నాన్నగారు - నేను, సత్యం, సత్యం పినమామ గారు అయిన సీతారామరాజు గారు కలిసి ఒకసారి పూరి జగన్నాథయాత్రకు వెళ్ళాము. అక్కడ దర్శనం అదీ బాగా జరిగి తిరిగి వచ్చేటప్పుడు ముగ్గురం ఒక హొటల్ లో టీ తాగాము. టీ చాలా బాగుందని నాన్నగారు రాజుగారితో అన్నారు. అప్పుడు సీతారామరాజు గారు ఎందుకు బాగోదు తేరగా వచ్చింది కదా బాగుంటుంది అన్నారు. అంతే, వెంటనే రాజుగారు తను తాగుతున్న టీని టేబుల్ మీద పెట్టేసి, చాలా నొచ్చుకుని బాధతో అక్కడ నుండి దూరంగా వెళ్లిపోయారు.

నాన్నగారు మాత్రం నిర్వికారంగా ఉండి పోయారు కాసేపటి తరువాత P.S.N రాజుగారు సీతారామరాజు గారితో, మిమ్మల్ని నేను ఈ యాత్రకి రమ్మని




పిలవలేదు. మీరే వచ్చారు. మీరు నాన్నగారిని అంత మాట అంటారా? నాన్నగారు తలచుకుంటే నాలాంటి వారిని ఎందరినో తయారు చేయగలరు. బాల్యం నుంచి నాన్నగారి సహాయ సహకారాల వలనే మేము ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాము అన్నారు. నాన్నగారు ఈ విషయం గద్గద స్వరంతో చెబుతూ కంటనీరు పెట్టుకుని సత్యం ప్రేమ, ఆప్యాయత అలాంటిది అన్నారు.

# ఓ పరమ గురుదేవా

## (లేట్ రంగరాజు గారు)

మా తండ్రి గారు అయిన రంగరాజు గారు ముగ్గురు అన్నదమ్ములు. ఆయన చిన్న వయస్సులోనే, తల్లిదండ్రులను కోల్పోయారు. అందువలన కాపవరం గ్రామంలో వారి అమ్మమ్మగారి ఇంట్లో పెరిగారు. మా పెదనాన్న గారు అయిన PSN Raju గారు మరియు నాన్నగారు స్నేహితులు అయినందువలన సెలవులలో నాన్నగారు మా పెదనాన్నతో కలిసి కాపవరం వస్తూ ఉండేవారు. రంగ రాజు గారి అమ్మమ్మ నాన్నగారితో ఒకసారి పక్షికి చెట్టు నీడ అయినా ఉంది. కానీ మా మనవలకి అది కూడా లేదు అని బాధ పడ్డారట. తరువాత స్వయంకృషితో ముగ్గురు అన్నదమ్ములు అభివృద్ధిలోకి వచ్చి ఎంతో ఆధ్యాత్మిక జీవితం కొనసాగించారు.



మా పెదనాన్న అయిన PSN రాజు గారిని నేను ఒకసారి, నాన్నగారు చిన్నతనం నుండి ఎలా ఉండేవారు అని అడిగాను. పదోతరగతిలో పెదనాన్న, నాన్నగారు Room Mates. నాన్నగారు ఎప్పుడూ భగవద్గీత చదువుతూ అందరికీ ఎంతో సహాయం చేస్తూ ఉండేవారు. మనం చాలా చిన్న కుటుంబీకులము. కాబట్టి పుస్తకాలు, పెన్సు కొని ఇచ్చేవారు. నాన్నగారు ఎంతో తత్వ చింతనతో ఉండేవారు. పెద్దల పట్ల గౌరవం, ఎప్పుడూ ఏదో ఆధ్యాత్మిక చింతనతో గడిపేవారు. పరీక్షల ఫలితాలు వచ్చినప్పుడు నాన్నగారు ఫెయిల్ అయ్యారు, పెదనాన్న పాస్ అయ్యారు. పెదనాన్న పాస్ అయినందుకు నాన్నగారు ఎంతో సంతోషంతో, అందరితో మా సత్యం పాస్ అయ్యాడు అని చెప్పేవారు.

అసలు నాన్నగారు ఫెయిల్ అయినందుకు బాధపడకుండా స్నేహితుడు పాస్ అయినందుకు చాలా సంతోషించారు. చాలా ప్రత్యేకంగా ఉండేవారు అని చెప్పారు.

మా తండ్రి గారైన రంగరాజు గారికి చిన్నతనం నుండి దుర్గాదేవి అంటే భక్తి. ఆయన ఎప్పుడు దేవీ నామస్మరణ చేస్తూ ఉండేవారు. ఆయన జీవితంలో చాలా కష్టాలు పడ్డారు. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ నామ స్మరణ మాత్రం విడిచిపెట్టలేదు. ఆయన నిద్రలో కూడా నామం జరిగేది. మా నాన్న కొన్ని ఇబ్బందుల కారణంగా వైజాగ్ నుండి టెక్కలి కాంట్రాక్ట్ కి మారవలసి వచ్చింది. ఎన్ని సమస్యలు వచ్చినా దేవి ఇచ్చిన మహా ప్రసాదంగా తీసుకొని జీవించారు. నాన్నగారు మా పెదనాన్న గారి ఇంటికి వచ్చేవారు. ఒకసారి నాన్నగారిని ఆగర్రు బేబీ గారు పరిచయం చేయటం జరిగింది. ఆ రోజు నాన్నగారు మా ఇంటి ముందు నుండి కొంత మంది భక్తులతో వెళుతుంటే, మా నాన్నని పరిచయం చేయడం జరిగింది. దుర్గామాత దయ అని నమస్కరించారు. వెంటనే నాన్నగారు చాలా తీక్షణంగా మా తండ్రి గారి వైపు చూశారు

తరువాత టెక్కలి లో ఉంటుండగా, మా ఇంటి వీధిలో అరుగుమీద నాన్నగారు కూర్చున్నారు. మా తండ్రిగారికి ఆల్కహాల్ అలవాటు ఉంది. అది కూడా మహా ప్రసాదంగానే తీసుకునేవారు. ఆరోజు డ్రింక్ చేద్దామనుకుని వీధిలోకి వచ్చారు. అక్కడ నాన్నగారు కూర్చుని ఉండటం చూసి, ఎప్పుడు వచ్చారు లోపలికి రండి అన్నారు. కానీ నాన్న గారు నువ్వు ఈరోజు నుండి డ్రింక్ చేయడానికి వీలులేదు అన్నారు. ఒక బెత్తంతో చాలా గట్టిగా చెప్పారు. మా తండ్రిగారు కుర్చీ తీసుకు రావటానికి లోపలికి వచ్చి, బయటికి వెళ్ళి చూసేసరికి నాన్నగారు కనిపించలేదు. ఇది అంతా కల కాదు.

సాయంత్రం ఆరు గంటల సమయంలో మా తండ్రిగారు పూర్తి ఎరుకలో ఉండగానే జరిగింది (వాస్తవంగా అదే సమయానికి నాన్నగారు జిన్నూరులో ఉన్నారు). తర్వాత ఎంత ప్రయత్నించినా డ్రింక్ చేయలేకపోయారు.

నాన్నగారిని మా నాన్న ఎంతో ప్రేమతో చూసేవారు. గుడిలో భగవంతుడిని ఎంత గౌరవంగా, భక్తిగా చూస్తామో అలాగే నాన్నగారిని చూసేవారు. నా పరమ గురుదేవా! అని స్మరిస్తూ ఉండేవారు. తరువాత మా నాన్న కోయంబత్తూర్ వెళ్ళారు. నాన్నగారు కోయంబత్తూరు 93 వ సంవత్సరం మే నెలలో 15వ తారీఖున వచ్చారు. మా నాన్నకి , నాన్నగారిని ప్రతి వేసవికాలంలో విశ్రాంతి తీసుకోవటానికి కొయ్యంబత్తురు తీసుకురావాలని కోరికగా ఉండేది. అలాగే నాన్నగారు వచ్చారు. చాలా ప్రేమగా చూసుకున్నారు. నాన్న గారిని గురువాయూర్, కాలడి మొదలగు ఊర్లు తీసుకువెళ్ళారు. మా తండ్రిగారు, నాన్నగారితో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. మా నాన్న పడుతున్న కష్టాలు అన్నింటినీ ఆయన భుజం మీద వేసుకొని చాలా ఓదార్పు ఇచ్చేవారు. మీకేం కావాలి అని మా తండ్రిగారిని అడుగుతూ ఉండేవారు. నాకు జీవితం చివరి వరకు మీ నామానికి దూరం అవ్వకుండా అనుగ్రహించమని కోరుకునేవారు.

మా నాన్నకి గురు పౌర్ణమి అంటే మహా పండుగ. నాన్నగారు మామూలుగా మనలాగానే ఉన్నారు అనుకుని మోసపోవద్దు. ఆయన మహాశక్తి అనేవారు. భగవద్గీత, రమణ భాస్కర చదువుకుంటూ ఆయన జీవితం గడిచింది. 2010 ఆగస్టులో మా తండ్రిగారికి క్యాన్సర్ అని తెలిసింది. ఆ విషయం నేను నాన్నగారికి చెప్పినప్పుడు, నీకు ఏమి కావాలి అని అడిగారు. ఆయనకి సఫరింగ్ లేకుండా వెళ్ళిపోవాలి అన్నాను. అప్పుడు నాన్నగారు, నువ్వు వెళ్ళి మీరు ఎంతో కాలం ఉండరు అని మీ తండ్రికి చెప్పు అన్నారు. ఆ మాట విని మా తండ్రి గారు చాలా సంతోషంగా మరణం తెలియటం చాలా అదృష్టం. నేను భగవంతుడిని స్మరించుకోవడానికి ఇంకా కొంతకాలమే అవకాశం ఉంది అన్నారు.

అదే సంవత్సరం నవంబర్ నెలలో దీపోత్సవానికి అరుణాచలం వెళ్ళాము. నాన్నగారు కూడా వచ్చారు. నన్ను చూసి మీ తండ్రి సఫరింగ్ లేకుండా వెళ్ళిపోవాలని, అరుణాచలేశ్వరుడిని అడుగుతున్నాను అని గిరి వైపు చూసి నమస్కరించారు. అక్టోబర్ 4 , 2011లో నాన్నగారు వైజాగ్ వచ్చారు. ఆ సమయంలో మా తండ్రిగారికి చాలా నీరసంగా ఉందని నాన్నగారు మా ఇంటికి చూడటానికి వచ్చారు. ఆయన రూమ్ లోకి నన్ను కూడా రమ్మని, నాన్నగారితో మాట్లాడటం మొదలు పెట్టారు. మా నాన్నకి నాన్నగారి పాదాలు అంటే చాలా ఇష్టం. వంగి ఆయన పాదాలపై తన శిరస్సును ఆనించటానికీ ప్రయత్నం చేస్తుంటే, వెంటనే నాన్నగారు ఆయన రెండు పాదాలు మా తండ్రిగారు శిరస్సుపై మోపారు. నాన్నగారితో మా తండ్రిగారు నాన్న గురుదేవా! నా ప్రాణ ప్రయాణ కాలంలో మీరు నాకు కూడా ఉండాలి అని అడిగారు. నాన్నగారు సరే అన్నారు. నా మరణానంతరం కూడా మీరు నాతో ఉండాలి అన్నారు మా తండ్రి గారు. నాన్నగారు సరే అన్నారు. నా ప్రాణం పోయే సమయంలో నామానికి దూరమవుతానేమో అని భయంగా ఉంది గురుదేవా అన్నారు. భవాని సహాయం చేస్తుంది అన్నారు నాన్నగారు.

2011 వ సంవత్సరం అక్టోబర్ 6 వ తారీఖున ఉదయం మా తండ్రిగారు కొంచం స్పృహలో ఉన్నారు. సాయంత్రం 3 గంllకి నాన్నగారు వచ్చారు. మా నాన్నని చూసి కోమాలోకి వేళ్ళకుండా దేహం విడిచి పెడితే బాగుండును అన్నారు. తర్వాత మీ నాన్నని ఎవరు పలకరించవద్దు, ముట్టుకోవద్దు అని చెప్పి అందరినీ దూరంగా ఉండమన్నారు. నన్ను నారాయణ నామం చేయమన్నారు.

నారాయణ అంటే చైతన్యం! చైతన్యం చైతన్యంలో కలిసిపోతుంది! అన్నారు. నాన్నగారు కొద్దిసేపు అలా తదేకంగా మా తండ్రి గారి వైపు చూసి వెళ్ళిపోయారు. నాకు నారాయణ నామం అలవాటు లేదు కాబట్టి చెయ్యలేక నాన్నగారిని ప్రార్థించాను. హృదయంలో నుండి నారాయణ అంటూ నాన్నగారు వాయిస్ వినిపించింది. మా తండ్రిగారు సాయంత్రం

6:30 ని॥లకు ‘నారాయణ’ అంటూ తుది శ్వాస విడిచి పెట్టారు. నాన్నగారు మరుసటిరోజు ఉదయాన్నే వచ్చి, నాన్నకి దండ వేసి, ప్రదక్షిణ చేసి, నమస్కరించి ఉత్తమ లోకాలకు వెళ్లిపోయాడు అన్నారు. ప్రాణం ఎలా వెళ్ళింది అన్నారు? నారాయణ అంటూ వెళ్ళిపోయారు అన్నాను. ఆ 12 రోజులు ఒక్క క్షణం కూడా ఆగకుండా నాన్నగారు వాయిస్ నారాయణ అంటూ నా హృదయంలో నుండి మారుమ్రోగింది. ఆ శబ్దాన్ని గమనిస్తు ఉన్నాను.

మా నాన్నకి తృప్తి కలిగింది అని సంతోషించాను. నాన్నగారు మా నాన్నకి ఇష్టమైన కోరికలు అన్నీ తీర్చారు. ఆయనకి ఎంతో ఇష్టమైన విజయదశమి రోజు, ఇష్టమైన గురుదేవుల సమక్షంలో దేహం వదిలిపెట్టారు. ఆయన జీవితంలో ఎన్నో కష్టాలు చూశారు. దైవ నామమే ఆయన ఊపిరి. గురుదేవులకు పూర్ణ శరణాగతి చెందారు. నాన్నగారితో మా తండ్రి గారు చాలా సన్నిహితంగా మెలిగారు. నాన్నగారిని ఒక గురువుగానే కాక తల్లిగా, తండ్రిగా, స్నేహితుడిగా, ఆత్మీయుడిగా సర్వం తానే అయినట్లుగా నాన్నగారితో అన్ని విషయాలు పంచుకునేవారు. మా తండ్రి గారికి నాన్నగారు పరిచయం అయ్యాక, ఎప్పుడు ఒంటరితనం అనిపించలేదు. నాన్నగారిని విశ్రాంతి గా ఉంచాలి అనుకునేవారు. నాన్నగారు కోయంబత్తూరు నాలుగు సంవత్సరాలు పాటు, సంవత్సరంలో రెండు సార్లు వచ్చారు. అమ్మ, వదిన నాన్న గారిని, వారి భక్తులను ఎంతో ప్రేమగా చూసేవారు. మా తండ్రి గారు చాలా అదృష్టవంతులు. నాన్న గారిని ఆయన స్మరించిన దేవి చూపించిందని భావించేవారు. నిరంతరం ఆయననే గురుదేవా! ఓ పరమ గురుదేవా! అని స్మరించే వారు.

# సాధన కంటే విశ్వాసం ఎంత గొప్పది


## (లేట్ పాందుమామ్మ & సావిత్రమ్మగారు)

**నాన్నగారికి, పాందుమామ్మ గారికి మధ్య ఉన్న అనుబంధం గురించి ఆవిడ మనవరాళ్ళు తెలియచేసిన విషయాలు:**



పాందుమామ్మగారు నాన్నగారిని మొదటిసారి కొమ్మరలో 1985 ఆ ప్రాంతంలో కలిసారు. అప్పటికే ఆవిడ పోగొట్టుకోవలసినది ఏమీ లేదు, పండిన పండు వలె వచ్చారు. నాన్నగారి సమక్షంలో మామ్మగారికి ఎరుకగా ఉండటం అనేది అనుభవంలోకి వచ్చింది. అది మొదలు ఆవిడ నాన్నగారికి శరణాగతి చెందుతూ వచ్చారు. నిరంతరం ఆయన స్మరణలో, ఆనందంలో మునిగి ఉండేవారు. ఒక్కొకక్క రోజు ఆనంద స్థితిలో హృదయం నిండి, ఆకలి లేక భోజనము చేసేవారు కాదు. నాన్నగారి  మాటలు నెమరువేసుకుంటూ తనలో తాను ఉండేవారు. అమృతవాక్కులు పుస్తకం దగ్గర ఉండేది. నాన్నగారు పాడిన హే భగవాన్, జయ భగవాన్, ప్రియా భగవాన్, ప్రభు భగవాన్ అని పడుకునేవారు. పిల్లల్ని, మనవల్ని అందరిని మహానుభావుడు నాన్నగారిని దర్శించుకోవాలని చెప్పేవారు. ఆయన చెప్పిన మాటలను పాటించమని కూడా చెప్పేవారు. ముందు ముందు ఆయన దొరకరు అనేవారు. ఒకసారి అరుణాచలం వెళ్ళమని చెప్పేవారు. ఆవిడ కోరిక మీద గానే సరస్వతి గారు, నరసింహ రాజు గారు మొదటిసారి  నాన్నగారిని నల్లకుంట తీసుకువచ్చారు. ఆ విధముగా మామ్మగారు తన కుటుంబంలోని వారిని శ్రీ నాన్నగారి  పాదముల చెంతకు చేర్చారు. ఒకసారి తునిలో రామావతీ గారికి , మామ్మగారికి చెట్టు కింద భగవాన్ దక్షిణామూర్తి రూపములో దర్శనమిచ్చారు. ఎప్పుడూ మౌనములోకి వెళ్ళిపోతూ ఉండేవారు. నిస్వార్ధ సేవ, సమానత్వం, కోపం లేకపోవటం, దైవభక్తి, గురువు పట్ల విశ్వాసము ఇవ్వని కలిగి ఆంతరంగిక ప్రయాణం చేసిన  భక్తురాలు పాందువ మామ.

మామ్మగారు 1995 సంవత్సరం జూన్ 30వ తేదీన మహాదేవుని పట్నంలో భగవంతునిలో ఐక్యం అయ్యారు. మామ్మగారికి, నాన్నగారికి తల్లి కొడుకుల అనుబంధం. అందుకని శ్రీ నాన్నగారి చేతుల మీదగా ఆవిడ దేహయాత్ర ముగిసినది. తరువాత సంవత్సరానికి శ్రీ నాన్నగారు గరగపర్రు విచ్చేసి, గంటన్నర మామ్మగారి గురించి ప్రవచనం చేశారు.



రెండేళ్ళకి పాందువ మామ్మగారిది ఫోటో తీసుకురమ్మని అరుణాచలంలో సెప్టెంబర్ 1వ తేదీన శ్రీధర్ గారితో పూజ చేయించి ఆశ్రమములో స్వయముగా శ్రీ నాన్నగారు ఫోటో పెట్టారు.

**నాన్నగారికి, సావిత్రమ్మగారికి  గారికి మధ్య ఉన్న అనుబంధం గురించి ఆవిడ మనవరాళ్ళు తెలియచేసిన విషయాలు:**

సావిత్రమ్మగారు 1934 వ సంవత్సరంలో సూరమ్మ గారికి (పాందువ్వ మామ) లక్ష్మీపతి రాజు దంపతులకు పాందువలో జన్మించారు. ఆవిడ పాందువ్వ మామగారి మూడవ కుమార్తె. సావిత్రమ్మగారికి అందరి యందు ప్రేమ, పరోపకారం స్వార్ధం లేకపోవటం దానధర్మాలు సహజ లక్షణములు. ఆవిడ వద్దకు పెద్ద పెద్ద ఉద్యోగ పదవులతో ఉన్నవారు, సామాన్యులు కూడా వచ్చి తమ తమ సమస్యలను, కష్టసుఖాలను పంచుకునేవారు. ఆవిడ ప్రతి ఒక్కరి సమస్యను ఆవిడ సమస్యగా అనుకోని పరిష్కారం కోసం తీవ్రంగా ఆలోచించేవారు. ఆ పరిష్కారం కోసం ఎంతైనా కష్టపడేవారు. కుడిచేతితో చేసిన దానం ఎడమచేతికి తెలియకూడదు అని మహాత్ముల వాణికి సావిత్రమ్మగారు నిదర్శనం. సావిత్రమ్మగారు జీవితాంతం నాది అని స్వార్ధం లేకుండా జీవించారు.t

"ప్రేమతోని నామ మాలించు భక్త భక్తుల భక్తుగా బ్రోవుము అరుణాచాలా అని భగవాన్ ప్రార్థించినట్లు". సావిత్రమ్మగారు నాన్నగారితో సమానంగా భక్తులను చూసి ఆనందపడేవారు.

మొదటిసారి నాన్నగారిని దర్శించుకున్నప్పటి నుండి ఆవిడ జీవితం చివరి క్షణం వరకు నాన్నగారి మీద ఉన్న విశ్వాసం చెక్కుచెదరలేదు.

సావిత్రమ్మగారు నాన్నగారితో, మా అమ్మను మీ చేతుల మీదుగా సాగనంపినట్లే నన్ను కూడా మీ చేతులతో పంపేయండి అనేవారు. సావిత్రమ్మ గారికి చివరి రోజుల్లో కిడ్నీలు పాడైపోయి హాస్పటల్లో నెల రోజులు పైనే ఉన్నారు. చివరిసారిగా నాన్నగారిని చూడాలని కోరారు. ఈ విషయం నాన్నగారికి చెబితే సెప్టెంబరు 23 వ తేదీన నాన్నగారు పుట్టినరోజు ఉంటుంది కదా! దానికి ముందు రమ్మంటారా, తరువాత రమ్మంటారా అని నాన్నగారు అడిగారు. పుట్టిన రోజు అయ్యిన తర్వాత నాన్నగారిని రమ్మన్నారు సావిత్రమ్మ గారు. నాన్నగారు హైదరాబాద్ వచ్చే సరికి ఆవిడ కోమాలో ఉన్నారు. I.C.Uలో ఉన్న సావిత్రమ్మ గారిని చూడటానికి నాన్నగారు వచ్చి తల నిమిరి సావిత్రమ్మగారు అని మూడుసార్లు పిలిచారు. మహానుభావుడు పిలుపు వినగానే ఆవిడ ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. ఇది జరిగిన మూడవ రోజున (28. 9. 2003) నాన్నగారు నల్లకుంట రమణ కేంద్రం లో ప్రవచనం చెబుతూ ఉండగా సావిత్రమ్మగారు దేహం చాలించారు. ఆ సాయంత్రం నాన్నగారు ఇంటికి వచ్చి ఆవిడ గురించి మాట్లాడి వెళ్ళారు. కోమాలో ఉన్న ఆవిడ నాన్నగారు పిలుపుకి స్పందించడం గురించి నాన్న గారిని అడిగితే, "గురువు అనుగ్రహం ఉంటే తెలుస్తుంది" అని అన్నారు.

## సావిత్రమ్మగారి మాటల్లో నాన్నగారి గురించి:



అమ్మ మాట నిజంగా వేదమే! నాన్నగారిని ఒక్క సారి దర్శనం చేసుకోమని పదే పదే చెప్పేది. కాని ఆ మాటలు ఈ కొంటె మనసు వింటేగా! తాతగారి మరణం నా మనసుని కలచివేసింది. ఎక్కడికీ వెళ్లాలనిపించేది కాదు. అప్పుడే నాన్నగారి, “అమృత వాక్కులు”, “ పసిడి పలుకులు” చదివాను. అమ్మకి మీరంటే పంచప్రాణాలు. నన్ను కూడ మీకు దగ్గర చేయాలని ఆవిడ తపన! ఎందుకో తర్వాత గాని అర్థం కాలేదు.

ఆ రోజు సఖినేటిపల్లి లో సత్యనారయణ రాజు గారి ఇంట్లో మొదటిసారిగా మిమ్మల్ని చూసాను. హాలంతా జనంతో నిండిపోయి ఉంది. ఎక్కడో దూరంగా ఒక మూల ఒడిగా కూర్చున్న నాపై మీ చూపు పడింది. అమ్మ మాటలు గుర్తుకొచ్చాయి. దగ్గరగా పిలిచి కూర్చోమన్నారు. అంతే!! ఆ ప్రథమ దర్శనంతోనే మీ దాసురాలనయ్యాను. ఏదో తెలియని ఆనందంతో మనసు నింపారు. మా ఇంటికి వస్తానన్నారు. ఎంత అర్హతను ప్రసాదించారు! మేలిమి బంగారంలా మెరిసిపోతూ, గుమ్మంలో అడుగుపెడ్తున్న మిమ్మల్ని చూసి క్షణకాలం ఇది కలా! నిజమా! అని సందేహించాను. “మనింటికి మనం వచ్చాం” అన్న మీ మాట మీకు-నాకు మధ్య ఉన్న బంధాన్ని గుర్తుకు తెచ్చింది. మీ పాదలను తాకినపుడు ‘మచ్చలేని గురువు’ అని హృదయంలో స్ఫురించింది. “ఓ మహానుభావుడు నీ ఇంటికి వస్తాడు. నువ్వు గుమ్మం దిగక్కర్లేదు. తరిస్తావు” అని ఎప్పుడో ఓ సిద్ధాంతి చెప్పిన మాటలను నిజం చేసారు.

మీ ప్రేమతో కట్టేసారు. మెలకువలో, స్వప్నంలో, కూర్చున్నా, నించున్నా నాతో మాట్లాడారు. మిమ్మల్ని మర్చిపోయిన క్షణం భరించరానిదిగా ఉండేది. అనుక్షణం వెంటాడారు. మిమ్మల్ని చూడకుండా ఉండలేననిపించేది. ఇదంతా మేముకావాలని కోరుకున్నది కాదు. మీరే మమ్మల్నిలాక్కున్నారు.

ఇది వరలో ప్రతిదానికీ కంగారే. పని జరిగితే సంతోషం, జరగక పోతే దుఃఖం వచ్చేది. చెంచా పొయినా బాధ పడి పోయేది మనసు. మంత్రగాడిలా అన్నీ మాయం చెసేశారు. చేతిలో కత్తెర లేకుండా ఆపరేషన్ చేసేశారు. ఇప్పుడు భూమ్యాకాశాలు ఏకమైనా చలించని ఎత్తుకు తీసుకెళ్లారు. మీ ప్రేమతో బంధించేశారు. ఆ ప్రేమ నా ఒక్కదాని సొంతమే అనుకున్నాను. ఎంత పిచ్చి భ్రమ! రేపల్లెలో ప్రతి గోపికకు కృష్ణుడు తన వాడేనన్న భావన నింపిన నల్లనయ్యవు మీరేనా అనిపించింది. అందరి పట్ల మీ ప్రేమ చూశాక.

కుడి చేత్తో తుండును ఊపుతూ, విలాసంగా నడిచే మీ నడక చూసి మురిసిపోతాను.

నీళ్లు తాగుతూ గ్లాసును అందంగా తిప్పే మీ చేతులను చూసి మురిసిపోతాను.



నిర్మలంగా చూసే మీ చూపు చూసి మురిసిపోతాను. అమృతము కురిపించే మీ మాటకు మురిసిపోతాను.

సోఫాలో రెండు కాళ్లు మడత వేసి కూర్చునే భంగిని చూసి మురిసిపోతాను.

పొట్ట నిమురుకుంటూ బోసినోటితో మీరు తేన్చుతూ ఉంటే చూసి మురిసిపోతాను. కళ్లు మూసుకుని చూస్తూన్న మీ చూపుకు మురిసిపోతాను.

నా మనసులోని మాటని విన్నట్టుగా తల ఊపుతూ అభయ హస్తం తో ఆశీర్వదించే మీ సుందర రూపాన్ని చూసి మురిసిపోతాను.

ఇలా ఎన్ని చెప్పను? మిమ్మల్ని చూశాక సృష్టిలో ఇంక చూడాల్సింది ఏమీ లేదనిపిస్తుంది. మీ కృపను ఎలా కనిపెట్టామో చెప్పమంటారా? నిన్నటి వరకు మిమ్మల్ని చూడాలన్న తపన. ఇప్పుడనిపిస్తుంది, “మీరు లేని చోటు ఎక్కడుందని”. సాధన కంటే విశ్వాసం ఎంత గొప్పది!!

# శ్రీ నాన్నగారు, మన ఆప్తులు

## (లేట్ రామకృష్ణరాజు గారు)

**రామకృష్ణరాజు గారికి, నాన్నగారికి మధ్య ఉన్న అనుబంధం గురించి వారి కుమార్తె శ్రీదేవి ( బేబి ) గారు తెలియజేసిన విషయాలు :**

నా తండ్రి రామకృష్ణరాజు గారు. ఆయన, నేను ఒకేసారి నాన్నగారిని కలుసుకున్నాము. గురువు దగ్గరకు మనమే వెళ్ళాము, గురువుతో అనుబంధం మనమే అభివృద్ధి చేసుకున్నాము అని మనం అనుకోవచ్చు. కానీ యదార్థానికి గురువే మనల్ని దగ్గరకు తీసుకుంటాడు. ఈ విషయం నాన్నగారే మనకి తెలియజేసి గుర్తుచేస్తుండేవారు. ఆయన దయ లేకుండా ఆయన సమక్షం మనకి దొరకదు. తన కరుణాపూరితమైన చూపుల ద్వారా, ప్రేమపూరితమైన మాటల ద్వారా, ఆప్యాయతతో కూడిన చర్యల ద్వారా మనని తనవైపుకి ఆకర్షించుకుంటారు. అందుకు మా నాన్నగారి జీవితమే ఒక నిదర్శనం! శ్రీనాన్నగారు ఆయనని ప్రేమతో ఇంజినీరు గారు అని సంభోదించేవారు. మా సంస్కారాలు, సంఘర్షణలు, ప్రారబ్ధాలు వేరైనా, నాన్నగారి అనుగ్రహంలో భౌతికంగా ఇద్దరం కలిసే ప్రయాణం చేసాము. జిన్నూరు, అరుణాచలం వెళ్ళినప్పుడు, నాన్నగారిని ఎక్కడయినా కలుసుకోవటానికి వెళ్ళినప్పుడు ఇద్దరం కలిసే వెళ్ళేవాళ్ళము.

నా తండ్రికి వృత్తిపరంగా, కుటుంబపరంగా చాలా గౌరవం ఉండేది. ఆయన మంచితనాన్ని, సమానత్వాన్ని, ప్రశాంతతని అందరూ ఇష్టపడేవారు. గ్రంధ పఠనం ఆయనకి ఇష్టమైన వ్యాపకం. ఎన్నో ఆధ్యాత్మిక గ్రంధాలు చదవటంతో పాటు, ఆధ్యాత్మిక ప్రవచనాలు కూడా వినేవారు. ఎక్కువ మౌనంగా, ఒంటరిగా గడిపేవారు. చాలా దయగా, ఉదారంగా ఉండేవారు. ఎవరికైనా ధన సహాయం కానీ, ఉద్యోగ విషయంలో రికమెండేషన్ కానీ అవసరం అయితే చేయటానికి సిద్ధంగా ఉండేవారు. ఇతర ప్రాంతాల నుండి బంధువులు, స్నేహితులు వైద్యం కోసం హైదరాబాదు వస్తే వారికి ఇంట్లో ఆతిధ్యమిచ్చి, తనే స్వయంగా హాస్పిటల్ కి తీసుకువెళ్లి తన డాక్టర్ స్నేహితుల ద్వారా వైద్యం చేయించేవారు. వృత్తిపరంగా ఆయన సివిల్ ఇంజనీరు.

కట్టడాలలో నైపుణ్యానికి మంచి పేరు ఉండేది. కానీ ఆయన ఎప్పుడూ దానిని ప్రదర్శించకుండా వినమ్రంగా ఉండేవారు. భౌతికంగా ఆయన ప్రారబ్ధంలో ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు  ఎదురవడం వల్ల ఎన్నో కష్టాలు, ప్రతికూల పరిస్థితులు అనుభవించారు. అయితే ఆయన జీవితంలో గొప్ప అదృష్టం నాన్నగారితో ఆయన అనుబంధం. ఆయన జీవితం రెండవ దశలో నాన్నగారు ఆయనని తన అనుగ్రహ వలయంలోకి తీసుకున్నారు. ఆయన పూర్వపుణ్యం, మంచితనం, సంస్కారం ఫలించి నాన్నగారితో అనుబంధముగా ఏర్పడింది. ఆయన జీవితం ఎంతో శాంతిగా, ఆనందంగా గడిచిపోయింది.



మేము నాన్నగారిని 1991వ సంవత్సరంలో, బేగంపేటలో, మాధాపూర్ లక్ష్మి వాళ్ళ అమ్మగారి ఇంటిలో మొదటిసారి కలిసాము. అమ్మ బలవంతం మీద మొహమాటంగా, అయిష్టంగానే వెళ్ళాం. నాన్నగారు మర్యాదగా కుశలప్రశ్నలు వేసి నాలుగు మాటలు మాట్లాడారు. అప్పటికి నాన్నగారి గురించి కానీ, రమణ మహర్షి గురించి కానీ ఎక్కువ వినలేదు. త్వరలో మా జీవితాలు నాన్నగారితో పెనవేసుకు పోతాయని, ఆయన సమక్షంలో ఇదివరకు తెలియని ఆనందము అనుభవిస్తామని అప్పుడు మాకు తెలియదు. తరువాత ఒకటి రెండు సార్లు మళ్ళీ కలిసాము. మా అమ్మ, పిన్ని నాన్నగారి దగ్గరికి తరచూ వెళ్ళేవారు. నాన్నగారు ఇంజినీరు గారు ఎలా ఉన్నారు అని తప్పనిసరిగా అడిగేవారట. మా అమ్మగారు తన సంతోషాన్ని దాచుకొని చిరుకోపం నటిస్తూ, నాన్నగారి కోసం వెళ్ళేది మేము, కానీ ఇంజినీరు గారిని అడుగుతారు ఏంటి అనేవారు. అమ్మ, పిన్ని, ఇతర భక్తులు ఎప్పుడూ చెప్పేవారు నాన్నగారు ఎక్కువగా ఇంజినీరుగారిని తలుస్తారని! అలా నాన్న మనస్సుని నెమ్మదిగా ఆక్రమించి తన వైపు ఆకర్షించుకున్నారు.

ఒకసారి పశ్చిమ గోదావరి జిల్లాలో బంధువుల ఇంటికి వెళ్లాము. అమ్మ మాతో నాన్నగారిని కలిసే వెళ్ళాలి అన్నారు. అప్పుడు నాన్నగారు భీమవరం దగ్గరలో ఒక గ్రామంలో ఉన్నారు. మేము భీమవరంలో ట్రైన్ ఎక్కాలి. అప్పటికి  సమయం కూడా ఎక్కువ లేదు. కానీ అమ్మ పట్టుపట్టారు. అంతా నాన్నగారే చూసుకుంటారు అని ఆవిడ విశ్వాసం. ఆశ్చర్యంగా టాక్సీ దొరికింది. వెంటనే బయలుదేరి వెళ్లాము. ఆయన ఉన్న ఇల్లు ఎక్కడో కూడా తెలియదు. కానీ, వెతకకుండానే చేరుకున్నాము. నాన్నగారు అప్పుడే ప్రవచనం ముగించి విశ్రాంతికి వెళ్తున్నారు. అక్కడ ఉన్న భక్తులు లోపలికి వెళ్లిపోతారు అంటూ మమ్మల్ని తొందర పెట్టారు. నాన్నగారు మమ్మల్ని చూసి ఆనందకరమైన చిరునవ్వుతో  రండి మీ కోసమే చూస్తున్నాను అన్నారు. అంతే ఒక్కసారిగా ఆనందం ముంచెత్తినట్టు అయిపోయాము. నాన్నగారు ఆప్యాయంగా నాన్న చెయ్యి పట్టుకొని, తన పక్కన కూర్చోపెట్టుకుని ప్రేమతో నిమురుతూ మాట్లాడారు. మీరు ఎప్పుడైనా నా ప్రవచనాలు వింటున్నారా? మీరు విని ఏమైనా తప్పులు ఉంటే చెప్పాలి సరిచేసుకుంటాను అన్నారు వినయంగా. నాన్న వెంటనే నిలబడి చేతులు జోడించి, మీ జ్ఞానం గురించి నేనేమి చెప్పగలను? మీకున్న వివేకం నాకు లేదు కదా అన్నారు. నాన్నగారు చూపిస్తున ప్రేమకి నాన్న మైమరచిపోయారు. నాన్నగారి సమక్షంలో, ఆయన ప్రేమప్రవాహంలో కొంత సేపు గడిపాము. మా ప్రయాణం గురించి అడిగి, తిన్నగా స్టేషనుకి వెళ్ళండి అంటూ జాగ్రత్తలు చెపుతూ పంపించారు. మీకు ఇష్టం  లేకపోయినా తీసుకెళ్లింది నేను, కానీ లాభం మీది అని అమ్మ పరాచికమాడితే నాన్న ఆనందంతో చిరునవ్వు నవ్వారు.

మెల్ల మెల్లగా నాన్న  నాన్నగారి అనుగ్రహంలో, ఆయన చూపిన దారిలో స్థిరపడిపోయారు. ఆయనకి జనం మధ్య నుంచి, ముఖ్యంగా స్త్రీల మధ్యనుంచి వెళ్లాలంటే మొహమాటం. కానీ నాన్నగారి పట్ల ఆకర్షణ, ఆయనని చూడాలనే తపన ఆయన సమక్షానికి తీసుకువెళ్లేవి. నాన్నగారు హైదరాబాద్ వచ్చినప్పుడల్లా నాన్న ఆయన దర్శనానికి వెళ్ళినా దూరంగానే ఉండిపోయేవారు. నాన్నగారు చూసి దగ్గరకు రమ్మని పిలుస్తూ, అక్కడ కూర్చున్న భక్తులని దారి ఇమ్మని తన గదిలోకి తీసుకెళ్లి ఒక్కోసారి గంటవరకూ గడిపేవారు.

ఎప్పుడైనా నాన్నగారిని చూడాలనే తపన కలిగితే నాన్న వెంటనే జిన్నూరు వెళ్ళేవారు. చాలాసార్లు నేనుకూడా ఆయనతో  వెళ్ళేదానిని.

నాన్నకి  డాక్టర్ రామారావు గారిలో ఒక మంచి స్నేహితుడిని చూపించారు నాన్నగారు. రామరావుగారు వారి ఇంటిలోనే ఆధిత్యమిచ్చి అన్ని సదుపాయాలు చూసేవారు. నాన్న మొహమాట పడతారని దగ్గర ఉండి నాన్నగారి దర్శనానికి, రమణ క్షేత్ర సందర్శనానికి తీసుకెళ్ళేవారు. ఇతర ప్రదేశాల నుండి వచ్చే భక్తులకి రమణ క్షేత్రంలో బస ఏర్పాటు ఉండేది. కానీ నాన్నగారు ఈ ఏర్పాట్లు చూసే భక్తులతో, ఇంజినీరుగారు డాక్టరుగారి ఇంటిలో అయితే సుఖంగా ఉంటారు అక్కడే ఉండనివ్వండి అన్నారు. నాన్నగారికి భక్తులు పట్ల ఉన్న ప్రేమకి, వారి సౌకర్యం పట్ల ఉన్న శ్రద్ధకి ఇది ఒక ఉదాహరణ. భక్తులకు శాంతిని, ఆనందాన్ని పంచుతూ వారి ఆధ్యాత్మిక అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా, వారి కనీస అవసరాలు, సదుపాయాల పట్ల కూడా ఎంతో శ్రద్ధ చూపేవారు. జిన్నూరు, అరుణాచలం వెళ్ళినప్పుడు - నా స్నేహితులు చక్రపాణిగారి లక్ష్మి, సంధ్య, వారి అక్క లక్ష్మి, రామారావుగార్ల తో కలసి ప్రయాణం చేయమని మమ్మల్ని నాన్నగారు ప్రోత్సహించేవారు. నాన్నని ఎక్కువగా గురువు సమక్షంలో ఉంచటానికి నాన్నగారు చేసిన ఏర్పాటు ఇది! రామారావుగారి ఇల్లు నాన్నగారి ఇంటికి పక్కనే ఉండటం వల్ల కూడా, నాన్నకి నాన్నగారితో ఎక్కువ సమయం గడపటానికి అవకాశం కలిగేది. వీలైనంత సేపు తన సమక్షంలో కూర్చోపెట్టుకొని అనుగ్రహ వర్షం కురిపించేవారు. ఒక్కోసారి భోజనం కూడా వారి ఇంటిలో ఏర్పాటు చేసి, నాన్నగారు ఎంతో ప్రేమగా స్వయంగా చేతిమీద నీళ్ళు పోసి టవలు అందించి, దగ్గరుండి వడ్డన చూసేవారు. నాన్నగారి ఆప్యాయతకు నాన్న ఒకపక్క కరిగిపోతూ బిడియంగా వారిస్తే, ఇలా చెయ్యటం నాకు సంతోషం అనేవారు.

నాన్నగారు కొంతకాలం ప్రతి సంవత్సరం కోయంబత్తూరు వెళ్ళేవారు. వసతి సౌకర్యాలు ఇబ్బంది వల్ల కొద్దిమంది భక్తులకే వెళ్ళటానికి అవకాశం ఉండేది. ఒకసారి మాకు ఆ అదృష్టం కలిగింది. నాన్నగారు ఆ యాత్రలో నాన్న పట్ల చూపిన ప్రేమకి కరిగి తన మనస్సుని పూర్తిగా విప్పి నాన్నగారితో పంచుకున్నారు.

ఆ యాత్ర తరువాత నాన్న చాలా కాలం వరకు తన్మయత్వంలో, ఆనందంలో ఉండిపోయారు. నాన్నకి రమణ ఆశ్రమం అన్నా అరుణాచలం అన్నా చాలా ఇష్టం. వీలైనప్పుడల్లా నాన్నగారితో పాటు అరుణాచలం వెళ్ళి, తప్పనిసరిగా గిరిప్రదక్షిణ చేసేవారు. వయస్సు, ఆరోగ్యం సహకరించకపోవటంతో చెప్పులు లేకుండా నడవలేకపోయేవారు. అప్పుడు నాన్నగారు, చెప్పులతో వెళితే మన భక్తిలో ఏదో లోపం ఉన్నట్టు కాదు, భక్తికి హృదయం ప్రధానం అని చెప్పాక, చాలా కాలం అలాగే వెళ్ళేవారు.

నాన్నగారి సంకల్పం వల్ల నాన్నకి అరుణాచలం పట్ల ఆకర్షణ బలపడుతూ వచ్చింది. భవిష్యత్తులో నాన్నగారి ప్రోద్బలంతో అక్కడ నాన్న చేయవలసిన పని నిర్ణయించబడి ఉంది. "ఆంధ్ర ఆశ్రమం" నిర్మాణం సమయంలో కొన్ని నెలల పాటు తరచూ అరుణాచలం వెళ్లవలసి వచ్చేది. నాన్నగారు నాపై అనుగ్రహ వర్షం కురిపించటానికి అది ఒక వంపు అని నాన్న అనుకొనేవారు. నాన్నగారు ఆంధ్ర ఆశ్రమ నిర్మాణానికి సంబంధించిన సమస్త పనులూ నాన్నతో సంప్రదించి, ఆ కార్యక్రమంలో భాగం పంచుకొనే అవకాశం ఇచ్చారు. ఆ నిర్మాణ కాలమంతా నాన్న, గంటల తరబడి నాన్నగారి దివ్యమైన సమక్షంలో ఆనందంగా గడిపేవారు. ఆధ్యాత్మిక శక్తితో నిండి వుండే అరుణాచల క్షేత్రంలో ఏకాంతంగా గడపటానికి అది ఒక అపూర్వ అవకాశం. ఆయనకి అనుకూలమైన రీతిలో సాధన చేసుకోవటానికి అది నాన్నగారు కల్పించిన అవకాశం. నిర్మాణ పనులకి అరుణాచలం వెళ్లినప్పుడు డాక్టర్ రామారావు గారు కూడా ఉండేవారు. డాడీకి అనారోగ్య సమస్యలు ఉండేవి. ఆధ్యాత్మిక అభివృద్ధి తో పాటు, నాన్నకి భౌతిక సౌకర్యాలలో  లోటు లేకుండా నాన్నగారు ఆ విధంగా ఏర్పాటు చేసారు.

కొన్ని సంవత్సరాల తరువాత "నాన్నగారు ఆశ్రమం" నిర్మాణం ప్రారంభమైనప్పుడు కూడా నాన్నగారు నాన్నని సంప్రదించారు. కానీ అప్పటికే ఆరోగ్యం క్షీణించి నాన్న జీవిత యాత్ర ముగిసే సమయం వచ్చింది.


అందువలన నాన్నగారు ఆ పనిని  మంచితనమూ, భక్తి కలిగిన డెంటిస్ట్ ఉష తండ్రి గారికి అప్పగించారు (ఉషా నేను ఒకటే అని నాన్నగారు ఎప్పుడూ అనేవారు). నాన్న చివరి రోజులలో కుటుంబ సమస్యలు ఎదుర్కోవలసి వచ్చింది. ఆయన చనిపోవటానికి ఒకటి రెండు సంవత్సరాల ముందు తీవ్రమైన అనారోగ్యం బారిన పడ్డారు. డాక్టర్లు వాళ్ళ ప్రయత్నం తీవ్రంగా చేస్తున్నారు. డాక్టర్ రామారావు గారు జిన్నూరు లో నాన్నగారి దగ్గరికి వెళ్ళి విషయం చెపితే, అది విననట్టుగానే ఇంజినీరు గారి మంచితనం గురించి, జీవితంలో జరిగిన సంఘటనలు గురించి ఏకధాటిగా ఒక గంట సేపు మాట్లాడుతూ ఉండిపోయారు. ఒక గంట తరువాత ఇంజినీరు గారికి ఏమీ పరవాలేదు తగ్గిపోతుంది అని చెప్పమన్నారు. సరిగ్గా అదే గంటలో డాక్టర్లు నాన్న ప్రాణం నిలబెట్టటానికి అన్నివిధాలా ప్రయత్నం చేస్తున్నారు. నాన్నగారు ఆ మాట అన్న క్షణంలో డాక్టరు మా దగ్గరికి వచ్చి ప్రమాదం లేదు, నెమ్మదిగా కోలుకుంటారు అని చెప్పారు. నాన్నగారే ఆయన్ని కాపాడారు.

దాదాపు ఒక సంవత్సరం తరువాత నాన్నగారు దీపోత్సవానికి విశాఖపట్టణం వెళ్లారు. నాన్న కొన్ని వ్యవహారాల మధ్య ఉన్నారు. ఒక్కసారిగా ఆయనకి నాన్నగారిని చూడాలని తపన కలిగింది. నాకు వెళ్ళటం కుదరక ఆయన ఒంటరిగానే ప్రయాణం అయ్యారు. నేను రెండు మూడు రోజుల తరువాత వస్తానన్నాను. మా తమ్ముడి అత్తగారి ఇంటికి వెళ్ళి, అక్కడి నుంచి నాన్నగారిని కలిశారు. తమ్ముడి అత్తగారు రాజ్యంగారు కూడా నాన్నతో వెళ్ళారు. ఆవిడ నాన్నని - నాన్నగారు ప్రేమతో ముంచెత్తటం, నాన్న పై చూపించిన ప్రత్యేకమైన శ్రద్ధ, ఆప్యాయత చూసి, సంతోషంతో మాకు ఫోనులో  చెప్పారు. దీపోత్సవం తరువాత నాన్నగారిని కలవటానికి నాన్న శ్యామలగారి ఇంటికి వెళ్లారు. ఆ రోజు సాయంత్రం ఆయన హైదరాబాద్ తిరుగు ప్రయాణం. నేను నాన్నని అక్కడే రెండు రోజులు ఉండమని, నేను వచ్చాక ఇద్దరం కలిసి హైదరాబాదు తిరిగి రావచ్చని ఎంతగానో అడిగాను. నాన్నగారు కూడా చాలా సార్లు ప్రయాణం మానేయమని, బేబీ వచ్చేవరకూ ఉండమని అడిగారు. ఏవో పనులు ఉన్నాయి వెళ్లిపోవాలి అన్నారు నాన్న. కానీ జరగబోయేది నాన్నగారికి తెలుసు కదా! బయలుదేరే టైము అయ్యింది.

నాన్నగారు మళ్ళీ అడిగారు ఉండిపొమ్మని. నాన్న త్వరలో మళ్ళీ వస్తాను అన్నారు. తరువాత రాజ్యంగారు మాకు చెప్పారు – నాన్నగారు లేచి వచ్చి నాన్నని గాఢంగా కౌగలించుకున్నారని, నాన్నని వదల లేనట్టు చాలా సేపు పట్టుకొని ఉండపోయారని చెప్పారు. నాన్నగారి ప్రేమ ఆవిడ హృదయాన్ని కదిలించింది. అక్కడినుంచి బయలు దేరి సామాను తీసుకొని స్టేషనుకి వెళుతున్నంత సేపు నాన్న తట్టుకోలేని ఆనందం, తన్మయత్వంలో ఉండిపోయి ఆపులేకుండా మాట్లాడుతుంటే, రాజ్యం గారు ఆయనకి నీరసం వస్తుందేమో అని భయపడ్డారట. హైదరాబాదులో ట్రైన్ దిగి బరువైన పుస్తకాల సంచితో ప్లాట్ ఫామ్ మీద నడుస్తూ పడిపోయారు. అక్కడ పోర్టరు జేబులో మా ఫోను నంబరు చూసి మాకు ఫోను చేశాడు. హాస్పిటల్ లో కొన్ని రోజులు కోమాలో ఉండి, డిసెంబర్ 2 న స్వర్గస్తులయ్యారు. నాన్న హాస్పిటలు లో ఉన్నన్ని రోజులు నాన్నగారికి కబురు చెపుతూనే ఉన్నాము. నాన్నగారు నాతో బెంగ వద్దు, కంగారు వద్దు, జాగ్రత్తగా చూడు. నీ డ్యూటీ నువ్వు చెయ్యి అని చెప్పారు.

తరువాత కొంత కాలానికి నాన్నగారు గయ యాత్రకి వెళ్లినప్పుడు - కుటుంబ పెద్దలకి, పూర్వీకులకి పిండప్రదానం చేస్తూ కూడా ఉన్న భీమవరం జయ గారితో, మన భక్తుల ఎవరైనా స్వర్గస్తులైన వారి పేర్లు చెప్పమన్నారట. ఇంజినీరుగారి పేరు చెపితే, ఆయన నాకు గుర్తు ఉన్నారమ్మా ఎప్పుడూ నా హృదయంలోనే ఉంటారు అన్నారట. ఈ విషయం తరువాత ఆవిడ మాకు ఫోన్ చేసి చెప్పారు. ఈ మాటలు చాలు నాన్నగారికి ఆయన పట్ల ఎంత ప్రేమ ఉందో!

నాన్నకి నాన్నగారితో ఉన్న అనుబంధం 1991లో మొదలై డిసెంబర్ 1999 స్వర్గస్తులయ్యేవరకూ పది సంవత్సరాలపాటు కొనసాగి, శరీరం పోయినా కొనసాగుతూనే ఉంది. చివరి 4-5 ఏళ్లలో నాన్నగారి పట్ల విశ్వాసం పెంచుకోమని, ఆయనని వదిలిపెట్టవద్దు అని నాన్న తరచూ నాకు చెప్పేవారు.



ఏదైనా సమస్యకి సలహా అడిగితే, నాన్నగారి తో మాట్లాడు ఆయన ఎలా చెపితే అలా చెయ్యి అనేవారు. ఏది మంచో ఆయనకి తెలుసు భారం ఆయన మీద వెయ్యి అనేవారు.

నాన్న పోయిన కొన్ని నెలల వరకూ నాన్నగారు ఎక్కువగా ఆయనని తలచేవారు. ఇంజినీరు గారు అప్పుడే వెళ్ళిపోయారు. ఇంకో పది సంవత్సరాలు ఉండాలి ముందే వెళ్ళిపోయారు అంటూ ఉండేవారు. ఎందుకు ఇలా అంటున్నారు అనుకునేవాళ్ళం. నాన్న పట్ల లోతైన ప్రేమ, వారి ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం ఈ మాటల ద్వారా వ్యక్తమవుతోంది అనిపించింది. 2006 వ సంవత్సరంలో, ఒకసారి జిన్నూరు వెళ్ళాను. నాన్నగారితో సంధ్యగారి ఇంటి షెడ్డులో కూర్చున్నాము. డాక్టర్ రామరావుగారు, చక్రపాణి గారి లక్ష్మి, సంధ్య గారు, కొద్దిమంది భక్తులు ఉన్నారు. నాన్నగారు నాన్న గురించి మాట్లాడటం మొదలు పెట్టారు. ఆయన గురించి వివరాలు, నాన్నగారికి తెలిసినవే మళ్ళీ మళ్ళీ అడిగారు. తరువాత అన్నారు - ఇంజినీరు గారిది మంచి మనసు, పవిత్రమైన మనసు. ఆయన ఇంకా మంచి జన్మలకి వెళ్ళాలి. అది నేను చూసుకుంటాను... ఆయనని నేను చూసుకుంటాను... అన్నారు నాన్నగారు!

# నాన్నగారు గొప్ప వరం, అనుగ్రహం

## (శ్రీమతి ఇందిరా గారు)

**ఇందిర గారికి, నాన్నగారికి మధ్య ఉన్న అనుబంధం గురించి వారి కుమార్తె శ్రీదేవి ( బేబి ) గారు తెలియజేసిన విషయాలు :**

మా అమ్మగారు శ్రీమతి ఇందిర గారు హైదరాబాద్ మొదటి భక్తులలో ప్రముఖులు. అమ్మ, మా పిన్ని కృష్ణ నాన్నగారి దర్శనానికి, ప్రవచనాలకి కలిసి వెళ్ళేవారు. మా అమ్మకి భక్తి ఎక్కువ, పూజలు క్రతువులు అంటే ఎక్కువ ఇష్టం. ఆవిడకి పదిమంది తో కలిసి సరదాగా గడపటం, స్నేహితుల్ని కలవటం ఇష్టం (మా నాన్నకి, నాకు పూర్తిగా వ్యతిరేకం). బంధువులకి, స్నేహితులకి ఆతిధ్యం ఇచ్చి వాళ్ళకి భోజన ఏర్పాట్లు, వాళ్ళ అవసరాలు చూడటం ఆవిడకి నచ్చే పని! ఊరినుంచి వైద్యం కోసం వచ్చే బంధువులని ఆప్యాయంగా ఆహ్వానించేవారు. నాన్న వాళ్ళని హాస్పిటలుకి తీసుకెళ్తే, ఇంట్లో వాళ్ళకి ఇబ్బంది కలగకుండా అమ్మ చూసేవారు. ప్రేమగా ఆప్యాయంగా చూస్తారని, స్నేహంగా ఉంటారని అందరికీ ఆవిడపై ఇష్టం ఉండేది. ఒక్కోసారి ఆవిడ శక్తికి మించిన పనులు కూడా చేసేవారు. చేయగలను అనే పట్టుదల, నాన్నగారు చూసుకుంటారు అని విశ్వాసంతో అనుకున్నది సాధిస్తారు.



మా అమ్మ ద్వారానే నాన్న, నేను నాన్నగారిని మొదటి సారి కలుసుకున్నాము. ఆయన దివ్యమైన సమక్షం మాకు దొరకటానికి ఆవిడే కారణం. అందుకు నా తల్లి పట్ల నేను ఎప్పుడూ కృతజ్ఞతగానే ఉంటాను. మరి కొంతమంది భక్తులు కూడా ఆవిడ ద్వారానే నాన్నగారిని కలిశారు. ఆవిడతో పాటు కొత్త భక్తులని అరుణాచలం తీసుకువెళ్ళి వాళ్ళకి అన్నీ చూపించేవారు. చాలా సంవత్సరాలుగా ఇంటిలో సత్సంగం నడుపుతూ, ప్రతి సోమవారం ఆవిడ ఊరిలో ఉన్నా లేకపోయినా సత్సంగానికి ఆటంకం లేకుండా చూసుకుంటున్నారు.

నాన్నగారు ఎన్నుకొన్న టీచర్లు, నాన్నగారి మాటలను భక్తులతో పంచుకోవటానికి ఇందిర గారి సత్సంగం ఒక వేదికగా ఉపయోగ పడింది. గురుపూర్ణిమ, నాన్నగారు-భగవాన్ పుట్టినరోజులు, దీపోత్సవం వంటి వేడుకలు జరుపుకోవటానికి కూడా ఎస్.ఆర్. నగర్ సత్సంగం ఉపయోగపడింది.

అమ్మ గురి ఎప్పుడూ తన గురించి చూసుకోవటం కంటే, భక్తులకి నాన్నగారి దర్శనం కలిగేలా చేయటం, వాళ్ళు ఆయన సమక్షంలో గడపటానికి అవకాశం ఇవ్వటం మీదే ఎక్కువగా ఉండేది. గంటల తరబడి నాన్నగారి సమక్షం కోసం ఎదురుచూసే భక్తులకి ఉండటానికి చోటు, వాళ్ళకి  వండిపెట్టడం, వాళ్ళకి కావాల్సిన సదుపాయాలు ఇవ్వటంలో ఆవిడ చెప్పలేని ఆనందం పొందేవారు. నాన్నగారు హైదరాబాద్ వచ్చిన్నప్పుడల్లా ఉండటానికి  యెస్. ఆర్. నగర్ లో మా ఇంటిని ఎన్నుకున్నారు. అది ఆవిడ భక్తులకి చేసిన సేవకి ఫలితంగా లభించిన గొప్ప వరం, అనుగ్రహం!

దాదాపు పది సంవత్సరాలు, 2017 వరకూ భక్తుల కోసం హైదరాబాద్ వచ్చినప్పుడల్లా నాన్నగారు మా ఇంటిలో ఉండేవారు. ఇక్కడ భక్తులకి అనుకూలంగా ఉంటుంది, అందుకే ఇక్కడికి వస్తున్నాను అనేవారు. నాన్నగారు తమ భక్తుల సంస్కారాలు, మనస్తత్వాలను బట్టి అనేక విధాలుగా వారిపై ప్రేమ, అనుగ్రహం కురిపించేవారు. హైదరాబాద్ వచ్చినప్పుడు మా ఇంటిని తన ఇంటిగా చేసుకొని, అమ్మకి ఇష్టమైన పని చేసే అవకాశం కల్పించారు. భక్తుల కోసం పని చేయటం ద్వారా ఆవిడకి ఉన్నత స్థితి ఇచ్చి అనుగ్రహించారు.

పిన్ని (కృష్ణ) ధైర్యంగా ఒక్కరే వెళ్లలేక పోతే, అమ్మ తనని వెంట పెట్టుకుని వెళ్ళేవారు. నాన్నగారు మీ అక్కాచెల్లెళ్ళు కలిసికట్టుగా ఉంటారు అనేవారు. ఇద్దరికీ నాన్నగారి పట్ల చాలా భక్తి, విశ్వాసం. పిన్నికి రెండు సార్లు ప్రాణాంతకమైన అనారోగ్యం చేసినా నాన్నగారి దయతో బయట పడ్డారు. రెండు సార్లు  ఆవిడ జబ్బుతో బాధపడుతున్నప్పుడు, నాన్నగారు పక్కనే ఉండి కాపాడినట్టు ఆవిడకి స్పష్టంగా అనుభవం అయ్యింది.

# సాక్షాత్తు పరమశివుడే మన నాన్నగారు

## (లేట్ భానుగారు)

భాను గారికి ఆయన స్నేహితుడు అయిన బ్రహ్మాజీగారి ద్వారా, నాన్నగారితో పరిచయం ఏర్పడింది. వారు ఇద్దరూ పుట్టపర్తి సాయి భక్తులు. పుట్టపర్తిలో అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఒకసారి బ్రహ్మాజీ గారు భాను ప్రసాద్ గారిని నాన్నగారి దగ్గరకు తీసుకుని వెళ్ళారు. గురువు తన బిడ్డలని తన దగ్గర కి ఏదో ఒక విధంగా చేర్చుకుంటారు. నాన్నగారు అలా బ్రహ్మాజీ గారి ద్వారా భాను ప్రసాద్ గారిని తన దగ్గరకు చేర్చుకున్నారు.



భాను గారి దృష్టిలో నాన్నగారు అంటే ఒక గురువే కాదు, సాక్షాత్తు ఈశ్వరుడే అనటానికి ఒక చిన్న ఉదాహరణ: భానుగారు ఆయన కుమార్తెతో నాన్నగారు గురించి ఒక ఉత్తరంలో ఈ విధంగా పంచుకున్నారు. "నాన్నగారు మనకు మనస్ఫూర్తిగా ఏమి కావాలంటే అది ఇస్తారు. ఎందుకంటే ఆయన సాక్షాత్తు శివుడు. దేవుడు రక్తమాంసాలతో ఉన్నాడు. ఆయనే నాన్నగారు" అన్నారు. ఇంతకంటే ఆయన గురించి మనము ఏమి చెప్పగలము? మనలో ఉన్న ప్రతి ఆలోచన ఆ ఈశ్వరుడికి ఎలా తెలుస్తుందో, అలాగే భానుగారి మనస్సులో ఉన్న ఆ ఆలోచన నాన్నగారికి తెలిసి భాను గారినే కాకుండా, వారి కుటుంబాన్ని కూడా ఎంతో ప్రేమతో చూసేవారు. భాను గారికి నాన్నగారు, అరుణాచలం ఇవి రెండే ప్రపంచం. ఎవరైనా ఆ రెండిటి గురించి మాట్లాడటం మొదలు పెడితే ఆయనకు వేరే లోకం తెలిసేది కాదు. భాను గారు భీమవరంలో ఉన్నప్పుడు, ప్రతి ప్రవచనానికి నాన్నగారిని దగ్గర ఉండి తన కారులో తీసుకొని వెళ్ళేవారు. భాను గారికి ఉద్యోగరీత్యా చిత్తూరు బదిలీ అయింది. Promotion కూడా వచ్చింది.

కానీ ఆయన నాన్నగారికి దూరంగా వెళ్ళవలసి వస్తుంది అని భాదపడి వెళ్ళటానికి ఇష్టపడలేదు. కానీ నాన్నగారు దానిని అంగీకరించకుండా మీరు వెళ్ళాలి భానుగారు అన్నారు. ఆ తరువాత నుండి భానుగారు, నాన్నగారు తరుచూ కలుసుకోకపోయినా,  వారి ఇరువురి మధ్య ఒక మానసిక అనుబంధం కొనసాగుతూ వచ్చింది.

భాను గారు చిత్తూరులో ఉన్నప్పుడు భక్తులు గాని, కుటుంబ సభ్యులు గాని ఎవరైనా వస్తే మాత్రం, ఆయన దగ్గరుండి వారిని అరుణాచలం తీసుకు వెళ్ళేవారు.

ఒకసారి భానుగారు భీమవరంలో ఉన్నప్పుడు హైదరాబాద్ లక్ష్మి భానుగారి ఇంటికి వచ్చారు. లక్ష్మి గారు కూడా ఎంతో ప్రేమతో భానుగారికి వారి తండ్రి స్థానాన్ని ఇచ్చేవారు. భాను గారు కూడా లక్ష్మీ గారిని పెద్ద కూతురు అనేవారు. ఒకసారి లక్ష్మీ గారితో భాను గారు ఒక మాట అన్నారు. "లక్ష్మీ నాకు ఒక్క కోరిక తప్ప, ఇంకే కోరికా లేదు. అదేమిటంటే, నా దేహము నా తల్లిదండ్రుల కంటే, నా గురువు కంటే ముందే వెళ్లిపోవాలి" అన్నారు. ఆ మాటలు ప్రక్కన ఉన్న వారి కుమార్తె విని, ఏంటి నాన్న ఇలా అంటున్నారు అనుకున్నారు. సంవత్సరాలు గడిచాయి. భాను గారి మనసులో ఆ కోరిక ఎంత బలంగా ఉందో కానీ,  భగవంతుడు కూడా ఆయన కోరిక తీర్చాడు. భానుగారు ఆయన తల్లిదండ్రుల కంటే, గురువు కంటే ముందే తమ దేహాన్ని విడిచిపెట్టారు.

భానుగారికి accident అయ్యి హాస్పటల్లో ఉన్నప్పుడు నాన్నగారు చూడటానికి వచ్చారు. అప్పుడు కూడా ఆయన నాన్నగారితో ఇంత కష్టపడి ప్రయాణం చేసి వచ్చారా నాన్నగారూ..! మీరు ఎందుకు ఇంత శ్రమ తీసుకుంటున్నారు..? అన్నారు. భాను గారు నాన్నగారు ఏమైనా ఇబ్బంది పడతారనిపిస్తే చాలా బాధ పడేవారు. ఆయన చివరి రోజులలో మందులతో, శారీరక ఇబ్బందులతో ఉన్నప్పుడు కూడా భగవంతుడు నాకు ఈ పరిస్థితి కల్పించాడు అని ఎప్పుడూ అనేవారు కాదు. ఇది నా ప్రారబ్ధము, నేనే అనుభవించాలి అనేవారు.

ఒక గురువుతో ఎలా ఉండాలి అనేది భాను గారిని చూసి నేర్చుకోవచ్చు. గురువు పట్ల ఆయన చూపించిన భక్తి, విశ్వాసము ఈరోజుకీ వారి కుటుంబాన్ని కాపాడుతున్నాయి. భానుగారు చనిపోయిన సంవత్సరానికి ఆయన భార్య విజయలక్ష్మి గారికి kidney problem వచ్చి మరణం అంచుల దాకా వెళ్లారు. డాక్టర్లు లాభం లేదు, బతికే అవకాశం లేదు ఇంక చివరి రోజులు అన్నారు. వారి కుమార్తెకు, నాన్నగారి గురించి తండ్రి తనతో పంచుకున్న వాక్యాలు గుర్తుకు వచ్చాయి. వెంటనే నాన్నగారికి ఫోన్ చేసి విషయం చెప్పి దుఃఖపడ్డారు. నాన్న వెళ్ళిపోయారు. ఇప్పుడు అమ్మకి కూడా ఏమైనా అయితే మాకు పెద్ద దిక్కు ఎవరు నాన్నగారూ... అని అడిగారు. వెంటనే నాన్నగారు బాధపడకమ్మా..! నాలుగు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి అన్నారు. ఆ మాటలు ఆమెకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి. కానీ ఆ పరిస్థితిలో మాత్రం doctors లాభం లేదు అన్నారు. కానీ చివరకు నాన్నగారు చెప్పినట్లు నాలుగు రోజుల్లోనే విజయలక్ష్మి గారి kidney function సెట్ అయింది. ఈ రోజు ఆవిడ కుటుంబ సభ్యుల మధ్య జీవించి ఉన్నారంటే, అది కేవలం గురువు అనుగ్రహం. గురువుని మనస్ఫూర్తిగా వేడుకుంటే ఆయన మన కోసం ఏదైనా చేస్తారు అని భానుగారు ఎప్పుడు చెప్పేవారు. నాన్నగారు భానుగారి పై ఉన్న ప్రేమతో వారి కుటుంభాన్ని ఈ రోజుకీ కాపాడుతూనే ఉన్నారు.



# నాన్నగారు మాకు ఇవ్వబడిన బహుమతి

## (లేట్ లక్ష్మిగారు)

నాకు బాహ్యంగా జీవితంలో ఏ లోటూ లేదు. కాని ఏదో వెలితి! జీవితం ఇంతేనా అనిపించేది. ఆ సమయంలో మా అమ్మమ్మగారు చనిపోయారు. విపరీతమైన దుఃఖం. ఏమిటీ జీవితం? ఎందుకు పుడుతున్నాం? ఎందుకు మరణిస్తున్నాం? మరణాంతర జీవితం ఏమిటి? ఒకటే ఆలోచనలు. ఆ పది రోజులు, భగవంతుడా! నువ్వంటే నాకు తోడురా అని ప్రార్థించేదాన్ని.

1990 ఫిబ్రవరి 9, నా జీవితం లో మరచిపోలేని రోజు. నా స్నేహితురాలు పుష్ప "అమృతవాక్కులు" అనే పుస్తకం ఇచ్చి చదవమంది. నేను తీసిన



పేజీలో "నీ దేహమే నీది కానప్పుడు ఈ లోకంలో ఏది నీదంటావు?" అన్న వాక్యం చదివిన వెంటనే ఆలోచన మొదలయింది. అమ్మమ్మ పోయారే అని బాధ పడుతున్నానేమిటి? నా దేహమే నాది కానప్పుడు, దీన్ని కూడ ఒక రోజు వదిలెయ్యాలి కదా! ఎంత అద్భుతంగా ఉంది. పుస్తకము మీద "నాన్నగారు" అనే పేరు చదివాను. నాన్నగారెవరు? అని అడిగాను. నాన్నగారు జిన్నూరులో ఉంటారు తీసుకెళతాను వస్తావా? అని మా తాతయ్య చెల్లెలు అన్నారు. ఆ వాక్యం చదివిన అరగంట లోనే జిన్నూరు బయలు దేరాను. అది నేను ఆనందమయ జీవితంలోకి ప్రవేశించే రోజని, నాకు ఆ రోజు తెలియదు.

నాన్నగారింటికి వెళ్లి వారి పాదాలకు నమస్కరిస్తుంటే ఏదో తెలియని ఆనందం కలిగింది. మామ్మగారు నాన్నగారికి పరిచయం చేస్తూ లక్ష్మి "అమృత వాక్కులు" చదివి ఆ పుస్తకాల కోసం వచ్చిందన్నారు.

నాన్నగారింటికి వెళ్లి వారి పాదాలకు నమస్కరిస్తుంటే ఏదో తెలియని ఆనందం కలిగింది. మామ్మగారు నాన్నగారికి పరిచయం చేస్తూ లక్ష్మి “అమృత వాక్కులు” చదివి ఆ పుస్తకాల కోసం వచ్చిందన్నారు. ఏం చదివావమ్మా అన్నారు నాన్నగారు. “నీ దేహం నీది కానప్పుడు ఈ లోకం లో నీదంటూ ఏముంది?” ఆ మాట నాకు చాలా నచ్చిందన్నాను. ఒక్క మాట చదివి వచ్చావామ్మా.. లక్ష్మీ..! అన్నారు. అమ్మా లక్ష్మీ అంటూ ఏడెనిమిది సార్లు పిలిచారు. ఆ పిలుపు వింటుంటే నా 23 ఏళ్ల జీవితం లో ఎవ్వరూ అంత ప్రేమ గా పిలవలేదు అనిపించింది. నాన్నగారి దగ్గర ఒక అరగంట ఉండి వచ్చేసాను. ఆ రాత్రంతా "అమృతవాక్కులు" "నాన్న ఉవాచ" చదివాను. ఒక్కొక్క మాట చదువుతూ ఉంటే తెలియని లోకాలకు తీసుకెళుతున్నట్టు అనిపించింది.

ఆ తరువాత నుండి నాన్నగారి పుస్తకాలలో చదివిన మాటలు, నాన్నగారి గొంతుతో వింటున్నట్టు ఉండేవి. పువ్వులు కోస్తూ ఉంటే “దేవుని పాదల వద్ద నీ అహంకారమనే పుష్పం పెట్టమ్మ” అని వచ్చేది. ఏదైనా పని అయిష్టంగా చేస్తే "ఇష్టంగా చెయ్యి. కొత్త వాసనలు రావు. పాత వాసనలు పోతాయి." అని నిరంతరం హృదయంలో నుండి గైడెన్స్ వచ్చేది.

ఒక ప్రవచనం లో నాన్నగారు "మీ హృదయం లో భగవంతునికి చోటివ్వండి" అన్నారు. అయితే నాకు భగవంతుడిని తలచుకోవడం, స్మరించుకోవడం వలన మాత్రమే హృదయం ఖాళీ అవుతుంది అనిపించలేదు. నా మనస్సులో తలంపులు ఎంత సేపు అణిగితే అంత సేపు హృదయం ఖాళీ అవుతుంది. అప్పుడే భగవంతునికి చోటిచ్చినట్టు అనిపించింది. నాన్నగారు చెప్పే అమృత స్థితి పొందకుండా మనస్సే అడ్డు వస్తోంది. ఆ మనస్సుని పట్టించుకోకు అని నాన్నగారు చెప్పిన మాట నాకు చాలా ఇష్టం. సాధన మనసే చేస్తోంది.. అదే చెప్పుకుంటుంది.. అదే పెరిగిపోతుంది..! ఒక సారి నాన్నగారితో కారులో వెళ్తూ, దేహం తో తాదాత్మ్యం వల్లనే కదా ఇన్ని బాధలు నాన్నగారూ అన్నాను. అవునమ్మా "ఆ తాదాత్మ్యం పోగొట్టుకోవడం పెద్ద కష్టం కాదు.

నీకు ఎవరింటికైనా వెళ్ళాలనిపిస్తుందనుకో అదీ ఒక తలంపే కదా! దాన్ని తలంపుగా ఎలా చూస్తున్నావో, అలాగే ఈ దేహం నేననేది కూడ ఒక తలంపులా చూడు. ఆ తలంపులో నుండి విడుదల పొందితే ఇప్పుడే ఇక్కడే జ్ఞానం పొందవచ్చు" అన్నారు.

నాన్నగారి బోధ నిజతత్వానికి మనల్ని చేరుస్తుంది. ఆ చేరుకోవటానికి వచ్చే అనేక అడ్డంకుల్ని వివిధ కోణాల్లో మనసుకి హత్తుకునేటట్లు నాన్నగారు చెపుతారు. మనకి ప్రత్యేకించి ఇది పోగొట్టుకోమని చెప్పరు. కాని ఏవైతే అమృత స్థితి పొందకుండా అడ్డు వస్తూన్నాయో, ఆయన దయలో మనకి కూడా తెలియకుండా అవి రాలిపోతాయి.



భగవాన్ ని భుజాన వేసుకుని నాన్నగారు ఊరూరు, ఇల్లిల్లూ తిరుగుతూ పామరులలో సైతం నిజమేదనే ఆలోచన కలిగిస్తున్నారు. ఆయన ప్రేమ అపారం. ప్రతి ఒక్కరిని ఆ ప్రేమ బంధిస్తుంది. ఆయన ప్రేమ, ఆప్యాయత, జ్ఞాన బోధ, అనుగ్రహం... వీటి గురించి మనం మాటలలో చెప్పుకుంటే తక్కువ చేసిన వారము అవుతామనిపిస్తుంది. సృష్టిలో దేనితోనూ ఆయనని పోల్చలేము. "నాన్నగారు" అన్న నాలుగు అక్షరాలు నాలుగు వేదాల సారం.

ఒక రోజు అరుణాచలం శివాలయంలో కొత్త భక్తులు "ఈ రోజే నాన్నగారిని చూస్తున్నాం, వారి గురించి ఏమైనా చెప్పండి" అని అడిగారు. మీరు ఆలయం లో శివుడిని చూసి దైవ భావం తో పాటలు పాడారు.. నా దేవుడు నాన్నగారే! ఎందుకంటే ఎలా జీవించాలో, ఎలా శాంతి పొందాలో, ఎలా బంధం నుంచి విడుదల పొందాలో తెలిపింది నాన్నగారే. "నాన్నగారు నాన్నగారే..!!" అన్నాను.

నాన్నగారి ప్రతి మాట మనల్ని ఆలోచింప చేసి మనసుని పరిపక్వం చేస్తుంది. మనల్ని వెలుగు లోనికి తీసుకు వెళ్తుంది. ఆయన నోటి లోంచి వచ్చే ప్రతీ మాట నాకు చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంటుంది. ఈ తండ్రి రాక పోతే ఎమైపోదునో అనిపిస్తుంది. ఈ తండ్రిని మాకు ప్రసాదించినందుకు భగవాన్ కి కృతజ్ఞతలు చెప్పుకుంటాను. భగవాన్..! మేమంటే నీకు పక్షపాతం ఉంది.. ప్రపంచం లో ఎంత మంది భక్తులు లేరు నీకు? కాని నాన్నగార్ని మాకు ప్రసాదించావు. ఆ తండ్రి చైతన్య వైభవం బోధిస్తూ ఆనందాన్ని రుచి చూపిస్తూ తీసుకెళ్తున్నారు. తండ్రీ!! నీ అనుగ్రహం మా మీద ఉందనటానికి నిదర్శనమే నాన్నగారు!

అరుణాచలం, భగవాన్, నాన్నగారితో నాకు తెలియని సంకెళ్ళు పడ్డాయి. వారిని ప్రేమించాలని ప్రేమించలేదు. ప్రేమించకుండా ఉండలేక ప్రేమిస్తున్నాను.

“మనది జన్మాంతర సంబంధం అమ్మా” అన్నారు నాన్నగారు!



## విజయ గారి మాటల్లో లక్ష్మిగారి గురించి:



1992 లో లక్ష్మిని, నాన్నగారిని వరహాలరాజు గారి ఇంట్లో కలిసాను. నాన్నగారు నాతో, నువ్వు ఖాళీ సమయంలో లక్ష్మితో గడపమ్మా, భగవాన్ తో అనుబంధం ఏర్పడుతుంది అన్నారు. అలా లక్ష్మితో స్నేహం మొదలయ్యాక కాలం తెలిసేది కాదు. నాన్నగారు చెప్పినవి లక్ష్మి నాకు బాగా విడమర్చి చెప్పేవారు. నాన్నగారు ఇద్దరు స్నేహితుల గురించి చెబుతున్నప్పుడు ఉదాహరణగా లక్ష్మి, విజయలక్ష్మిలాగ అనేవారు. ఒకసారి నాన్నగారు ఎవరో ఇద్దరు స్నేహితులు విడిపోయారు అని చెప్పారు. అప్పుడు నేను లక్ష్మితో మనం విడిపోతామా లక్ష్మీ అన్నాను. అవన్నీ మనసు గొడవలు, మనకి కాదులెండి అన్నారు. మా ఇద్దరి స్నేహం చివరవరకు అలాగే వుంది.

నాన్నగారు వచ్చిన ప్రతిసారి  స్టేషన్ నుండి తీసుకురావటానికి లక్ష్మి, నేను కలిసి వెళ్ళేవాళ్ళం. లక్ష్మి నాన్నగారు వచ్చేముందు ఇంటికి రంగులు వేయించి, నాన్నగారికి అన్నీ కొత్తవి కొనిపెట్టేవారు. వంటలు చాలా రుచిగా ఉండటం కోసం తాజా కూరలు ప్రతి పూట తెచ్చి వండేవారు. నాన్నగారు ఉన్న పది రోజులు పండుగ లాగా ఉండేది. కొత్తవారు వస్తే థాంక్స్ చెప్పడానికి ఇంటి యజమాని ఎవరు? అని అడిగేవారు. మేము అందరం లక్ష్మిగారి ఇంట్లో సొంత ఇల్లులా అంత ఫ్రీగా ఉండేవాళ్ళం. మధురానగర్ లో లక్ష్మిగారి ఇంట్లో మాస్టర్ బెడ్ రూమ్ ని భగవాన్ గదిలా చేశారు.

లక్ష్మిని నాన్నగారు జిన్నూరుకు, హైదరాబాదుకు వారధి వేసేవమ్మ అన్నారు. ఒకసారి లక్ష్మి స్వప్నంలో నాన్నగారికి కాఫీ ఇచ్చారట. అప్పుడు లక్ష్మితో నాన్నగారు శాంతిగా ఉన్నావా? అని అడిగారట.

శాంతిగా ఉన్నాను అనేవాడు దొరకటం లేదు నాన్నగారూ.. అన్నారట లక్ష్మి. ఒకసారి నాన్నగారు లక్ష్మిని భగవాన్ వర్క్ బాగా చేస్తున్నావు అన్నారు. వాసనని బట్టి చేస్తున్నాను కదా నాన్నగారూ అన్నారు. Subject proper Understanding అమ్మా అన్నారు నాన్నగారు.

తలంపులు మొయ్యకండి, మనసుని పట్టించుకోకండి అని లక్ష్మి తరుచూ చెబుతూ ఉండేవారు. అవి వింటూ ఉంటే మా మనస్సులు తేలికపడేవి. ఒకసారి సెప్టెంబర్ 1st అని మాకు తెలియకుండానే, ఒక 20 మంది లక్ష్మి ఇంటికి ఏవో స్వీట్స్ తీసుకొని వెళ్ళాము. భగవాన్ గురించి చెప్పుకొని భోజనాలు అక్కడే చేసాము. నాలుగు గంటలకు వచ్చేస్తుంటే ఒక భక్తురాలు ఫోన్ చేసి ఈ రోజు భగవాన్ అరుణాచలం వచ్చిన రోజు అన్నారు. మాకు తెలియకుండానే ఆ రోజుని లక్ష్మి గారింట్లో బాగా జరుపుకున్నాము.



1991 వ సంవత్సరంలో లక్ష్మి, నాన్నగారు మరో పదిమందితో కలిసి దక్షిణాది యాత్రలకు వెళ్ళారు. లక్ష్మి గుడిలో పూజలు చేయకుండా నాన్నగారి దగ్గరే ఉండే వారు. ఒక భక్తురాలు నాన్నగారిని పూజలు చెయ్యకుండా జ్ఞానం వస్తుందా? అని అడిగారు. అప్పుడు నాన్నగారు - మన లక్ష్మి జ్ఞానమార్గంలో పూజ, జపం లేకుండా దూసుకెళ్తుంది కదా! అన్నారు. అరుణాచలం శివాలయంలో ఆంధ్రభక్తులు తన్మయంగా పాటలు పాడి తిరిగి వస్తూ బయట ఉన్న నాన్నగారిని, లక్ష్మిని చూసి ఆయన ఎవరు? అని లక్ష్మిని అడిగారు. మీకు ఆ శివుడిని చూస్తే ఎలా అనిపించిందో నాకు "నాన్నగారు" అలా అన్నారు లక్ష్మి. తరువాత నాన్నగారు ఒక అమ్మగారు నన్ను శివుడితో పోల్చారు. ఆమె విశ్వాసానికి నాకు శివుడినై పోవాలని ఉంది అని ఒక ప్రవచనంలో ప్రస్తావించారు.

మధురైలో లక్ష్మి పువ్వులు కొందామని వెళుతుంటే నాన్నగారు ఇది మన పని కాదమ్మా, మీనాన్నగారి ( లక్ష్మి తండ్రి ) పని అన్నారట. ఆ యాత్ర

నుండి తిరిగి వచ్చాక లక్ష్మి, అక్కడ జరిగిన విశేషాలు మాతో పంచుకుంటూ ఉంటే మేము కూడా ఆ యాత్రకి వెళ్ళినంత ఆనందం కలిగింది. 1992 లో నాన్నగారితో మేము ఒక 30 మంది కలిసి అరుణాచలం వెళ్ళాము. లక్ష్మి అరుణాచలేశ్వరుడుకి 30 మంది జీవులను ఆహారంగా తెచ్చింది అన్నారు నాన్నగారు.

ఆంధ్ర ఆశ్రమం ప్రారంభోత్సవానికి నాన్నగారు మమ్మల్ని సుందరం గారి ఇంటికి వెళ్ళి ఆహ్వానించి రండి అన్నారు. లక్ష్మి, నేను, పద్మ ముగ్గురం



కలిసి వెళ్ళాము. వారి ఇంట్లో ఉన్న భగవాన్ చెల్లెలి ఫోటో చూసి లక్ష్మికి ఎంతో కాలం తరువాత అందరిని చూశాను అనే భావం కలిగి తట్టుకోలేక కన్నీటి ధారలు ఆగలేదు. (ఎవరూ చూడకుండా నేను, పద్మ లక్ష్మికి అడ్డుగా నిలబడ్డాము). ఆశ్రమం ప్రారంభోత్సవం రోజు గృహప్రవేశం పూజ అయ్యాక లక్ష్మిని, పద్మని హారతి ఇమ్మన్నారు. పూజారి దోసిలితో చిల్లర డబ్బులను లక్ష్మి చెంగు పట్టమని వేస్తూ, భగవాన్ ఆడపడుచు కట్నం ఇస్తున్నాడు అన్నారు.

ఒక భక్తురాలు లక్ష్మితో, ఆశ్రమానికి ఏదయినా కొందామనుకుంటున్నాను ఏం కొనను? అని అడిగారు. మీరు ఏదైనా వస్తువుని ఇస్తే అది చూసి మనమే కొన్నాము అనే తలంపు వస్తుంది. ఆ తలంపు ఎందుకు? దనం ఇవ్వండి సరిపోతుంది అన్నారు. ఒకసారి దసరాకు లక్ష్మి భగవాన్ సమాధి దగ్గర కన్నీటితో నిలబడి, భగవాన్ కుటుంబంలో నన్ను ఎందుకు పుట్టించలేదని మనసు అడుగుతోందని నాతో చెబుతున్నారు.



వెంటనే లక్ష్మికి లోపల నుండి భగవాన్ ఇంక ఈ గడప దాటవా అనే స్ఫురణ కలిగించారు. అప్పుడు లక్ష్మికి అవును చావు పుట్టుకలు లేని స్థితి కదా పొందవలసినది అనిపించింది.

ఈలోపు రమణి అమ్మగారు వచ్చి లక్ష్మిని తాంబూలం తీసుకోమన్నారు. మేము బ్రాహ్మణులం కాదు అన్నారు లక్ష్మి. నువ్వు మా కుటుంబ సభ్యురాలిగా అనిపిస్తున్నావమ్మా అని తాంబూలం ఇచ్చారు. ఒకసారి లక్ష్మి అమెరికా వెళ్ళాలి అనుకున్నారు. ఏమి కొనాలి అనే తలంపులు వస్తున్నాయట. నాన్నగారు అమెరికా వెళ్ళాలనుకుంటే ఎలా ఉంటారు అనుకోగానే తలంపులు ఆగిపోయాయట! ఈ విషయం నాన్నగారితో చెబితే "ఎక్కడికి తలంపు వెళితే అక్కడ గురువుని పెట్టు, మనసు చచ్చి ఊరుకుంటుంది. గుణాల ఆట చూడు!" అన్నారు నాన్నగారు.

ఒకసారి లక్ష్మి వేణమ్మతో మీకు నాన్నగారు అంటే ఇష్టం అంటున్నారు కదా! Who am I ని ఇష్టం చేసుకోండి. తలంపులు లేని స్థితిలో నాన్నగారిని ఇష్టం చేసుకోండి అన్నారు. లోహ్యా గారి లక్ష్మి, లక్ష్మికి నీడలా ఉండేవారు. ఒకసారి జిన్నూరు లో నాన్నగారి పుట్టినరోజున అరుగు మీద అందరూ క్యూలో పళ్ళు ఇస్తున్నారు. లక్ష్మిని అక్కడే ఉన్న బిస్కెట్ ప్యాకెట్ ఇచ్చి క్యూలో రండి అన్నారు. నాన్నగారు భోజనానికి వెళ్ళివచ్చారు. లోహ్యా గారి లక్ష్మి బిస్కెట్ ప్యాకెట్ అక్కడ పెట్టి నాన్నగారికి దన్నం పెట్టుకున్నారు. నాన్నగారు ఈ బిస్కెట్ ప్యాకెట్ హైదరాబాదు నుంచి తెచ్చావామ్మా! అన్నారు. కాదు నాన్నగారూ ఇది మీ దగ్గర ప్యాకెట్ అన్నారు. నాన్నగారు నవ్వేసి బెల్లం వినాయకుడి కథ గుర్తు వస్తుందమ్మా వెరీ గుడ్ అన్నారు.

"మనం నిజం! మనం అనుకునేది నిజం కాదు! భగవంతుడు మనల్ని బాగా చూస్తున్నాడు అనేది ఒక తలంపు. చూడటం లేదని ఒక తలంపు. ఈ తలంపులకు above గా వెళ్ళాలి అని లక్ష్మి, లోహ్యాగారి లక్ష్మికి చివరి మాటలుగా చెప్పారు.

అరుణ, లత, పుష్ప... అందరికి లక్ష్మి మంచి స్నేహితురాలు. లతతో భగవాన్ ని హృదయంలో పెట్టుకోండి అని చెప్పారు. అరుణ ప్రతిరోజు లక్ష్మితో గడిపేవారు. నా జీవితానికి లక్ష్మి ఒక వరం అన్నారు పుష్ప.

ఒక ఆమె లక్ష్మిని ఎవరో మహాత్ములు వచ్చారు వారి దర్శనానికి వెళదాము అన్నారు. లక్ష్మి నాకు రావాలని ఉండదు అన్నారు. ఈ విషయం లక్ష్మి నాన్నగారిని అడిగారు. అలా పిలిచినప్పుడు వెళ్ళాలా నాన్నగారూ? వెళ్ళకుండా నేను తప్పించుకుంటున్నానా? అని అడిగారు. నాన్నగారు, నువ్వు ఇంట్లోనే మంచి కాఫీ చేసుకుంటే, ఇంక హోటల్ కి వెళ్ళాలి అనుకోవు కదా! అలాగే ఇది కూడా! సంతృప్తి గా ఉన్నప్పుడు వెళ్ళాలని అనిపించదు అన్నారు. నాన్నగారికి ఆరోగ్యం బాగాలేదని వైజాగ్ వెళ్ళారు. ఆ విషయం లక్ష్మికి తెలిసిన వెంటనే ఫ్లైట్ లో వైజాగ్ వెళ్ళిపోయారు. ఆ ప్రేమను మరచిపోలేనమ్మా అన్నారు నాన్నగారు!

గణేషన్ గారు లక్ష్మి ని వెరీగుడ్ ఆర్గనైజర్ అని మెచ్చుకుని, లక్ష్మి ఇంటిని మినీ రమణాశ్రమం అన్నారు. వెంకట్ రామన్ గారు లక్ష్మి ని నా ఫేవరెట్



డాటర్ పొన్ను (కూతురు) అని పిలిచేవారు, లక్ష్మి అంటే చాలా ఇష్టపడేవారు. సుందరం గారు, సుశీలగారు, మణి గారు, రమణ గారు అందరూ లక్ష్మి గారి ఇంటికి వచ్చారు. లక్ష్మి చనిపోయిన తరువాత ఉష కుంభమేళాకి వెళ్ళారు. అక్కడ పెద్దలు అందరకి పిండాలు వేశారంట. ఆ రాత్రి ఉషకి స్వప్నంలో లక్ష్మి కనబడి నన్ను మర్చిపోయావా అన్నారంట. మరుసటి రోజు ఈ విషయం ఉష ఫోన్ చేసి చెప్పారు.

ఆ తరువాత రోజు నేను జిన్నూరు వెళ్ళాను. ఉషకి వచ్చిన స్వప్నం గురించి నాన్నగారికి చెప్పి, మేము కుంభమేళా కి వెళ్తున్నాము పిండాలు వేయమంటారా నాన్నగారూ అని అడిగాను. నాన్నగారు వెనక్కి వాలిపోయి రెండు చేతులు హృదయం మీద పెట్టుకుని పిండాలు కోరకుందా..!!

లక్ష్మిని నాలో కలిపేసుకుందాము అనుకుంటున్నానమ్మా అన్నారు. తరువాత కాశీ నుండి తిరిగి వస్తున్నాము.. ఎయిర్ పోర్టులో నాన్నగారు వేణమ్మతో, లక్ష్మిని ఇండిపెండెంట్ హ్యాపీనెస్ లో కలిపి వేయడానికే, unbroken peace happiness కి తీసుకువెళ్ళటానికే ఈ ప్రయత్నం అన్నారు. లక్ష్మి జీవితానికి ఇంకేం కావాలి? ఎంత అదృష్టవంతురాలో కదా నాన్నగారు ఈ మాట అన్నారు అనుకున్నాము. చనిపోయాక సాధనలు ఏమీ చేయలేము కదా!

వాల్మీకి రిషి అవ్వకముందు చాలా పొరపాట్లు చేసాడు కదా! ఆ ప్రారబ్దం అనుభవించకుండా ఆయన ఋషి ఎలా అయ్యాడు?



అని నాన్నగారిని అడిగితే ఆ చెడు గురించి మాట్లాడుకున్నవారు పంచుకున్నారు అన్నారు. అలాగే లక్ష్మి విషయంలో జరిగిందనిపించింది. 4 సంవత్సరాలు అందరూ ఆమెని తలచి, తలచి పవిత్రం చేశారనిపించింది. ఆమె స్నేహితులు అయినందుకు మేము ఆరుగురం అదృష్టవంతులం. ఆమెతో మమ్మల్ని తలచారు, తిట్టారు, పొగిడారు. ఎంత అదృష్టవంతులమో అనిపిస్తూ ఉంటుంది. ఆ మధుర స్మృతులు తలుచు కొన్నప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. లక్ష్మి గారు మధురానగర్ లో ఇంటిలో ఉన్నప్పుడు మధురం అన్నారు నాన్నగారు. తరువాత నెక్టర్ గార్డెన్స్ లో కి వెళ్ళినప్పుడు, గృహప్రవేశం రోజు లక్ష్మితో - నెక్టార్ అమృతం  అమ్మా అన్నారు. లక్ష్మి చనిపోయాకా లక్ష్మి లేని హైదరాబాద్ వస్తున్నాను అని నాన్నగారు చాలాసార్లు అనేవారు.

## వేణమ్మగారి మాటల్లో లక్ష్మిగారి గురించి:

ఈ సృష్టిలో ఎవ్వరు ఇవ్వలేని ఆస్తిని (నాన్నగారిని) లక్ష్మి మాకు అందించారు. నాన్నగారు అంటే ఎందుకో... ఏమిటో...

ఆమె మాటల్లో విన్నాక ఆయన్ని వదులుకోలేము. నాన్నగారు అంటే ఏమీ తెలియని మాకు నాన్నగారిలోనే భగవంతుడిని దర్శింప చేశారు. మా మనస్సుని, మా జీవితాన్ని మాకు కాకుండా చేసారు. ఈ రోజు మా మనస్సుని పరిశీలించి చూసుకుంటే నిండా భగవాన్ ని, నాన్నగారిని నింపేసారు లక్ష్మి. మా జీవితం అంతా లక్ష్మి స్వాధీనంలో గడిపేద్దాం అనే భరోసాలో ఉండేవాళ్ళం. చివరికి మమ్మల్ని లక్ష్మి ఎలా తయారు చేసారంటే, ఇప్పటికీ లక్ష్మి మాటలేని సత్సంగం లేదు, లక్ష్మి గైడెన్స్ లేని రోజు లేదు. లక్ష్మి ఏది చెప్పినా వెంటనే దానిని నిరూపించి చూపేవారు.

లక్ష్మితో నాన్నగారు అంటే నాకు చాలా ఇష్టం అని చెప్పేదాన్ని. నిజంగా నాకు నాన్నగారంటే కారణం తెలియని ఇష్టం. ఒకరోజు లక్ష్మి చాలా



సీరియస్ గా నాతో "తలంపులు లేని స్థితిలో మీ హృదయంలో ఉన్న నాన్నగారిని ఇష్టపడి ఇష్టం అని చెప్పండి అన్నారు." మనసు చాలా బాధపడింది కానీ, పదిహేను రోజులలో నాకు స్పష్టత వచ్చింది. మనసుతో చేసేది ఏదీ ఎప్పటికీ ఒకేలా ఉండదని చెప్పారు. అప్పటినుంచి మనసుకి, హృదయానికి బేధం తెలిసింది. మన మనసుని ఆబ్జెక్ట్ గా చూస్తే ఎలా ఉంటుందో రోజూ ఏదో ఒక సందర్భంలో చెప్పేవారు.

లక్ష్మిని అరుణాచలం వెళ్ళినప్పుడు చూస్తే భగవానుని ఇంత ఇష్టపడి వచ్చిందా... అనిపించేది. చిన్నపిల్లలకి వాళ్ళకి ఇష్టమైనవి చేస్తే ఎలా ఉంటారో అలా ఉండేవారు. అరుణాచలంలో భూమిని, ఆకాశాన్ని, కొండని, గాలిని, నీరుని కూడా ఎక్కడ కోల్పోతానో అన్నట్టు చూస్తూ...

అంత ఆనందకరమైన అనుభూతిలో ఉండేవారు. ఆమెను చూసిన వాళ్ళకు కూడా మారు మనస్సు కలిగేది. ఇంగ్లీష్ బాగా వచ్చినవారు ఇంగ్లీష్ వాళ్ళతో మాట్లాడిన దానికంటే, లక్ష్మి తెలుగులో వాళ్ళతో మాట్లాడితే వాళ్ళకు బాగా అర్థం అయ్యేది. ఆమెకు "ఇది ఎలా సాధ్యం..!" అని అందరం ఆశ్చర్య పోయే వాళ్ళం.

అరుణాచలంలో భగవాన్ ను, భగవాన్ భక్తులను మాకు ఒక అద్భుతమైన రీతిలో చూపించేవారు. ఒక్కొక్కసారి ఆమె ఒక్కరే ఎక్కడికో వెళ్ళి కూర్చునేవారు. ఎందుకో మాకు తెలిసేది కాదు. అన్నింటికంటే ఆమెతో చేసిన గిరిప్రదక్షిణ అపురూపం! అరుణాచలేశ్వరుడితో ఆడుకునేవారు, పాడుకునేవారు. చాలామంది లక్ష్మితో కలిసి గిరి ప్రదక్షణ చేయాలి అని అడిగేవారు. ఎంతమందికి ఆ కోరిక తీరిందో తెలియదు. భగవాన్ తో ఆమెకు ఎంత అనుబంధం ఉందో, ఆశ్రమంతో కూడా అంతే అనుబంధం ఉండేది. ముఖ్యంగా వెంకటరామన్ గారితో ఆమెకు చాలా అనుబంధం ఉండేది. ఆయనతో చిన్న పిల్లవాడితో ఆడుకున్నట్టు ఆడుకునేవారు. అయన కూడా లక్ష్మిని ఎంతో గారాబం చేసేవారు. ఆయన చేసిన పనులన్నీ లక్ష్మితో చెప్పుకొని ఆనందపడే వారు. ఇవన్నీ చూసి మేము ఆనందపడేవాళ్ళం. ఆశ్రమంలో సాంబారు అన్నం ఆమె ఎంతో అపురూపంగా భుజించే వారు. ఇంట్లో ఎప్పుడూ అలా తినేవారు కాదు.

నేను పెద్దదాన్ని అవడం వల్ల లక్ష్మి నాతో - పెద్దవారు ఎలా జీవించాలో, ఎందుకు అలా జీవించాలో చెప్పేవారు. ఆమె చెప్పినట్టు జీవించటం మొదలుపెట్టగానే ఫలితం అద్భుతంగా ఉండేది. ఆమె నా కోసం ఏమి తెచ్చినా మా అమ్మకి అనేవారు. నా జీవితంలోకి నాన్నగారిని, భగవాన్ ని తీసుకురావడమే కాకుండా, నన్ను అమ్మ తో సమానంగా చూసుకున్న లక్ష్మి కి నేను ఏమి ఇవ్వగలను? భక్తుల పట్ల లక్ష్మికి ఉన్న అభిమానం మనం ఊహించలేము. మొదట్లో నాన్న గారు పది పదిహేను రోజులు ఉన్నా కూడా ఒక్క బెడ్ రూమ్ లోనే లక్ష్మి గారి భర్త అయిన రమేష్ గారు, వారి ముగ్గురు పిల్లలు ఉండేవారు. వారి ఇల్లంతా భక్తులతో నిండిపోయేది. లక్ష్మి

గారికి, రమేష్ గారికి తెలిసిన ప్రతి భక్తురాలు రుణపడి ఉంటారు. నాన్నగారు రూమ్ లోకి వెళ్ళిపోయిన తరువాత, లక్ష్మి రాత్రి రెండు గంటల వరకు భక్తులకి సబ్జెక్ట్ చెప్పి, రెండు గంటలకు పడుకునేవారు. మరల ఉదయం నుండి అదే తేజస్సుతో ఉండేవారు. భక్తులు ఎంతమంది వచ్చినా భోజనాలు, టిఫిన్లు



అన్ని చాలా జాగ్రత్తగా చూసుకునేవారు. ఎవరైనా వచ్చి నాన్నగారు, భగవాన్ అని అంటే చాలా ఇష్టపడేవారు. నాన్నగారు కూడా లక్ష్మిని భక్తురాలిగా చూసేవారు కాదు. నాన్నగారు కూడా జిన్నూరు లో ఉన్నంత సౌఖ్యముగా లక్ష్మి దగ్గర ఉండేవారు. ఇంట్లో భక్తులను చూసుకుంటూ ఆమె నాన్నగారికి వంట చేసేవారు. సబ్జెక్టు లో ఒక్క అక్షరం కూడా విడిచిపెట్టేవారు కాదు. ఒక మనిషికి లక్ష్మిలా ఉండటం అసాధ్యం అనుకునేదాన్ని. ఇప్పటికీ నాకు అలా ఉండటం ఎలా సాధ్యం? అన్న ప్రశ్నకి సమాధానం రాలేదు. లక్ష్మికి కృతజ్ఞతలు చెప్పి నేను రుణం తీర్చుకోలేను. లక్ష్మి చెప్పినట్టు జీవిద్దాం అనుకుంటే సాధారణ మనిషిని అయిన నాకు సాధ్యం  కాదు!


# నడిచే భగవద్గీత

## (లేట్ రమేష్ గారు)

భగవంతుడు ఎలా జీవించమని చెప్పాడో అలా జీవించిన వారిలో రమేష్ గారు ప్రముఖులు, శ్రేష్ఠులు !

రమేష్ గారి పూర్తిపేరు "యలమంచిలి బండి రమేష్" ఈయన 1972 జనవరి 29 న జన్మించారు. ఈయన తండ్రి దక్షిణామూర్తి శర్మ గారు, తల్లి పుష్పావతి గారు. ఈయనకు ఆధ్యాత్మిక జీవితం కుటుంబ వారసత్వంగా రాలేదు. ఆ కుటుంబంలో నుంచి ఆయన ఒక ప్రత్యేక వ్యక్తిగా లోకానికి తెలియబడ్డారు. తల్లి ద్వారా ఈయన భగవద్గీత నేర్చుకున్నారు. తరువాత ఆధ్యాత్మిక జీవితంలో అంచెలంచెలుగా విస్తరించారు.

ప్రారంభంలో సుందరచైతన్యానంద ప్రవచనాలు ఆయన ఆధ్యాత్మిక జీవితానికి పునాదిలాగ తోడ్పడ్డాయి. అప్పటినుంచీ ఆయన భౌతిక జీవితాన్ని భగవంతుని సేవకే వినియోగించాలని నిర్ణయించుకుని, ఉద్యోగ విరమణ చేసారు. వివాహం కూడా చేసుకోలేదు. ఏవిధమైన స్వార్థం లేకుండా ఇతరులకోసమే జీవించారు.




1995 లో భగవద్గీత అధ్యయనం చేయడం ప్రారంభించి ఒక సం॥ లో కంఠస్థం చేసి, చిన్న జీయరు స్వామి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ తీసుకున్నారు. రమేష్ గారు "బ్రహ్మశ్రీ అప్పలసోమేశ్వర శర్మగారి శిష్యులు" వారివద్ద భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలను అధ్యయనం చేసారు. 2010 లో షణ్ముఖశర్మ గారి ప్రవచనంలో "నరసింహ ఆవిర్భావ ఘట్టం" వినడం జరిగింది. తరువాత ఆయనకి నరసింహస్వామి దర్శనం అయ్యింది.

అప్పటి నుండి సింహాచల క్షేత్రంలో ప్రహ్లాదుని వైభవాన్ని ప్రచారం చేయడానికి విశేషమైన కృషిచేసారు.




సింహాచల క్షేత్ర ఆవిర్భావానికి కారకుడైన "భక్త ప్రహ్లాదుని" యొక్క విగ్రహ ప్రతిష్ఠ చేయాలనే సంకల్పంతో పాటు, ఆ క్షేత్ర ప్రజలలో ప్రహ్లాదుని భక్తితత్వాన్ని ప్రచారం చేయాలని కూడా నిర్ణయించుకున్నారు. అప్పుడు 2015 జనవరి నెలలో వారం రోజులపాటు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారిచేత "శ్రీ ప్రహ్లాద నృసింహ సర్వస్వం" అనే అంశము మీద ప్రవచనాలు ఏర్పాటు చేసారు. ఆ ప్రవచనాలను 2016 మే లో "భక్త ప్రహ్లాద చంద్రిక" అనే పుస్తకంగా రూపొందించారు.

2016 అక్టోబరులో విజయదశమి నాడు భక్త ప్రహ్లాదుని విగ్రహ ప్రతిష్ఠ చేయించారు. రమేష్ గారు నిర్వహించిన "ప్రహ్లాద విగ్రహ ప్రతిష్ఠ" కు నాన్నగారు సింహాచలం వెళ్ళడం కూడా జరిగింది. తరువాత 2019 జనవరి లో సింహాచల క్షేత్రంలో ముకుందకరావలంబమ్ ప్రవచనాలు షణ్ముఖశర్మగారితో చెప్పించారు. ఆ సందర్భంగా ముకుందకరావలంబ స్తోత్రాలకు, గ్రంథాల ఆధారంగా అద్భుతమైన వ్యాఖ్యానం రాసి, పుస్తక రూపంలో వెలుగులోకి తెచ్చి వాటిని అందరికీ పంచారు. 2018 జనవరి 23 న ఆయన హృదయంలో నుండి జ్ఞానం వాక్యరూపంలో ప్రవాహంలా మొదలై 1200 వాక్యాలు "ప్రహ్లాద జ్ఞాన వీచికలు" రూపంగా వెలుగు చూసి భక్తులందరికీ అందాయి.

తాను జీవితాంతం నేర్చుకున్న భగవద్గీత, రామాయణం, భారతం, భాగవతం శంకరుల అద్వైత సిద్ధాంతాలను ప్రహ్లాద తత్వంతో సమన్వయం చేసి - వాటిని భక్తి, జ్ఞాన, వైరాగ్యాలతో బోధించేవారు. అవి విన్నవారంతా బ్రహ్మానందాన్ని అనుభవించేవారు.

సద్గురు శ్రీ నాన్నగారి ద్వారా దైనందిన జీవితంలో నడవడిక ఎలా ఉండాలి అనేది నేర్చుకునేవారు. 2002 లో మొదటిసారి అరుణాచల యాత్ర చేసారు. రమణతత్త్వంపై కూడా ఆయనకి ఆసక్తి కలిగింది. అప్పటినుండి నాన్నగారితో అనుబంధం పెరిగింది. నాన్నగారు రమేష్ గారిని "నడిచే భగవద్గీత" అనేవారు. రమేష్ అంటే నాన్నగారికి ప్రత్యేకమయిన ఇష్టం! ఆయన శాస్త్ర పాండిత్యాన్ని కలిగి ఉండడంతో పాటు సంపూర్ణమైన భక్తి, వివేకాలతో జీవించేవారు. ఆధ్యాత్మిక గ్రంథాలన్నింటిమీదా, ద్వైతం, అద్వైతం అనే అంశాల మీద నాన్నగారు రమేష్ తో చాలా ఇష్టంగా చర్చించేవారు. ఎవరైతే నేను చెప్పింది అవగాహన చేసుకుని, దానిని అందరికీ అర్థమయ్యేలా బోధిస్తారో వాళ్ళు నాకు అత్యంత సన్నిహితులు అని కృష్ణుడు భగవద్గీతలో చెప్పిన విధంగా రమేష్ జీవించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో రమేష్ గారు చేసే కృషికి నాన్నగారు మెచ్చుకుంటూ, ఎంతో ప్రోత్సాహాన్ని అందించేవారు.

రమేష్ గారు 1998 నుండి సంపూర్ణంగా భగవంతుడి కోసమే జీవిస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ఆయన అనుకున్నది అనుకున్నట్టుగా చేసుకుంటూ వెళ్ళారు.



ఈయన బోధ 2010 లో పూర్ణానంద సమాజంలో 10, 15 సం॥ల లోపు పిల్లలతో మొదలైంది. తరువాత విధ్యాప్రకాశానందగిరి పేరుతో ద్వారకా నగర్ లో, భగవద్గీత క్లాసులు 2010 జనవరిలో, శ్రీ సంపూర్ణానందస్వామి చేతులమీదుగా ప్రారంభమయ్యాయి. తరువాత వాటిని, ఆ సంవత్సరం ఆగస్టు 5 నాటికి శివానంద ఆశ్రమంలోకి మార్చడం జరిగింది. అక్కడనుండి ఆయన సత్సంగాలు విస్తరించాయి. వారానికి 5 రోజులు క్లాసులకి, రెండు రోజులు సింహాద్రి నాథుడి దర్శనానికి కేటాయించేవారు. భక్తులతో సింహాచలం పౌర్ణమి ప్రదక్షిణలు చేస్తూ కూడా బోధించేవారు.

భక్తులకు ఫోన్లద్వారా కూడా సందేహనివృత్తి చేసేవారు. భగవద్గీత, రామాయణం, ఆదిశంకరుల అద్వైతగ్రంథాలు, రమణగ్రంథాలను బోధించేవారు. ఆయన చివరగా రమణుల "నేనెవడును" గురించి ప్రవచించారు.



గీతా ప్రచారసమితి, గీతా సత్సంగం అనే సంస్థలు నిర్వహించే త్రైమాసిక, అర్థసంవత్సర, వార్షిక, భగవద్గీత పోటీలకు ( చిన్నపిల్లల దగ్గరనుండి పెద్దవారి వరకూ ) రమేష్ ను న్యాయ నిర్ణేతగా పిలిచేవారు.

ఒక భక్తుడికి ఉండవలసిన లక్షణాలన్నీ రమేష్ గారిలో కనపడేవి. వినయంగా, సౌమ్యంగా, ఎవరినీ నొప్పించకుండా మాట్లాడేవారు. వైజాగ్ భక్తులకు ఆయన ఎంతో ఆప్తులుగా ఉండేవారు.

ఆయన పొందిన అనంత వస్తు జ్ఞానాన్ని అందరికీ పంచుతూ, అందరిచేతా "ఓం అనంతాయనమః" అని స్మరణ చేయించేవారు. ఆయన పొందిన జ్ఞానాన్ని భక్తి, జ్ఞాన, వైరాగ్యాలతో సమన్వయం చేసుకుంటూ, ఆయన దగ్గర చేరిన చిన్నవయసు యువకులకు, ఎందరో భక్తులకు ప్రతిరోజూ ప్రవచనాలద్వారా బోధించేవారు. ఆయన సంపూర్ణంగా, ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపి అందరికీ ఆదర్శప్రాయులయ్యారు. తను వచ్చిన పని పూర్తి చేసుకుని, దేహాన్ని ఆనందంగా విడిచిన మహనీయుడు శ్రీ రమేష్ కుమార్ గారు..!

# అందరి బంధువు


## (లేట్ బుజ్జి గారు)

"బుజ్జి" అనేది ఒక పేరు కాదు, భక్తులకు కలిగే ఒక అనుభూతి!

తెల్లవారుజామున నాన్నగారి పాదాలకు నూనె రాయడంతో బుజ్జి దినచర్య ప్రారంభమయ్యేది. రోజంతా నాన్నగారికి అవసరమయిన పనులన్నీ చేస్తూ, కన్నమ్మగారికి ఇంట్లోకి అవసరమైనవన్నీ తెచ్చిపెడుతూ వారి కుటుంబంలో సభ్యుడిలా పనిచేస్తూ ఉండేవాడు.

శ్రీ నాన్నగారిని దర్శించుకున్న భక్తులలో చాలామందికి బుజ్జి బాగా తెలుసు. భక్తులందరితో బుజ్జి సరదాగా, ఒక ఆత్మీయుడిలా ఉండేవాడు.

నాన్నగారి ప్రవచనాలు అన్నిటినీ రికార్డ్ చేసి, వాటిని ఆడియో క్యాసెట్స్



రూపంలో తీసుకువచ్చాడు. వాటిని భక్తులకి కొరియర్ చేస్తూ ఉండేవాడు. రమణ భాస్కర కవర్ పేజీ డిజైన్ పని కూడా ఆ టీమ్ తో కలిసి చేసేవాడు. రమణభాస్కర పుస్తకాలను కొరియర్ చేసేవాడు. రమణ కేంద్రంలో భక్తులెవరైనా బస చేసినప్పుడు వారికి కావాల్సిన సౌకర్యాలు - ఆహారము, వాటర్ బాటిల్స్... అన్ని ఏర్పాట్లూ దగ్గరుండి చూసుకునేవాడు. అవసరమైతే పాలకొల్లునుంచి పార్శిల్స్ తెచ్చిపెట్టేవాడు. వారంతా తిరిగి వెళ్ళేటప్పుడు స్టేషన్ లో ట్రైన్ ఎక్కేవరకూ బాధ్యత తీసుకునేవాడు. భక్తులకు ట్రైన్ లో తినడానికి పార్సిల్స్ కూడా తెచ్చిపెట్టేవాడు.

నాన్నగారు ఎక్కడికి వెళితే అక్కడికి కూడా ఉండి తీసుకు వెళ్ళడము, ఆయనతో పాటు కూడా వెళ్ళే భక్తులకు టికెట్స్ బుక్ చేయడము...

ఇలా అన్ని పనులలో నాన్నగారికి,  భక్తులకు మధ్య ఫోస్ట్ మేన్ లా పని చేసాడు. నాన్నగారితో ఎవరైనా మాట్లాడాలనుకుంటే బుజ్జికి ఫోన్ చేసేవారు. బుజ్జి నాన్నగారితో మాట్లాడి నాన్నగారు ఏమన్నారో భక్తులకు తెలియజేసేవాడు. అవసరమైతే భక్తులని నాన్నగారితో మాట్లాడించేవాడు. నాన్నగారి ఆరోగ్యానికి, సౌకర్యానికి ఇబ్బంది లేకుండా ఏ టైమ్ కి ఎవర్ని పంపాలి..? ఎవర్ని పంపకూడదు..? అనేది కూడా బుజ్జి చూసుకునేవాడు. ఇలా తను చేసే పనిలో ఎవర్నీ నొప్పించకుండా అందర్నీ సమన్వయం చేసుకుంటూ, వీలయినప్పుడు భక్తులకు ఆయన దర్శనం ఇప్పించేవాడు. నిజంగా కష్టాలలో, ఇబ్బందులలో ఉన్నవాళ్ళెవరైనా వస్తే వాళ్ళని ఆప్యాయంగా ఓదార్చి, ధైర్యం చెప్పి పంపేవాడు.



బుజ్జి మంచి భోజనప్రియుడు. వేడిగా ఉన్న రుచికరమైన పదార్థాలను తినడం ఇష్టపడేవాడు. అలాగే వాటిని అందరికీ పంచడంలో ఉన్న ఆనందాన్ని కూడా రుచి చూసేవాడు. నాన్నగారు ఆరోగ్యం బాగోలేనప్పుడు హాస్పిటల్ లో చేరితే రాత్రి, పగలు కాపలాగా ఉండేవాడు. రాత్రిళ్ళు నాన్నగారికి నిద్రపట్టకపోతే తనూ మేల్కొనే ఉండేవాడు. నాన్నగారు జరిపిన ఫంక్షన్స్ కి, ఆయన పుట్టినరోజు వేడుకలకి ముఖ్యమైన ఏర్పాట్లు బుజ్జి చూసేవాడు.



ఒకసారి నాన్నగారు భగవాన్ గురించి చెబుతూ అన్నారు: రమణాశ్రమంలో భోజనాల తరువాత, భగవాన్ టైమ్ తెలియకుండా అక్కడున్న భక్తులకు ఆధ్యాత్మిక విషయాలు చెబుతుంటే, ఒక పరిచారకుడు వచ్చి భగవాన్ వెనుక నిలుచుని ఇక వెళ్ళండి అని భక్తులకు సైగ చేసేవారట.

అలాగే బుజ్జి కూడా నాన్నగారి దగ్గర ఉన్న భక్తులకు వెళ్ళి రమ్మని సైగలు చేసేవాడు. బుజ్జి గురించి నాన్నగారు ఒక ప్రవచనంలో, "మా బుజ్జి ఏమంటున్నాడు అంటే, టైమ్ అవ్వగానే నేను మీకు చెబుతాను, అప్పుడు వెంటనే పుస్తకం అక్కడ పడేసి మీ దారిన మీరు వెళ్ళిపోండి, వినేవాళ్ళు వాళ్ళదారిన వాళ్ళు వెళ్ళిపోతారు. మీకు ఆతిధ్యం ఇచ్చేవాళ్ళు సుఖపడతారు అంటున్నాడు" అన్నారు.

ఒకసారి శ్రీశైలంలో నాన్నగారి సమక్షంలోకి కొంతమంది భక్తులను పంపడం, కొంతమందిని పంపకపోవడంతో భక్తులు నిరాశ చెంది బుజ్జితో, నాన్నగారికి అందరూ సమానమే కదా అన్నారట. అప్పుడు బుజ్జి నాన్నగారితో భక్తులు అన్నమాట చెప్పాడు. దానికి నాన్నగారు "హృదయంలో అందరూ సమానమే! కానీ భౌతికంగా అదెలా కుదురుతుంది?" అన్నారు. సాదారణంగా భక్తులందరం గురువుగారి దగ్గరికి పండ్లు తీసుకెళ్ళి, కాసేపు కూర్చుని ఆయన చెప్పింది విని, ఆయన అనుగ్రహాన్ని పొంది తిరిగి వస్తాము. కానీ ఒక జ్ఞాని దగ్గర నిరంతరం పని చేయడం అనేది సామాన్యమైన విషయం కాదు. వేరే విధంగా మనసులోని బలహీనతలతో అక్కడ పనిచేయడానికి ఆస్కారమే ఉండదు. అక్కడ చేసే పనులు కష్టమైనా నిమగ్నమై చేయాలి. భగవంతుడు ఈ ప్రక్రియలో... జీవుడుని రెండో కంటికి తెలియకుండా పవిత్రుడిని చేస్తాడు! అది బుజ్జి విషయంలో జరిగింది. దాదాపు 20 సం॥లు జ్ఞాని సమక్షంలో గడిపి ఆయనకు సేవ చేసే భాగ్యం, ఆయన భక్తులకు కూడా సేవ చేసే భాగ్యం బుజ్జికి దొరికినట్టుగా ఇంకెవరికీ దొరకి ఉండదు. బహుసా అందుకేనేమో! భగవంతుడు బుజ్జి అందరిలా ఈ లోకంలో జీవించడం సరయినది కాదని ఆయన లోకానికి తీసుకెళ్ళిపోయాడు.



"బుజ్జి, నాన్నగారి బుజ్జిగానే మనకందరికీ తెలుసు. ఇక నాన్నగారి బుజ్జిగానే మన జ్ఞాపకాలలో మిగిలిపోతాడు".

# నాన్నగారి ప్రేమ - విశ్వ ప్రేమ

## (లేట్ రాజశ్రీ గారు)



నాన్నగారు మన జీవితంలోకి వచ్చిన తరువాత మనం  ఒక్కసారి వెనుకకు తిరిగి చూసుకుంటే మన  జీవితం అంతా నాన్నగారే నిండి ఉంటారు. అంటే మన భౌతిక జీవితం మరియు ఆధ్యాత్మిక జీవితం ఆయన అధీనంలోకి వెళ్ళిపోయి ఉంటాయి. ఎంతో ప్రేమగా మనల్ని సరిచేస్తూ, మనల్ని శాంతిలో నిలబెడుతూ మన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ముందుకు తీసుకు వెళుతున్నారు.

నాన్నగారు తరుచుగా - మీ తెలివితేటలవలన మీరు ఇక్కడికి రాలేదు. దేహ ప్రారబ్ధాన్ని ఈశ్వరుడు ముందే నిర్ణయించాడు. అందువల్ల ఇక్కడికి వచ్చిన వాళ్ళు తెలివైనవాళ్ళని, ఇక్కడికి రానివాళ్ళు తెలివితక్కువ వాళ్ళని అనుకోవద్దు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే నిర్ణయమయిపోయింది మనం ఇక్కడ కూర్చుని సత్సంగం చెప్పుకోవడమనేది! మీకు పూర్వపుణ్యం తగినంతగా లేకపోతే, మీరు సరయిన గురువు దగ్గర కూడా పడలేరు అనేవారు.

భాగవతంలో,  అష్టమస్కందంలోని  గజేంద్రమోక్షములో ఒక  పద్యం గురించి  నాన్నగారు  చెప్పేవారు.  గజేంద్రుని  వేడుకోలు  అది..!

ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై,  
యెవ్వనియందు డిందు, పరమేశ్వరుడెవ్వడు, మూలకారణం  
బెవ్వ డనాది మధ్యలయు డెవ్వడు, సర్వము దానయైన వా  
డెవ్వడు, వాని నాత్మభవు, నీశ్వరునే శరణంబు వేడెదన్

తాత్పర్యము : ఈ విశ్వం ఎవరి వలన ఉద్భవించిందో, ఎవ్వనియందు లీనమై ఉంటుందో, ఎవ్వనియందు లయిస్తుందో... సర్వమూ తానే అయి ఉన్నవాడెవ్వడో... అట్టి పరమేశ్వరుని శరణు కోరుతున్నానని దీని అర్థం.

భగవాన్ కూడా ఉన్నది నలుబది అనుబంధములోని మంగళము లో ఈ విధంగా తెలియజేసారు.

ఈ సర్వమును దేనియందున్నదో, దేనిదో, దేనినుండి కలిగినదో, దేనికొరకో, దేనివలననో, యేదియో ఆ సద్వస్తువును భజింతుము గాక!

నా ఆధ్యాత్మిక ప్రయాణం మా అమ్మగారి ద్వారానే మొదలైంది. ఆవిడ నాకు తొలి గురువు. నాన్నగారి కంటే ముందు భగవానే నా జీవితంలో ప్రవేశించారు. అయితే నాన్నగారు, భగవాన్ కూడా మా అమ్మగారి ద్వారానే నాకు పరిచయం అయ్యారు. మా అమ్మగారు భక్తి మార్గంకంటే, జ్ఞానమార్గాన్ని ఎక్కువ ఇష్టపడేవారు. అదే విధంగా జీవించి చూపించేవారు. మేము బ్రాహ్మణులమైనా, ఆవిడ ఆచారాలని అసలు పట్టించుకునేవారు కాదు. ఎప్పుడూ ప్రవర్తన, ప్రవర్తన... అంటూ ప్రవర్తన సరిచేసుకోవాలి అనేవారు. మాకు ఎప్పుడూ ప్రవర్తన సరిగా ఉండాలి అని చెబుతూ, రామాయణంలో రాముడు అలా ప్రవర్తించాడు, సీతాదేవి అలా ప్రవర్తించింది అంటూ... అందరి పుణ్య పురుషుల గురించి మాకు చెప్పేవారు. శాస్త్ర ప్రమాణంగానే నీ జీవితాన్ని సరిదిద్దుకో అని సలహా ఇచ్చేవారు. ఒకసారి సుందర చైతన్య గారు రాజమండ్రిలో ఉపదేశసారం బోధించారు. అది మా అమ్మగారు విని రమణ మహర్షి పట్ల చాలా ఆకర్షితులయ్యారు. ఒకసారి నాకు ఫోన్ చేసి ఉపదేశసారంలోని మొదటి శ్లోకాన్ని చెబుతూ పేపర్ మీద రాసుకోమన్నారు. "కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలం" అని రాయించారు. తరువాత కొద్ది రోజులకే బంధువులతో కలిసి అరుణాచల యాత్రకు వెళ్ళారు.

అక్కడ  రమణాశ్రమం చూసి చాలా ఆనందపడ్డారు. అక్కడ కఠినమైన నియమ నిబంధనలు లేకుండా ఉండటం, స్వేచ్ఛగా ఉన్న ప్రశాంతమైన వాతావరణం, ఆశ్రమం, గిరి... ఇవన్నీ చూస  చాలా ఆనందపడ్డారు. తిరిగి వచ్చిన తరువాత, నన్ను నా భర్తతో కలిసి అరుణాచలంలో ఉన్న రమణాశ్రమాన్ని తప్పక దర్శించుకోమని చెప్పారు.

తరువాత నా భర్తతో కలిసి అరుణాచలం వెళ్ళాను. రమణాశ్రమం గేటు చూడగానే నాకు తెలియకుండానే దుఃఖం వచ్చేసింది. ఆ దుఃఖం పూర్వజన్మ అనుబంధం వలన వచ్చింది అని, నాన్నగారి దగ్గరకు వచ్చిన తరువాత అర్థమయ్యింది. గిరి ప్రదక్షిణ చేసిన తరువాత, మా అమ్మాయికి కొంచెం ఆరోగ్యం బాగా లేనందువలన నా భర్త, మా అమ్మాయి కిందనే ఉండిపోయారు. నేను మా అబ్బాయిని తీసుకుని గిరిపైకి వెళ్ళాను. అప్పుడు మా అబ్బాయి గిరి పైకి వెళితే అక్కడ రమణమహర్షి కనిపిస్తారా? అని అడిగాడు. కనిపిస్తారు అని చెప్పాను. మాకు దారిమధ్యలో ఒక వృద్ధ సాధువు కనిపించి మమ్మల్ని ఆపి, రమణ మహర్షి గురించి కొద్దిగా ఇంగ్లీషులో చెప్పారు. అది విని మా అబ్బాయి నిజంగానే రమణమహర్షి ఈ సాధువు రూపంలో వచ్చారు అని భావించి చాలా ఆనందపడ్డాడు. ఆ గిరి, ఆ రమణాశ్రమం, నా మనసుని చాలా ఆకట్టుకున్నాయి. తిరిగి  వచ్చేటప్పుడు సూరి  నాగమ్మగారి లేఖలు వెంట  తెచ్చుకున్నాను. ప్రతిరోజు నా దినచర్య లో  భాగంగా లేఖలను చదువుతూ ఉండేదాన్ని. రమణ మహర్షి గారి జీవిత వైభవం, ఆయన సబ్జెక్ట్ నా మనసుని బాగా హత్తుకుని చాలా ఆనందం అనిపించేది. మేము అరుణాచలం వెళ్ళి వచ్చిన రెండు సంవత్సరాలకి నా భర్త అకస్మికంగా మరణించారు. ఆయన చనిపోయారు అని కబురు తెలిసి మేము నా భర్త  పనిచేసే నర్సింగ్ హోమ్ కి వెళ్ళాము. ఆయన దగ్గరకు వెళ్ళి హృదయం పైన నా తలని పెట్టుకోగానే, నాకు తెలియకుండానే నిద్రలోకి జారుకున్నాను. మా అన్నయ్య  నన్ను పిలవగానే నాకు మెలకువ వచ్చింది.

ఆ తరువాత నాకు భర్త చనిపోతే నిద్ర వస్తుందా..! అనే సందేహం వచ్చింది కానీ, ఆ సందేహాన్ని నివృత్తి చేసేవారు లేరు. నా భర్త చనిపోయిన తరువాత ఎందుకో తెలియదు కానీ నాకు కలగవలసిన అంత దుఃఖం కలుగలేదు. భగవంతుడు దగ్గర మాత్రమే నాకు తెలియకుండా కన్నీరు వచ్చేది. ఆయన చనిపోయిన రెండు నెలలకు ఆయన పని చేసే హాస్పటల్ లోనే నాకు ఉద్యోగం వచ్చింది. పిల్లలకి భవిష్యత్తులో ఎవరి జీవితం వారికి ఏర్పడుతుంది కాబట్టి, నాకు ఏదో ఒక ఆధ్యాత్మిక మార్గాన్ని పట్టుకొని ఉండాలి అనిపించింది.  అవకాశం ఉన్నప్పుడల్లా చాలా పుస్తకాలు చదువుతూ, చాలా ఆధ్యాత్మిక కేంద్రాల చుట్టూ తిరిగాను.

నా భర్త చనిపోయిన సంవత్సరానికి అమ్మగారితో, అన్నయ్యలతో కలిసి అరుణాచలం వెళ్ళాను. అక్కడ అరుణాచలేశ్వరుడిని చూడగానే గోలక్ష్మి తన సంతానాన్ని తీసుకువచ్చి భగవాన్ ఎదుట ఉంచి నీదే భారం అని భగవాన్ ఎదుట మోరసాచి పడుకుంటుంది. ఈ వాక్యం లేఖలలో ఉంటుంది. అది జ్ఞాపకం  వచ్చి అరుణాచలేశ్వర గిరి వైపు చూస్తూ నా బిడ్డలను తీసుకువచ్చి నీకు అప్పజెప్పాను, ఇక నీదే భారం! నేను తల్లి వేషం వేస్తాను. నువ్వే చూసుకో అని ఆయనకు అప్పగించేసాను. అరుణాచలం నుండి తిరిగి వచ్చేస్తుంటే, సంవత్సరం నుండి నా మదిలో దాగి ఉన్న  దుఃఖం అంతా కట్టలు తెంచుకుని వచ్చేసింది. బస్సులో కూర్చుని ఆ గిరి వైపు  చూస్తూ తండ్రీ, నువ్వు నాకు చాలా దూరంగా ఉన్నావు. నేను నీ దగ్గరకు రావాలంటే చాలా సమయం పడుతుంది. నిన్ను విడిచి ఉండలేను. ఎలా నీ దగ్గరికి ఎలా రాగలను? అంటూ దుఃఖ పడ్డాను. ఆ తరువాత మా అమ్మగారు రమణ మహర్షి గారి శిష్యులు "నాన్నగారు" అని ఒకరు జీవించే ఉన్నారట. ఆయనతో మనము సాన్నిహిత్యం పెంచుకోవాలి అని చెప్పారు.

నాన్నగారి భక్తురాలైన ఝాన్సీగారి తల్లిగారు, మా అమ్మగారు అనుకోకుండా కలుసుకున్నారు. అలా నాన్నగారు మా జీవితంలోకి ప్రవేశించారు.

ఝాన్సీగారి ఇల్లు నేను పనిచేసే ఆఫీస్ కి దగ్గరగా ఉండటం వలన, ఒకసారి వారింటికి వెళ్ళాను. ఝాన్సీ గారు నాకు ఒక అరడజను క్యాసెట్లు, రమణ సంభాషణలు అనే పుస్తకాన్ని కూడా ఇచ్చి, ఇవి చదువుతూ ఉండండి నాన్నగారు వచ్చినప్పుడు మీకు చెబుతాను దర్శనం చేసుకోవచ్చు అని చెప్పారు. ఒకరోజు ఝాన్సీగారు ఫోన్ చేసి, ఫలానా చోటికి నాన్నగారు వస్తున్నారు అని నన్ను రమ్మని చెప్పారు. నేను ఆఫీసు నుండి మధ్యాహ్నం ఝాన్సీ గారు చెప్పిన అడ్రస్ కి వెళ్ళాను. అక్కడ భానుగారి పద్మ గారు సత్సంగం చెబుతున్నారు. ఝాన్సీ గారు నన్ను నాన్నగారి దగ్గరకు తీసుకువెళ్ళి పరిచయం చేస్తూ, ఈమెకు ఈ మధ్యనే భర్త చనిపోయారు అని చెప్పారు. అప్పుడు నాన్నగారికి నాకు సంభాషణ ఈ విధంగా కొనసాగింది.

నాన్నగారు : ఆర్థిక ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా?

భగవంతుడి దయ వలన ఆర్థిక ఇబ్బందులు ఏమీ లేవు నాన్నగారూ అన్నాను. (మా అబ్బాయి చదువుకి కొంచెం ఇబ్బంది ఉన్నప్పటికి, అందరి ముందు చెప్పలేకపోయాను)

నాన్నగారు అలాగా! అన్నారు.

నాన్నగార్ని చూడటం అదే మొదటిసారి అయినా నాన్నగారు 'అలాగా' అనేసరికి  నా మనసుకి "నీకు ఆర్థిక ఇబ్బందులు ఏమీ ఉండవు అని నన్ను ఆశీర్వదించినట్టు అనిపించింది".

నాన్నగారూ, నా భర్త చనిపోయినప్పుడు ఆయన దేహం మీద నా తలవాల్చుకోగానే మౌనంలోకి వెళ్ళిపోయాను అని నాకు తెలియకుండానే నాన్నగారితో చెప్పాను.

నాన్నగారు కొద్ది క్షణాలు మౌనంగా ఉండి "నువ్వు తరిస్తావు అమ్మా!" అన్నారు.

నాకు భృకుటి లో ఏదో తెలుస్తోంది అది మనస్సేనా అని అడిగాను.

నాన్నగారు అవును మనస్సే అమ్మా అన్నారు.

నాన్నగారూ, భృకుటి మీద దృష్టి నిలపవచ్చా?

నీ ఇష్టం అమ్మ!  నీకు ఎక్కడ భావుంటే అక్కడ దృష్టి నిలుపు.

భృకుటి మీద ధ్యాస పెడితే మహిమలు వస్తాయి అంటారు కదా నాన్నగారూ!

"ఆ మహిమలు గొడవ మనకి ఎందుకమ్మా!" అన్నారు.



నాన్నగారు నువ్వు తరిస్తావు అమ్మ అని ఆశీర్వదించారు అని నాకు పట్టరాని ఆనందం కలిగింది. ఆ తరువాత నాకు అనిపించింది. ఆధ్యాత్మిక కేంద్రాల చుట్టూ తిరగటం కాదు, నేను తరించటమే నా జీవిత లక్ష్యం అనుకున్నాను.  అలాగే నాకు ఏమి కావాలో నా కంటే ఎక్కువ నాన్నగారికే తెలిసింది కాబట్టి, నాన్నగారే నాకు నిజమైన గురువు అని ఆ రోజు నాకు అర్థం అయింది.

నాన్నగారు ఒకసారి శ్రీనగర్ కాలనీకి వచ్చినప్పుడు, ఆఫీసులో ఒక గంట పర్మిషన్ తీసుకుని ఉదయాన్నే నాన్నగారి దగ్గరకు వచ్చాను. నేను వచ్చేసరికి హాలంతా భక్తులతో నిండిపోయి ఉంది. నాన్నగారు ప్రవచనాలు చెబుతారని అప్పటికి నాకు తెలియదు. ఆరోజు నాన్నగారి ప్రవచనం వింటుంటే చాలా అద్భుతంగా అనిపించింది. ఆఫీసు మరియు పిల్లల బాధ్యతలు ఉండటం వలన అందరిలా నాకు నాన్నగారి దగ్గరకు రావటం కుదరటంలేదని, అంత అద్భుతమైన సబ్జెక్ట్ ని వినటానికి అవకాశం లేదు కదా అని చాలా బాధ కలిగింది. అప్పుడు నాన్నగారు "వారం రోజులు నీతో ఉండే గురువుని నువ్వు ఏమి పట్టుకుంటావు?

ఒక గంట నీతో ఉండే గురువుని ఏమి పట్టుకుంటావు? హృదయంలో నిరంతరం ఉండే గురువుని పట్టుకో!" అని చెప్పారు. నాన్నగారు ఆ వాక్యం చెప్పగానే నా హృదయానికి బాగా హత్తుకొని అప్పటిదాకా ఉన్న దుఃఖం అంతా ఆనందం కింద మారిపోయి ఆఫీస్ కి బయలుదేరాను.

ఒకసారి అనుకోకుండా మేము అరుణాచలం వెళ్ళాము. అక్కడికి నాన్నగారు వస్తున్నట్లు మాకు తెలియదు. అక్కడ అరుణాచలంలో మాకు నాన్నగారి దర్శన భాగ్యం  కలిగింది. నాన్నగారిని మా బాబు, పాప అరుణాచలంలోనే మొదటిసారి దర్శనం చేసుకున్నారు. నాన్నగారు హైదరాబాద్ వచ్చినప్పుడు నాకు తెలియటం లేదని, నాన్నగారి భక్తులలో ఒకరిద్దరితో పరిచయం చేసుకుని నాన్నగారు వచ్చినప్పుడు చెప్పమన్నాను.  వారు నాన్నగారు వచ్చినప్పుడల్లా నాకు శ్రద్ధగా చెబుతూ ఉండేవారు. అప్పటినుండి నాన్నగారు హైదరాబాదు వచ్చినప్పుడు తరుచుగా దర్శనం చేసుకునేదాన్ని.

తరువాత ఒక ఐదు సంవత్సరాలకి నాకు అనారోగ్యం వచ్చింది. అప్పటికే మా పిల్లలు ఇద్దరూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అందువల్ల నేను నా ఉద్యోగానికి సెలవు పెట్టేసాను. అదే సమయంలో నాన్నగారు ప్రతి రెండు నెలలకు ఒకసారి హైదరాబాదు నాకోసమే వస్తున్నట్టు వచ్చి పది రోజులు ఉండేవారు. నాకు నాన్నగారు అంటే ఇష్టం ఉండటం వలన, మా పిల్లలు కూడా నేను నాన్నగారి దగ్గరకు వెళ్తానంటే ఏమీ అనేవారు కాదు. అందువలన నాన్నగారు ఉన్న పది రోజులు కూడా ఉదయాన్నే వచ్చి, సాయంత్రం వరకు ఉండేదాన్ని. నాన్నగారు చెప్పే ప్రవచనాలు చాలా అద్భుతంగా ఉండేవి. నాన్నగారు జిన్నూరు వెళ్ళిపోయిన తరువాత కూడా ప్రతి సోమవారం ఎస్సార్ నగర్ సత్సంగానికి తప్పకుండా వెళ్ళేదాన్ని. ఆ సత్సంగాలకి క్రమం తప్పకుండా వెళ్ళటం వలన నాకు ఆ వాక్యాలు విలువ తెలియటం మొదలైంది.

ఒకసారి సత్సంగంలో "'లౌకికులు మీ ఇంటికి వస్తే వారితో మీరు ఏమీ మాట్లాడకుండా, మీకు ఏమైనా పని ఉంటే చేసుకుంటూ ఉండండి" అని వారితో ఎలా ప్రవర్తించాలో చెప్పారు. అదే వారంలో మా ఇంటికి లౌకికులు రావటం జరిగింది. నాకు ముందు నుండి వారితో మాట్లాడటం పెద్దగా ఇష్టం ఉండేది కాదు. మంచితనంలో చిన్న పిరికితనం  ఉంటుంది కదా! ఆ పిరికితనం వలన వారిని భరిస్తూ వచ్చేదాన్ని. ఆ వారంలో వారు వచ్చినప్పుడు నాన్నగారి వాక్యం జ్ఞాపకం వచ్చి, వారికి చేయవలసిన మర్యాద చేసి మౌనంగా కూర్చున్నాను. వారు కూడా ఒక గంట కూర్చుని మాకు కూడా పని ఉంది వెళ్ళి వస్తాము అని చెప్పి వెళ్ళిపోయారు. నేను ఏమీ మాట్లాడలేదు అని వారికి నా మీద కోపం రాలేదు. ఆ సంఘటన నాకు చాలా వింతగా అనిపించింది. అలా నా జీవితంలో నాన్నగారి వాక్యాన్ని పట్టుకొని జీవించటం ప్రారంభమయింది. అప్పుడు నాకు మనసులో "మనకు అవసరమైనప్పుడు గురువు వాక్యం రూపంలో మన దగ్గరకు వచ్చి మనల్ని అనుగ్రహిస్తాడు" అనిపించింది.

మరొక సారి సత్సంగానికి వెళ్ళినప్పుడు "బంధువులలో బంధువై ఉండు, స్నేహితులలో స్నేహితురాలివై ఉండు" అని చెప్పారు. ఈరోజు ఇలా చెప్తున్నారు ఏమిటి అనుకుని ఇంటికి వచ్చేసాను. తరువాత నాలుగు రోజులకి బంధువులు వచ్చారు. వారు రాగానే, నాన్నగారు చెప్పిన బంధువులలో బంధువై ఉండు అనే వాక్యం స్ఫురించి, వారికి నచ్చినట్టు ప్రవర్తించి వారిని పంపించేసాను. అలా నెమ్మదిగా వాక్యం పట్టుకొని జీవించటం మొదలయ్యింది. వాక్యాన్ని ఆచరణలో పెడుతూ ఉంటే నాకు చాలా ఆనందం అనిపించేది. ప్రతిరోజు నాన్నగారి ప్రవచనాలు వింటూ ఉండేదాన్ని.

నా స్నహితురాలు అయిన స్వర్ణ భర్త చనిపోయారు. ఆమె చాలా భక్తి కలవారు. నాన్నగారు హైదరాబాద్ వచ్చినప్పుడు ఆమె నాన్నగారిని దర్శనం చేసుకున్నారు. ఆయన పాదాలు పట్టుకోగానే ఆమెకు చాలా శాంతి కలిగింది.

ఒకసారి ఒక భక్తుడు నాన్నగారిని "True Love" గురించి చెప్పమని అడిగారు. ఆ ప్రశ్న వినగానే నాన్నగారు ఇది చెప్పటానికి ఒక రోజు సమయం పడుతుంది అంటూ True Love గురించి రామకృష్ణుడిని ఉదహరిస్తూ చాలా అద్భుతంగా చెప్పారు. అప్పటినుండి రెండు, మూడు సంవత్సరాలు వరకు రామకృష్ణుడి గురించి చెబుతూ రామకృష్ణుడే అయ్యారు. True Love గురించి చెబుతున్న సమయంలోనే నా మనసు అంతర్ముఖం అయ్యింది. నాన్నగారి అనుగ్రహ వర్షంలో తడవటం అనేది అదే మొదటిసారి. నాన్నగారు లేచి లోపలికి వెళ్ళి పోయినా నేను కళ్ళు తెరవలేకపోయాను. ఆరోజు నాన్నగారు అంటే ఏమిటో నాకు అనుభవంలోకి వచ్చింది.

నాకు చిన్నప్పటినుండి రామకృష్ణుడు అంటే చాలా ఇష్టం. మా అమ్మగారు కూడా మా చిన్నప్పుడు రామకృష్ణుడు గురించి చెప్పేవారు. అలాగే రామకృష్ణడి జీవిత సంగ్రహం కూడా చదివాను. నాన్నగారు, రామకృష్ణుడు ఒక్కరే అని బాగా నిర్ధారణకు రావటం జరిగింది. అప్పటినుండి నాన్నగారు అంటే బాగా ఇష్టము, చనువు ఏర్పడింది. నా భర్త చనిపోయిన తరువాత భగవద్గీతలో శ్లోకాలు కాకుండా, దాని తాత్పర్యం ఎక్కువ చదివేదాన్ని. అందువలన భగవద్గీత పట్ల బాగా ఇష్టం ఏర్పడింది. అందులో "ఫలితం నీ చేతిలో లేదు, నా మీద భారం వెయ్యి" అనే వాక్యాలు బాగా మనసుకి హత్తుకునేవి. భగవద్గీత చదివినప్పుడు నాకు కలిగిన సంశయాలు అన్నీ నాన్నగారిని అడుగుతూ ఉండేదాన్ని. ఏ సందేహం వచ్చి అడిగినా కళ్ళల్లోకి చూస్తూ రెండు గంటలు సేపు చెప్పేవారు.

నాన్నగారి ప్రవచనం వినే ముందు ప్రతి రోజూ విష్ణు సహస్రనామాలు వినేదాన్ని. అందులో "శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే..." అనే శ్లోకం మూడుసార్లు చదువుతారు. ఆ శ్లోకం మూడుసార్లు చదవటానికి ఒక 90 సెకన్లు సమయంపడుతుంది. ఆ 90 సెకన్లు తలంపులు లేకుండా మౌనంగా ఉండటానికి ప్రయత్నించేదాన్ని. కానీ అదే సమయంలో బయటినుండి ఎవరో ఒకరు వచ్చి తలుపు కొట్టేవారు. మొదట్లో నాకు

రియాక్షన్ వచ్చేది. కానీ క్రమంగా  బాహ్య సంఘటనలకు రియాక్ట్ అవ్వడం మానేసాను. కానీ లోపల తలంపులు మాత్రం నిరవధికంగా వస్తూనే ఉండేవి. నాకు ఆ తలంపులు అన్నీ తగ్గి కేవలం ఆ నామంతోనే ఏకాగ్రత చెందటానికి రెండు సంవత్సరాల సమయం పట్టింది.

ఒకసారి నాన్నగారు - హెూలీ కంపెనీలో ఒకే ఒక మైనస్ పాయింట్ ఉంది. అది ఏమిటంటే, విడిపోయేటప్పుడు దుఃఖం వస్తుంది అన్నారు. ఆయన అన్నట్లుగానే నాన్నగారిని ఎప్పుడు, ఎక్కడ కలిసినా  తిరిగి వెళ్ళేటప్పుడు చాలా దుఃఖం వచ్చేది. సత్సంగాలకు వెళ్ళడం వలన, ఏవైనా సమస్యలు ఎదురయినప్పుడు, కష్ట సమయం వచ్చినప్పుడు నాన్నగారు చెప్పిన వాక్యాలు జ్ఞాపకం వచ్చి వాటిని ఆచరణలో పెట్టగలిగేదాన్ని. అప్పుడు సమస్యకు తగిన శాంతియుత పరిష్కారం లభించేది. అలా వాక్యాలను జ్ఞాపకం చేసుకుని ఆచరించే శక్తిని కూడా గురువే ఇచ్చేవారు.

మా అమ్మాయి పెళ్ళికి అంతా నాన్నగారే బాధ్యత తీసుకున్నారు. నాన్నగారి అంగీకారంతోనే సంబంధం ఖాయం చేశాము. ఆహ్వాన పత్రిక ఇవ్వటానికి నాన్నగారి దగ్గరకు వెళ్ళాను. ఆ సమయానికి నేను, నాన్నగారు మాత్రమే అరుగు మీద ఉన్నాము. అప్పుడు నాన్నగారు నువ్వు సబ్జెక్ట్ చెపుతావా? అని అడిగారు. నాకు అప్పుడు రెండు వాక్యాలు గుర్తుకు వచ్చాయి.

మొదటిది : ప్రతి ఒక్కరికి హృదయంలోని ఈశ్వరుడితో మానసిక అనుబంధం ఉండగా, ఈమధ్య వర్తిత్వం ఎందుకు అంటారు భగవాన్! అది నేను సూరి నాగమ్మగారి లేఖలు లో చదివాను.

రెండవది :  ఇతరులు ఎవరున్నారు బోధించడానికి? అని కూడా భగవాన్ అంటారు.  ఈ రెండు వాక్యాలు గుర్తుకు వచ్చి నేను చెప్పను అని తల అడ్డంగా ఊపాను. నాన్నగారు కూడా ఏమీ మాట్లాడలేదు. మా అమ్మాయి వివాహం అయిపోయింది.

నిజం చెప్పాలి అంటే, అమ్మాయి వివాహం రోజున నాకు శ్రమ తెలియకుండా పనులన్నీ ఆయన అనుగ్రహంలో  సక్రమంగా జరిగాయి. నాకు దేనితోనూ తాదాత్మ్యం లేకుండా, దైవికంగా అంతా జరిగిందని మర్నాడు నాకు అర్థమయింది. ఇదంతా గురువు దయ! ఈ సంఘటనతో నాన్నగారి మీద నాకు విపరీతమైన నమ్మకం ఏర్పడింది. ఆయన దయామయుడు, సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి!

నాన్నగారితో, పాప పెళ్లి అయ్యి వెళ్లిపోయింది. నాకు మమకారంతో చాలా దుఃఖం వచ్చేస్తోంది. నన్ను మామకారం నుంచి విడుదల చేయండి నాన్నగారూ అని అడిగాను. వెంటనే నాన్నగారు పెద్ద నవ్వు నవ్వారు. తరువాత రెండు చేతులు పైకి ఎత్తి అలాగే అన్నట్టు ఆశీర్వదించారు. అయితే, ఇంటికి వచ్చేసిన తరువాత నాకు దుఃఖం ఇంకా ఎక్కువ అయింది. అమ్మాయి ఫోటో చూడటం, ఏడవటం ఇదే జరుగుతోంది. నన్ను మమకారపు దుఃఖం నుండి విడుదల చేస్తున్నారు అనే స్ఫురణని కూడా నాన్నగారు కలిగించారు. వారం రోజులు గడిచిన తరువాత నుండి నాకు కన్నీళ్ళు రాలేదు. అప్పటి నుండి నాలో ఉన్న బలహీనతలని చూసుకొని నాన్నగారిని విడుదల చేయమని ప్రార్థించేదాన్ని. ప్రార్థనే మన సాధన! అక్కడ నుండి వాలు గాలిలో సైకిల్ తొక్కినట్టుగా సాధన కొనసాగింది.

ఒకసారి నేను పళ్ళు ఇవ్వడానికి వెళ్తే నన్ను అక్కడే నిలబెట్టి పక్కవారితో రామకృష్ణుడు వివేకానందుడుని బోధించమని చెబితే, నేను భోదించను అన్నాడు. అప్పుడు రామకృష్ణుడు  నువ్వు బోధించకపోతే నీ ఎముకలు బోధిస్తాయి అన్నాడని నాన్నగారు చెబుతున్నారు. ఆ మాట వినగానే నన్నే అంటున్నారా అనిపించింది. వెంటనే, వివేకానందుడి తో నిన్ను పోల్చు కొంటావా..  ఆని నా బుద్ధి నన్ను హెచ్చరించింది. నాన్నగారు అదే మాటను మరలా 3 సార్లు చెప్పి, నా చేతిలో ఉన్న పండ్లని తీసుకున్నారు. నన్నే అంటున్నారు అని అర్థమయ్యి, నాకు విపరీతమైన మానసిక వత్తిడి వచ్చింది. నా భర్త మరణంతో నేను ఇంటాబయటా చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాను. నన్ను సబ్జెక్టు చెప్పమంటారు ఏమిటి?

అనుకున్నాను. పూర్వం ఒకసారి మెడిటేషన్ చేస్తే నా మనసు అంతర్ముఖమయింది. ప్రారంభంలో నాకు మెడిటేషన్ లోనే మనస్సు అంతర్ముఖం అవుతుంది అనే అపోహ ఉండేది. పని చేసుకుని ఒక గంట కళ్ళు మూసుకుని కూర్చొవటానికే నాకు సమయం సరిపోవడం లేదు. నన్ను రాయమంటారు ఏమిటి? నన్ను చెప్పమంటారు ఏమిటి? అని నా మనసు చాలా ఎదురు తిరిగింది. ఎంత పోరాటం అంటే 30 గంటలు చాలా ఇబ్బంది పడ్డాను. ఒకవైపు నా బుద్ధి, మనసుని శరణాగతి చేశాను అంటున్నావు గురువు మాట వినవా? అంటోంది. గురువు దయ ఉంటే  మన తలంపులు, సంఘర్షణలు ఏ పాటివి? చివరకి ఒక చిన్న పుస్తకంలో నాలుగు మాటలు రాసుకొని వెళ్ళాను. నాన్నగారు వచ్చి నా ముందు మౌనంగా రెండు నిమిషాలు నిలబడ్డారు. అలా నాకు శక్తిని ఇచ్చినట్టు అనిపించింది. ఆ తరువాత నుండి మరలా ఎప్పుడూ రాయటం మానలేదు. మరునాడు తెల్లవారుజామున  నాలుగు గంటలకు ధ్యానంలో కూర్చుంటే నా ప్రయత్నం లేకుండానే నా మనసు అంతర్ముఖమయింది. నువ్వు రాయడం మూలంగానే ఈ స్థితి వచ్చింది అని నాకు స్ఫురింప చేశారు. నన్ను బాగు చెయ్యటం కోసమే ఇదంతా చేస్తున్నారు అని అర్థమయ్యి బాగా దుఃఖం వచ్చింది. అప్పటినుండి పూర్ణ శరణాగతి చెందాను".

మా బాబుకి దుబాయిలో జాబ్ వచ్చి వెళ్ళిపోయాడు. అప్పుడు నాన్నగారు, అమ్మా! ఇప్పుడు నీకు ఏకాంతంగా ఉండటానికి అవకాశం వచ్చింది. కాలాన్ని సద్వినియోగం చేసుకో! సత్సంగాలకు వెళ్ళు. కాఫీ దొరకలేదని ఎండ్రిన్ తాగము కదా! ప్రసంగాలు దొరకకపోతే లౌకికంలోకి వెళ్ళకు. భగవంతుడు కాల రూపంలో ఉన్నాడు అని నాన్నగారు నన్ను వేలు పెట్టి చూపించి చెప్పారు. నాన్నగారు అలా చెప్పగానే లోపల నుండి నా ప్రయత్నం లేకుండానే కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా అనుగ్రహించు తండ్రీ! నా ప్రయత్నంతోనే అవ్వదు. నీ అనుగ్రహంతోనే అవ్వాలి అని ప్రార్థించాను.

నాన్నగారి దగ్గరకు వెళ్ళటం, సత్సంగం చెప్పటం, సత్సంగం వినటం, సత్సంగం రాయటం, హృదయంలో సత్సంగం... ఇలా 5 రకాల సత్సంగాలు జరిగేవి. నాన్నగారు చెప్పిన సబ్జెక్టు రాస్తే, భక్తులు ఎవరో ఒకరు వచ్చి మీరు సబ్జెక్టు రాశారట కదా! ఒకసారి చదవండి అని అడిగేవారు. వారికి చదివి వినిపించడం వల్ల సబ్జెక్ట్ నాకు మననం అయ్యేది. అలా మెల్లగా నాకు తెలియకుండానే నాన్నగారు టీచింగ్ లో ట్రైనింగ్ ఇచ్చారు. ప్రతిరోజు ఉదయాన్నే నాన్నగారి ఉపన్యాసం వినేదాన్ని. అందులో నాకు నచ్చిన ఒక వాక్యం తీసుకుని దానిపై రోజంతా సాధన చేసేదాన్ని. కాసేపటికి మనసు బయటకు వెళ్ళిపోయేది. మళ్ళీ నాన్నగారు గుర్తుకు వచ్చేవారు. అప్పుడు విచారణ చేసుకుని అక్షరమణమాల, ఉపదేశసారము, నాన్నగారి నామము చేసుకుంటూ మనసుని నిరోధించేదాన్ని. మరుసటి రోజు ఇంకొక వాక్యం మీద సాధన చేసేదాన్ని.

జిన్నూరు వెళ్ళినప్పుడు నాన్నగారు నా వైపు చూడాలి, నాన్నగారు నన్ను పలకరించాలి అని మనసులో కోరుకునేదాన్ని. ఇంతలో నాన్నగారు ఇంట్లో వారిని పలకరించడం అవసరమా! అని ఎవరితోనో అంటున్నారు. ఆ మాట వినగానే నన్ను పలకరించకుండా ఉంటే బాగుండును అనుకున్నాను. క్రమంగా ఆయన దయ నాకు మౌనంగానే తెలిసేది. నాలోని బలహీనతలను తొలగించమని నాన్నగారిని ప్రార్థించేదాన్ని.

ఒకసారి ఒక భక్తురాలు భర్త చనిపోయారు అని నాన్నగారి దగ్గరకు వచ్చారు. ఆమెను చూసి నాకు, నా భర్త జీవించి ఉన్నప్పుడే నాన్నగారి దగ్గరకి వచ్చి ఉంటే, ఆ జీవుడు కూడా పవిత్రులు అయ్యేవారు కదా అనిపించింది. నాన్నగారు అమ్మా.. డాక్టర్ గారు ఎప్పుడు చనిపోయారు? అని అడిగారు. అంటే మన మనసులో ఉన్నది ఆయనకు తెలిసిపోతుంది కదా!

ఎప్పుడైతే మా పిల్లల్ని అరుణగిరికి అప్పచెప్పానో, అప్పటి నుండి నాన్నగారే పిల్లల్ని చూసుకున్నారు. "రూపు దాల్చిన గిరి మన నాన్నగారు."

నాన్నగారిలో జ్ఞానులు అందరినీ దర్శింప చేశారు. అలా క్రమంగా నాలో మార్పు తీసుకు వచ్చి, ఈ సత్సంగాలు అన్నీ చెప్పించారు. అది కేవలం ఆయన అనుగ్రహం మాత్రమే!

నాన్నగారు వివిధ ప్రవచనాలలో మహాత్ములు అందరి గురించి బోధించి ఉన్నారు. అవి అన్నీ ఒక చోట నన్ను తెలుగులో రాయమని విజయ్ నాకు చెప్పారు. అవి తను ఇంగ్లీషులోకి అనువదించుకుని నాన్నగారు అంగీకారంతో వెబ్ సైట్ లో పెట్టారు. అందుకోసం ప్రవచనాలు వింటూ, నిరంతరం రాసుకోవడం వలన సబ్జెక్ట్ చెప్పటానికి నాకు చాలా సహాయ పడింది. అలా నాన్నగారు దయతో, విజయ్ చేసిన జ్ఞానయజ్ఞంలో నన్ను కూడా సమిధను చేశారు.

ఒకసారి నాన్నగారు సార్ నాథ్ లో బుద్ధుడు గురించి చెబుతూ  బుద్ధుడు అయిపోయారు. నాన్నగారి మార్గం మనకి చాలా సులభంగా ఉంటుంది. కానీ మనం చేసే ప్రయత్నం చాలా నిజాయితీగా చేయాలి. ఎక్కడ మనం ఫెయిల్ అవుతున్నామో చూసుకొని అక్కడ మనం ప్రయత్నం చేస్తూ ఉండాలి. గురువు ఆ ప్రయత్నమే చూస్తాడు.

మనం నెమ్మదిగా ప్రయాణం చేసినా గమ్యం మాత్రం మరచిపోకూడదు. గురువు మీద విశ్వాసం చెదరకుండా చూసుకుంటూ గురుస్మరణలో ఉంటే, నీ కర్తవ్య కర్మలు నీవు చెయ్యకూడదు అనుకున్నా,  చెయ్యకుండా ఉండలేవు. అలా చేస్తూ ఉంటే ఆయన దయ మనపై ఉండి తప్పనిసరిగా హృదయ సుఖాన్ని పొందుతాము.

సూర్యుడు భూమిపై ఒక భాగాన్ని విడిచి వెళ్ళిపోతూ, నేను వెళ్ళిపోతున్నాను ఈ భాగానికి ఎవరైనా వెలుగుని ప్రసరించగలరా? అని అడిగితే, ఒక కిరసనాయిలు దీపం ముందుకు వచ్చి ఓ సూర్యుడా..!

నువ్వు ఏ విధంగా అయితే వెలుగును ప్రసరింపచేస్తున్నావో, నేను కూడా అదే విధంగా ప్రసరింపచేస్తాను. నువ్వు కోట్ల మందికి వెలుగును ఇస్తే, నేను నలుగురికే ఇస్తాను. నువ్వు వెళ్లి రా! నువ్వు చేసే పని నేను చేస్తాను అందట.  రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పిన ఈ వాక్యం చాలా బావుంటుంది.

మన నాన్నగారి ప్రేమ కూడా సూర్యుడి వెలుగులా విశ్వప్రేమ! మనం నాన్నగారిలా కాకపోయినా, కిరసనాయిల దీపంలా ఒక నలుగురికి ప్రేమను పంచుదాం. అలా ఒక చిన్న ప్రయత్నం చేసి, ఆ ప్రేమించే శక్తిని ఇమ్మని గురువుని ప్రార్థించుదాము. అలా చేస్తూ ఉంటే, తప్పనిసరిగా గురువు తన hold లోకి తీసుకుంటాడు. నాన్నగారు చేయవలసిన పని ఏమీ లేకపోయినా మనకోసం బోధిస్తూ, పనిచేసి చూపించారు. కాబట్టి ఆయన జీవితమే బోధ అయ్యింది. ఆ భోదే మనకి ఆదర్శం.  నాన్నగారు సామాన్య గురువు కాదు. నాన్నగారు మన అందరికీ జ్ఞానం వస్తుంది అని అభయమిస్తూ అనేక రకాలుగా ఆశీర్వదించారు. కాబట్టి మనందరం తప్పనిసరిగా తరించి తీరుతాము.

నాన్నగారికి ఒక ఆస్ట్రేలియా భక్తుడు ఒక ఉత్తరంలో "మీరు నన్ను ఏ విధంగా ప్రేమించారో ఆ ప్రేమను జ్ఞాపకం తెచ్చుకుంటూ ఉంటే, ఆ ప్రేమలో నా అహంకారం కరిగిపోతోంది" అని రాశాడట. అలాగ నాన్నగారి ప్రేమను జ్ఞాపకం తెచ్చుకుని ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉందాము. గురువు ఏ చైతన్య స్థాయిలో ఉన్నాడో, ఆ చైతన్య స్థాయికి మనల్ని తీసుకువెళ్ళటానికి సిద్ధంగానే ఉన్నారు. మనసు నశించే వరకూ మనం ప్రయత్నం విడిచిపెట్టకూడదు. మనసు నశించిన తరువాత ఆ దేహం ద్వారా జరగవలసిన పనులు జరుగుతూనే ఉంటాయి.

**తుది పలుకులు:**

"అమ్మా! ఆరోగ్యం పాడయింది. క్యాన్సర్ అంటున్నారు. శరీరమంతా వ్యాపించేసింది. నాన్నగారు చూసుకుంటారు. నాన్నగారి అనుగ్రహంతో మనసు చాలా బాగుంది. నాన్నగారిలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చేస్తోంది. ఈరోజు ఉదయం క్యాసెట్ పెట్టుకుంటే మోక్షం మీ అందరికీ ఇచ్చేస్తాను సందేహపడకండి అన్న వాక్యం  వినపడింది. ఎవరూ కంగారు పడవద్దు. దేహం నేను కాదు, మనసు నేను కాదు, మన అందరం ఆత్మ స్వరూపులము. అదిగా నిలిచి ఉందాము. నా మనసు చాలా హాయిగా ఉంది. బెంగగా ఉన్నవారు ఎవరైనా ఉంటే, ఈ రాజేశ్వరిని తీసుకుని వెళ్ళి నాన్నగారి సన్నిధిలో అప్పగించండి. కంగారు పడకండి. సబ్జెక్టుకు ఎవరు దూరం అవ్వకండి. సబ్జెక్టే గురువు! ఉంటాను."



"గిరి రూపమో, గురు రూపమో శ్రీ నాన్న పాదమే మాకు శరణ్యము.

ఓం శ్రీ గురుభ్యోనమః".

# నాన్నగారి అంతులేని ప్రేమ ప్రవాహం

**(లేట్ పద్మ గారు)**

**నాన్నగారు సర్వదేవతా స్వరూపులు!**



నాన్నగారు రాముడు గురించి చెబుతున్నప్పుడు రాముడిలా, కృష్ణుడి గురించి చెబుతున్నప్పుడు కృష్ణుడిలా అనిపించేవారు. రామకృష్ణుడిలా, షిర్డీసాయిబాబాలా, శంకరాచార్యునిలా బుద్ధుడిలా, భగవాన్ లా ఇలా నాన్నగారు ఎవరి గురించి చెబితే వారి రూపంలా అనిపించేవారు. నాన్నగారిలో అందరి మహాత్ములను దర్శించిన ఆనందం కలిగేది. నాన్నగారి సమక్షంలో చింతామణిలా చింతలు తీరేవి. కల్పవృక్షంలా కోరికలు తీరేవి. చంద్రుని వెన్నెలలా చల్లదనం ప్రసరించేది.

షిర్డీసాయిబాబా నా భక్తులను నా దగ్గరకు తీసుకుంటాను అని చెప్పారు. అంటే మనం ఎక్కడ, ఏ పరిస్థితిలో ఉన్నా గురువుకి తెలుస్తుంది. మేము నల్గొండ జిల్లా రాశి సిమెంట్ ఫేక్టరీ దగ్గర ఉండేవాళ్ళము. అక్కడి నుండి 1992 డిసెంబరు మొదటి వారంలో హైదరాబాదుకి మారాము. ఆ చివరి వారంలో నాన్నగారు పరిచయం అయ్యారు. మేము హైదరాబాద్ రావడం వల్ల ప్రయోజనం ఏమిటంటే, నాన్నగారి సన్నిధికి చేరుకోవడం జరిగింది. ఆయన రప్పించుకున్నారు. ఇది "దైవానుగ్రహం".

మా అత్తగారు, ఆడపడుచు నన్ను నాన్నగారి దగ్గరకు తీసుకువెళ్ళి పరిచయం చేసారు. నాన్నగారు అప్పుడు లక్ష్మీవాళ్ళ నాన్నగారు వరహాలరాజుగారి ఇంట్లో ఉన్నారు. నాన్నగారు నన్ను బాగా పలకరించారు. ఏం చదివావు?

ఏం పుస్తకాలు చదువుకుంటూ ఉంటావు? అని అడిగారు. మొదటి దర్శనంలోనే నాకు నాన్నగారంటే బాగా ఇష్టం ఏర్పడింది. రెండు రోజుల్లో త్యాగరాయ గానసభలో "రమణభాషణములు" పుస్తకం ఆవిష్కరణోత్సవం ఉంది రమ్మని ఆహ్వానపత్రిక ఇచ్చారు.

త్యాగరాయ గానసభలో సామవేదం షణ్ముఖశర్మగారితో పాటు వేరే వక్తలు కూడా మాట్లాడారు. అక్కడ నాన్నగారు కూడా అరగంటసేపు మాట్లాడి ఆత్మగురించి చెప్పారు. నాకు సబ్జక్ట్ చాలా కొత్తగా, ఆశక్తిగా ఉంది అనిపించింది. అదే ట్రిప్ లో 1993 జనవరి 1న రేణుకగారి ( Biological ) ఇంట్లో భోజనాల ఏర్పాట్లు, మధ్యాహ్నం నాన్నగారి ఉపన్యాసం చాలా వైభవంగా జరిగాయి.

సంక్రాంతికి మా అత్తగారి ఊరు కోడవల్లి వెళ్ళాము. అక్కడినుండి జిన్నూరు మొదటిసారి వెళ్ళటం జరిగింది. నాన్నగారు అరుగుమీద కూర్చుని ఉన్నారు. ఆయన నాతో చాలా ఆప్యాయంగా మాట్లాడారు. ఏం పుస్తకాలు చదువుతావు? అని అడిగారు. నాన్నగారూ మీ దగ్గరకు వచ్చింది తక్కువే కాని మీ కేసెట్స్ బాగా విన్నాను అని చెప్పాను. నీ డైలీ లైఫ్ కి ఏమైనా ఉపయోగపడుతున్నాయా? అని అడిగారు. నేను ఇంతవరకూ జపం చేసుకోవాలి, పుణ్యం చేసుకోవాలి అనుకున్నాను. మీరు చెప్పిన Aim high & Aim at the highest అని చెప్పింది చాలా నచ్చింది. God realisation ultimate destination అని తెలిసింది అన్నాను. మా అత్తగారితో, పార్వతమ్మగారూ మీ కోడలు చాలా త్వరగా ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి వస్తుందని చెప్పి నాన్నగారు నన్ను బ్లెస్ చేసారు.

1993 వ సం ll రం డిసెంబరు ఆఖరి వారంలో మొదటిసారిగా అరుణాచలం వెళ్ళాము. అప్పుడు నాన్నగారు మోరీ గెస్ట్ హౌస్ లో ఉన్నారు. మాకు అక్కడ పక్కనే ఒకరూమ్ ఇచ్చారు.

నాకు అరికాళ్ళలో Corns ఉండటం వల్ల చెప్పులు లేకుండా ఇంట్లోకూడా నాలుగు అడుగులు వెయ్యలేకపోయేదాన్ని. ఆ కారణంగా గిరిప్రదక్షిణ చెప్పులు లేకుండా చెయ్యటం అసాధ్యం అనిపించి చెప్పులతో ప్రదక్షిణకి బయలుదేరాను. నాన్నగారు మమ్మల్ని కుబేరలింగం దగ్గర ఉండమని, ఆయన అక్కడకు వచ్చి కాసేపు కూర్చుని వెళ్ళిపోయారు. తరువాత మేము గిరి ప్రదక్షిణ పూర్తిచేసి తిరిగి వచ్చాము. ఆ సాయంత్రం నాన్నగారు నాతో నువ్వు ఈ రోజు భోజనం చేయవద్దు, రామారావుగారు పండ్లు తెచ్చి ఇస్తారు అవే తీసుకో అన్నారు. చెప్పులతో గిరి ప్రదక్షిణకు వెళ్ళినందుకే నాన్నగారు భోజనం మానేసి పండ్లు తినమన్నారేమో అనిపించింది. అందువల్ల మరుసటిరోజు ఉదయం చెప్పులు లేకుండానే గిరిప్రదక్షిణ చేసాను. నాన్నగారు అలా అని ఉండకపోతే నేను చేయలేకపోదును. ఆ తరువాత నాన్నగారు నువ్వు ఇంక ఒకసారి కూడా తిరగవద్దు. ఎక్కడికైనా వెళ్ళాలనిపిస్తే కారులో వెళ్ళి, ఎక్కడయినా కూర్చోవాలనిపిస్తే కాసేపు కూర్చుని వచ్చేయి అన్నారు. నాన్నగారు ఏదైనా ఒకసారి వద్దు అంటే దానిమీదకు నా మనసు పోయేది కాదు.

నాన్నగారు పరిచయమైన కొత్తలో నేను నాన్నగారితో, అందరూ భగవాన్, భగవాన్ అంటున్నారు. వర్కు అంతా చేసేది మీరయినా, మీరు కూడా అంతా భగవాన్ చేసారంటున్నారు. మీకు భగవాన్ గురువు అవ్వచ్చు కానీ మాకు భగవాన్ గురువు ఎలా అవుతారు? మాకు అన్నీ తెలియజేసి బోధించేది మీరే కదా! మాకు మీరే గురువు అన్నాను. అప్పుడు నాన్నగారు నవ్వుతూ, నీలాంటివాడే పండరీపురంలో ఒకడు ఉన్నాడు. ఇద్దరు గురుశిష్యులు ఉండేవారు. గురువుగారు అరుగుమీద కూర్చున్న సమయంలో పాండురంగడి ఊరేగింపు వచ్చింది. అప్పుడు గురువుగారు శిష్యుడితో, పెరుమాళ్ వెళ్ళిపోతున్నాడు తొందరగా వచ్చి చూడమని పిలిచారు. అప్పుడు ఆ శిష్యుడు

మీ పెరుమాళ్ వెళ్ళిపోతే మీరు చూసుకోండి, నేను నా పెరుమాళ్ కి పాలు కాచుకుంటున్నాను నేను రాను అన్నాడు. అంటే ఆ శిష్యుడికి గురువుగారే పెరుమాళ్ అన్నమాట!

ఒకసారి మా నాన్నగారితో కలిసి రవీంద్రభారతిలో అనూప్ జలోటా బజన్స్ ఉంటే వెళ్ళాను. తిరిగి వచ్చేసరికి అర్ధరాత్రి అయిపోవడం వల్ల అమ్మగారింట్లో ఉండిపోయాను. మర్నాడు ఉదయం మా హౌస్ ఓనర్ సిద్ధయ్యగారు ఫోన్ చేసి మా ఇంట్లో దొంగలు పడ్డారని చెప్పారు. వెళ్ళి చూస్తే కొంత డబ్బు, బంగారం పోయాయి. మా ఎదురింటి సాయిగారి భార్య నాగేశ్వరి, సిద్ధయ్యగారు, సంధ్య, ఇంటి ప్రక్కవారు అందరూ వచ్చారు. నేను బీరువాలో చూసి మా గురువుగారి కేసెట్స్ సేఫ్ గా ఉన్నాయి అని ఆనందపడ్డాను. వారు డబ్బు, బంగారం పోయాయని బాధ పడకుండా కేసెట్స్ చూసి ఆనంద పడుతున్నారు, ఆ కేసెట్స్ లో ఏముంది? అని అడిగారు. మా గురువుగారి ప్రవచనాలు ఉన్నాయని చెప్పాను. మా ఇంట్లో అన్ని గదుల్లో నాన్నగారి ఫొటోలు ఉన్నాయి. ఈ ఫొటోలో ఉన్నది ఎవరని అడిగారు. మా గురువుగారు, నాన్నగారు అంటారు అని చెప్పాను. ఆ తరువాత నాన్నగారు వచ్చినప్పుడు వారందరూ వచ్చి దర్శనం చేసుకున్నారు. నాన్నగారి అంగీకారంతో అశోక్ నగర్ లో మా ఇంట్లో సత్సంగం పెట్టుకున్నాము.



అశోక్ నగర్ లో త్యాగరాయ గానసభ మా ఇంటికి దగ్గరగా ఉండేది. సిద్ధయ్యగారు నాన్నగారి ఉపన్యాసం త్యాగరాయ గానసభలో పెట్టుకోవచ్చుకదా అని సలహా ఇచ్చారు. నేను నాన్నగారిని త్యాగరాయ గానసభలో ఉపన్యాసం పెట్టుకుందామని అడిగాను. నాన్నగారు అంగీకరించారు. "శ్రీ నాన్నగారి ఆధ్యాత్మిక ప్రవచనం" అని చిన్న పేపర్ ప్రకటన ఇచ్చాను. ఆ హాలు మొత్తం జనంతో నిండిపోయింది.

కార్యక్రమం అంతా చాలా బాగా జరిగింది. మేము అశోక్ నగర్ లో ఉన్న రోజుల్లో, నాన్నగారి ఉపన్యాసం త్యాగరాయ గానసభలో
పెట్టుకుందామని అడిగేదాన్ని. నాన్నగారు అందుకు అంగీకరించేవారు. నాన్నగారు వస్తే పెద్ద పండుగలా ఉండేది.
నాన్నగారు హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ మేము ఆయన దగ్గరకు వెళ్ళేవాళ్ళము. అప్పుడు నాన్నగారు మదురానగర్ లక్ష్మిగారి ఇంటిలో ఉండేవారు. నల్లకుంట సావిత్రి మామ్మగారి ఇంటికి కూడా వచ్చేవారు. ప్రవచనం చేసేటప్పుడు ఏదైనా పుస్తకం చదువుతూ చెప్పేవారు. ఆ పుస్తకం నా చేతికి ఇచ్చి చదవమనేవారు. రెండు లైన్లు చదివాక దానిమీద వివరణ ఇచ్చేవారు. నేను ఎప్పుడైనా వెనక కూర్చున్నా ముందుకు రమ్మని పుస్తకం ఇచ్చేవారు. అలా చాలాకాలం నాకు ముందు కూర్చునే అవకాశం లభించింది. ముందురోజు చెప్పిన ఉపన్యాసంలో ప్రశ్నలు అడిగేవారు. ఒకసారి సనత్ కుమారుడు గురించి చెబుతూ సనత్ కుమారుడే భగవాన్ గా జన్మించాడని చెప్పారు. మర్నాడు భగవాన్ సనత్ కుమారుడిగా ఉండగా ఏమి చెప్పాడమ్మా అని అడిగారు. ఎవరూ మాట్లాడలేదు. మన నిజ స్వరూపం బ్రహ్మం, మన స్వరూపం ఆత్మ. కానీ మనలో ఉన్న బ్రహ్మం మనకి అందాలంటే అది ఎలా అందాలో సనత్ కుమారుడు చెప్పాడు. ఏమి చెప్పాడంటే ఎవరూమాట్లాడటం లేదేమిటి? అన్నారు. అప్పుడు ఆహార శుద్ధి వలన ఇంద్రియ శుద్ధి అన్నాను. నాన్నగారు అవును అని నావైపు తిరిగారు.

ఆహారశుద్ధి వల్ల - ఇంద్రియశుద్ధి
ఇంద్రియశుద్ధి వల్ల - మనశ్శుద్ధి
మనసుశ్శుద్ధి వల్ల - అంతఃకరణశుద్ధి
అంతకరణశుద్ధి వల్ల - ఆత్మానందం అందుతుంది

అని సనత్ కుమారుడు చెప్పాడు నాన్నగారూ అన్నాను. అప్పుడు నాన్నగారు నవ్వుతూ Very Good. You are born teacher, you are not made teacher అన్నారు.

ఒకసారి ఈశ్వరునికి మరోపేరేమిటి? అని అడిగారు.

"కర్మఫలదాత" అని చెప్పాను.

ఒక సందర్భంలో నాన్నగారు మనం పూర్వజన్మలో ఈ దేహం నిజం, ఈ సంఘటనలు నిజం, ఈ కుటుంభసభ్యులు నిజం అనుకున్నాము. ఈ జన్మలో కూడా ఈ దేహం నిజం, ఈ సంఘటనలు నిజం. ఈ కుటుంబ సభ్యులు నిజం ... ఇలాగే అనుకుంటున్నాము. వచ్చే జన్మలో కూడా అలాగే అనుకుంటాము అని చెప్పి ఈ సంసారం గురించి భగవాన్ ఏమన్నారో చెప్పారు. తరువాత దాని గురించి అడుగుతూ భగవాన్ ఈ సంసారాన్ని ఏమన్నారు? అని అడిగారు. భగవాన్ ఈ సంసారాన్ని Ever unreal (ఎప్పుడూ అసత్యమే) అన్నారు అని చెప్పాను. నీ సబ్జక్ట్ grasping బాగుంది. గడియారం ముల్లు ఎంత accurate గా తిరుగుతుందో అలా ఉంది. అంత accurate గా ఉంది నీ సబ్జక్ట్ అన్నారు. అక్కడ నేను చేసిందేమీ లేదు. నాన్నగారు చెప్పిన మాటలే తిరిగి చెప్పేదాన్ని. అయినా నాన్నగారు నన్ను మెచ్చుకుంటూ టీచింగ్ కి బాగా ప్రోత్సహించేవారు.

ఒకసారి నాన్నగారిని భక్తియోగం ఒకటి సరిపోతుంది కదా నాన్నగారూ అని అడిగాను. "భక్తియోగం అంతా అక్కరలేదు. "సర్వభూతహితేరతాహః" ఈ ఒక్క వాక్యం చాలమ్మా! భాగవతంలో రంతిదేవుడు అనే భక్తుడు ఉన్నాడు. రంతి దేవుడు భోజనం చేసేటప్పుడు తనకి ఆకలిగా ఉన్నా ఎవరైనా అడిగితే వారికి బిక్ష కాదనకుండా ఇచ్చేవాడు. మంచినీళ్ళు తాగేటప్పుడు అడిగితే ఆ నీరు కూడా ఇచ్చేసేవాడు.

అప్పుడు భగవంతుడు ప్రత్యక్షమై ఏమైనా వరం కోరుకోమంటాడు. అప్పుడు ఆ భక్తుడు నేను అందరి హృదయాలలో ఉండాలి. అలా ఉండి ఏ జీవికైనా దుఃఖం వస్తే ఆ దుఃఖాన్ని వారు అనుభవించకుండా నేనే అనుభవించేస్తాను. అప్పుడు జీవకోటి దుఃఖం లేకుండా సుఖంగా ఉంటారు. అలాంటి వరం ఇమ్మని అడిగాడు. అలా అన్ని భూతాల క్షేమం కోరేవారికి మోక్షం ఇవ్వకుండా ఎవరూ ఆపలేరు అన్నారు.

నాన్నగారి మనవడు వర్మగారు srinannagaru.com పేరుతో Website start చేసి wonderful work చేస్తున్నారు. దేశ, విదేశాలలో ఉండే



భక్తులు అందరూ నాన్నగారి పుట్టినరోజుకి, గురుపూర్ణిమకి వెళ్ళలేకపోయాము అనే బాధ లేకుండా audio, video లద్వారా అన్ని ఉపన్యాసాలు వినగలిగేలా, చూడగలిగేలా అవకాశాన్ని కల్పిస్తూ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒకసారి నాన్నగారితో నేను వర్మకి వ్యక్తి భావన లేదు కదా నాన్నగారూ! అని అడిగాను. అవునమ్మా కరెక్టుగా చెప్పావు. వర్కు చేస్తాడు కానీ వ్యక్తి కనపడడు అని నాన్నగారు వర్మని మెచ్చుకున్నారు.

కనస్ట్రక్షన్ వర్క్ రీత్యా మా కుటుంబం హైదరాబాదునుండి చెన్నైకి మారవలసి వచ్చింది. అప్పుడు నాన్నగారు పద్మ మద్రాసు వెళ్ళడంవల్ల హైదరాబాదుకి నష్టం, మద్రాసుకి లాభం అన్నారు. నాన్నగారు హైదరాబాదులో లక్ష్మి ఇంటికి వచ్చేవారు. లక్ష్మి నాన్నగారికి బాగా సేవ చేసేవారు. భక్తులను కూడా చాలా ప్రేమగా ఆదరించేవారు. సహనంతో, నవ్వుతూ అందరినీ పలకరిస్తూ ఉండేవారు. ఆమెని చూసినప్పుడు గురువు సేవచేసుకోవడం ఎంత అదృష్టం? అనిపించేది. నాన్నగారు నాకు ఆ కోరిక మద్రాసులో తీర్చేసారు.

2000 సం॥రం నుండి 2003 వరకు మూడు సం॥రాలు నాన్నగారు అరుణాచలం వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు మా ఇంటికి వచ్చి ఉండేవారు. నాన్నగారితో నాకు కారులో అరుణాచలం వెళ్ళే అవకాశం వచ్చేది. కారులో కూడా సబ్జక్ట్ చెబుతూనే ఉండేవారు. ఖన్నా, శాంతి, వడివేలు, సంగీత విద్వాంసులు మణిగారు, వారి భార్య .... చెన్నై భక్తులంతా వచ్చేవారు. కొంతమంది మన భక్తులు కూడా వచ్చేవారు. అలా మా హాలు మొత్తం నిండిపోయేది. మద్రాసులో నాన్నగారితో నేను గడిపిన రోజులు నాకు Golden days.

నాన్నగారు కోయంబత్తూరు, కొత్తగూడెం వెళ్ళినప్పుడు నాన్నగారికి ఫోన్ చేసి నేను రావచ్చా అని అడిగితే రామ్మా పద్మా అనేవారు. కొత్తగూడెం వెళ్ళినప్పుడు అక్కడ సౌకర్యంగా ఉంటుందని రమ్మనేవారు. అక్కడ అంతా ఆచార్యులవారి సబ్జక్ట్ చెప్పేవారు. ఎంత అందంగా చెప్పేవారు అంటే, సముద్రపు కెరటంలో ఒక బుడగ పగిలిపోతే ఆ బుడగ నీరుగా మారుతుంది. బుడగగా అసత్యం కానీ నీరుగా సత్యం. బంగారపు వడ్డాణం కరిగిస్తే వడ్డాణం కరిగిపోతుంది కానీ బంగారంగా మిగులుతుంది. మట్టి కుండను పగలగొడితే కుండ రూపాన్ని కోల్పోతుంది కానీ మట్టిగా మిగిలి ఉంటుంది.

బుడగ అసత్యం - నీరుగా సత్యం.
వడ్డాణంగా అసత్యం - బంగారంగా సత్యం.
కుండగా అసత్యం - మట్టిగా సత్యం.

దేహబుద్ధి, జీవబుద్ధి నశిస్తే బ్రహ్మాకారం చెందుతాం. జీవబుద్ధి అసత్యం, బ్రహ్మపదార్థం సత్యం. అప్పుడు limitations దాటి Every thing అయిపోతాం అని చెప్పేవారు.

"మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంశ్రయః! అంటే అసలు మనిషి జన్మదొరకటం, జ్ఞానం పొందాలనే కాంక్ష కలగడం, కలిగినా దానిని నెరవేర్చే గురువు అనుగ్రహం దొరకడం ఇవి మూడూ దైవానుగ్రహం అన్నారు శంకరాచార్యుల వారు. అంటే అనేక వేల జన్మల పుణ్యఫలం ఉంటేనే గానీ అవి దొరకవు. అందులోనూ ఒక మహాగురువు ఆశ్రయం దొరకితే ఇక నీకు దశ తిరిగిందిలే అనేవారట ఆచార్యులవారు.

నాకు ఆరోగ్యం బాగోలేకపోయినా గురువుగారు దేహంతో ఉన్నంతకాలం ఆయనతో గడిపినందుకు చాలా సంతృప్తిగా ఉంది. దేహం వచ్చినందుకు ప్రారబ్దం ఎలా ఉన్నా, ఒక మహాత్ముని చుట్టూ 25 సం ॥లు సన్నిహితంగా తిరిగే అవకాశం లభించింది. ఎప్పుడూ నాన్నగారి ధ్యాసతోనే గడిపేవాళ్ళము. ఆ ధ్యాసలో పిల్లలు పెరగటం, వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు ఎలా జరిగాయో అవేమీ గుర్తులేవు. నిరంతరం నాన్నగారి సబ్జక్ట్, సత్సంగం అంతే! కొన్నిసార్లు సత్సంగానికి వినటానికి వెళ్ళేవాళ్ళము. కొన్నిసార్లు చెప్పటానికి వెళ్ళేవాళ్ళం. ఎలా అయినా మొత్తంగా సత్సంగాలచుట్టూ, నాన్నగారిచుట్టూ తిరిగేవాళ్ళం. అలా మన దృష్టి ఎటూ మళ్ళకుండా సబ్జక్ట్ చుట్టూ ఉండేలా ఆయన చేసారు.

కష్ణుడు అంటే ఇష్టం ఉండటం వేరు. కృష్ణుడు చెప్పిన భగవద్గీత యొక్క వైభవాన్ని అర్థం చేసుకుని కృష్ణుని ఇష్టపడటం వేరు అని చెప్పారు నాన్నగారు. అలా నాకు నాన్నగారి సబ్జక్ట్ వినేకొలది లోపల నాన్నగారంటే ఇష్టం, గౌరవం పెరుగుతూ వచ్చాయి. అది జ్ఞాని వైభవం..! నాన్నగారి సబ్జక్ట్ ఒక మహా సముద్రం. మనం అందులో ఒక నీటి బిందువు లాంటివాళ్ళం. నాన్నగారి గురించి నేను తెలుసుకున్నది కూడా ఆ నీటి బిందువు అంత మాత్రమే అనిపిస్తుంది.

నాన్నగారు ఒకసారి ప్రవచనంలో ఏమి చెప్పారంటే, Theory మొత్తం అంతా వింటాము కానీ, ఆ సబ్జెక్ట్ లోతుల్లోకి మాత్రము దిగము. అంటే చెరువులోకి దిగకుండా అలా చెరువుగట్టు మీద కూర్చునే ఉంటాము. అది చూసి, చూసి గురువు ఒక్క తోపు తోస్తాడు. అప్పుడు నీటిలో పడిపోతాము. మనం చేయాలని స్నానం చేయకపోయినా, అందులో పడిపోయాము కాబట్టి స్నానం అయిపోతుంది. అలా గురువుకి "One kick is enough" అని చెప్పారు. మనం నీటిలో పడకుండా అలా కాలక్షేపం చేస్తూ ఉంటే గురువు ఎప్పుడో ఒక తన్ను తన్నితే లోపలికి వెళ్ళిపోతాము.

నాకు 24 సం ll ల వయసులో Auto - Immune disorder ( One type of arthritis ) వచ్చింది. డాక్టర్స్ పెద్దగా hope ఇవ్వలేదు.

ఒకసారి కారులో నాన్నగారితో అరుణాచలం వెళ్తూ ఉంటే నాన్నగారు "అమ్మా పద్మా 1984 వ సం ll లో నాకు అనారోగ్యం కలిగినప్పుడు డాక్టర్స్ నేను చనిపోతాను అని చెప్పారమ్మా! డాక్టర్స్ అందరూ నాకు కేన్సర్ అనుకున్నారు. అప్పుడు నాకు వచ్చిన ఆలోచన ఏమిటంటే, ఈ దేహంలో ఉండగా ఇంక మరలా అరుణాచలం చూడలేనేమో అని తలంపువచ్చింది" అని చెప్పారు. అప్పుడు నేను నాన్నగారితో, నా అనారోగ్యం గురించి డాక్టర్స్ చెప్పినప్పుడు నాకు వచ్చిన తలంపు ఏమిటంటే, నాన్నగారి సమక్షాన్ని కోల్పోతాను అనిపించింది అన్నాను. దానికి నాన్నగారు జ్ఞానం పొందే అవకాశం మిస్ అయిపోతాను అనిపించిందా? అని అడిగి మౌనం వహించారు. కానీ ఆ తరువాత నాకు 25 సం ll రాలు ఆయన సమక్షంలో ఆనందంగా గడిపే అవకాశాన్ని కలుగజేసారు. ఇది ఆయన నాకు ప్రసాదించిన వరం.



నాకు కాశీ వెళ్ళాలని ఉండేది. కాకపోతే ట్రైన్ లో వెళ్ళాలంటే సమయం ఎక్కువ పడుతుంది, నాకు ప్రయాణం చేయటం కష్టమవుతుంది అనుకున్నాను. నాన్నగారు ఆ కోరిక కూడా తీర్చేసారు. అప్పటికే నాన్నగారు రెండుసార్లు కాశీ వెళ్ళారు. మళ్ళీ కాశీ వెళుతున్నారని తెలిసింది. నాన్నగారూ ఈ సారి మీరు హైదరాబాదు వచ్చేయండి. ఇక్కడనుండి అందరం ఫ్లైట్ లో వెళదాము అని అడిగాను. సరేనమ్మా అయితే అన్నారు. అలా నాన్నగారు హైదరాబాద్ వస్తే ఫ్లైట్లో వెళ్ళాము. తొమ్మిది రోజులు నాన్నగారితో కాశీలో గడిపాను.

కాశీలో 20 మందికంటే ఎక్కువ పట్టని బోటులో నాన్నగారు భక్తులతో కలిసి బయలుదేరారు. ఒడ్డున ఉన్న రాయిమీదనుండి బోటులోకి దూకాలి. కొంతమంది ఎక్కగలిగిన వాళ్ళు దూకేసారు. నాకు దూకే పరిస్థితిలేదు కనుక ఆగిపోయాను. బోటు బయలుదేరి వెళ్ళిపోతుంటే నాన్నగారు పద్మ ఏది? అని అడిగారట. అదేంటి పద్మని ఎక్కించుకోవద్దా అని ఉషని అడిగి మళ్ళీ వెనక్కి వెళ్దాం పదండి అన్నారట. అప్పుడు బోటు మాకోసం తిరిగిరాగానే, రాయిమీద నుండి బోటులోకి ఎక్కలేను అనుకున్నదానిని నాకు తెలియకుండానే ఎక్కేసాను. నాతోపాటు మరో ఇద్దరు భక్తులు విజయ్ కుమార్ గారు, ఆయన భార్య ఇందిర గారు కూడా ఎక్కారు. ఆరోజు నాన్నగారు నదిలోనుండి నీరుతీసి బోటులో ఉన్న భక్తులందరిమీదా చల్లుతూ చాలా ఆనందంగా గడిపారు. పక్కనే వేరే బోట్ లో ఉన్న భక్తులు కూడా నాన్నగారూ మామీద కూడా చల్లండి అంటే వారిమీద కూడా నీళ్ళు చల్లారు.

నాన్నగారు భద్రాచలం వెళ్ళినప్పుడు నాకు కుదరలేదు. కానీ వెళ్తే బావుండును అనుకున్నాను. తరువాత నాన్నగారితో మూడుసార్లు భద్రాచలం వెళ్ళే అవకాశం కలిగింది! రెండుసార్లు శ్రీశైలం కూడా వెళ్ళాను.

కాలడి వెళ్ళినప్పుడు పూర్ణానదిలో స్నానంచేసి, అక్కడ చిన్ని కృష్ణుడి గుడి ఉంటే నాన్నగారితోపాటు దర్శనానికి వెళ్ళాము. బయటికి వచ్చిన తరువాత అమ్మా పద్మా కృష్ణుడిని చూసావా? కృష్ణుడి దర్శనం అయ్యిందా? అని చాలా ఆనందంగా అడిగారు. నేను మామూలు విగ్రహాన్ని చూసానంతే! నాన్నగారు నిజంగా కృష్ణుడి దర్శనం అయినట్టు ఇంత ఆనందంగా అడుగుతున్నారు ఏమిటి అనుకున్నాను.

నాన్నగారితో  కోయంబత్తూరు వెళ్ళినప్పుడు కొంతమంది భక్తులు వెళ్ళిపోయినా నేను చివరి వరకూ ఉండిపోయాను. అప్పుడు రంగరాజుగారు నాన్నగారితో, ఈసారి వేరే ప్రదేశాలు చూద్దాము అన్నారు. నాన్నగారు, నేను, రామచంద్రరాజు గారు, రంగరాజుగారు, ఆయన భార్య అందరం కలిసి కారులో బయలుదేరాము. మధురై, భగవాన్ జన్మస్థలమైన తిరుచ్చుళి, కుమారస్వామి క్షేత్రమైన తిరుప్పరకుంద్రం వెళ్ళాము. ప్రతి గుడిలోకి వెళ్ళి వచ్చిన తరువాత ఇది పద్మ డెస్టినీలో ఉంది అనేవారు. భగవాన్ ఆత్మానుభవం పొందిన స్థలానికి తీసుకువెళ్ళి ఇక్కడే భగవాన్ ఆత్మానుభవం పొందారు. నువ్వు ఇక్కడ కాసేపు కూర్చో పద్మా అన్నారు. తిరుప్పరకుంద్రం గుడికి వెళ్ళినప్పుడు, మధురై ఈశ్వరుని గుడికి వెళ్ళినప్పుడు, అక్కడి పూజారులు నాన్నగారు ఎవరో తెలియక పోయినా, దేవుడికి అలంకరించిన  పూలమాల తీసి నాన్నగారి మెడలో వేసారు. ఏమీ తెలియనివారిని కూడా ఆకర్షించే వైభవం " జ్ఞాని వైభవం! "

ఒకసారి నాన్నగారితో అరుణాచలం నుంచి కారులో పాండిచ్చేరి వెళ్ళాము. అక్కడ అరబిందో ఆశ్రమానికి తీసుకువెళ్ళారు. సమాధితో పాటు అక్కడన్నీ చూపించారు. అరబిందో 40 సంవత్సరాలు బయటికి రాకుండా ఒకే గదిలో ఉండిపోయారు. వాకింగ్ కూడా ఆ గదిలోనే చేసేవారు. సావిత్రి లాంటి పుస్తకాలు రచించారు. మనకి రెండురోజులు మనుషులు కనపడకపోతే ఉండలేము. భగవాన్ ని ఎక్కడికయినా వెళదామని భక్తులు అడిగితే, ఎక్కడికి వెళ్ళినా పంచభూతాలే! గాలి,

నీరు, అగ్ని, భూమి, ఆకాశం. ఇంక ఆరోభూతం ఏమీ లేదని చెప్పేవారు అన్నారు. నాన్నగారు చెప్పిన ఈ రెండు మాటలూ నాకు బాగా స్ఫూర్తినిచ్చాయి. కోయంబత్తూరులో రోజూ ప్రారబ్ధాన్ని, ఏకాంతవాసాన్ని ఎంజాయ్ చెయ్యాలని, కష్టసుఖాలను ప్రసాద బుద్ధితో స్వీకరించాలని చెప్పారు. జ్ఞాని ప్రారబ్ధాన్ని మామిడి రసం తాగినట్టు, చెరుకురసం త్రాగినట్టు అనుభవిస్తారని చెప్పారు. రెండు సం॥ల నుండి నేను ఎక్కడికీ వెళ్ళలేకపోయినా నాకు ఏమీ అనిపించలేదు. నాన్నగారి అనుగ్రహంలో అదంతా సహజంగా జరిగిపోతూ వచ్చింది.

అహం వైశ్వానరో భూత్వా
ప్రాణినాం దేహమాశ్రితః।
ప్రాణాపానసమాయుక్తః
పచామ్యన్నం చతుర్విధమ్ ॥

"నేను అందరి హృదయాలలో ఉన్నాను. జఠరాగ్ని రూపంలో కూడా ఉన్నాను. జఠరాగ్ని రూపంలో ఉండి తినే ఆహారాన్ని జీర్ణం చేసేది నేనే" అన్నాడు కృష్ణుడు.

మీరు సుబ్బారావు అనే వ్యక్తికి భోజనం పెట్టారనుకోండి! నేను సుబ్బారావుకి భోజనం పెట్టాను, సుబ్బారావుకి భోజనం పెట్టాను అనుకోకండి. ఆయనకి ఆకలిగా లేకపోతే మనం పెట్టినా తినలేడు. ఎవరికైనా భోజనం పెట్టినా ఈశ్వరుడికి పెట్టాను, ఈశ్వరుడే తిన్నాడనుకోండి. సుబ్బారావులో జఠరాగ్నిరూపంలో ఉండి జీర్ణమయ్యేలా చేసేది ఈశ్వరుడే! తిన్న ఆహారం జీర్ణమయ్యేలా చేసేది నేనే అన్నాడు కదా! భగవంతుడు మన హృదయానికి అంత దగ్గరగా ఉండటం వలన, మనం పాపకర్మలు చేయకుండా పవిత్రంగా ఉండాలి అన్నారు.

ఆహారం విషయంలో పాటించవలసిన నియమాలు :

1. మనం కష్టపడి, న్యాయంగా సంపాదించిన సొమ్ముతో కూడినదై ఉండాలి.
2. సాత్వికమైన శాఖాహారం తీసుకోవాలి.
3. భగవంతుని ప్రార్ధన చేసిన తరువాత ఆహారం తీసుకోవాలి.
4, ఆహారమును ఎక్కువ, తక్కువ కాకుండా యుక్తముగా తీసుకోవాలి.

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ
బ్రహ్మణా హుతమ్।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా॥



ఇచ్చేవాడు బ్రహ్మము! పుచ్చుకునే వాడు బ్రహ్మము! ఇవ్వబడుతున్న క్రియ బ్రహ్మము! ఇచ్చే వస్తువు బ్రహ్మము!

మనం ఎవరికైనా మామిడి పండు ఇస్తే - మామిడి పండు ఇచ్చేవాడు బ్రహ్మము. మామిడి పండు పుచ్చుకునేవాడు బ్రహ్మము. మామిడి పండు బ్రహ్మము. అలా బ్రహ్మ భావనతో అన్నీ చేసేవాడు చివరికి బ్రహ్మమునే పొందతాడు! అని నాన్నగారు చాలా అద్భుతంగా చెప్పారు.

వైజాగ్ లో మా వదిన ( వైజాగ్ పద్మ ) గారి ఇంటికి నాన్నగారు వచ్చినప్పుడల్లా వదిన నన్ను రమ్మనేవారు. అక్కడ నాన్నగారితో సన్నిహితంగా గడపడానికి మంచి అవకాశం లభించేది. నాన్నగారు వైజాగ్ శ్యామల గారి ఇంట్లో ఉన్నప్పుడు ఒకరోజు ఏసుక్రీస్తు గురించి చెప్పారు. ఏసుక్రీస్తు దగ్గరకు ఒక శిష్యుడు వచ్చి నీవు ప్రభువువి, దేవుడివి అంటూ ఉంటే ఏసుక్రీస్తు - నువ్వు మూడు రోజుల్లో నన్ను 30 నాణాలకు పట్టిస్తావు అన్నారంట.

అప్పుడు ఆ శిష్యుడు అదేమిటి ప్రభూ? అలా అంటారు అన్నాడట. అవును అది అంతే అన్నారట. అప్పుడు నేను ముందే క్రీస్తు చెప్పినందుకైనా ఆ శిష్యుడు అలా చేయకుండా ఉండవలసింది నాన్నగారూ అన్నాను. అదేంటమ్మా పద్మా? విధి బలీయమైనది! వాసన బలీయమైనది! ఆ శిష్యుడికి ధన వాసన ఉంది. ధనం అనగానే దానికి లొంగిపోయాడు. తరువాత జీసస్ కి శిలువ వేయడం చూసి, నా వల్లే ఇదంతా జరిగింది అని ఆ నాణాలు అక్కడే పడేసి ఉరివేసుకుని చనిపోయాడు. కానీ ఆ సమయానికి వాసన వలన లొంగిపోయాడు అని చెప్పారు. ఆ నాలుగు రోజులూ సత్సంగంలో విధి బలీ .... యము! వాసన బలీ .... యము! అంటూ చాలా ఉదాహరణలు చెప్పారు.

రావణాసురుడు సీతని తీసుకొచ్చినప్పుడు, మండోదరి రావణాసురుడితో ముందే చెప్పింది. నువ్వు తీసుకొచ్చింది సీతను కాదు నీ మృత్యువుని..! సీతను తిరిగి రాముడికి అప్పజెప్పు. రాముడుకి శరణాగతి చెందు అని చెప్పినా రావణాసురుడు వినలేదు. అలాగే వాలితో తార చెబుతుంది. నీ చేతిలో చావు దెబ్బలు తిని వెళ్ళిన సుగ్రీవుడు, మళ్ళీ ఇంత త్వరగా యుద్ధానికి వస్తున్నాడంటే, వెనక ఏదో బలగంతో ( శక్తితో ) వస్తున్నాడు వెళ్ళొద్దని చెబుతుంది. కానీ విన్నాడేంటి? విధి బలీ...యము! అన్నారు.

వాలి భార్య తార వాలి చనిపోయిన తరువాత రాముడితో, భార్యా వియోగం ఎలా ఉంటుందో నీకు తెలుసు కదా! నువ్వు బాధ పడుతున్నావు. మరి భర్త వియోగం నాకు ఎందుకు కలుగజేసావు? అని అడిగింది. అప్పుడు రాముడు తారకి ఒక రహస్యం చెప్పాడు అన్నారు నాన్నగారు. సృష్టి మొదలైనప్పటి నుండి ఈనాటి వరకూ ఈశ్వరుడి సంకల్పానికి వ్యతిరేకంగా ఏ సంఘటనా జరగలేదు. ఈశ్వరుడి సంకల్పం ఒకలా ఉంటే, ఇంకొకరకంగా చేయడానికి అసలు అవకాశమే లేదు. ప్రారబ్ధమనే ఇరుసులో నువ్వూ, నేనూ, అందరం బంధీలం అమ్మా తారా! ఇక్కడ ఎవరూ స్వతంత్రంగా వ్యవహరించలేరు! వాలి చనిపోవడం కూడా ప్రారబ్ధంలో భాగమే! అన్నాడు రాముడు.

ఈశ్వరః సర్వభూతానాం
హృద్దేశేర్జున తిష్ఠతి।
భ్రామయన్ సర్వభూతాని
యంత్రారూఢాని మాయయా॥

భగవద్గీతలోని ఈ శ్లోకం అంటే నాన్నగారికి చాలా ఇష్టం. "ఈశ్వరుడు అందరి హృదయాలలోనూ తిష్టవేసుకుని కూర్చున్నాడు. మామూలుగా కూర్చోలేదు, తిష్టవేసుకుని కూర్చున్నాడు. యంత్రాన్ని తిప్పేవాడు యంత్రాన్ని తిప్పినట్టు బొమ్మలన్నింటినీ తిప్పుతున్నాడు. పిచ్చివాడి చేతిలో రాయి ఉంటే ఎటు విసురుతాడో తెలీదు. అలా పిచ్చివాడిలా తిప్పట్లేదమ్మా! వారి వారి ప్రారబ్ధానుసారం తిప్పుతున్నాడు." అన్నారు.

ఇందిరాగాంధీ దగ్గర ఉండే సెక్యూరిటీలో సిక్కులు ఉంటే ప్రమాదం తీసేద్దామన్నారట! నాకు అందరూ సమానమే అందట. ఆ సిక్కుల చేతిలోనే ఆమె చనిపోయింది. అలా ఎవరయినా చెప్పినా బుద్ధి ( మాయ ) విననివ్వదు. అలాగే రాజీవ్ గాంధీ విషయంలో ఒక అమ్మాయి హ్యూమన్ బాంబ్ పెట్టుకుని పూలమాలతో వస్తే ఎస్. ఐ ఆపేసాడు. రాజీవ్ గాంధీ అదిచూసి పంపించమన్నాడు. ఆ అమ్మాయి వచ్చి దండేసి బాంబ్ పేల్చేసింది. అంటే డెత్ ని ఆహ్వానించటమే! ఎస్. ఐ ఆపినప్పుడు ఆగాలి కదా! వచ్చేయమన్నాడు. మాయ విననివ్వదమ్మా! అని చెప్పి ఇంకో అద్భుతమైన మాట చెప్పారు. "మాయ విననివ్వకపోవడం కాదు, అసలు ఈశ్వరుడే విననివ్వడు." అంటే వాడి ప్రారబ్ధానుసారం ఆడించేయాలి కదా! విధి బలీయము! అన్నారు. అయితే ఈశ్వరుడే మాయలో పెట్టేసి, ఈశ్వరుడే విననివ్వకుండా చేసేస్తే మనం మాయలో పడి కొట్టుకోవడమేనా? ఏంటి పరిస్థితి? అని నాన్నగారే ప్రశ్నించి, ఆయనే సమాదానం చెబుతూ దీనికి పరిష్కారం కూడా కృష్ణుడు చెప్పాడు అన్నారు.

తమేవ శరణం గచ్ఛ
సర్వభావేన భారత!
తత్ప్రసాదాత్ పరాం శాంతిం
స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్!!

అన్ని విధాలా ఆయన్నే శరణు పొందు. ఆయన అనుగ్రహం వల్ల పరమశాంతిని, శాశ్వతమైన స్థానాన్నీ పొందుతావు.



అంటే ఈశ్వరుడి పాదాలను ఆశ్రయించి జీవించాలి. చేపలు పట్టేవాడు వల విసిరినప్పుడు తెలివైన చేపలు, చేపలు పట్టేవాడి పాదాల దగ్గరకు వెళ్ళిపోతాయి. వల విసిరినప్పుడు ఆ చేపలు అతని వలలో పడవు. అలాగే ఈశ్వరుడి పాదాలను ఆశ్రయించిన వాళ్ళు మాయ వలలో పడరు. ఈశ్వరానుగ్రహం కలిగితే ప్రయోజనం ఏమిటి? ఈశ్వరానుగ్రహం కలిగితే మన జేబులో డబ్బులు పెట్టి వస్తువు కొనుక్కోవటం ఎంత సులభమో, మోక్షం అంత సులభంగా వరిస్తుంది. అప్పుడు మనం ఆయన స్వరూపాన్ని పొందుతాము. అది శాశ్వత ఆనందం అన్నారు.

మనం కలెక్టరు గారి ఇంటికి వెళ్ళామనుకోండి. వాచ్ మెన్ మనల్ని బయటే ఆపేస్తాడు. కలెక్టరుగారు బాల్కనీలోంచి చూసి లోపలికి పంపమన్నారనుకోండి, వాచ్ మెన్ లోపలికి పంపిస్తాడు. అలా పలానవాడికి దారి ఇవ్వు అని ఈశ్వరుడు చెబితే మాయ దారి ఇస్తుంది. అంటే మాయాధిపతి ఎవరు? ఈశ్వరుడే! అన్నారు.

రాజశేఖర రెడ్డి ఫ్లైట్ ఎక్కేముందు పైలెట్ వద్దండి వాతావరణం బాలేదన్నాడు. అప్పుడు రాజశేఖరరెడ్డి నీకు డెత్ అంటే అంత భయమా? పద వెళ్దాం అన్నారట. అంటే విధి బలీ... యము! అన్నారు.

వరలక్ష్మిగారి అమ్మాయి విజయ వాళ్ళింట్లో (కొంపెల్ల) I am that I am గురించి అద్భుతంగా చెప్పారు.

I am అంటే బ్రహ్మము (Truth). అది అందరి హృదయాలలోనూ ఉంది. అందరం బ్రహ్మ స్వరూపులం అయ్యే ఉన్నాము.

I am అంటే సద్వస్తువు. That I am అంటే "అది నేనయి ఉన్నాను" అనేది ఇక్కడ ముఖ్యం. దానిలోనే మొత్తం అంతా ఉంది! చీమలోనూ, ఏనుగులోనూ... అన్ని జంతువులలోనూ సద్వస్తువు ఉంది. దేవుడు ఉన్నాడని చేప్పేవాడిలోనూ దేవుడు ఉన్నాడు. దేవుడు లేడని చేప్పేవాడిలోనూ దేవుడు ఉన్నాడు. మనకు తెలిసినా తెలియకపోయినా I am అనేది అందరిలోనూ ఉంది. అసలు ముందు That I am అది నేనయి ఉన్నాను అని గ్రహించాలి. అది అనుభవంలోకి రావాలి. క్రీస్తు చెప్పిన I am That I am అనేది భగవాన్ కి కూడా నచ్చింది. ఈ వాక్యాన్ని ఆయన బాగా ఎంజోయ్ చేసేవారని నాన్నగారు అన్నారు.

రెడ్డిగారు అనే ఆయన ప్రతి ఆదివారం భగవాన్ దగ్గరికి వెళ్ళిపోయేవారు. అప్పుడు గాంధీగారు అన్నారట. ఇప్పుడు రమణ మహర్షిలో ఏముందో నాలోనూ అదే ఉంది. నీలోనూ అదే ఉంది. Truth అందరిలోనూ సమానంగానే ఉంది. మరి రమణ మహర్షి దగ్గరకు పరిగెడతావెందుకు? అన్నారట. Truth మీలోనూ ఉంది. నాలోనూ ఉంది. కానీ ఆయనలో ఉన్నది ఆయనకు అనుభవంలోకి వచ్చింది. మనలో ఉన్నది మనకు అనుభవంలోకి రాలేదు అన్నారట. ఆ సమాదానానికి గాంధీగారు కూడా సంతోషించారు అన్నారు.

I am that I am అనేది క్రీస్తు రియలైజ్ అయ్యాడు. భగవాన్ కి, ఆచార్యులవారికి, బుద్ధుడికి .... అనుభవంలోకి వచ్చింది. I am that I am అనగానే వాళ్ళలా మనం రియలైజ్ అవ్వలేము కాబట్టి క్రీస్తు,

సాత్వికులు ధన్యులు - వారు స్వతంత్రించుకుందురు.

సమాదాన పరుచువారు ధన్యులు - వారు దేవుని అనుగ్రహానికి పాత్రులగుదురు.

హృదయశుద్ధి గలవారు ధన్యులు - వారు దేవుని చూచెదరు అని చెప్పాడు.

( సమాదాన పరుచువారు: ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరుగుతున్న సమయంలో, కొంతమంది పట్టుకుంటామని వచ్చి పడగొట్టేస్తూ ఉంటారు. అదే సమాదాన పరుచువారు అయితే, అక్కడికి వెళ్ళి గొడవ పెరగకుండా అడ్డుకుని సర్దిచెబుతారు. అటువంటి వారు దేవుని అనుగ్రహానికి పాత్రులు అవుతారు. )

డబ్బులు ఉన్నవారు ధన్యులు, అధికారం ఉన్నవారు ధన్యులు అని క్రీస్తు చెప్పలేదు. ఏయే లక్షణాలు ఉంటే భగవంతుడు అనుభవానికి వస్తాడో అవన్నీ చెప్పాడు. ఆధ్యాత్మికమైన బోధలన్నీ హృదయంలోనికి వెళ్ళటానికే! కృష్ణుడు భగవద్గీతలో చెప్పిన 700 శ్లోకాలు కూడా మనం హృదయంలోకి వెళ్ళటానికే! మనకు అది అనుభవంలోకి రావాలంటే ముఖ్యంగా ప్యూరిటీ ఉండాలి అన్నారు నాన్నగారు. దీనికి ఒక ఉదాహరణ చెప్పారు.

జన్నూరులో ఒక అబ్బాయికి కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ చేసారు. ఆయితే కొత్త ఆర్గాన్ ని మన శరీరం రిజెక్ట్ చేస్తుంది. అందుకని స్టెరాయిడ్స్ ఇచ్చేస్తారు. ఇమ్యూనిటీని సప్రెస్ చేసేస్తారు రిజెక్ట్ చేయకుండా!

అయితే ఆ అబ్బాయి body కిడ్నీని రిజెక్ట్ చేసేసింది. అతను చనిపోయాడు.

మనలో 99 % purity ఉండి 1 % impurity ఉంటే, మనం బ్రహ్మంలో ఐక్యం అయిపోదామని అనుకున్నా బ్రహ్మం మనల్ని రిజెక్ట్ చేస్తుంది. ఆ అబ్బాయి body కిడ్నీని ఎలా రిజెక్ట్ చేసిందో, అలా బ్రహ్మం మనలో 1 % impurity ఉన్నా కూడా తనలో ఐక్యం చేసుకోకుండా రిజెక్ట్ చేస్తుంది. మనం 100 % Purity ని పొందినప్పుడు బ్రహ్మం తనలో ఐక్యం చేసుకుంటుంది. అందుకే క్రీస్తు ప్యూరిటీ పొందమని ఇవన్నీ చెప్పుకొచ్చాడు అన్నారు.

నను బోలు దీనుల నింపొందకాచుచు
చిరంజీవివై బ్రోవు మరుణాచలా!

అంటే నా లాంటి రమణులు వస్తూ వెళ్ళిపోతూ ఉంటారు. ఈ రమణుని అనుగ్రహిస్తేనే సరిపోదు. నిన్ను ఆశ్రయించిన జీవకోటి అంతటినీ మోక్షం వచ్చేవరకూ అనుగ్రహిస్తూ చిరంజీవివై ఉండి బ్రోవుము అరుణాచలా! అన్నారు భగవాన్. నాన్నగారు ఈ విషయం చెపుతూ, మనమేంటమ్మా! మన పిల్లాడికి ఫస్ట్ రేంక్ రావాలి, మన పక్కింటివాళ్ళ పిల్లాడికి ఫస్ట్ రేంక్ రాకూడదు. ఇంకా విచిత్రమైన మాట చెప్పారు. మన పొలంలో వర్షం పడాలి, పక్కవాడి పొలంలో వర్షం పడకూడదు. ఇంక మనకి మోక్షం ఎలా వస్తుందమ్మా? అందరి శ్రేయస్సు కోరుకునేవాడికి మోక్షం వద్దన్నా వచ్చి వరిస్తుంది అన్నారు.

నేను అనగానే ఎవరూ చెప్పక్కర్లేకుండానే మనకు దేహం స్పురిస్తోంది. అలా నేను అనగానే ఎవరికయితే బ్రహ్మం స్పురిస్తోందో వాళ్ళకి అది కడసారి జన్మ అన్నారు.

నైనం ఛిందంతి శస్త్రాణి
నైనం దహతి పావకః।
న చైనం క్లేదయంత్యాపో
న శోషయతి మారుతః ॥

అంటే ఆత్మను శస్త్రం ఖండించలేదు. అగ్ని దహించలేదు. నీరు తడపలేదు. గాలి ఎండింపచేయలేదు. అంటే ఆత్మ అవినాశి. అది సర్వవ్యాపి. సర్వకాల సర్వావస్థలలోనూ ఉండేది. ఆత్మను ఎవరూ ఏమీ చేయలేరు. నువ్వు ఇప్పుడే, ఇక్కడే Truth ని రియలైజ్ చెయ్యగలిగితే గొడవే లేదు. అది శాశ్వత ఆనందం. ఒకవేళ నువ్వు ఆస్థాయిని అందుకోలేకపోయినా, ఆత్మ పుడుతూ, చస్తూ ఉంటుందని ఒకవేళ అనుకున్నా కూడా నీకు మళ్ళీ పునర్జన్మ వస్తుంది. ఈ దేహం పోతే ఇంకో కొత్త దేహం ఇస్తాడు. అందుచేత చావుకి ఎవరూ భయపడక్కర్లేదు.

జాతస్య హి ధ్రువో మృత్యుః
ధ్రువం జన్మ మృతస్య చ
తస్మాదపరిహార్యేర్థే
న త్వం శోచితుమర్హసి ॥

అంటే పుట్టినవాడు చనిపోవడం ఎలాగూ తప్పదు. చనిపోయినవాడు పుట్టడం ఎలాగూ తప్పదు. కాబట్టి నువ్వు భయపడక్కర్లేదు. నీకు ఇంకో కొత్త దేహాన్ని, ఇంకో కొత్త తల్లితండ్రులను నిర్ణయించిన తరువాతే ఈ దేహంలోంచి నీ ప్రాణం తీస్తాడు. ఇంకో కుటుంబం నిన్ను ఆహ్వానించడానికి సిద్ధంగా ఉంటుంది అన్నారు. నాన్నగారి భక్తులమయిన మనమందరం అసలు భయపడక్కర్లేదు. ఎందుకంటే నాన్నగారు మనందరినీ ఫస్ట్ క్లాస్ పాసింజర్స్ అన్నారు. నేను కాశీ లో బోటు ఎక్కలేకపోయినా, ఆయన వెనక్కి వచ్చి నన్ను ఎక్కించుకుని వెళ్ళారు.

పోస్టాఫీసు మీటింగులలో నాన్నగారు బల్లగుద్ది మరీ చెప్పిన మాటలు : "ఎవరయితే తమ శక్తిని, ఐశ్వర్యాన్ని .... అన్నిటినీ త్రికరణశుద్ధిగా 100 % ఉపయోగించుకుంటూ, బ్రహ్మంకోసం ప్రయత్నం చేస్తూ, ఆ ప్రయత్నంలో బ్రహ్మాన్ని పొందకుండా గనక మరణిస్తే - ఆలస్యం చేయకుండా మహాయోగులు, మహాత్ములు ఉన్న ఇంట్లో ఆ జీవుడిని తీసుకువెళ్ళి నేను ప్రవేశపెడతాను అర్జునా అన్నాడు కృష్ణుడు."

నేను హైదరాబాదు వస్తున్నానని తెలియగానే బంధువులు, భక్తులు అందరూ స్టేషన్ కి రిసీవ్ చేసుకోవడానికి వస్తారు. అలాగే మరి మనం చనిపోయినప్పుడు మన జీవుడిని రిసీవ్ చేసుకోవడానికి ఎవరయినా వస్తారా అంటే వస్తారు. ఇక్కడ మనం మాట్లాడిన మంచి మాట, మంచి తలంపు, మనం చేసే మంచి పని ఏదీ వృధా కాదు. ఆ సత్కర్మ మనల్ని రిసీవ్ చేసుకోవడానికి వచ్చి మనల్ని చీకటి లోకాలకు తీసుకెళ్ళకుండా వెలుగున్న లోకాలకు తీసుకెళ్తుంది. జీవుడి కోసం ఎవరూ రారని అనుకోవద్దు అన్నారు నాన్నగారు.

నాన్నగారు ఎవరినైనా చూసి ఏదైనా అంటే ఆయన అనుగ్రహం వలన అది జరుగుతుంది. పటేల్ కి ఎంత ధైర్యం ఉందో పద్మకి అంత ధైర్యం ఉంది అనేవారు. ఒకసారి ఏదో చిన్న సంఘటన జరిగింది. నిజానికి ఆ సంఘటనకి నాకు రియాక్షన్ వచ్చింది. కానీ నాన్నగారు పద్మ అసలు ఈ చిల్లర విషయాలు పట్టించుకోదు అన్నారు. నాన్నగారు అలా అనగానే అయితే నాన్నగారు నన్ను చాలా ఉన్నత స్థాయిలో చూడాలనుకుంటున్నారు అనుకున్నాను. అంటే యాక్షన్ ఉండాలి కానీ, రియాక్షన్ ఉండకూడదు అని నాన్నగారు గైడ్ చేసారు.

"సత్యజ్ఞానములేని ఈ జన్మ ఫలమేమి యొప్పగ రావేల అరుణాచలా!"

భగవాన్ అక్షరమణమాలలో చెప్పింది నాన్నగారు ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. సత్యాన్ని తెలుసుకోకుండా, జ్ఞానం పొందకుండా ఈ దేహం చనిపోయింది అనుకోండి ఏం ప్రయోజనం? అంటూ భగవాన్ దగ్గరకి వచ్చిన ఒక వ్యక్తి గురించి చెప్పారు.

ఒక మాష్టారు చాలా సమస్యలు ఉండడంవల్ల చనిపోదామని నిర్ణయించుకుని, చివరిసారిగా దర్శనం చేసుకుందామని భగవాన్ దగ్గరకి వస్తారు. భగవాన్ ఆ సమయంలో విస్తరాకులు కుడుతూ ఉంటారు. ఈ విస్తరాకులు నేను ఎందుకు కుడుతున్నాను? అని అడిగారు. మీరు భోజనం చేయడానికి అని మాష్టారు సమాదానం చెప్పారు. భోజనం చేయకుండానే నేను ఈ విస్తరాకుని పడేసాననుకోండి ఏమిటి ప్రయోజనం? అన్నారు భగవాన్. మీరు కుట్టిన విస్తరాకు వృధా అయినట్టే అని చెప్పిన మాష్టారుకి వెంటనే స్ఫురించింది. నేను చనిపోదామని అనుకుంటున్న విషయం భగవాన్ కి అర్థమయింది, అందుకే విస్తరాకు గురించి ఉదాహరణగా చెపుతున్నారు. జ్ఞానం పొందకుండా చనిపోతే, విస్తరాకులాగే నా జన్మ కూడా వృధా అవుతుందని భగవాన్ తెలియజేస్తున్నారు అని అర్థమై ఆ మాష్టారు ఆత్మహత్యాప్రయత్నం విరమించుకున్నారు. అది మహాత్ముల దర్శనం వల్ల కలిగే ప్రయోజనం!

నాన్నగారు ఒక ప్రవచనంలో, మోక్షం వచ్చేవరకు గురువు వెంటాడుతూనే ఉంటాడు అని చెప్పారు. గురువు దేహంతో కూడానే ఉంటాడా అని అడిగాను. నాన్నగారు "దేహంతో సహా ఉంటాడు" అన్నారు. రామకృష్ణుడు మళ్ళీ పుడతాను అన్నాడు కదా! రామకృష్ణుడు మళ్ళీ పుట్టడం ఏమిటి? రామకృష్ణుడు అనే Individual విడిగా ఉంటుందా? తిరిగి పుట్టడానికి అని అడిగాను. అప్పుడు నాన్నగారు, కృష్ణుడు కూడా చెప్పాడు నేను మళ్ళీ పుడతానని!

యదా యదాహి ధర్మస్య
గ్లానిర్భవతి భారత।
అభ్యుత్థానమధర్మస్య
తదాత్మానం సృజామ్యహమ్॥

పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చ దుష్కృతామ్।
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే ॥

ధర్మమునకు హాని కలిగినప్పుడు, అదర్మం పెచ్చుపెరిగినప్పుడు నన్ను నేను సృజించుకుంటాను. ధర్మ పరిరక్షణ కొరకు నేను ప్రతియుగమునందు అవతరిస్తాను అని కృష్ణుడు అర్జునుడితో చెప్పాడు కదా! వాడు బ్రహ్మమై చెబుతున్నాడు. అంటే రామకృష్ణుడు కూడా బ్రహ్మమై చెబుతున్నాడు నేను మళ్ళీ వస్తాను అని. అంటే వారు దేహాన్ని సృజించుకుంటారు.

ఉదాహరణ: వర్షం వచ్చినప్పుడు మన ఇళ్ళల్లో అన్ని తూరలలోంచి నీరు ప్రవహిస్తుంది. అన్ని తూరలలోంచీ వచ్చేది వర్షపు నీరే! అలాగే ఆచార్యులవారై వచ్చినా, రామకృష్ణుడై వచ్చినా.... ఏ రూపంలో వచ్చినా వారిద్వారా ప్రవహించేది మొత్తం బ్రహ్మమే! ఏదో ఒక రూపంలో వచ్చి ఆ ఇంజన్ కి నీ పెట్టె తగిలించేస్తారు అన్నారు.

నాన్నగారు కూడా బ్రహ్మమై చెబుతున్నారు నేను మళ్ళీ వస్తానని! మళ్ళీ పుడతాను అంటే అక్కడ నాన్నగారు అనికాదు. బ్రహ్మమే మళ్ళీ పుడుతుంది.

సర్వధర్మాన్ పరిత్యజ్య
మామేకం శరణం వ్రజ।
అహం త్వా సర్వపాపేభ్యో
మోక్షయిష్యామి మా శుచః॥

భగవంతుడికోసం అన్ని ధర్మాలనూ విడిచిపెట్టేయచ్చు. అప్పుడు ఆయన మనలో ఉన్న పాపాలన్నీ కడిగి ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. అయితే శరణాగతి చెందడం మనం చేయాల్సిన పని.

"వ్యక్తిగతమైన నేను ఉన్నంతసేపు గురువునో, ఈశ్వరుడినో నమ్మవలె" అన్నారు భగవాన్. రమణ భాషణములులో వస్తుంది. ఆ వాక్యము నాన్నగారు నాతో చదివించారు. భక్తిమార్గం safest & surest అన్నారు. అంటే నదిని ఈదుకుంటూ వెళ్ళవచ్చు, పడవలోనూ వెళ్ళవచ్చు. అంటే భక్తిమార్గం పడవలో క్షేమంగా ప్రయాణించినట్టు!

"రమ్మని యనలేదె వచ్చినా వంతివ్వ వెరకు నీ తలవిధి అరుణాచలా"

అని అక్షరమణమాలలో భగవాన్ అన్నారు కదా! అంటే రమ్మని పిలిచావు, నీ కూడా తిప్పుకున్నావు. ఇప్పుడు జ్ఞానం ప్రసాదించవలసిన బాధ్యత కూడా నీదే అని అర్థం. అంటే మనకు మోక్షం ప్రసాదించటం నాన్నగారికి, అరుణాచలేశ్వరుడికి వారి విధి అన్నమాట! అయితే కొంచెం మన ముఖం అటువైపు తిప్పి ఉంచాలి.

చివరిసారిగా నేను వైజాగ్ హాస్పిటల్ కి వెళ్ళి దర్శనం చేసుకున్నప్పుడు, నిండు పున్నమి చంద్రునిలా నవ్వుతూ రెండు చేతులూ

ఎత్తి ఆశీర్వదించారు.

ఆయన జీవించి ఉన్నంతకాలం ఆయన సమక్షంలో ఆనందంగా గడిపే భాగ్యం నాకు కలుగచేసారు. అంతులేని ప్రేమ కురిపించారు.

సంతృప్తికరమైన జీవితాన్ని ప్రసాదించారు. జ్ఞానబిక్ష పెట్టారు. మరణభయాన్ని దాటించారు. God realisation పొందేవరకూ కూడానే ఉంటానని అభయం ఇచ్చారు.

అన్నీ తానై సులభంగా ఆధ్యాత్మిక ప్రయాణం చేయిస్తూ, లక్ష్యాన్ని చేరుస్తున్న నాన్నగారి పాదపద్మములకు సర్వదా కృతజ్ఞతా పూర్వక ప్రణామములు!





భక్తుల స్మృతులు అందచేసిన భక్తులకి

అవి పలుమార్లు విని రాసిన అపర్ణ గారికి

(సహాయం చేసిన విజయ లక్ష్మి, నీలిమ, మాధురికి)

హృదయానికి హత్తుకునేలా భాషని అందంగా సవరించిన గీతగారికి

కృతజ్ఞతలు